ఓ౩మ్

సాంఖ్య దర్శనము

(కపిల మహర్షి ప్రణీతము)

★

అనుకర్త :

"కళాప్రపూర్ణ" పండిత గోపదేవ్

★

ప్రకాశకులు :

ఆర్య సమాజము - కూచిపూడి

పిన్ 522-313

గుంటూరు జిల్లా

అంబాదర్శన గ్రంథమాల — ౭

తృతీయ ముద్రణము – 2000

సర్వస్వామ్యములు : ఆర్య సమాజము - కూచిపూడి.

మే – 1989

శుక్ల–వసంతం

మూల్యము రు.

"విజయ ఆర్టు ప్రెస్"
తె నా లి.

అంబాదర్శన గ్రంథమాల

మహారాజపోషకులు :- రు౩౦౦౦లు అంతకుపైన నిచ్చువారు

రాజపోషకులు :- రు ౧౫౦౦లు ,, ,,

పోషకులు :- రు ౫౦౦లు ,, ,,

మహారాజపోషకులు :

౧ శ్రీమతి కొత్తపల్లి యామినీదేవి — కూచిపూడి
౨ శ్రీ బెల్దె జగదీశ్వరయ్యశ్రేష్ఠి — సికిందరాబాద్
౩ శ్రీ మాశెట్టి వేంకటేశ్వరరావు — సికిందరాబాద్
౪ శ్రీ కొసరాజు మాధవయ్య — తెనాలి
౫ డా. శ్రీ వై. వి. సుబ్బారావు, సరోజనీదేవి — గుంటూరు
౬ శ్రీ గ్రంధి కామరాజు — విజయవాడ
౭ శ్రీ కావూరి జయచంద్రవర్మ — కూచిపూడి
౮ శ్రీ చదలవాడ అచ్చేశ్వరరావు, రాజ్యలక్ష్మి — ,,
౯ శ్రీమతి చదలవాడ లక్ష్మమ్మ — ,,
౧౦ శ్రీ మజ్జిడ్డి గురవారెడ్డి — తూములూరు
౧౧ శ్రీ చంద్రయ్య & సన్స్—అల్‌వాల — సికిందరాబాద్
౧౨ శ్రీ యం. యస్. బాలకృష్ణ, సుధాకర్ — ,,
౧౩ శ్రీ ఉప్పల రాజేశ్వరరావు — ,,
౧౪ శ్రీ కొసరాజు తిరుమలరావు, సూర్యకుమారి కురుమద్దాలి
౧౫ శ్రీ గజ్జె సుబ్బారావుగుప్త, నాంచారమ్మ — గుంటూరు
౧౬ శ్రీ జక్కిడి సీతారామరెడ్డి, సీతాఫలమండి సికిందరాబాద్
౧౭ శ్రీ తుమ్మల వల్లభయ్య — కూచిపూడి
౧౮ శ్రీ నోముల స్వామిదాస్, శ్రీ శ్రీపతి వెంకటరావు
సికిందరాబాద్
౧౯ శ్రీ వాసంశెట్టి రామకృష్ణారావు — వలసపాకల

౨౦ శ్రీ బొల్లేపల్లి సత్యనారాయణ	గుంటూరు

రాజపోషకులు :-

౧ శ్రీ కావూరి సంగయ్య	కూచిపూడి
౨ శ్రీ జె. వెంకటరావు	వరంగల్
౩ శ్రీ బి. శంకరలాల్	హైదరాబాద్
౪ శ్రీ యలవర్తి రామకోటయ్య సీతారత్నం	కూచిపూడి
౫ శ్రీ కుమ్మరి పోచయ్య	సికిందరాబాద్
౬ శ్రీమతి బొర్రా వేంకటరత్నమ్మ	కూచిపూడి
౭ శ్రీ యం. భూపతిరావు ప్రజ్ఞాపురం	హైదరాబాద్
౮ శ్రీ సరిదె శ్రీనివాసరావు, కనకలక్ష్మి	రేలంగి గోదావరి
౯ శ్రీ వి. యస్. గుప్త	కొత్తగూడెం

పోషకులు :-

౧ శ్రీ మేకా రామకృష్ణయ్య	కూచిపూడి
౨ శ్రీ జాస్తి వెంకటప్పయ్య, తులశమ్మ	,,
౩ శ్రీమతి దాసరి రామకోటమ్మ	,,
౪ శ్రీమతి కన్నెగంటి శైలసుత నవరత్నకుమారి	,,
౫ శ్రీ కోట్ల రమణారెడ్డి	సికిందరాబాద్
౬ శ్రీ పోలం వీరయ్య సోదరులు	,,
౭ శ్రీ కోడూరి సుబ్బారావు, సీతాఫలమండి	,,
౮ శ్రీ దుర్గా సత్యనారాయణ, కృష్ణవేణి	తణుకు
౯ శ్రీ కావూరి శివరామయ్య	మోపిదేవి
౧౦ శ్రీ గడ్డిపాటి వేంకట కృష్ణయ్య	అమృతలూరు
౧౧ శ్రీ చుండూరి శ్రీహరిరావు, శాంతకుమారి	గుంటూరు
౧౨ శ్రీ మల్లాది సూర్యనారాయణమూర్తి	రాజంపేట (తూ॥ గో॥ జి)

తొలిపలుకులు

కె. సచ్చిదానందమూర్తి

ఆంధ్ర విశ్వవిద్యాలయము

క్రీస్తు పూర్వము ఆరు, ఏడు శతాబ్దములలో భారతదేశములో తాత్త్విక సమాలోచన ఉత్కటముగా నుండెను. ఈ ఆలోచనా ఫలితములలో ఒకింత ఉపనిషత్తులలో ఉపలబ్ధము. ఉపనిషత్తుల కాలములోనే వాటితోపాటును, వాటి పిదప స్వతంత్రముగను, కాని బహుశః వాటి నాధారముగ నుంచుకొనియు అపారమైన తత్త్వమీమాంసయు, అనేకములగు దర్శన ప్రస్థానములును బయల్వెడలెను. లోకాయతిక, జైన బౌద్ధములు ఇంచుమించు చట్టివే. తరువాత అనేక ఏండ్లకు, అనగా క్రీస్తుపూర్వము ఒకటవ శతాబ్దమునుండి క్రీస్తు తర్వాత 2వ శతాబ్దము లోపల వేదోపనిషత్తులు శృతి ప్రమాణముగా అంగీకరింపబడి ప్రత్యక్షానుమానములతో సమాన సత్తాకములుగాను అదృష్ట విషయములందు బలవత్తరముగాను గౌరవింపబడగా, అనేకులు తమతమ సిద్ధాంతములను వానిలో వెదుకసాగిరి. వాటిపై ఆధారపడి యున్నటుల నిదర్శనముల పొందుపరచ ప్రయత్నించిరి సూత్రప్రాయముగా తమ దార్శనిక సిద్ధాంతముల ప్రవచించిరి. ఫలితముగ షడ్దర్శనములు బయల్వెడలెను లోకాయతికాది కొన్ని దర్శనములు వేదమును ప్రమాణముగా నంగీకరించుట యటుంచి, అవి పురోహితుల కుతంత్రములని కూడ అనెను వైదికమత పునరుద్ధరణ కాలమున (revivalistic period) లోకాయతికము వైపుకు ప్రజలు పెడముఖముపెట్టి జైన బౌద్ధులను వలెనె పలుబాధలు పెట్టిరి. కొలదిమందే లోకాయతికులమని చెప్పుకొన సాహసించిరి; క్రమముగా చార్వాక సాహిత్యము ఖిలమయ్యెను. కాక ఆ ప్రాతకాలమున కేవలము తర్కముపైనను మానవబుద్ధిపైనను ఆధారపడి భావోద్రేకములకు (emotions) ఏమాత్రము తావొసగని చార్వాక దర్శనము ఎవరికిని విచారము కల్గించకుండనే మృతి నందెను. జైన బౌద్ధములు ధర్మములుగా మారెను వాటి స్థాపకులు దేవతలైరి వాటి బోధలను సంగ్రహించిన గ్రంథజాలము వేదముల స్థాన మాక్రమించెను.

కపిలుడు వ్రాసినవనబడు 'సాంఖ్యసూత్రములు' లభించుచున్నవి. 1500 క్రీ.శ. మందుండిన అనిరుద్ధునికంటె ప్రాచీను డెవరును వీనిపై భాష్యాదులు వ్రాయకపోవుట చేతను, ఈ సూత్రములను శంకరాదులెవ్వరును ఉదాహరింపకపోవుట చేతను, బ్రహ్మసూత్ర, యోగసూత్రములందలి కొన్ని సూత్రములు యథాతథముగ సాంఖ్యసూత్రములం దుండుటచేతను, 'తత్త్వసమాస' మను పేర లభించు మరికొన్ని సూత్రములు మాత్రమే కపిల ప్రోక్తము లని కొంద రనుటచేతను, సాంఖ్య సూత్రముల కర్త కపిలుడు కాడు, అర్వాచీను డెవడో ఈశ్వర కృష్ణాదుల గ్రంథముల జదివి ఈ సూత్రములు వ్రాసెను—అని పాశ్చాత్యుల యొక్కయు, పెక్కుమంది భారతీయ విద్వాంసుల యొక్కయు అభిప్రాయము, (ఇ) అనిరుద్ధుడికంటే పూర్వులు భాష్యాదులు వ్రాసి యుండవచ్చును, అవి నష్టములై యుండ వచ్చును. బ్రహ్మసూత్రములపై శంకరునికంటే పూర్వులగు బౌద్ధాయనాదులు వ్రాసిన భాష్యములు నశించినవికదా. భాగురిముని సాంఖ్యసూత్రములపై భాష్యరచనము చేసెనని దయానంద సరస్వతి కృతసత్యార్థ ప్రకాశము (ఆంధ్రానువాదము)న గలదు. ఈ భాగురిముని ఎవరో, ఈయన భాష్యమిప్పుడు దొరకునో లేదో, ప్రకాశితమో కాదో, అలభ్యమైన ఆయన వ్రాసెననుట కాధారము లేవియో నే నెఱుగను. దయానందునివంటి మహా పండితుడు, సత్యాన్వేషి అప్రమాణికమనుమాట ననజాలడు గాన, అది విశ్వసనీయమే. శంకరాదులు సాంఖ్యసూత్రముల నుదాహరింపక పోవుటకు కారణము వారికి ఆ క్షణమున కా సూత్రములు జ్ఞప్తిలో లేక పోవచ్చును. దగ్గరలో వానిని కల్గిన తాళపత్రగ్రంథము లేకుండ వచ్చును. శంకరాదులు నేటివలె దగ్గర పైపుమిషనును, రిఫరెన్సు లైబ్రరీని పెట్టుకొని వ్రాయ లేదుకదా. బ్రహ్మసూత్రములందు భగవద్గీతను గూర్చియు, భగవద్గీతయందు బ్రహ్మసూత్రములను గూర్చియు, ప్రశంసగలదు కదా. వీనిలో ఏది పూర్వము, ఏది అపరము? అట్లే వ్యాసుని శిష్యుడగు జైమిని మతము బ్రహ్మసూత్రమం దనేకచోట్ల ఉద్ధృతము. అందుచే జైమిని తరువాతివాడు బాదరాయణుడా ? సూత్రకర్తలందరు ఇంచుమించు సమకాలికులై యుండ వచ్చును, లేదా చాలాకాలమునుండి సూత్రరూపముగ ప్రతినోటివెంట

మెలగు నభిప్రాయమే ఒకచో బాదరాయణ కపిలాదులు సంగ్రహించి యుండవచ్చును. జైమిని పేరెట్లు బ్రహ్మసూత్రములందు కన్పడినను తత్సూత్రకారుడు తర్వాతివాడు అని అనలేమో, పంచశిఖుని పేరు సాంఖ్య సూత్రములందు కన్పడిన మాత్రమున అది కపిల కృతము కాకుండపోదు గురువు దీర్ఘజీవియై వార్ధక్యమున గ్రంథరచనము చేసిన అందు ప్రశిష్యుల పేర్లు వారి శిష్యుల పేర్లు కూడ వ్రాసియుండుటలో అసంభవము లేదు సారాంశమేమన : సాంఖ్యసూత్రకారుడు కపిలుడు కాడని చెప్పువారు చూపు కారణము లన్నియు బలహీనములేగాని, ఆ సూత్రములను కపిలుడు వ్రాయుచుండగా చూచినవారునూ లేరు; వేద పురాణాదులందు పేర్కొన బడిన అతిప్రాచీనుడగు కపిలుడే; సాంఖ్యసూత్ర కర్త మరొకరు కాదు అనుటకు బలమైన అనుమాన ప్రమాణమును లేదు. అనిరుద్ధ విజ్ఞానభిక్షువులు మాత్రము అవి కపిల కృతము లని అభిప్రాయపడిరి. అట్టి మేధావుల అభిప్రాయము లాదరణీయములు కాకుండునా ? అయితే నేడు దొరకు సాంఖ్యసూత్రములలో తర్వాతివారు చేర్చినవి చాల గలవని తక్కినవి కపిల కృతము లని కొందరి అభిప్రాయము. కౌముదీప్రభలో స్వప్నేశ్వరుడు సాంఖ్యసూత్రములు పంచశిఖ కృతములనియు, కపిలమతము ననువదించునవి గాన అవి కపిలుని పేరనే బరగినవని చెప్పినాడు. ఆ రధ్యాయములు కలిగి, అనేకములగు కథలతో నొప్పుచు చక్కగా సాంఖ్య సిద్ధాంతముల తేటపరచుచు, ఇతర దర్శనముల ఖండించు సాంఖ్యసూత్రములు కపిలుడు వ్రాసినవైనచో బుద్ధునికి పూర్వమే అది రచింపబడి యుండవలెను. మరెవరో వ్రాసి కపిలుని పేరు పెట్టియుండిన, లేక కపిలు డను పేరుగల మరియొక్కడు వ్రాసియుండినను అది 14వ శతాబ్దమునకు ముందే వ్రాయబడి యుండవలెను. ఎందుకన 15 వ శతాబ్దపు అనిరుద్ధుడు వానిపై వృత్తియు, దావాపు 1600 క్రీ. శ. ప్రాంతమున నుండిన మహాదేవుడు ఆ వృత్తికి సారమును వ్రాసెను. 16వ శతాబ్దములో విజ్ఞానభిక్షువు వానిపై భాష్యము వ్రాసెను. ఇదియే సూత్రములపై వ్రాయబడియున్న వానిలోకెల్ల మేటిదగు వివరణము. విజ్ఞానభిక్షువు సాంఖ్యదర్శనము నిరీశ్వరము కాదని, బ్రహ్మము ఆనందరూపుడను వాదముతో పొసగుననియు చూపగల్గినాడు.

సాంఖ్య సూత్రములు కపిలుడే వ్రాసియున్న, కపిలుని అభిప్రాయములను విజ్ఞాన భిక్షువు సరిగానే వివరించగలిగియుండిన, సాంఖ్యదర్శనము నంత ఎక్కువగా తక్కిన దర్శన శాస్త్ర వాఙ్మయ మెందుకు చెండాడినదో ఊహించుట కష్టము. సాంఖ్యము నిరీశ్వరము అని చెప్పు మహా భారతము లోని కొన్ని శ్లోకములు (ముఖ్యముగా XII - 11039), జనకునికి పంచశిఖుడు చేసిన బోధ సాంఖ్యసూత్రములలో చెప్పబడినవని విజ్ఞానభిక్షువు తలచు సిద్ధాంతములతో సమన్వయించుట కష్టము. సాంఖ్యము నిరీశ్వరమే అనెద మన్న, భాగవతములో కపిలుడు బోధించినాడన్న సేశ్వర సాంఖ్యమునకు వైరుధ్యము వచ్చును. అందుచేత హరిభద్రుడన్నట్లు "సాంఖ్యా నిరీశ్వరాః కేచిత్ కేచిదీశ్వర దేవతాః'', కొందరు సాంఖ్యులు సేశ్వరులు కొందరు నిరీశ్వరులు అని వొప్పుకొనవలసి వచ్చును. ఇరుతెగలవారును తమతమ సిద్ధాంతములే కపిలప్రోక్తము లని ఘోషించుచుండిరి. సాంఖ్య సూత్రములు కపిల కృతములైనను, ''ఈశ్వరా సిద్ధేః" ఇత్యాది సూత్రములు పూర్వపక్షమా? సిద్ధాంతమా ? అను మీమాంస వచ్చును నిరీశ్వర సాంఖ్యుల కవి సిద్ధాంతము లగును. సేశ్వరు లవి అన్యమతములను (జైనాదులను) అనువదించునవని అందురు. కపిలుని హృదయమేమో ఆయనకే వేద్యము !

'22 సూత్రములలో సాంఖ్యదర్శనమును విపులీకరించుచు తత్త్వ సమాస మనుపేర వర్తిల్లు గ్రంథమే కపిలకృతము. ఇతరములు కావు' అని కొందరి వాదము. మేక్స్ ముల్లర్ ఇటుల తలచెను. ఇప్పు డెవ్వరును ఇటు లనుటలేదూ. ఈ తత్త్వసమాస మనునది కేవలము విషయసూచిక వలె ఉండుటచేతను, దీనిపై అత్యంత ప్రముఖు లెవ్వరు వ్యాఖ్యానాదులు చేయకుండుటచేతను, ఇంత చిన్న సూత్ర గ్రంథము మరే దర్శనమునకు లేకుండుట చేతను, ఇది ప్రాచీనుడగు కపిలుడు వ్రాసినది కాకపోవచ్చును.

కపిలుడు వ్రాసినది ఈ రెండును కాదు, 'షష్టి తంత్ర' మను వేరొండు గ్రంథము, అని భాస్కరాచార్యులు ఇత్యాదుల అభిప్రాయము. (చూడు - భాస్కరుల బ్రహ్మసూత్ర భా. 2. 1 1.) సాంఖ్యకారికలపై వ్రాయబడిన జయమంగళ వ్యాఖ్యానములో 'షష్టి తంత్ర' కర్త పంచశిఖుడని కలదు; భామతిలో వాచస్పతి షష్టి తంత్ర మందొక శ్లోకము నుదా

హరించి అది వార్షగణ్యుడు చెప్పినదని అనినందున షష్టితంత్రకర్త వార్షగణ్యుడని కొందరందురు. షష్టితంత్ర మనునది ప్రత్యేక గ్రంథము కాదు, షష్టిపదార్థములు ప్రపంచింపబడిన శాస్త్రము కాన షష్టి తంత్రము అన్నట్లు మాఠరాచార్యులు సూచించినాడు. వాచస్పతియు తత్త్వకౌముదియందు 'సేయం షష్టిపదార్థీ కథితేతి .... శాస్త్రమే వేదమితి సిద్ధం' అనుచు షష్టిపదార్థములను వివరించు శాస్త్రము షష్టి తంత్రము అని చెప్పి, 'షష్టి తంత్రము అను గ్రంథ విశేషము లేదని సూచించినాడు. మాఠర వాచస్పత్యాది మహామహులు ఇట్లనుటచేతను, షష్టి తంత్రమను ప్రత్యేక గ్రంథము ఉపలబ్ధము కానందునను, సాంఖ్యదర్శనమే షష్టితంత్ర మనబడు చుండెడిది అని నిర్ణయించ వచ్చుగాని, తత్త్వవైశారదిలో వాచస్పతియే ఒక శ్లోకమును షష్టితంత్రములోనిదని చెప్పి, దానినే భామతిలో వార్షగణ్యుడు చెప్పినది అనుటవలన, ఒకవేళ షష్టితంత్ర మను గ్రంథ ముండెనేమో, అది వార్షగణ్య అథవా పంచశిఖ కృతమేమో అను దుర్వారమగు శంకపొడ మును.

బృహత్సంహిత పైని తన వ్యాఖ్యానములో ఈశ్వరకృష్ణుని సాంఖ్య కారిక నుదాహరించి, "తథాహ కపిలాచార్యః" అని భట్ట ఉత్పలుడు అనుట చూడ, మన వ్యాఖ్యాతలకు ఎవరేది వ్రాసినారు అను పెద్ద విచక్షణ, ఉదాహరించుటలో తగుజాగ్రత్త లేదని తేలును. అందుచేతనే ఒకవేళ స్వప్నేశ్వరు డన్నట్లు, సాంఖ్యసూత్రములు కపిల కృతములు కాదేమో అనియు శంక కలుగును. అది కపిలుడు వ్రాయకుండిన అతను వ్రాసిన దేమిః షష్టితంత్ర మను గ్రంథవిశేషమా అని చెప్పెదమన్న, దానిని గూర్చియు వివాదమాయెను.—అసలా షష్టితంత్రమను నొక ప్రత్యేక గ్రంథము లభించదాయెను.

నిర్వివాదముగ 'సాంఖ్యకారిక' యను పేర ఇప్పు డుపలభ్యమగు గ్రంథము పరమార్థునిచే చైనీస్‌భాషలోనికి ఆరవ శతాబ్దమున అనువాదితము గాన, నాల్గవ శతాబ్దమందలి వసుబంధువుచే అది ఖండింపబడినది గావున దాని రచన తృతీయ శతాబ్దమందు జరిగెనని సర్వసమ్మతము. సాంఖ్యకారి కలు 70 అనియు, వాటికి హిరణ్యసప్తతి యను పేరనియు, వాటి కర్త

వింధ్యవాసి యనియు ఆతడు వార్షగణ్యుడి శిష్యుడనియు భౌద్ధ సాంప్ర దాయము. వింధ్యవాసి యనునది వింధ్యపర్వతములం దుండుటచే ఈశ్వర కృష్ణునికి కల్గెనని టకాకుసూ ఇత్యాదుల అభిప్రాయము. ఈశ్వరకృష్ణుడు వేరు, వింధ్యవాసి వేరు అని, గుణరత్నుని అభిప్రాయము. మాఠర, వాచ స్పత్యాదులు వ్యాఖ్యానము గావించిన సాంఖ్యకారికలు 72. అందు 71 వ దానిలో సాంఖ్యకారికా కర్త ఈశ్వరకృష్ణుడు అని కలదు. అందుచే టకా కుసూ అభిప్రాయము సమంజసము కావచ్చును, కాని గౌడపాదుడనువాడు (ఇతడు మాండూక్య కారికాకారుడు కానట్లున్నాడు) ఈ కారికలపై వ్యాఖ్యా నము వ్రాయుచు 69 దానివరకే వ్రాసినాడే, తక్కిన వాతడు ప్రక్షిప్తము లని తలచెనా లేక సులభముగ అర్థమగునవని తలచి వ్యాఖ్యానించుట మానెనా ? కాని చైనీస్ అనువాదమందు 71 కారికల వరకు ఉండుటవలన, 71 వ దానిలోనే ఈశ్వరకృష్ణుడు వాటి కర్త అని యుండుటచేత టకాకుసూ అభిప్రాయము బలపడుచున్నది. గుణరత్నుడు పొరబాటుబడి యుండవచ్చు నేమో.

ఎవరు వ్రాసిన నేమి, "సాంఖ్య సూత్రములు", 'తత్త్వ సమా సము", "సాంఖ్యకారికా' అనునవి సాంఖ్య దర్శనముపై లభించు ప్రామా ణిక గ్రంథములు. ఇందు మూడవ దానిపై నేను, సోమసేఖర శాస్త్రిగారు తెలుగులో వ్రాసి యున్నారు. మొదటిదానిపై ఇప్పు డీ గ్రంథోదయమైనది. షడ్దర్శనములలో ఒకటి సాంఖ్యము. సాంఖ్యదర్శన సిద్ధాంతములు ప్రతి పురాణమందు, మహా భారతాదులందు, మనుస్మృతి యందు, శ్వేతాశ్వేతరా ద్యుపనిషత్తులలోను, భగవద్గీత యందును కొంచెము మార్పులతో స్వీక రింపబడినవి. "తత్కారణం సాంఖ్య యోగాధి గమ్యం" అనగా జగత్కారణము = భగవంతుడు సాంఖ్య యోగములచే తెలియదగినది, అది తెలిసిన బంధ విముక్తి అని ఉపనిషద్వచనము, "సిద్ధానాం కపిలో మునిః" అని గీతయు, "కపిలస్తత్వ సంఖ్యాతా భగవాన్" అని భాగవతమును, "పంచమః కపిలోనామ" అని గరుడ పురాణమును, "ఋషిం ప్రసూతం కపిలం యస్తమగ్రే" అని శ్వేతాశ్వేతరోప నిషత్తు "కపిలః పరమర్షిః పురాతనః" అని భారతమును కపిలుని భగవదవతారత్వమును, సాంఖ్య శాస్త్ర కర్తృత్వమును కీర్తించినవి. గార్బె

మున్నగు పాశ్చాత్య విద్వాంసులు "In Kapila's doctrine, for the first time in the history of the world, the complete independence and freedom of the human mind, its full confidence in its own powers, were exhibited" అని ప్రశంసించి నారు. గ్రీకు తత్త్వవేత్తయగు పైథాగొరస్ సాంఖ్యమునుండి ఎంతో నేర్చికొనెనని వింటర్ నిట్జు అభిప్రాయము. అట్టి సాంఖ్యదర్శనమును అవ గతము చేసికొనుటకు సాంఖ్యసూత్రముల కంటే మించిన దేముండును ? ఆ సూత్రములు స్వయముగా కపిల కృతములు కాకపోయినను — కావని నేననలేదు — కపిలముని హృదయమునే చాలవరకు ప్రకాశపరచుచున్న వనుటలో సంశయము లేదు. వాటిపై ఆంధ్రమందు చక్కని భాష్యము జయల్వెడలుట ఆంధ్రుల భాగ్యము.

పండిత గోపదేవ్‌గారు చిన్నతనాననే ఏకాంత జీవితము, యోగము, ఆధ్యాత్మికానుభూతులపై చాల ప్రీతిని గలియుండిరి. అనేకాశ్రమములను చూచియు తృప్తినొందక, చివరకు పోతోహర్ గురుకులమున శ్రీ ముక్తి రామోపాధ్యాయులను పండిత ప్రవరునివద్ద తక్కిన దర్శనములతోపాటు యోగదర్శనమును కూడ అధ్యయనము చేసిరి నాటినుండి ఐహిక గురువు లందరికి తిలోదకము లిచ్చి గురోర్గురువగు పరమేశ్వరునే గురువుగా నిశ్చ యించుకొని, పతంజలి ఋషి ప్రోక్తవిధముగ కాశ్మీరాంతర్గత మగు అమర నాథ క్షేత్రమున తీవ్రయోగ సాధనచేసి అంతర్ముఖిత్వము నందిరి. యోగా గ్నిచే ధూత కల్మషులై స్వస్థల మగు గుంటూరు మండలాంతర్గత కూచి పూడికి వచ్చి, దయానంద సరస్వతి ప్రదర్శిత మార్గమున అగ్రగాము లుచు, నిరంతరము వైదిక ధర్మ ప్రచారమం దున్నవారు శ్రీగోపదేవ్ గారు, ఈ వరకే వీరు వైశేషిక, న్యాయ, యోగ దర్శనములపై వ్యాఖ్యాన ములు వ్రాసియున్నారు ఇప్పుడు సాంఖ్యదర్శన వ్యాఖ్యానము పూర్తి చేసి నారు. శ్రీ గోపదేవ్ గారి ఈ నాల్గు గ్రంథములను ఇటీవలనే పరికించి నాను. నిజము చెప్పుచున్నాను. వారి గ్రంథ పఠనము నా కాశ్చర్య అసూయ లను గల్గించినది. షడ్దర్శనములలోను ఇంత పరిశ్రమ చేసి, తత్ఫలితము శ్రమకు వ్యయమును ఓర్చి ఆంధ్ర లోకమునకు అందించుచున్న ఈయన

పై దుష్యము చూచి, ఇట్టి పండిత దిగ్దంతి ఆంధ్రలోకమున నున్నందుకు ఆశ్చర్యము కల్గెను. సంస్కృతమందును, దర్శన శాస్త్రమందును ఇంతటి విద్వత్తు నా కసూయ కల్గించెను ఆంధ్ర దేశమున తర్కమందో, వేదాంత మందో పరిశ్రమ చేసిన పెద్ద పండితులు కొందరు లేకపోలేదు. కాని వారిలో ఎంతమంది తమ పాండిత్యము సర్వ జనుల కుపకరించునట్లు చేయుచున్నారు ? ఇంటికి వచ్చిన ఏ నల్గురైదుగురికో అధ్యాపన కార్యము చేయుటవలన గాని, ఏ సంస్కృత కాలేజీ యందో చక్కగా తినుటకు కూడ చాలని జీతముపై పనిచేయుట వలన గాని బహుజన సేవ అగుట లేదు జీవితమంతకు గలసి ఏ పంచదశిపైననో, హఠయోగ ప్రదీపిక పైననో ఎవరికి అర్థముకాని విధమున సంస్కృత వ్యాఖ్యలో ఉన్న దున్నట్లు 'డుము వులు' మాత్రము చేర్చి తెలుగున వ్రాయుటవలన అచ్చు ఖర్చేగాని లాభ మే ప్రాణికిని లేదు. శ్రీ గోపదేవ్ గారి వ్యాఖ్య లట్లుగాక అతీవ స్పష్ట ముగ, తేట తెనుగున నున్నవి. విశాల మగు భారతీయ దర్శన ప్రపంచ మం దాయన చిరాభ్యస్తుడగు ప్రయాణికుడు. ఆయన చూపిన మార్గమున పోయెదమేని కష్టరహితముగా ఆ ప్రపంచయాత్ర కొనసాగించ గలము. సుష్టుగా అధ్యయనము చేసినదంతయు జీర్ణమైన దప్ప ఇట్టి వ్యాఖ్యలు వ్రాయలేరు ఆంధ్ర దేశమందు ప్రస్తుతము మరెవరును చేయలేని అత్య వసరమగు కార్యమును సాధించిన శ్రీ గోపదేవ్ గారికి నా హృదయ పూర్వక ధన్యవాదములు.

శ్రీ గోపదేవ్‌గారు తమ పనిని చేసినారు; ఇక ఆంధ్రులు, అనగా విశ్వవిద్యాలయములు, సంస్కృత కళాశాలలు, పండితులు, జనసామా న్యము వారి కృతులను సమాదరించి లాభము నొందెదరుగాక, లేనిచో మనకే నష్టము.

అచిరకాలములోనే పూర్వోత్తర మీమాంసలపై కూడ ఆంధ్ర వ్యాఖ్యానములు ప్రకటించిన, వారు వాచస్పతి అపరావతార మనునది ధృవ పడును.

ఓమ్

పరిచయము

''ఏకమేవ దర్శనమ్ ఖ్యాతిరేవ దర్శనమ్''

సాంఖ్యదర్శనము భారతీయ దర్శనములలో నొకటి. ముఖ్యముగా షడ్దర్శనములని పిలువబడు ఆస్తిక దర్శనములలో నన్యతమము, భారతీయ జనశ్రుతి ననుసరించి యీ దర్శనము ఇతర దర్శనముల కంటె ప్రాచీనముగ నెంచబడుచున్నది. ఈ గ్రంథమును రచియించిన మహానీయుడు పరమర్షి కపిల భగవానుడు

కపిల మహర్షి

కపిల మహర్షి కణాదాదుల కంటె నతిప్రాచీనుడు. కావున నీ మహర్షి యెప్పటివాడో మఱియు నెక్కడివాడో నిర్ణయించి చెప్పుట దుస్తరమగుచున్నది. సంస్కృత వాఙ్మయములో కపిల నామము గల యాచార్యుల వర్ణన లనేక విధముల ననేక స్థలములందు జూడనగును. అందువలన వీరిలో సాంఖ్యదర్శన రచయిత యే కపిలుడో విద్వాంసులు నిశ్చితముగ నిర్ణయింప జాలకపోవుట వింత కాదు విదేశీయాక్రమణముల మూలమున భారతీయ సాహిత్యము, ఆవాసనిలయములు నెన్నియో విధములయిన మార్పులకు గురియైనవి. ఆ యా సమయములందు గలిగిన భౌగోలిక పరివర్తనములు కారణములుగ భారతీయ చరిత్రమును బోధించు సాధనములు భూగర్భమున విలీనములై పోయినవి. కావున వేలకొలది సంవత్సరములకు పూర్వము గతించిన వ్యక్తులను గురించి నేడు ఇదమిత్థమని నిర్ణయింపగలుగుట దుస్తరమే.

భారతభూమియందు కపిల నామముతో వ్యవహరింపబడినవారు నలువురు ఋషిపుంగవు లుద్భవించినట్లు కొందఱు విద్వాంసులు భావించుచున్నారు. వారిలో నొకరు కలియుగమున గోతమ వంశమునందు జన్మించినవారు. వారి నామముతోనే కపిలవస్తు నగర మొకప్పుడు నిర్మింపబడినట్లు బౌద్ధ వాఙ్మయమున చూడనగును. విదేశీయ విద్వాంసులలో పలువురీ గోతమ వంశజుడైన కపిలుడే సాంఖ్యదర్శన కర్తయని భావించుచున్నారు. కాని యియ్యది సత్యము కాదు. సాంఖ్యదర్శన మతి ప్రాచీనము

మిగిలిన ముప్వురు కపిలులలో నొకరు బ్రహ్మమానస పుత్రుడు మూల జ్ఞాని. రెండవ ఋషి అగ్ని యొక్క యవతారము. మూడవ కపిలమహర్షి కర్దమ ప్రజాపతికి దేవహూతియందు జన్మించిన వాడు.

ఉపర్యుక్త వ్యక్తులలో నాలవ వాడైన కపిల మహర్షియే సాంఖ్య దర్శన రచయిత యని పరిశోధకుల నిర్ణయము. ఈ కపిలదేవుని గురించి శ్రీమద్భాగవతమున తృతీయ స్కంధమునందు ఇరువది మూడవ యధ్యాయము మొదలు ముప్పదిమూడవ యధ్యాయము వరకు విస్తారముగ వర్ణింపబడియున్నది.

''ఏతన్మే జన్మలోకేఽస్మిన్ ముముక్షూణాం దురాశయాత్
ప్రసంఖ్యానాయ తత్త్వానాం సంమతా యాత్మదర్శనే''

భా ౩. ౨౪, ౩౬.

విష్ణుభగవానుడు కర్దమ ప్రజాపతి భార్యయైన దేవహూతియం దవతరించినట్లును, సరస్వతీ నదీతీరమున నున్న కర్దమ ప్రజాపతి యాశ్రమమునకు మరీచ్యాది మహర్షులతోబాటు బ్రహ్మ వచ్చినట్లును మఱియు నా బ్రహ్మ కర్దమునితో "ఆదిపురుషుడైన భగవాన్ విష్ణువు తన మాయ ద్వారా ప్రాణులకు శుభము చేకూర్చుటకై కపిల దేహమును ధరించినాడు'' అని చెప్పినట్లు భాగవతమున జూడనగును. ఇంతియేకాక యా బ్రహ్మ, దేవహూతితో "మనుపుత్రీ! నీ కడుపున విష్ణువు జన్మించినాడు. అతడు నీకు అవిద్యాజన్య సంశయముల నన్నిటిని బోగొట్టి పృథివియందు చరించును. అతడు సిద్ధులలో నందఱ కంటె శ్రేష్ఠుడై సాంఖ్యాచార్యులలో సుప్రతిష్ఠితు డగును. ప్రపంచమున కపిలు డని ప్రసిద్ధి వడయును" అని చెప్పినాడు.

ఇట్లు భాగవతమున వర్ణింపబడిన కర్దమ ప్రజాపతికి దేవహూతి యందు జనించిన కపిల మహర్షియే సాంఖ్యదర్శన కర్త యని పరిశోధకుల మతము. ఈ కపిలుడే బ్రహ్మ మానసపుత్రుడనియు, అగ్నియొక్క యవతార మనియు నూహింప వీలగును.

గరుడ పురాణమునం దొకచో నిట్లు వర్ణింపబడినది.

"పంచమః కపిలోనామ సిద్ధః కాలవిప్లుతమ్
ప్రోవాచాసురయే సాంఖ్యం తత్త్వగ్రామవినిర్ణయమ్"

ఈ శ్లోకమున కపిలుడు విష్ణువు యొక్క పంచమావతారముగా చెప్పి యతడే సాంఖ్య ప్రవక్తయని చెప్పియుండుట స్పష్టమగుచున్నది

ఈ విషయమున సాంఖ్యదర్శన వ్యాఖ్యాత యగు విజ్ఞానభిక్షువు కూడ తన యభిప్రాయము నిట్లే వివరించియున్నాడు.

''తదిదం సాంఖ్యశాస్త్రం కపిలమూర్తిః భగవాన్ విష్ణు రఖిలలోకహితాయ ప్రకాశితవాన్ ....''

''భగవాన్ విష్ణుస్వరూపుడగు కపిలమూర్తి యీ సాంఖ్యశాస్త్రమును లోకహితము కొఱకు ప్రకాశింపజేసినాడు.... ....''

ఈ సందర్భముననే విజ్ఞాన భిక్షువు, 'అగ్న్యవతారమయిన కపిలుడు సాంఖ్యమును రచించినాడు' అను పరుల వాదమును సైతము ఖండించి అగ్న్యవతారముగ నెంచబడు కపిలుడు విష్ణువు యొక్క యవతారమని చెప్పబడు కపిల మహర్షికంటె భిన్నుడు కాడనియు నొక్కి చెప్పి యున్నాడు.

షడ్ దర్శనములకు వ్యాఖ్యాన మొనర్చిన వాచస్పతి మిశ్రులును 'ఈ కపిలమహర్షియే సాంఖ్యదర్శన కర్త యని వ్రాసియున్నాడు. ఇతడు తనచే రచియింపబడిన సాంఖ్యతత్త్వ కౌముదియందు అరువది తొమ్మిదవ కారికకు వ్యాఖ్య నొనరించుచు, 'పరమర్షి' పదమునకు 'కపిలుడు' అని యర్థము వ్రాసియున్నాడు మఱియు నలువది మూడవ కారికను వివరించు తావున,

"యథా సర్గాదా వాది విద్వాన్ భగవాన్ కపిలో మునిర్ధర్మజ్ఞాన వైరాగ్యైశ్వర్య సంపన్నః ప్రాదు ర్బభూవేతి స్మరంతి''

'సృష్టిప్రారంభమునందు ధర్మ జ్ఞానాది సంపన్నుడును, ఆది విద్వాంసుడును, భగవానుడు నగు కపిలు డుద్భవించినాడు' అని వ్రాసియున్నాడు. ఈ ప్రసంగములను జూచినపుడు వాచస్పతి మిశ్రులును కర్దమ దేవహూతులకు జనించిన కపిలమహర్షియే సాంఖ్య దర్శన రచయితయని యంగీకరించుచున్నట్లు స్పష్టమగుచున్నది.

ఇంతటి విద్వాంసు లిట్లు సాక్ష్యము బలుకుచుండగా, కొందఱు ఆధునికులు పాశ్చాత్య విద్వాంసులు, వారి ననుగమించు భారతీయ విపశ్చి

తులను కపిల మహర్షి చారిత్రిక పురుషుడే కాదని వాదించుచున్నారు. వారి దృష్టిలో కపిలుడు మనవలె పాంచభౌతిక శరీరధారియే కాడు. పలువురు భారతీయ విద్వాంసులు సైతము పాశ్చాత్యుల యభిప్రాయము నూది పలుకుటయే తమకు గౌరవప్రదమని యెంచుచున్నారు. అందువలన పాశ్చాత్యులతో నేకీభవించి భారతదేశమునకు గౌరవము నాపాదించు వాస్తవిక ఘట్టముల ననేకములను అసత్యము లనియు, కల్పితము లనియు చెప్పుటకు వెనుకాడకున్నారు భారతీయ విద్వాంసుల యీ మనోవృత్తి సత్య పక్షపాతుల హృదయములకు కష్టము కలిగింపక పోదు.

ఇట్లనుటచే మిథ్యా భూతమగు నాత్మశ్లాఘకు లోనయి పరులు నిరూపించు సత్యము నంగీకరింపరాదని నా యభిప్రాయము కాదు. వాస్తవమును కల్పితమని చెప్పుటలో పరానుగామిత్వము మాత్రము ప్రశంసనీయము కాదనియే చెప్పవలసి వచ్చును.

కోల్‌బ్రుక్ జైకోబీ మోక్షమూలర్ ప్రభృతి పాశ్చాత్య విద్వాంసుల దృష్టిలో కపిలు డొక కాల్పనిక వ్యక్తి. ఈ విషయమును చూడదలచిన వారు డా. రిచర్డ్ గార్బే రచించిన (Sankhya and Yoga) అను రచన చూడవచ్చును. కీథ్ తనచే రచియింపబడిన (Sankhya System) లో కపిల పదమునకు 'హిరణ్యగర్భుడు' పర్యాయ పదమనియు, కపిలునకు శివ, విష్ణు, అగ్ని ఆదులతో నేకాత్మత సంస్కృత సాహిత్యమున జూడ నగుచున్నదనియు, కాబట్టి కపిలుడను నొక చారిత్రిక పురుషుడు వాస్తవమున లేడనియు వ్రాయుచున్నాడు

కొన్ని విశేష గుణములు నిమిత్తముగా గైకొని యొక వ్యక్తిని నామాంతరములచే వ్యవహరించిన మాత్రాన ఆ యా నామ పదములు పర్యాయములు కాజాలవని విద్వాంసుల యభిప్రాయము. శౌర్యధైర్యాది గుణములను పురస్కరించుకొని యొక బాలకుని సింహమని వ్యవహరించుట బాలక, సింహ పదములలో పర్యాయతను సాధించునా? మఱియు నందువలన బాలకుడు కల్పితుడన నొప్పునా ? ఇట్లే కపిలుడును తన లోకాతిశయ గుణములు నిమిత్తము కాగా, అగ్ని, విష్ణువు ఆదినామములచే కీర్తింపబడియుండుట సంస్కృత సాహిత్యమున జూడనగును. అంత మాత్రమున నతడు కల్పితవ్యక్తి యని నిర్ణయించుట విచార సహము. తర్క

సహాము కానేరదు. ఒక వస్తువుయొక్క యస్తిత్వమును నిరూపించుటకు దానిని సాధించు ప్రమాణములుండి, బాధక ప్రమాణములు లేకుండ వలయును. కాబట్టి కపిలుని యస్తిత్వమును సాధించు ప్రమాణము లనేకము లుండుటయే కాక బాధక ప్రమాణ మొందును లేకనికిః పిలుడు కాల్పనిక వ్యక్తియని యూహించుట నిరాధారమని తేట తెల్లము.

పాశ్చాత్య విద్వన్మతి ననుగమించిన భారతీయ విద్వాంసులలో పం. గోపీనాథ కవిరాజుగా రొకరు వీరును కపిలుడు కాల్పనికవ్యక్తి యని వ్రాసియున్నారు.

"That కపిల the First Teacher of సాంఖ్య in fact the first Enlightened Human - being during the cycle - was not a historical personage in the usually accepted sense of the term, is without any dout ———————————— Before he had plunged into నిర్వాణ, కపిల furnished himself with a సిద్ధదేహ and appeared before ఆసురి to impart to him the Secrets of సాంఖ్యవిద్యా."

'మొదటి సాంఖ్యప్రవక్త లేక యీ కల్పమునందు మనుష్య జాతికి సంబంధించిన సర్వ ప్రథమ విజ్ఞ ప్రాణియగు కపిలుడు చారిత్రిక పురుషుడు కాదని నిస్సందిగ్ధముగా చెప్పవచ్చును.... ... ." అని వ్రాయుచు నీ సందర్భమున కవిరాజు గారు చివరకు "కపిలుడు నిర్వాణమును బొందుటకు పూర్వము తన కొక సిద్ధ దేహమును కల్పించుకొని శిష్యుడైన ఆసురికి సాంఖ్య విద్య నుపదేశించుటకు అతని ముం దగపడెను." అని నిబంధించి యున్నారు. కవిరాజు గారి యీ చివరి వాక్యము వారి పూర్వ వాక్యమున కెంత విరుద్ధముగా నున్నదో వారు గమనింపకుండుట విచారణీయము. కపిలుడు వాస్తవికముగ దేహధారియైన వ్యక్తి కాదనుచు నిర్వాణమును బొందుటకు పూర్వము సిద్ధదేహమును ధరించి ఆసురికి సాంఖ్య విద్యను బోధించినాడని యంగీకరించుటలో గల సామంజస్యమేమి ? కపిలుడు వాస్తవమున

చారిత్రిక పురుషుడు కాకున్న నిర్వాణమును బొందిన దెవరు ? నిర్వాణమును బొందుటకు పూర్వము కపిలుడు ధరించిన సిద్ధదేహ మెట్టిది ? అది భౌతికమా ? అభౌతికమా ? అభౌతిక మగుచో ఆసురి యెదుట ప్రత్యక్ష మెట్లు కాగలదు ? భౌతికమే యగునెడల ఆ దేహ మెంత తడవు అటు లున్నది ; అయ్యది కొంత కాలము మనుజుడైన ఆసురికి సాంఖ్యమును బోధింప ననువుగా భూమిపై వ్యవహరించియున్న పక్షమున కపిలుడు కాల్పనికు డెట్లగును ? కావున కవిరాజుగారి లేఖయే వారి మతమున కడ్డువచ్చుచున్నది ఇంతియేకాక వారి లేఖను చక్కగా పరిశీలించినచో నయ్యది కపిల మహర్షి యైతిహాసిక పురుష డనియు నాది విద్వాంసు డనియు నా కాలపు సిద్ధులలో నతడు శ్రేష్ఠుడనియు బోధపడగలదు.

ఇట్లు ఆదికాలమున కర్దమ ప్రజాపతికి మనుపుత్రియైన దేవహూతి యందు జన్మించిన కపిలమహర్షియే జన్మాంతర సంస్కారబలముచే సిద్ధుడై సాంఖ్యదర్శనమును రచియించినాడని తెలుచున్నది.

కాలము :— కపిలమహర్షి కాలమును నిర్ణయించుటకును తగిన సాధనసామగ్రి లభించుట దుష్కరమే యగుచున్నది. ప్రస్తుతమున యుగముల కాలనిర్ణయము చేయుటకు ననువులేకున్నది. కాగా ఆ విద్వాంసుడైన కపిలమహర్షి సత్యయుగమునకు చివరనో, త్రేత యుగమునకు ప్రారంభముననోయున్నట్లు పాంచరాత్ర సాంప్రదాయమనకు సంబంధించిన అహిర్బుధ్న్య సంహితలో వర్ణింపబడియున్నన కాలనిర్ణయము చేయజాలము. మహాభారతమునందు శాంతిపర్వములో వర్ణింపబడియున్న కపిల - ఆసురి సంవాదమును బట్టి చూచినన కపిలుడు మిక్కిలి ప్రాచీనుడనియే చెప్పనగును. మఱియు నుపనిషత్తులలో నొకటి యగు శ్వేతాశ్వతరోపనిషత్తు నందును కపిల నామము స్పష్టముగా నుల్లేఖింపబడినది. కపిలనామమే కాక సాంఖ్య సిద్ధాంతములు నీ యుపనిషత్తునందే కాక యితర ఛాందోగ్యా ద్యుపషత్తులందు ప్రతిపాదింపబడి యుండుట చూచుచున్నాము. కఠోపషత్తునందు (౧. ౩. ౧౦. ౧౧.) ఇంద్రియములు, తన్మాత్రల మనస్సు, అహంకారము, మహత్తు, అవ్యక్తము, పురుషుడు నను సాంఖ్యదర్శన ప్రతిపాద్య విషయములు చక్కగా వివరింపబడియున్న

వేదమునందును సాంఖ్య మూలసిద్ధాంతములు నిరూపింపబడి యున్నవి. కాని, వేదనిరూపిత సాంఖ్యపదార్థములకు దార్శనిక స్వరూపము నొసంగినవాడు పరమర్షి కపిలుడు. అట్టి దార్శనిక స్వరూప ప్రతిబింబములే యుపనిషత్తులందు మనకు గోచరించుచున్నవి. కాబట్టి కపిలుడు ఉపనిషత్తుల కాలమునకు పూర్వుడనియు చెప్పుట సాహసము కానేరదు.

పై పంక్తులనుబట్టి కపిలమహర్షి సత్యత్రేతల సంధిసమయమున నుండియుండునని సామాన్యముగ జెప్పగలిగినను యుగప్రమాణ మనిశ్చిత మగుటచే నిన్ని వత్సరములని చెప్పజాలము. కర్దమ ప్రజాపతి యాశ్రమము సరస్వతీ నదీతీరమున నున్నట్లు సంస్కృత సాహిత్యమున జదువుచున్నాము. కపిలుని జన్మస్థానమ నయ్యదియే యై యుండును. ఆశ్రమ నిర్మాణసమయమున సరస్వతీనది ప్రవాహ పూర్ణమై ప్రాంత భూమిని సస్యశ్యామల మొనర్చి యలరారుచుండి యుండును నేడు సరస్వతీనది ప్రవాహ రహితమై నామావశిష్టముగా నున్నది. ఐతిహాసికుల దృష్టిలో నా నది యెండిపోయి కనీసము ఇరువదియైదువేల సంవత్సరములు గతించియుండునని యూహింపబడుచున్నది. ఇట్లిరువదియైదువేల సంవత్సరములకు పూర్వ మీ సరస్వతి సలిలపూర్ణమై సంపదలీనుచున్న రోజులలో నెన్నడు కర్దము డా నదీతీరమున తన యాశ్రమము నిర్మించియుండెనో యెట్లూహింపనగును ? కాని యీ నదీ చరిత్రము కపిలు డెంతటి పూర్వుడో యూహింప నొకింత తోడ్పడక పోదు.

కాళీపద భట్టాచార్యులు 1932 లో తాము రచియించిన నొక లేఖయందు కపిలమహర్షి క్రీస్తు జన్మమునకు ఏడువందల సంవత్సరములకు పూర్వమే యుండి యుండునని నిర్ణయించినారు. వారు తమ నిర్ణయమునకు ఆధారముగా నీశ్వరకృష్ణునిచే రచియింపబడిన డెబ్బదియొకటవ కారికలో వర్ణింపబడిన సాంఖ్యాచార్యుల శిష్యపరంపరను గ్రహించియున్నారు. వారు కపిలుడు మొదలు ఈశ్వరకృష్ణుని వరకు గల పరంపరాగత శిష్యులు ఇరువదియైదుగురని గణించి, యొక్కొక్కరి జీవితకాలము సగటున ముప్పది వర్షము లని యెంచి యుపర్యుక్త కాలమును నిర్ణయించి యున్నారు. కాని, యిట్టి యూహ పరిపూర్ణ

మనుటకు వలనుపడదు. కారణమేమన :— భట్టాచార్యులే వ్యాఖ్యానముల యాధారమున నీ శిష్య సంఖ్యను నిర్ణయించియున్నారో యా వ్యాఖ్యానములే కాక తదితర వ్యాఖ్యానములలో నొకటి యగు యుక్తిదీపికయందు నుపర్యుక్త శిష్యులేకాక మఱికొందఱు సాంఖ్యాచార్యుల పరంపరకు చెందినవారు వర్ణింపబడి యున్నారు. వారి సంఖ్యయు నందు చేర్పబడినచో కాలపరిమితి యింకను పెరుగ గలదు. కాబట్టి భట్టాచార్యుల పద్ధతి ననుసరించియు నిశ్చితముగ కపిలుడు క్రీస్తుకు పూర్వ మెనిమిదవ శతాబ్దము వాడని కానీ, లేక యంతకు పూర్వము వాడని కానీ చెప్ప నలవికాదు.

క్రీస్తుశకము పదునాలుగవ శతాబ్దమునకు తరువాతనే యొకానొక కపిలనామక పురుషునిచే సాంఖ్యదర్శనము నిర్మింపబడినదని చెప్పు విద్వాంసులు కొందఱు గలరు ఇందుకు రెండు కారణములు ముఖ్యముగా జెప్పుదురు ఒకటి :- శంకరాచార్యుడు, సాయణుడు మున్నగు దార్శనిక ఆచార్యులు సాంఖ్య సూత్రములను తమ రచనలలో నెక్కడను నుల్లేఖించి యుండకపోవుట. రెండు : సాంఖ్యదర్శనము నందలి సూత్రములలో న్యాయము, వైశేషికము మున్నగు నామములు వాడబడియుండుట.

ఒకానొక గ్రంథము ఆధునికము అని చెప్పుటకు ఆ గ్రంథము లోని పదములో వాక్యములో సూత్రములో మరియొక గ్రంథములో గ్రహింపకుండుట ప్రమాణముగ కానీ, కారణముగ కానీ చెప్పుట యుక్తి యుక్తము కాదు. ఇట్టి యుల్లేఖనమే యొక పుస్తకము యొక్క ప్రాచీన తార్వాచీనతలను సాధింప సాధకముగ నంగీకరింతుమేని యది కార్యసాధకము కానేరదు. సాయణుడు తనచే రచియింపబడిన ఋగ్వేద భాష్యమునందు వేంకట మాధవుని నామము తక్క తన కంటె నెంతో పూర్వకాలమునందు వేద భాష్యమును రచియించి గతించిన వారి నామముల నెక్కడను పేర్కొని యుండలేదు - అందు చేత, స్కందస్వామి, నారాయణుడు, ఉద్గీథుడు, భట్టభాస్కరుడు మున్నగు ప్రాచీన వేదభాష్య కర్త లందఱు సాయణుని కంటె తరువాతి వారన చెప్ప సాహసింపనగునా ? ఎన్నిటికిని కాదు - స్కందస్వామి

ప్రభృతులు సాయణాచార్యులకంటె పూర్వు లనుట నిర్వివాద విషయము. కాబట్టి సాంఖ్య సూత్రములను శంకరాచార్యాదులు తమ గ్రంథములలో నుల్లేఖింపనంతమాత్రమున కపిలుడు శంకరాదులకంటె నర్వాచీనుడు (తరువాతి వాడు) అనుట సరికాదు.

సాంఖ్యదర్శనము అర్వాచీనమని చెప్పువారి రెండవ యుక్తి యొకింత బలవత్తరముగ కనిపింపకపోదు కాని సూత్ర రచనను బాగుగ పరిశీలించిన తదుపరి పరిశీలకులు సాంఖ్యదర్శనము ప్రాచీనము కాదని చెప్పుటకు తోడ్పడు సూత్రము లన్నియు ప్రక్షిప్తములుగా నిర్ణయించుచున్నారు.

"నవయం షట్పదార్థ
వాదినో వైశేషికాదివత్" ౧. ౨౫.
"న షట్పదార్థ నియమ స్తద్ బోధాన్ముక్తిః" ౫. ౮౫.
"షోడశకాది ష్వప్యేవమ్" ౫. ౮౬.

ఈ సూత్రములందు వైశేషిక పదము కణాదుని, షోడశపదము గౌతముని బోధించును. కపిలుడు పూర్వము వర్ణించినట్లు ఉపనిషత్కాలము కంటె పూర్వు డగునెడల తనచే రచియింపబడిన సూత్రములందు తనకు తరువాతి వారైన కణాదాదుల నెట్లు పేర్కొనగలడు? కావున కణాదాదులకు తరువాతివాడై యుండవలయునని యెంచుట యుక్తి సంగతముగా తోచును కాని ప్రస్తుతము సాంఖ్యదర్శనమున నున్న సూత్రములన్నియు నున్నవి యున్నట్లు కపిలమహర్షి రచితములని పరిశోధకులు అంగీకరింపరు. సూత్ర రచనాశైలిని పరీక్షించి యిట్టివి యనేక సూత్రములు ప్రతి యధ్యాయమునందును ఆధునికు లెవరో చేర్చియున్నారని పరిశీలకుల నిశ్చయము. అందువలననే బౌద్ధాదుల మతఖండనములు సైతము ఈ దర్శన సూత్రములందు నామోల్లేఖ పూర్వకముగ కానవచ్చుచున్నవి. ఈ వాదము నంగీకరించియు మేము ప్రక్షిప్త సూత్రములను పుస్తకమునుండి తొలగింపక ఉన్నవి యున్నట్లు వ్యాఖ్యానము చేసియున్నాము. విజ్ఞాన భిక్షువు మున్నగు వ్యాఖ్యాకారులును ఇట్లే వ్యాఖ్యానము చేసియున్నారు.

పై వివాదగ్రస్త విషయములన్నియు "సాంఖ్యదర్శన్‌కా ఇతిహాస్" అను నొక గ్రంథము ననుసరించి యొకింత యిట చర్చించియున్నాను. ఈ గ్రంథమును విద్యాభాస్కర, వేదరత్న, శ్రీ పండిత ఉదయవీర శాస్త్రి (న్యాయతీర్థ సాంఖ్య యోగతీర్థ, వేదాంతాచార్య) గారు రచియించి యున్నారు. వీరే సాంఖ్యదర్శన - ఇతిహాసము పాఠకుల కందజేయుటకై సుమారు ఇరువదియైదు సంవత్సరము లన్వేషణ చేసినట్లు తెలియుచున్నది. పీఠికయందు చర్చించిన విషయములే కాక యితరానేక విషయములు సాంఖ్యదర్శనమునకు సంబంధించినవి పాఠకుల పై గ్రంథమునందు వివరముగాను, సప్రమాణముగాను జూడ గలుగుదురు.

స్థానము :—

కపిల మహర్షి జన్మస్థానము సరస్వతీ నదీతీరము నందలి కర్దమ ప్రజాపతి యాశ్రమ మని సామాన్యముగ నింతకు పూర్వము నిర్దేశించి యున్నాను. ఉత్తర భారతమున అంబాలా జిల్లాకు - ఉత్తర పూర్వము - ఈశాన్యమున సిర్‌మార్ రాజ్యము (నాహన్ స్టేట్) నందు సరస్వతీ నదీచిహ్నము లక్కడక్కడ నేటికిని కనిపింపకపోవు. 'శివాలక' పర్వతమున 'ఆదిబద్రీ' నామము గల కనుమనుండి సరస్వతీ నది బయటబడి సమతలమున ప్రవహించి యుండెను. ఐదారు మైళ్ళు పైగా హరిపుర కనుమనుండి బయటబడిన శాఖ యొకటి యీ సరస్వతి యందు కలియు చుండెడిది. 'శివాలక' ప్రదేశమునకు ముప్పదిమైళ్ళ దూరములో నీశాన్యముగా రేణుక యనెడి యొక సరస్సున్నది దాని యిప్పటి సంకుచిత నీరసస్థితిని జూచి యొకప్పు డట నొక పెద్ద నదీప్రవాహ ముండి యుండనోపు నని యూహింపనగును. దానికి నైదాఱుమైళ్ళ దూరమున నీశాన్యముగ నొక పెద్ద పర్వత మున్నది. దానిపై రెండు చిన్న చిన్న శిఖరము లున్నవి. అందొకదాని పేరు నేటికిని 'కపిలటిబ్బ' యనియు మఱియొకదాని పేరు 'జమదగ్ని' యనియు చెప్పబడుచున్నది. ఆ స్థానిక చరిత్రము కూడ జమదగ్ని, రేణుక పరశురాముల చరిత్రమునకు సంబంధించియే యున్నది.

సరస్వతీ నది యుపర్యుక్త స్థలములకు ఈశాన్యముగ కొంత దూరములో 'బిందుసరమ'ను సరస్సున నుద్భవించి పై స్థలములకు సమీపమున ప్రవహించుచుండి యుండును. ఈ నదీతీరమునకు సమీపమున నేటికిని కపిల నామముతోనే పిలువబడు నా శిఖరమే కపిల జన్మస్థానము - కర్దమ ప్రజాపతి యాశ్రమమై యుండనోపును.

భాగవతము ననుసరించి స్వాయంభువ మనువు తన కన్యను దేవహూతినిచ్చి వివాహమొనర్చుటకై కర్దముని ఆశ్రమమునకు వచ్చి యున్నాడు. ఆ స్థానము బ్రహ్మావర్తముననో దానికి సమీపముననో ఉన్నట్లు చెప్పబడుచున్నది. ఇట్లు సంస్కృతమున లభించు బిందు సరము, సరస్వతీ, బ్రహ్మావర్తనము మున్నగు శబ్దముల యాధారముతో కపిలుని జన్మస్థానము నాహన్ స్టేటులో నున్న రేణుకా సరస్సునకు సమీప మని యూహింపనగుచున్నది.

ఈ గ్రంథము సాంఖ్యదర్శనము లేక సాంఖ్య ప్రవచనము, అనియు, షష్ఠితంత్రమనియు సంస్కృత వాఙ్మయమున పేర్కొన బడినది. ఇందలి ప్రతిపాద్య విషయము ఆధ్యాత్మిక దృష్టితో నరువది విధముల విభాగింపబడుటచే నియ్యది షష్టితంత్రమని పిలువబడును. ఆధిభౌతిక దృష్టితో విషయవిభాగ మొనర్చి తత్త్వవ్యాఖ్యాన మొనర్చి నందున సాంఖ్యప్రవచన మనియు లేక సాంఖ్యదర్శనమనియు చెప్ప బడినది.

ఆధిభౌతిక వివేచన దృష్టితో నీ శాస్త్రమున నిరువది నాలుగు జడ తత్త్వము లొక వర్గముగాను, చేతన తత్త్వములు మఱియొక వర్గముగాను విభజించి మొత్తము ఇరువదియైదు తత్త్వము లిందు వివరింపబడును. జడ వర్గమునకు ప్రకృతి మూలకారణము. మిగిలిన నిరువదిమూడు తత్త్వములు దాని కార్య పదార్థములు. ప్రకృతి పురుషుల వివేకజ్ఞానము కలుగుటయే సాంఖ్య మనబడును. ఇదియే మోక్షము లేక యపవర్గ మనబడును. ఇటి వివేక జ్ఞాన మిందు ప్రవచించుటయే నీ శాస్త్రము సాంఖ్య ప్రవచన మనియు చెప్పబడును.

కపిలమహర్షి షష్టితంత్రము, లేక సాంఖ్యదర్శనమును రచియించి తన శిష్యుడైన ఆసురికి బోధించి యున్నాడు. ఆసురి యా తంత్రమునే

పంచశిఖాచార్యునకు బోధించియున్నాడు. అత డీ శాస్త్రమున అధ్యాపనము, వ్యాఖ్యానము, లేఖనము మున్నగు రీతులలో దేశమున నలుగడల వ్యాపింపజేసియున్నాడు. ఇట్లు శిష్య పరంపరగా నీ గ్రంథము ఈశ్వరకృష్ణునకు లభించినది. ఈ శిష్య పరంపరలో భార్గవుడు, ఉలూకుడు, వాల్మీకి, హారీతుడు, దేవలుడు, జనకుడు, వశిష్ఠుడు, పతంజలి, వార్షగణ్యుడు, గర్గుడు, గౌతముడు మున్నగు పలువు రాచార్యులు లెక్కింపబడుచున్నారు.

ఈశ్వరకృష్ణుడీ దర్శన సిద్ధాంతములను బాగుగ నాకళించుకొని, సాంఖ్య సప్తతి - సాంఖ్యకారిక యను పేరుతో నొక గ్రంథమును ఛందోబద్ధముగ రచియించి యున్నాడు. అందువలన సాంఖ్యదర్శనము అర్వాచీనమనియు, ఈశ్వరకృష్ణ రచిత కారికలు ప్రాచీనములనియు నెంచువారి మత మనాదరణీయమే యని తేలుచున్నది. కావుననే ఈశ్వరకృష్ణుడు తన డెబ్బదిరెండవ కారిక నిట్లు రచించియున్నాడు

"సప్తత్యాంకిల యేఽర్థాస్తేఽర్థాః కృత్స్నస్య షష్టితంత్రస్య
ఆఖ్యాయికా విరహితాః పరవాదవివర్జితాశ్చ"

"కారికా సప్తతిలో నున్న సమస్త పదార్థములు షష్టి తంత్రములోనివే. షష్టితంత్రములోని ఆఖ్యాయికలు, పరవాద ఖండనలు మాత్ర మిందు వర్ణించలేదు" అని తన గ్రంథము నుపసంహరించి యున్నాడు.

ఆధ్యాత్మిక దృష్టితో సాంఖ్యదర్శనమున వర్ణింపబడిన అరువది పదార్థములు.

౧. పంచ విపర్యయములు :— ౧. తమస్సు = అవిద్య
౨. మోహము = అస్మిత
౩. మహా మోహము = రాగము
౪. తామిస్రము = ద్వేషము
౫. అంధతా మిస్రము అభినివేశము

౨. నవ తుష్టులు :— ౧. ప్రకృతి
౨. ఉపాదానము

౨. నవ తుష్టులు :—

౩. కాలము
౪. భాగ్యము
౫. అర్జనోపరమము
౬. రక్షణోపరమము
౭. క్షయోపరమము
౮. అతృప్త్యుపరమము
౯. హింసోపరమము

౩. అష్ట సిద్ధులు :—

౧. ఊహ
౨. శబ్దము
౩. అధ్యయనము
౪. ఆత్మిక దుఃఖవిఘాతము
౫. భౌతిక దుఃఖవిఘాతము
౬. దైవిక దుఃఖవిఘాతము
౭. సుహృత్ ప్రాప్తి
౮. దానము

౪. అష్టావింశత్యశక్తులు :—

జ్ఞానేంద్రియా శక్తులు:
౧. చక్షుర్వధ
౨. రసనవధ
౩. ఘ్రాణవధ
౪. త్వగ్వధ
౫. శ్రోత్రవధ

కర్మేంద్రియా శక్తులు:
౬. వాగ్ వధ
౭. పాణివధ
౮. పాదవధ
౯. పాయువధ
౧౦. ఉపస్థవధ
౧౧. మనోవధ

4)

౧౨. ప్రకృతి వధ
౧౩. ఉపాదానవధ
౧౪. కాలవధ
౧౫. భాగ్యవధ
౧౬. అర్జనోపరమవధ
౧౭. రక్షణోపరమవధ
౧౮. క్షయోపరమవధ
౧౯. అతృప్త్యుపరమవధ
౨౦. హింసోపరమవధ
౨౧. ఊహవధ
౨౨. శబ్దవధ
౨౩ అధ్యయనవధ
౨౪. ఆత్మికదుఃఖ విఘాతవధ
౨౫. భౌతిక దుఃఖ విఘాత వధ
౨౬. దైవికదుఃఖ విఘాతవధ
౨౭. సుహృత్ ప్రాప్తివధ
౨౮. దానవధ

} బుద్ధికి సంబంధించిన అశక్తులు

౫. దశమౌళికార్థములు :— ౧. ఏకత్వము
౨. అర్థవత్వము
౩. పారార్థ్యము
౪. అన్యత్వము
౫. అకర్తృత్వము
౬. బహుత్వము
౭. అస్తిత్వము
౮. వియోగము
౯. యోగము
౧౦. స్థితి

(ఈ యిరువది పదార్థములు సాంఖ్యకారికలు రచించిన ఈశ్వర కృష్ణుని యభిమతము ననుసరించి యిట నుల్లేఖింపబడినవి. ఈ దర్శన వ్యాఖ్యానమున నియ్యవి వివరముగా తెలుప యత్నింపనైతి.)

అధిభౌతిక దృష్టితో నీ దర్శనమునందు ప్రతిపాదింపబడిన పదార్థము లిరువదియైదు. ౧. పురుషుడు, ౨. ప్రకృతి, ౩. బుద్ధి, ౪. అహంకారము, ౫. పంచతన్మాత్రలు, ౬. ఏకాదశేంద్రియములు, ౭. పంచ మహాభూతములు.

ఇట్టి యిరువదియైదు తత్త్వముల జ్ఞానప్రాప్తిచే నరులు ముక్తి నంద గలుగుదురని యీ గ్రంథము ప్రతిపాదించును. ఈ తత్త్వములను బాగుగ పరిశీలించి చూచినపుడు అధ్యాత్మమార్గమున వీని యుపయోగము సాక్షాత్తుగ గలదని తెలిసికొనుట కష్టము కానేరదు.

అతి స్వల్పముగాను అత్యంత సంక్షిప్తముగాను నేనీ పరిచయమున చర్చించిన విషయములన్నియు నుపర్యుక్త గ్రంథసహాయము మూలము ననే పాఠకులకు సమర్పింపగలిగినాను. ఈ గ్రంథకర్త తన గ్రంథము ద్వారా నాకు చేసిన మహోపకారమునకు గ్రంథకర్తకు సదా కృతజ్ఞుడనై యుందును.

నా యందలి ప్రేమచే నా కోర్కెను త్రోసిపుచ్చక యతి స్వల్ప కాలములో నా యీ సాంఖ్యదర్శనమునకు, శ్రీ కె. సచ్చిదానందమూర్తి (దర్శనాధ్యాపకులు — ఆంధ్ర విశ్వవిద్యాలయము - వాల్తేరు) గారు మహత్వ పూర్ణమును, గంభీరాధ్యయన బోధకమును నగు భూమిక నొకదానిని వ్రాసి యిచ్చినారు. ఇందులకు నేను వారికి సర్వదా కృతజ్ఞుడను. వీరు ఆంధ్ర, ఆంగ్ల, సంస్కృత విద్వల్లోకమున కతి పరిచితులు. తరుణ వయస్సుననే విపశ్చిత్ ప్రశంసకు పాత్రులై యనేక గ్రంథములను రచియించిన సఫల ప్రయత్నులు. ఇట్టి యోగ్య విద్వాంసులు నా యీ కృతికి తొలిపలుకులు వ్రాయు నవకాశము లభించుట నా భాగ్యము.

ఇంతకు పూర్వము తెలుగు పాఠకులకు న్యాయ వైశేషికములు, యోగము నను మూడు ప్రాచీన దర్శనములను 'అంబా వ్యాఖ్యానము'

అను వ్యాఖ్యానముతో సమకూర్చి యున్నాను. వానిని చదివిన సహృదయులు కొందఱు మిగిలిన దర్శనములుకూడ ఇట్లే తెలుగువ్యాఖ్యానముతో పొందుపఱచి తెలుగు భాషామతల్లికి కానుకగా నర్పింప లేఖల మూలమున ప్రోత్సహించి యున్నారు. వారి ప్రోత్సాహ మూతగా గొని నా నేర్చినయట్లు సంస్కృతములో గల యనేక వ్యాఖ్యానముల సహాయముతో నీ సాంఖ్యదర్శనమునకు కూడ అంబావ్యాఖ్యాన మను పేర వ్యాఖ్యానము రచియించి సోదర పాఠకుల కందజేయుచున్నాడ. విజ్ఞులిందలి గుణ దోషములను వివేకించి దోషములను ప్రేమ పురస్సరంగా నాకు తెలిపిన మరియొక సంస్కరణమున నయ్యవి సరిచేసికొనగలనని వినమ్రుడనై విన్నవించుచున్నాడ.

కూచిపూడి
4-1-54
జయచైత్ర శు ౧.

బుధవిధేయుడు
గోపదేవ్

-: సంపాదకీయము :-

ఇయ్యది మూడవ ముద్రణము ఈ గ్రంథనామము సాంఖ్యదర్శనము. ఇది షడ్దర్శనములలో నొకటి. ఏతద్గ్రంథకర్త కపిలుడనియు, కాదనియు, ఆకపిలుడు కూడ నెవ్వరాయనియు వాదోపవాదములగూర్చి శ్రీ పండిత గోపదేవ్‌గారి పరిచయ వాక్యముల వలన విశదము కాగలదు. సంస్కృతవాఙ్మయమున సాంఖ్యదర్శనము, సాంఖ్యప్రవచనము, షష్టితంత్రమనియుచెప్పబడి యున్నది. ఆధ్యాత్మిక దృష్టితో నిందలి విషయము అఱువది విధముల విభజింపబడి యుండుటచే నీగ్రంథమును షష్టి తంత్ర మందురు. మఱియు ఆధిభౌతిక దృష్టితో విషయమును విభజించి తత్త్వవ్యాఖ్యాన మొనర్చుటచే సాంఖ్యదర్శనము, సాంఖ్యప్రవచన మనియు నందురు.

ఆధిభౌతిక దృష్టితో జడతత్త్వముల నిరువది నాల్గింటినొక సముదాయముగాను, చేతన తత్త్వముల నొక సముదాయముగాను, విభజించి మొత్తము ఇరువది యైదు తత్త్వములుగా నిందు వివరింపబడి యున్నవి. జడతత్త్వములకు మూల కారణము ప్రకృతి. తక్కిన యిరువది మూడు తత్త్వములు ప్రకృతి యొక్క కార్యపదార్థములు ప్రకృతి పురుషుల వివేక జ్ఞానము గలుగుటయే సాంఖ్యము. దీనినే మోక్షము లేక అపవర్గము అందురు. ఇందలి విషయమునుబట్టి ఈ గ్రంథము సార్థక నామము కలది యగుచున్నది.

ఈ విషయమందు నేటి మానవులకు నభిలాష తక్కువగుటచే పాఠకులు కఱవై పునర్ముద్రణమున కింత కాలము పట్టినది. పాఠకులు ఇందలి విషయమందు మనస్సును చొప్పించి మోక్షమార్గ మన్వేషించుటకు ప్రయత్నింతురుగాక !

తెనాలి
4-5-89

వెంకయార్య

విషయ సూచిక

ద్వితీయాధ్యాయము

తృతీయాధ్యాయము

చతుర్థాధ్యాయము

పంచమాధ్యాయము

సాంఖ్య దర్శనము

ప్రథమాధ్యాయము

మానవుడు తన జీవితమున సాధింపదగినది పరమ పురుషార్థము – మోక్షము. దానికి ముఖ్యమైన సాధనము ప్రకృతి పురుషవివేకజ్ఞానము – 'ప్రకృతి వేఱు; పురుషుడు వేరు;' అను జ్ఞానము. ప్రకృతి యన నేమో, పురుషు డన నేమో, వానిని వేరువేరుగా తెలిసికొనిన గాని పరమపురుషార్థము సిద్ధింపదు. కాబట్టి కరుణానిలయుడైన కపిల మహర్షి ప్రకృతి పురుష వివేకజ్ఞానమును విపులముగా నుపదేశింప దలచి యీ శాస్త్రమును రచించియున్నాడు. ముందుగా పరమపురుషార్థము యొక్క – స్వరూపము – లక్షణము–ను వర్ణించుచున్నాడు.

"అథ త్రివిధ దుఃఖాత్యంత నివృత్తి రత్యంత పురుషార్థః" ౧. ౧.

త్రివిధ........నివృత్తిః = ఆధ్యాత్మికము, ఆధిభౌతికము, ఆధిదైవికము నను మువ్విధములైన దుఃఖముల (బాధల) యత్యంత నివారణము. అత్యంత పురుషార్థః = పరమపురుషార్థము.

ప్రతి పురుషుడును అనగా ప్రతి జీవుడు కోరదగినది పురుషార్థ మనబడును. పురుషునిచే నర్థింపబడునది కాబట్టి పురుషార్థము. పురుషుడు తా గోరుదానికంతము – నాశము లేకుండవలయునని యెంచును. అట్టి యంతము నతిక్రమించి –

అంతము లేక – యుండునట్టి యర్థము అత్యంత పురుషార్థ మనబడును. పురుషార్థములు రెండు. ఒకటి భోగము. రెండవది యపవర్గము. ఈ రెండువిధములైన పురుషార్థములను నిర్వర్తించుటకే ప్రకృతి ప్రవర్తించునని సాంఖ్యులు చెప్పుదురు. సుఖముల ననుభవించుటయే భోగమని లోకులు సామాన్యముగ వ్యవహరింతురు. కాని, శిష్టులు – శాస్త్ర సంప్రదాయము నెఱిగినవారు – మాత్రము సుఖదుఃఖముల యనుభవము భోగ మందురు. సుఖదుఃఖములు పురుషుని కోరిక – అర్థన–చే నేర్పడునవియే కాబట్టి భోగము పురుషార్థ మనబడును. ఇయ్యది జనించును; అనగా పుట్టును. అంతకు పూర్వము లేక క్రొత్తగా కలుగునని భావము. జనించునది కాబట్టి దీనికొక యంతము – నాశము ఉండును అంతము నతిక్రమింపదు. పుట్టినది గిట్టక తప్పదుకదా! కాగా భోగ మనెడి పురుషార్థము అత్యంత పురుషార్థము కాదు. నాశవంతమైన (అంతము గల) పురుషార్థమును సాధించు విధము – ఉపాయము – ను తెలుప శాస్త్రము నారంభించుట విశేష ప్రయోజనదాయకము కాదు. అందువలన నంతము లేని – అత్యంతమైన – పురుషార్థము (అపవర్గము)సాధించుట కనువైన సాధనము నుపదేశించుటకే యీ శాస్త్ర మారంభింపబడిన దనుట నిక్కువము. త్రివిధ దుఃఖాత్యంత నివృత్తియే యత్యంత పురుషార్థము. ప్రతి పురుషుడును తనకు దుఃఖము లత్యంతముగా నివృత్తి చెందవలయుననియే యభిలషించును. అదియే పరమ పురుషార్థము. దానికి సాధనము ప్రకృతిపురుష వివేక

జ్ఞానము. ప్రకృతి యన నేమో, పురుషుడన నేమో, వాని వివేక జ్ఞాన మెట్టిదియో వివరించుటయే యీ శాస్త్రమున విషయము. ఈ శాస్త్రమున మొదటి పదము 'అథ'; చివరి పదము 'పురుషార్థః'; అథ మొదలు పురుషార్థము వరకు గలది శాస్త్రవిషయము. దాని ప్రతిపాదనము ప్రారంభింపబడినట్లే సూత్రములోని 'అథ' శబ్దము శాస్త్రప్రారంభమును తెలుపును.

త్రివిధ దుఃఖములు :- జ్వరాది వ్యాధులవలన శరీరమున నేర్పడు బాధలు, కామ క్రోధాదులవలన మనస్సునందు కలుగు బాధలు ఆధ్యాత్మికములు (౧); భూతము లన ప్రాణులు. వ్యాఘ్రాది క్రూర మృగములు చోరులు హంతకులు మున్నగు మానవులు. మఱియు సీఘాతుక ప్రాణులు వానివలన కలుగు బాధలు ఆధిభౌతికములు (౨); విద్యుత్తు, సూర్యుడు, పృథివ్యాది భూతములు నిట దేవత లనబడును. వీనివలన కలుగు - భూకంపము, అశనిపాతము, అతివృష్టిమున్నగు వానిచే నేర్పడు - బాధలు ఆధిదైవికములు (3); దుఃఖము లన్నియు మానసికములే యైనను త్రివిధములుగా విభజించి చెప్పుట వివరణార్థము.

సాంఖ్యుల మతమున పురుషుడు - ఆత్మ - కూటస్థ నిత్యుడు - పరిణామము నొందనివాడు. అట్టివానిలో దుఃఖాది పరిణామములు కలుగనేరవు. కాబట్టి దుఃఖాదు లన్నియు ప్రాకృతికమైన బుద్ధి తత్త్వమునకు చెందినవే యందురు. అయినను, దుఃఖాది పరిణామములు గల బుద్ధి పురుషునకు సమీప

మున నుండుటచేత పురుషునందు బుద్ధియో, లేక బుద్ధియందు పురుషుడో ప్రతిఫలించుట - ప్రతిబింబించుట - సంభవము. అట్టియెడ పురుషుడు తనయందు ప్రతిబింబించిన బుద్ధి పరిణామములను - దుఃఖాదులను - వివేకింపక - వేరని తెలిసికొనక - తనవి కావని యెంచక - తనవే యని యెంచి భోగము కలవాడగుచున్నాడు. కాబట్టి దుఃఖాదులు పురుషున కున్నట్లే యన వలసి వచ్చుచున్నది. అట్టి దుఃఖముల నత్యంతముగా నివర్తించుటకు కేవలము వివేకజ్ఞాన మవసరము. అందువలన ప్రకృతి పురుష వివేకజ్ఞానము ద్వారమున దుఃఖాత్యంతనివృత్తి పరమ పురుషార్థ మగుచున్నది. దుఃఖనివృత్తియనగా దుఃఖధ్వంసము (నాశము) కాదు. సాంఖ్యులు సత్కార్యవాదులు. అనగా నదివరకు లేని వస్తువెన్నడును క్రొత్తగా నేర్పడదనియు, ఉన్న వస్తు వెన్నడు నాశము (ధ్వంసము - అభావము - ఉనికి లేకుండుట) నందదనియు చెప్పుదురు. కాబట్టి వా రభావము నంగీకరింపరు. ఈ యభిప్రాయమే గీతలో ('నాసతో విద్యతే భావః, నాభావో విద్యతేసతః') అని వివరింపబడినది. అందువలన నిట నివృత్తిపదమున కర్థము ధ్వంసము (అభావము - నాశము) కాదనియు, అతీతావస్థ యనియు తెలిసికొనవలయును. దుఃఖములు మన మనుభవించు క్షణములో నవి వర్తమానావస్థలో నుండును. అనుభవించిన మరుక్షణమున నవి అతీతావస్థను బొందును. ముందు అనుభవింపవలసినవి అనాగతావస్థలో నుండును. అతీతావస్థ నందిన దుఃఖములను గురించి పురుషుడు చేయవలసిన దేమియు నుండదు. వర్తమాన

దుఃఖములును మఱుక్షణమున నతీతావస్థను బొంది యవియు నుపేక్షింపదగినవియే యగును. కాగా మిగిలిన అనాగత దుఃఖమే యతీతావస్థను బొందింపదగిన దగుచున్నది. ఈ యనాగత దుఃఖభోగము పురుషునకు ప్రకృతిపురుష వివేక జ్ఞానము లేమిచే కలుగుచున్నది. కాబట్టి యట్టి వివేక జ్ఞానమే దానిని తొలగింపగలదు. మఱియొక యుపాయ మేమియు లేదు. అందువలన కపిల మహర్షి ప్రకృతిపురుష వివేక జ్ఞానమును కలిగింప నీ శాస్త్రము నారంభించియున్నాడని భావము.

ఈ పరమ పురుషార్థమైన త్రివిధ దుఃఖాత్యంత నివృత్తి దృష్టోపాయములై లోకసిద్ధములగు నౌషధ పానాద్యుపాయముల ద్వారమున సిద్ధింపదా? కష్టసాధ్యమైన శాస్త్రీయ వివేకజ్ఞాన మెందులకన :-

"న దృష్టాత్తత్సిద్ధి ర్నివృత్తేఽప్యనువృత్తి దర్శనాత్" ౧. ౨.

దృష్టాత్ = లోకసిద్ధమగు నౌషధపానాదుల వలన, తత్సిద్ధిః = త్రివిధ దుఃఖాత్యంత నివృత్తి రూపఫలము, న = కలుగదు. కారణ మేమన, నివృత్తేఽపి = లోకసిద్ధమగు నుపాయమువలన నొక విధముగ నెట్లో దుఃఖము తొలగినను, అనువృత్తి దర్శనాత్ = కాలాంతరమున మరల నట్టిదుఃఖము వాటిల్లుచుండుటవలన.

ప్రాణులకు కలుగు నాధ్యాత్మికాది దుఃఖములను తొలగించుటకు నౌషధ పానాద్యుపాయములు లోకమున నెన్నో యున్నవి. వాని నుపయోగించుకొని జీవులు తమకు కలుగు నాకలిబాధ మున్నగు నెన్నో బాధలను తొలగించుకొనుట నిత్యము మనము చూచుచునే యున్నాము. ఆకలిగొన్నవాడు

అన్నము తిని యాకలి బాధను తొలిగించుకొనును. జ్వరము వచ్చినవాడు ఔషధమును తిని జ్వరదుఃఖమును తొలగించుకొనును. ఇట్లే యితర బాధ లితరోపాయములవలన పోగొట్టుకొనును. కాని యీ బాధలు మరల కలుగకపోవు. కలుగుచునే యుండును. కాబట్టి లోకసిద్ధమగు – దృష్టములగు – నుపాయముల వలన దుఃఖాత్యంత నివృత్తి కలుగనేరదు.

లోక ప్రసిద్ధములైన యుపాయముల వలన దుఃఖములను తొలగించుకొనుట పురుషార్థము కాగలదా యన :–

"ప్రాత్యహిక క్షుత్ప్రతీకారవత్ తత్ప్రతీకార చేష్టనాత్ పురుషార్థత్వమ్" ౧ 3.

ప్రాత్యహికక్షుత్ ప్రతీకారవత్ = ప్రతిదినము కలుగు నాకలి బాధను తొలగించుకొనుట పురుషార్థమైనట్లు, తత్ప్రతీకారచేష్టనాత్ = లోక ప్రసిద్ధోపాయముల మూలమున నాధ్యాత్మికాది దుఃఖములను తాత్కాలికముగ తొలగించుకొనుటయు, పురుషార్థత్వమ్ = పురుషార్థమే యగును.

దుఃఖము వాటిల్లినపుడు దానికి ప్రతీకార మొనర్చుకొనుట లోకన్యాయము. శాస్త్రీయ మయిన యుపాయము తెలియదని లోకప్రసిద్ధమగు నుపాయము ద్వారమున నపు డా దుఃఖమును తొలగించుకొనకుండుట యుచితము కాదు. కాబట్టి దృష్టోపాయము మూలమున తాత్కాలికముగనైనను దుఃఖమును నివర్తింపజేసికొనుట పురుషార్థమే యగును. కాని పరమపురుషార్థము కానేరదని భావము.

లోకప్రసిద్ధోపాయమువలన సాధించెడి తాత్కాలిక దుఃఖనివారణము సైతము పురుషార్థమైనను,

"సర్వాసంభవాత్ సంభవేఽపి సత్తాసంభవాత్
హేయః ప్రమాణకుశలైః" ౧. ౪.

సర్వాసంభవాత్ = సర్వవిధములైన దుఃఖముల నివారణ మసంభవ మగుటవలన, సంభవేఽపి = ఎట్లోసంభవమైనను, సత్తాసంభవాత్ = సూక్ష్మరూపమున నా దుఃఖముల యునికి సంభవమగుటవలన, ప్రమాణకుశలైః=నిపుణులచేత, హేయః = (దృష్టోపాయమువలన కలిగెడి దుఃఖముల తాత్కాలిక నివృత్తి) త్యజింపబడదగినదే.

దృష్టమైన లోకసిద్ధోపాయము మూలమున లభించెడి దుఃఖముల తాత్కాలిక నివృత్తి పురుషార్థమైనను నయ్యది యాత్యంతిక నివృత్తి కాదు కాబట్టి నిపుణులు దానిని హేయముగా నెంచుదురు.

"ఉత్కర్షాదపి మోక్షస్య సర్వోత్కర్ష శ్రుతేః" ౧. ౫.

మోక్షస్య = దుఃఖాత్యంతనివృత్తి, ఉత్కర్షాదపి = దృష్టోపాయము వలన కలిగెడి దుఃఖనివృత్తికంటెను శ్రేష్ఠమైనందువలనను, సర్వోత్కర్షశ్రుతేః = దృష్టోపాయమువలన నేర్పడెడి దుఃఖనివృత్తికంటె మోక్షము నెక్కుడుగా శ్రుతి వర్ణించియుండుటవలన, దృష్టోపాయము నిపుణులకు హేయమే.

మఱియు త్రివిధదుఃఖాత్యంతనివృత్తి యనెడి మోక్షము దృష్టోపాయమువలన సంపాదించెడి దుఃఖముల తాత్కాలిక నివారణముకంటె నెంతో యుత్తమము. ఇట్లే శ్రుతులందును వర్ణింపబడి యున్నది.

"అశరీరం వా వసంతం నప్రియాప్రియే స్పృశతః"
ఛాందోగ్య.... ౮. ౧౨. ౧౦

'శరీర రహితులైనవారికి సుఖదుఃఖము లుండవు' అని శ్రుతులు మోక్షము నుత్కర్షగా వర్ణించియున్నవి. కాబట్టి

నిపుణులు శాస్త్రీయోపాయ సాధ్యమైన పరమపురుషార్థమునే కామింతురు. పురుషార్థమును మాత్రము హేయముగానే చూతురని భావము.

దృష్టోపాయము వలన దుఃఖాత్యంత నివృత్తి కలుగకుండినను శాస్త్రమున చెప్పబడిన ఉపాయ సాధ్యములయిన వైదిక యజ్ఞ యాగాదులవలన కలుగదా? యన :-

"అవిశేషశ్చోభయోః" ౧. ౬.

ఉభయోః చ = దృష్టము, శాస్త్రీయము నయిన రెండుపాయములును, అవిశేషః = సమానములే.

దృష్టోపాయములైన ఔషధ సేవనాదులవలన నెట్లు దుఃఖాత్యంత నివృత్తి కలుగదో యట్లే శాస్త్రీయోపాయములచే సాధింపదగు యజ్ఞయాగాదులవలనను దుఃఖాత్యంత నివృత్తి కలుగదు.

ఈ సూత్రమునందలి యుభయ శబ్దము దృష్టము, అదృష్టము ననెడి రెండుపాయములకు బోధకముగా వ్యాఖ్యాతలు గ్రహించి అదృష్టోపాయ మనగా వేదమునందు హింసాయుక్త యజ్ఞ యాగాదులను సాధించుటకుగా నుపదేశింపబడిన యుపాయ మని వ్యాఖ్యానము చేసియున్నారు. కాని యది చింత్యము. వేదములందనేక తావులలో హింస సర్వథా నిషేధింపబడినది. హింసాయుత కార్యములు యజ్ఞ యాగాదు లనుట వేదము లంగీకరింపవు. ఈ విషయమును బాగుగ నెఱుగవలయుననిన సత్యార్థ ప్రకాశము (శ్రీమద్దయా

నంద మహర్షి ప్రణీతము)ను, 'ఋగ్వేదాది భాష్యభూమిక'ను పాఠకులు చదువుదురు గాక.

వ్యాఖ్యాతలవంటి దృష్టిగల సాంఖ్యకారికా కర్తయు నొక కారికయం దిట్లు వర్ణించియున్నాడు.

"దృష్టవదానుశ్రవికః సహ్యవిశుద్ధిక్షయాతిశయయుక్తః"

దృష్టోపాయమువలన సాధింపబడెడి దుఃఖ నివృత్తి వలెనే ఆనుశ్రవికమయిన - వైదిక - ఉపాయసాధ్యమగు దుఃఖనివృత్తియు అశుద్ధమైన హింసాది పాపముతోను, న్యూనాతిశయములతోను కూడుకొని యుండును. కాబట్టి రెండును సమానములే యని కారికాకారుని యభిప్రాయము.

గురువులనుండి యనుశ్రవణము చేయబడును కావున అనుశ్రవ మనగా వేదము. అనుశ్రవముచే విధింపబడు యాగాదులు - కామ్యకర్మములు - ఆనుశ్రవికములు. ఇయ్యవి హింసాయుక్తములు. వాని ఫలమును వినాశి-నశించునదియే. మఱియు నొక యజ్ఞమున కొకింత ఫలము; మఱియొక యజ్ఞమున కంతకంటె నెక్కువ ఫలము; నని హెచ్చుతగ్గులతో కూడియుండుటయు శాస్త్రసిద్ధము. కాబట్టి యాత్యంతిక దుఃఖ నివృత్తి యన నొప్పదు. శాస్త్రవిధులు పెద్దపెద్ద యనిష్టములతో సంబద్ధముకాని యభీష్టమును సాధించునవి కాబట్టి విధిపూర్వకముగాచేయు హింస పాపజనకము కాదనచెల్లదు. విధిపూర్వకముగా చేయు హింసాకృత్యము హింసాయుత కర్మమువలన కలిగెడి యభీష్టమగు స్వర్గాది ఫలముకంటె

నెక్కడ నిష్టమును కలిగింపకున్నను ఆ హింసకు తగిన పాపము కలిగింపదని చెప్పుట కేరికిని శక్యముకాదు. శాస్త్రవిధి దాని నడ్డగింపజాలదని భావము. విధిపూర్వకముగాచేయు హింసకు పాప ముండదనియు నితర హింసలకు పాపము కలుగుననియు చెప్పుట సత్యదూరము. ఇట్లు విభజించుటకు ప్రమాణ మొండును కానము.

"అహింసన్ సర్వభూతాన్యన్యత్ర తీర్థేభ్యః"

(తీర్థములలోదప్ప మిగిలిన స్థలములలో నేభూతమును హింసింపజనదు) అను నిట్టి వాక్యములు తీర్థేతరస్థలములలో హింస చేయనందువలన అభీష్టము సిద్ధింపగలదని బోధించునే కాని తీర్థములలో హింసించిన పాపము కలుగదని చెప్పనేరవని యభియుక్తుల మతము.

"న కర్మణా న ప్రజయా ధనేన
త్యాగేనైకే నామృతత్వ మానశుః"

(కామ్యకర్మముచే కాని, సంతతిచే కాని, ధనముచే కానీ, మోక్షము లభింపదు. త్యాగముచేతనే లభించును.)

'తమేవ విదిత్వాఽతి మృత్యుమేతి
నాన్యః పంథా విద్యతేఽయనాయ.'

'ఆత్మను తెలిసికొని మోక్షము నందును. ఆత్మజ్ఞానము కంటె మఱియొక మార్గము తరణమునకు లేదు.' అను నిట్టి శ్రుతి వాక్యములను తిలకించినను అదృష్టోపాయ జనితము

లయిన కేవల కామ్యకర్మముల మూలమున నత్యంత దుఃఖ నివృత్తి కలుగనేరదని స్పష్టమగుచున్నది.

దుఃఖాత్యంతనివృత్తి మోక్షము కాబట్టి దుఃఖములతో సంబంధ మేర్పడుటయే బంధ మనవలసివచ్చును. అట్టి బంధము స్వాభావిక మగునెడల దృష్టాదృష్టములనెడి యుభయ విధము లయిన యుపాయములును దానిని తొలగింపనేరవు. అట్లే శాస్త్రీయమైన ప్రకృతిపురుష వివేకజ్ఞాన మనెడి సాధనము సైతము స్వాభావిక బంధము నెట్లు తొలగింపగలదు? అని శంకించి యది స్వాభావికము కాదనియు, నైమిత్తిక మనియు మహర్షి నిరూపింపదలచినాడు. అందువలన బంధము స్వాభావిక మగునెడల కలుగు దోషమును ముందు జూపుచున్నాడు.

"న స్వభావతో బద్ధస్య మోక్షసాధనోపదేశ విధిః" ౧. ౭.

స్వభావతోబద్ధస్య = స్వభావముగానే - స్వరూపముతోనే - దుఃఖ సంబంధముండిన పురుషునకు, మోక్షసాధనోపదేశవిధిః = దుఃఖనివృత్తి రూప మోక్షమును సాధించుటకు తగిన యుపాయమును బోధించుట, న = సంగతముకాదు.

పురుషుడు స్వాభావికమగు దుఃఖసంబంధముచే బద్ధుడగు పక్షమున నతనికి మోక్షమును సాధించుసాధనము నుపదేశించుట యుక్తముకాదు. కాబట్టి పురుషుడు స్వభావముచే బద్ధుడు కాడని భావము.

ఈశ్వరకృష్ణసూరియు తన కారికలం దిట్లే వర్ణించి యున్నాడు.

"యద్యాత్మా మలినోఽస్వచ్ఛోవికారీస్యాత్ స్వభావతః
న హి తస్య భవేన్ముక్తిర్ జన్మాంతర శతైరపి"

'స్వభావముచేతనే యాత్మ మలినము, అస్వచ్ఛము, వికారము గలదియు నగునెడల వందలకొలది జన్మముల నెత్తిన మీదటను దానికి ముక్తి కలుగనేరదు.'

ఉష్ణత యగ్నికి స్వాభావికము. 'దేనియం దేది యుత్పన్నమగుటలో కారణ విలంబము వలన విలంబము కలుగదో దాని కది స్వాభావికము'' అని స్వభావ లక్షణము. అగ్నియున్నపుడు దానియం దుష్ణత యుత్పన్నమగుటలో మరి యొక కారణ విలంబమువలన విలంబము కలుగదు. కాబట్టి యగ్నికి ఉష్ణత స్వాభావికము. ఉష్ణత అగ్నితోనే యుండి యగ్నితోనే నివృత్తి చెందును. దుఃఖము పురుషునకు స్వాభావికము కాదు. అని భాష్యకారులు - విజ్ఞాన భిక్షువు.

మోక్షసాధనోపదేశవిధి యేల సంగతము కాదు? ఒకవేళ సంగతము కాకున్నను దానివలన కలుగునదేమన:-

"స్వభావస్యానపాయిత్వాత్
అననుష్ఠాన లక్షణ మప్రామాణ్యమ్" ౧. ౮.

స్వభావస్య = స్వరూపము, అనపాయిత్వాత్ = వస్తు వున్నంత వరకు నుండునదికావున, శాస్త్రమునకు, అననుష్ఠానలక్షణమ్ = 'శాస్త్రోపదేశము ననువర్తింపలేకుండుట' యనెడిలక్షణముగల, అప్రామాణ్యమ్ = అప్రామాణికత కలుగును.

స్వభావము పదార్థమున్నంతవరకు నుండునది కాబట్టి పురుషునకు బంధము స్వభావ మగునెడల నయ్యది విడుచుట శక్యముకాదు. అశక్యము నుపదేశించు శాస్త్రము నను వర్తించువా రుండరు. అట్టియెడ శాస్త్రమునకు అననుష్ఠాన మనెడి దోషము వాటిల్లునని భావము.

శాస్త్రబలమువలననే యనుష్ఠాన మేల సంభవము కాదన :-

"నాశక్యోపదేశ విధి రుపదిష్టేఽప్యనుపదేశః" ౧. ౯.

అశక్యోపదేశవిధిః = సాధించుటకు శక్యముగాని ఫలముకొఱకు జేయు ఉపదేశవిధానము, న = సంభవముకాదు — కారణమేమన, ఉపదిష్టేఽపి=ఉపదేశింపబడినప్పటికి, అనుపదేశః=అదివ్యర్థమే.

సాధింప ననువుగాని ఫలము నుద్దేశించి శాస్త్రముపదేశించినను వ్యర్థమే యగును. అట్టి యర్థమును శాస్త్రము బోధింపదని భావము.

స్వాభావికము సైతము తొలగగలదను వాని శంక :-

"శుక్లపటవత్ బీజవచ్చేత్" ౧. ౧౦.

శుక్లపటవత్ = తెల్లనివస్త్రమునందలి తెలుపు ఎఱుపురంగుచేతను, బీజవత్ = విత్తనమునందలి యంకురించు శక్తి వేయించుటచేతను, చేత్ = స్వాభావికములయ్యు తొలగింపబడుచున్నవిగదా! యనిన,

తెల్లని వస్త్రమునకు స్వాభావికమయిన తెలుపురంగు ఎఱుపురంగుచే తొలగింపబడుచున్నది. విత్తనమునందలి యంకురించుశక్తి స్వాభావికమయ్యు విత్తనమును వేయించినపుడు తొలగిపోవుచున్నది. కాబట్టి స్వభావముకూడ తొలగింప నవకాశమున్నదని తెలియుచున్నది. అందువలన పురుషునకు బంధము స్వభావమైనను దానిని తొలగింప ననువగు సాధనమును శాస్త్రమేల బోధింపరాదు? అనిశంకాభిప్రాయము.

సమాధానము :-

"శక్త్యుద్భవానుద్భవాభ్యాం నాశక్యోపదేశః" ౧. ౧౧.

శక్త్యుద్భవానుద్భవాభ్యాం = ఉత్తేజక ప్రతిబంధకముల ద్వారమున శక్తియొక్క యావిర్భావ తిరోభావములు జరిగినందువలన, అశక్యోప దేశః=అసాధ్య ఫలసాధనము నుపదేశించుట, న=సంభవముకాదు.

తెల్లనివస్త్రమునందలి తెలుపురంగు - దానికి ప్రతి బంధకమైన ఎఱుపురంగుచే కనబడదేకాని బొత్తుగా నశింపదు. కావుననే ప్రయత్నపూర్వకముగా చాకలి యెఱుపురంగును తొలగించినపుడు తెలుపు మరల ప్రకటమగును. అట్లే బీజము నందలి యంకురించు శక్తి వహ్నిచే నడ్డగింపబడునే కాని నశింపదు. అందువలననే యోగి తన సంకల్పబలముచే ప్రతి బంధకముగా నున్న వహ్నిని తొలగించినపుడు వేయించిన విత్తనము సైతము మొలకెత్తగలదు. కాబట్టి స్వభావము నివర్తించుననుట చెల్లదు. పైనచెప్పిన ఉదాహరణములు స్వభావము నివర్తించు ననుటను సాధింపజాలవు. కాగా పురుషునకు బంధము స్వాభావిక మగునెడల మోక్ష మశక్య మగును. కావున స్వభావము కాదని తేలుచున్నది.

పురుషునకు బంధము (దుఃఖయోగము) స్వాభావికము కానిపక్షమున కాలసంబంధము వలన నేర్పడునని యేల చెప్పరాదన :-

"న కాలయోగతో వ్యాపినో నిత్యస్య సర్వసంబంధాత్" ౧. ౧౨.

వ్యాపినః = సర్వపదార్థములతోను సంయోగముగల, నిత్యస్య = సతతమునుండు, కాలమునకు, సర్వసంబంధాత్ = ముక్తులు, అముక్తులు నెల్లరితోను సంబంధముండుటవలన, కాలయోగతః = కాలసంబంధమనెడి నిమిత్తమువలన పురుషునకు బంధము కలుగుననుటయు, న=తగదు.

పురుషునకు బంధము కాలసంబంధముచే నైమిత్తిక మనుటయు నుచితము కాదు. కాలము సర్వవ్యాపకమై నిత్యమైయుండి ముక్తులతోను, అముక్తులతోను, నెల్లరితో సంబంధము కలదగును. అట్టియెడ ముక్తిజెందనివారు కాల సంబంధముచే బద్ధులయినచో ముక్తులుకూడ కాలసంబంధ ముచే బద్ధులు కావలసివత్తురు. కాబట్టి పురుషబంధమునకు నిమిత్తము కాలసంబంధము కానేరదని భావము. సాంఖ్యుల మతమున క్షణాత్మకకాలమే నిత్యమనియు మిగిలిన కాల మనిత్య మనియు ముందు వివరింపబడును.

కాలము, దేశము, కర్మము ననునవి ప్రతికార్యము నకును సాధారణ కారణములు - సామాన్యనిమిత్తములు - (Common cause) అని యెల్లరు నంగీకరింతురు. అందువలన కాలమునకు బంధవిషయమున సామాన్యనిమిత్త్వము లేదని చెప్పుట యీసూత్రాభిప్రాయము కాదు. కాలము పురుష బంధమునకు విశేషనిమిత్తము కాదనుటయే యుద్దేశము. పురుష బంధము ఉపాధివలన కలిగినదని యీ శాస్త్రమునం దంగీకరించుటయే యిందులకు కారణము. మఱియు దేశ సంబంధముకూడ బంధమునకు హేతువు కాదనుచున్నాడు.

"న దేశయోగతోఽప్యస్మాత్" ౧. ౧౩.

అస్మాత్ = పూర్వోక్తహేతువువలననే, దేశయోగతః అపి = దేశ సంబంధముచేతను, న=బంధము నైమిత్తికము కాదు.

కాలమువలెనే దిక్కు (దేశము) కూడ ముక్తులు, బద్ధులు అని భేదములేక యెల్లరితోను సంబంధము కలదగుట

వలన నెల్లరు బద్ధులే యగుదురు. నాడు ముక్తి యసంభవ మగునని భావము.

అటులయిన బంధము బాల్యాద్యవస్థా మూలక మేల కాదన :-

"నావస్థాతో దేహధర్మత్వా త్తస్యాః" ౧. ౧౪.

తస్యాః = బాల్య కౌమారాద్యవస్థలు, దేహధర్మత్వాత్ = శరీర ధర్మము లగుటవలన, అవస్థాతః =అవస్థవలన, న = బంధము నైమిత్తి కము కాదు.

బాల్య యౌవనాద్యవస్థలన్నియు దేహధర్మములేకాని పురుషధర్మములు కావు. అన్యధర్మము లన్యుని బంధమునకు నిమిత్తములని యంగీకరింతుమేని బద్ధుని ధర్మములు ముక్తులను సయితము బద్ధులను చేయగలవని చెప్పవలసివచ్చును. కాబట్టి బాల్యాద్యవస్థలు బంధహేతువులు కావు.

బాల్యాదులు దేహధర్మము లయినంత మాత్రమున నవి పురుషధర్మము లేలకావన :-

"అసంగోఽయం పురుష ఇతి" ౧. ౧౫.

అయంపురుషః = ఈ ప్రత్యగాత్మ - జీవుడు, అసంగః = సంగ రహితుడు - వికార సంబంధము లేనివాడు, ఇతి = కాబట్టి బాల్యాద్యవస్థలు దేహధర్మములే కాని పురుషధర్మములు కావు.

బాల్యాద్యవస్థలు దేహధర్మములు. కాబట్టి దేహము పరిణామము నొందుచుండును. ఈ యవస్థలు పురుషునం దంగీకరించిన నతడును పరిణామియై యనిత్యు డగునని భావము. కాబట్టి పురుషు డసంగుడు.

కర్మముచే పురుషబంధ మేల నైమిత్తికము కాదన :-

"న కర్మణాఽన్యధర్మత్వా దతిప్రసక్తేశ్చ" ౧. ౧౬.

కర్మణా = విహితమో లేక నిషిద్ధమో యైన కర్మచేతను, న = బంధము నైమిత్తికము కాదు. కారణ మేమన, అన్యధర్మత్వాత్ = కర్మము ఆత్మకంటె భిన్నమైన దేహమునకు జెందిన ధర్మము, చ = మఱియు, అతిప్రసక్తేః = ముక్తుడును బద్ధుడే కావలసివచ్చును.

శాస్త్రముచే విధింపబడిన కర్మము విహితము. కూడదని నిషేధింపబడిన కర్మము నిషిద్ధము. ఈ యుభయవిధ కర్మములును దేహాదులచే నిర్వర్తింపబడును. కాబట్టి యవి దేహధర్మములే కాని పురుషధర్మములు కావు. దేహధర్మము పురుషబంధమునకు నిమిత్తమగునెడల బద్ధునిధర్మముచే ముక్తుడును బద్ధుడు కావలసివచ్చును. ఇది యతిప్రసక్తి. న్యాయ విరుద్ధమని భావము. కాబట్టి కర్మము బంధహేతువు కాదు. మఱియొక దోషము :-

"విచిత్ర భోగా నుపపత్తి రన్యధర్మత్వే" ౧. ౧౭.

అన్యధర్మత్వే = దేహధర్మమైన కర్మము పురుషబంధమునకు హేతువుగా నంగీకరింతుమేని, విచిత్ర భోగానుపపత్తిః = లోకమున జూడబడుచున్న ఒకరికంటె నొకరు విలక్షణముగా ననుభవించు సుఖ దుఃఖముల వ్యవస్థ సంగతము కానేరదు.

అనాదిగా నడుచుచున్న యీప్రపంచమున సుఖమును కలిగించు కర్మముగానీ, దుఃఖమును కలిగించు కర్మముగానీ చేయనివారుండరు. అందఱు నుభయవిధ కర్మములను చేయుచునే యుందురు. అన్యధర్మము అన్యబంధమునకు హేతువుగా నంగీకరింతుమేని లోకమున నెల్లరు సుఖులో లేక యెల్లరు

దుఃఖులో కావలసి యుందురు. కొందఱు సుఖులు కొందఱు దుఃఖులు కావలయునను నియమము లేనందున విలక్షణభోగము కలుగ వీలులేదని భావము. లోకమున విచిత్రభోగము చూచుచున్నాము కాబట్టి యన్యధర్మము అన్యబంధమునకు హేతువని యంగీకరించుట బుద్ధివిరుద్ధమని తాత్పర్యము.

అటులయిన ప్రకృతి నిమిత్తమువలన పురుషబంధము కలుగునందుమేని యదియు కాదని చెప్పుచున్నాడు.

"ప్రకృతి నిబంధనాచ్చేన్న, తస్యా అపి పారతంత్ర్యమ్" ౧, ౧౮.

చేత్ ప్రకృతినిబంధనాత్ = సాక్షాత్తుగా ప్రకృతి నిమిత్తమున పురుషబంధము కలుగునందుమేని, న = కాదు, తస్యా అపి = ఆ ప్రకృతియు, పారతంత్ర్యమ్ = పరతంత్రమే.

అవివేకముచే ప్రకృతి పురుషులకు సంబంధము కలుగును కాని సాక్షాత్సంబంధము కలుగనేరదని ముందు వివరింపబడును. అవివేక పూర్వకముగా గాక సాక్షాత్తుగా పురుషునితో ప్రకృతికి గల సామాన్య సంబంధముచే పురుషునకు బంధ మేర్పడునని యంగీకరింతుమేని బద్ధముక్త భేదము లేక యెల్లరును బద్ధులు కావలసివత్తురు అతి ప్రసక్తి తప్పదని భావము. కాబట్టి ప్రకృతి సైతము సాక్షాత్ బంధనహేతువు కాదని సూత్ర తాత్పర్యము.

పురుషునకు గల బంధము స్వాభావికమో లేక నైమిత్తికమో కానిపక్షమున మరి దేనివలన బంధ మేర్పడుచున్నదన :—

"న నిత్యశుద్ధ బుద్ధ ముక్తస్వభావస్య తద్యోగ స్తద్యోగాదృతే" ౧.౧౯.

ప్రథమాధ్యాయము

నిత్యశుద్ధ....స్వభావస్య = నిత్యుడు, శుద్ధుడు, బుద్ధుడు,
శీలుడు నయిన పురుషునకు, తద్యోగః = బంధయోగము — బం
తద్యోగాదృతే = అవివేకముచే నేర్పడిన ప్రకృతి సంయోగ విశే
లేక, న = కలుగనేరదు.

పురుషునిలో నిత్యత్వము కూటస్థ నిత్యత; అ
పరిణామ రాహిత్యము. శుద్ధత్వము సత్వ రజ స్తమో గుణ
లతో సంగము లేకుండుట. బుద్ధత్వము. ఎన్నడులోపిం
చిద్రూపత; ముక్తస్వభావము ముక్తశీలము; అని తెలిసి
వలయును.

అవివేకమువలన నేర్పడిన ప్రకృతి పురుషసంయో
బంధహేతువని పరమార్థము. బంధమునకు హేతువైన ప్ర
పురుషసంయోగము అవివేకకృతమని ముందు ఏబదివై
సూత్రమున సూత్రకారుడు స్వయముగా చెప్పును.
బంధము అవివేకముచేత బుద్ధిసత్వమనెడి యుపాధివలన
చును. కావున నది యౌపాధికమే కాని స్వాభావికముక
నైమిత్తికమును కాదు.

ప్రస్తుతము నాస్తికులు చెప్పు బంధహేతువులను
తము నిరాకరింపదలచి బౌద్ధులలో నొకరగు యోగాచా
మతమునకు సంబంధించిన హేతువును కాదనుచున్నా
యోగాచారుడు క్షణిక విజ్ఞానసంతతియే యాత్మగా
రించును. అతడు క్షణిక విజ్ఞానాత్మకుమించి మఱియొక ప్ర
నంగీకరింపడు. కాబట్టి వారిదృష్టిలో ప్రకృతి యనెడు వ
లేనందున దాని సంయోగము బంధమునకు నిమిత్తమన
వీలులేదు. క్షణికవిజ్ఞాన సంతానమే వాస్తవికతత్త్వః

మిగిలినదంతయు సాంవృత్తికము. సంవృత్తి యనగా నవిద్య. అదియే మిథ్యా జ్ఞాన మనియు చెప్పబడును. దానివలననే బంధ మేర్పడును; అని చెప్పు యోగాచారుని యవిద్యా నిమిత్తమును నిరాకరించుచున్నాడు.

"నావిద్యాతోఽప్యవస్తునా బంధాయోగాత్" ౧. ౨౦.

అవిద్యాతఃఅపి=యోగాచారుని సంవృత్తి యనెడు యవిద్యవలనను, న = బంధయోగము కలుగనేరదు. అవస్తునా = వస్తువుకానట్టి మిథ్యాజ్ఞానముతో పురుషునకు, బంధాయోగాత్=బంధమేర్పడ జాలదు.

యోగాచారుని యవిద్య వస్తువుకాదు. స్వప్నమున జూచు త్రాడువంటిది. అట్టిదానిచే పురుషునకు బంధము కలుగ నేరదని భావము.

కణాద గౌతమ జైమిని వ్యాస ప్రభృతులు తమ దర్శనము లం దవిద్య నంగీకరించియున్నారు. కాని వారు చెప్పు అవిద్యకు యోగాచారుని సంవృత్తికి మిక్కిలి భేదమున్నది. కణాదాదులచే నంగీకరింపబడు నవిద్య చిత్తధర్మమైనను వాసనారూపమున ననాదియై మిథ్యాజ్ఞానమే లక్షణముగా గలదై యుండును. సాంఖ్యుల యవివేకమున కది యపర పర్యాయమే.

యోగాచారుని యవిద్య సర్వథా అవస్తువు కాదు. వస్తువే యనిన :–

"వస్తుత్వే సిద్ధాంత హానిః" ౧. ౨౧.

వస్తుత్వే=అవిద్య వస్తువని యంగీకరించినచో, సిద్ధాంతహానిః = తా నంగీకరించిన సిద్ధాంతమునకే భంగము వాటిల్లును.

సంవృత్తి యవస్తువు కాదు. వస్తువే యగునందురేని విజ్ఞానాత్మ తక్క వస్త్వంతరములేదని యంగీకరించు యోగాచారుని సిద్ధాంతమునకే భంగము కలుగును. కాబట్టి యవిద్య వస్తువని యంగీకరించి బంధ హేతువనుటకును వీలులేదని భావము.

"విజాతీయ ద్వైతాపత్తిశ్చ" ౧. ౨౨.

మఱియు నవిద్య వస్తువని యంగీకరించిన విజ్ఞానాత్మ కంటె భిన్న జాతీయమగు మఱియొక వస్తు వంగీకరింపవలసి వచ్చును.

క్షణిక విజ్ఞానసంతతిలో ననేక వ్యక్తులున్నట్లంగీకరించినను నయ్యవి సజాతీయములే కాబట్టి, ద్వైతాపత్తి కలిగినను దోషము లేదు. కాని, యవిద్య వస్తువుగా నంగీకరించినపుడు విజాతీయమైన ద్వైతము నంగీకరింపవలసి వచ్చును. కాబట్టి యవిద్య వారి కనిష్టమైన విజాతీయ ద్వైతమును కలిగించి దోషాకర మగునని భావము.

"విరుద్ధోభయ రూపాచేత్" ౧. ౨౩.

అవిద్య వస్తువును కాదు. అవస్తువును కాదు. కాని, వస్త్వవస్తూభయ రూపమని యంగీకరింతు మందురేని,

"న తాదృక్ పదార్థా ప్రతీతేః" ౧. ౨౪.

న =అదియును నొప్ప వలనుపడదు. కారణ మేమన? తాదృక్ పదార్థా ప్రతీతేః = లోకమున వస్తువుకానీ, అవస్తువుకానీ కాక వాని కంటె విలక్షణమైన పదార్థ మొండు లేదు.

లోకమున నొక పదార్థమున్న నది వస్తువో లేక యవస్తువో యగును. అట్లు కాక వస్త్వవస్తూభయ రూప మైన పదార్థ మొండును కానము. కాబట్టి యదియు నంగీకరింప జనదని భావము.

"న వయం షట్ పదార్థవాది నో వైశేషికాది వత్" ౧.౨౫.

వయమ్ = బౌద్ధులమైన మేము, వైశేషి కాది వత్ = వైశేషిక నైయాయికుల వలె, (కణాద గౌతములవలె) షట్ పదార్థవాదినః = పదార్థములు ఆరో లేక పదహారో యని నియమముగా నంగీకరించు వారము, న = కాము.

కణాదుడు తన వైశేషిక దర్శనమునందు 'ద్రవ్యగుణ, కర్మ, సామాన్య, విశేష, సమవాయము' లని షట్ పదార్థముల నంగీకరించి యున్నాడు. ఇట్లే గౌతముడు న్యాయ దర్శనము నందు ప్రమాణ ప్రమేయాది భేదములతో పదునారు పదార్థముల నంగీకరించి యున్నాడు. (ఈ పదార్థ వివరములను తెలిసికొన గోరువారు నాచే తెలుగున రచింపబడిన వైశేషిక న్యాయ దర్శనములను చూడ వచ్చును.) కణాద గౌతముల వలె బౌద్ధులమైన మేము నియతసంఖ్య గల పదార్థముల నంగీకరించువారము కాము. కాబట్టి లోకమున మేము చెప్పినట్టి వస్త్వవస్తూభయరూప విలక్షణ పదార్థ మొకటి మిథ్యాభూతమై, యవిద్యా లక్షణము కలిగినదై యుండునని యంగీకరింప వలయు నందురేని,

"అనియతత్వేఽపి నాయౌక్తిక సంగ్రహో
ఽన్యథా బాలోన్మత్తాది సమత్వమ్" ౧. ౨౬.

అనియతత్వేఽపి = వైశేషికాదుల వలె పదార్థ నియమము లేకున్నను, అయౌక్తికస్య = యుక్తి సిద్ధముకాని పదార్థముయొక్క, సంగ్రహః = స్వీకారము, న = చేయ వలనుపడదు, అన్యథా = యుక్తి సిద్ధముకాని వస్తువు నంగీకరింతుమేని, బాలోన్మత్తాది సమత్వమ్ = బాలకులతోను, పిచ్చివారితోను సములమగుదుము.

కణాదాదులవలె పదార్థములను సంఖ్యతో నియమింప జాలకపోయినను, లోకమున నేదేని యొక పదార్థ మున్నదని నిరూపింప దలచినపుడు అది భావపదార్థమో యభావ పదార్థమో చెప్పవలసి యుండును. భావాభావములకు చెందని పదార్థ మొక్కటి యనిర్వాచ్యమై యున్నదనుట యుక్తి విరుద్ధము. అట్టిదాని నంగీకరింపజనదు. అంగీకరించువారు వ్యుత్పన్నమతులుకాని బాలకులతోను, భ్రాంతులగు పిచ్చివారితోను సమానులగుదురు. కాబట్టి యోగాచారులు చెప్పు వస్త్వవస్తూభయ రూపమగు నవిద్య యుక్తివిరుద్ధ మగుటచే నంగీకరింప యోగ్యము కాదు. పదార్థమేకాని యవిద్యచేత నిత్యముకాని క్షణిక మగు విజ్ఞానసంతతి రూపమగు నాత్మకు బంధ మేర్పడుట సర్వథా బుద్ధి విరుద్ధమని భావము.

యోగాచారుల వలెనే శంకర మతానుయాయులును అనిర్వచనీయమైన యవిద్య నంగీకరింతురు. దానిచే పురుషుడు బద్ధు డగుననియు విద్యచే ముక్తు డగుననియు చెప్పుదురు. శాంకరుల యవిద్యయు బౌద్ధుల సంవృత్తివలెనే యుక్తివిరుద్ధ మని తెలిసికొనవలయును.

విజ్ఞానవాదమును నిరాకరించు సూత్రములను వ్యాఖ్యానించుచు ప్రవచన భాష్యకారులు విజ్ఞానభిక్షు వొకచో

(౧-౨౨ సూత్రముపై నిట్లు వ్రాసిరి. "వేదాంతి బ్రువుల" మని చెప్పుకొనువారి మాయావాదము సైతము విజ్ఞానవాదములోని యంతర్భాగమే కాబట్టి యదియు నిరాకరణీయమే.

"మాయావాద మసచ్ఛాస్త్రం ప్రచ్ఛన్నం బౌద్ధమేవచ
మయైవకథితం దేవి కలౌ బ్రాహ్మణరూపిణా"

(మాయావాదము సచ్ఛాస్త్రముకాదు. అది ప్రచ్ఛన్న బౌద్ధము. కలికాలమున బ్రాహ్మణరూపమును దాల్చి నేనే దానిని చెప్పియున్నాను.) అను పద్మపురాణములోని శివుని వాక్యములు నీమాయావాదము ప్రచ్ఛన్నబౌద్ధముగా నంగీకరించుచున్నవి.

మఱియు ప్రచ్ఛన్నబౌద్ధులైన నవీన మాయావాదుల 'తుచ్ఛము' అను పదార్థము బంధహేతువనుట పొసగదు."

యోగాచారులు బాహ్య జగత్తు సత్యముగా నంగీకరింపరు. కాని బౌద్ధులలో సౌత్రాంతికులు వైభాషికులు నను వారు బాహ్యముగ మనకు తెలియు పదార్థము లన్నియు పరమాణువుల పుంజములుగా నంగీకరింతురు. 'కుండ, గుడ్డ, మఠము మున్నగు వస్తువులన్నియు పరమాణువుల సముదాయములే. వేరే వ్యక్త్యాత్మక పదార్థమొండులేదు' అని వారి సిద్ధాంతము. అనగా వారి దృష్టిలో విజ్ఞానాత్మయేకాక పరమాణు పుంజరూప బాహ్య విషయములు కలవని యెఱుగవలయును. అట్టి బాహ్య విషయములకు సంబంధించిన అనాది వాసన వలన బంధమేర్పడగలదన, నదియు కాదనుచున్నాడు.

"న అనాది విషయోపరాగతోఽప్యస్య" ౧. ౨౭

అస్య = క్షణిక విజ్ఞాన స్వరూపియగు పురుషునకు, అనాది విషయోపరాగనిమిత్తతః అపి = అనాదిగా కలుగు విషయోపరాగమనెడి నిమిత్తమువలనను, న = బంధము కలుగజాలదు.

ప్రవాహరూపమున ననాదియైన, ఉపరంజకమగు బాహ్యవిషయమునకు సంబంధించిన వాసన యనెడి సంబంధ విశేషము ఈ సూత్రమున విషయోపరాగ మనబడినది.

అనాది విషయోపరాగ మనెడి నిమిత్తము వలనను బౌద్ధుల కభిమతమగు విజ్ఞానాత్మకు బంధము కలుగనేరదని భావము. కారణ మేమన :-

"న బాహ్యాభ్యంతరయో రుపరంజ్యోపరంజక భావోఽపి దేశవ్యవధానాత్,స్రుఘ్నస్థపాటలీపుత్రస్థయోరివ" ౧. ౨౮

బాహ్యాభ్యంతరయోః = వెలుపలనుండు విషయమునకు, లోపలనుండు విజ్ఞానాత్మకు, ఉపరంజ్యోపరంజకభావోఽపి = పరస్పరము ఉపరంజ్యత్వోపరంజకత్వ భావము సైతము, న = సంభవము కాదు. స్రుఘ్నస్థపాటలీపుత్ర స్థయోరివ = స్రుఘ్నము, పాటలీపుత్రము నను ఒకదాని కొకటి దూరముగానుండు పట్టణములలో నుండువారివలె.

స్ఫటికమణి, రంగులున్న పుష్పము నను నీ రెండును సమీపముగా నున్నపుడు-వాని మధ్యలో నెట్టి యాటంకము లేనపుడు - పుష్పములోని రంగులు స్ఫటికమునందు ప్రతిఫలించి యది రంగులు కలదిగా నగపడును. అట్టియెడ పుష్పముపరంజకము, స్ఫటికమణి ఉపరంజ్యము నగును. అయ్యవి దూరమున ననగా నొకటి స్రుఘ్న నామక పట్టణమందును, మఱియొకటి పాటలీపుత్రము నందును ఉన్నపక్షమున నవి

యుపరంజకోపరంజ్యభావము నందజాలవు. అట్లే ఉపరంజ్యమగు విజ్ఞానాత్మ దేహమునం దంతర్భాగమున నుండును. ఘటపటాది ఉపరంజక విషయములు దేహమునకు బాహ్యమున నుండును. విజ్ఞానాత్మకు విషయములకు మధ్య దేహము వ్యవధానముగా నుండును. అట్టియెడ ఉపరంజకములయిన బాహ్యములగు విషయములయొక్క వాసనచే నాంతరిక విజ్ఞానాత్మ యెట్లు ఉపరక్తము కాగలదు ? కాజాలదు. ఇట్లు విషయ విజ్ఞానాత్మలకు ఉపరంజకోపరంజ్యభావమే కుదరనపుడు విషయోపరాగమనెడి వాసన పురుష బంధమునకు నిమిత్తమనుట యసంగతమని భావము.

బౌద్ధుల విజ్ఞానాత్మ శరీరమునందలి చిత్తసత్వమే కాని వేరొండేమియు కాదు. ఆ చిత్తసత్వము ప్రతిక్షణము వృత్తి రూపమున మారుచుండును. అదియే జ్ఞానము. ఆ జ్ఞానము నెల్లప్పుడు నుండక ప్రతిక్షణము మారుచుండును. పూర్వ జ్ఞానము నశించి యుత్తరజ్ఞాన ముదయించుచుండును. ఇట్లు క్షణక్షణము నుదయించి నాశమందుచుండు విజ్ఞానసంతానమే వారి విజ్ఞానాత్మ. ఇతర దేహేంద్రియాది విషయజాతమంతయు పరమాణుపుంజములే. అందువలన వారిమతమున నింద్రియ గోలకములకు మించి యింద్రియములు వేరుగా నుండవు. బాహ్యవిషయములను విజ్ఞానాత్మతో చేర్చు పదార్థమొండును కానరాదు. అట్టియెడ విజ్ఞానాత్మ విషయవాసనచే వాసితుడై బద్ధుడెట్లు కాగలుగును ? కాజాలదు. కాబట్టి బంధము వాసనా నిమిత్తము కాదని భావము.

పై దికులయిన కణాదాది మహర్షులదృష్టిలో పురుషుడు శరీరమునకంటె భిన్నుడై శరీరమునందుండును. విషయములు బాహ్యములే కాని యవి కేవల పరమాణుపుంజములు కాక వేరువేరుపదార్థములు. విషయములను పురుషునితో చేర్చుటకు లగినట్లు జ్ఞానేంద్రియములు చిత్తము వేరుగా నంగీకరింతురు. కాబట్టి వారిమతమున విషయములు ఇంద్రియములద్వారమున పురుషుని జేరి యతని నుపరక్తుని జేయగలుగుచున్నవని భావము

క్షణికమయ్యు విజ్ఞానాత్మ యగు చిత్తము కేవలము దేహమునందే యుండదు. అది దేహమునకు లోపల వెలుపల నెల్లయెడల పూర్ణమై యుండును. అందువలన విషయోపరాగము కలుగగలదన :—

"ద్వయోరేక దేశలబ్ధోపరాగా న్నవ్యవస్థా" ౧. ౨౯.

ద్వయోః=బద్ధముక్తాత్మలకు, ఏకదేశలబ్ధోపరాగాత్ = ఒకే విషయ దేశమున నుపరాగము లభించినందున, వ్యవస్థా = బంధమోక్షముల వ్యవస్థ, న = ఉండనేరదు.

బద్ధపురుషుడు ముక్తపురుషుడు నిరువురు బహిరంతః పూర్ణులయినచో బాహ్య విషయ దేశమునందుచేరి యుపరక్తులగుట సంభవమే యగును. కాని బద్ధుడే విషయమున నుపరక్తు డగునో యా విషయమునందే ముక్తుడు నుపరక్తు డగును. అట్టియెడ నొకడు బద్ధుడు, మఱియొకడు ముక్తుడు నేల కావలయును ? ఇరువురు బద్ధులో లేక ముక్తులో కావలసియుందురు. అందువలన బద్ధ ముక్త వ్యవస్థ యుండ నేరదని భావము.

శంక :-

"అదృష్ట వశాచ్చేత్" ౧. ౩౦.

చేత్ అదృష్టవశాత్ = బద్ధముక్తుల కుభయులకు విషయ సంయోగము సమానమైనను, అదృష్టవశమున బద్ధునకే విషయోపరాగ ముండుననియు, ముక్తున కుండదనియు, నందువలన వ్యవస్థ యేర్పడగలదనియు నంగీకరించిన దోషముండనేరదని సూత్రార్థము.

సమాధానము :-

"న ద్వయో రేక కాలా యోగాత్ ఉపకార్యోపకారకభావః" ౧. ౩౧.

ద్వయోః = కర్త, భోక్త, అను నీ రెండాత్మలకు, ఏకకాలాయోగాత్ = సమానకాలికత్వము లేకపోవుటవలన, ఉపకార్యోపకారకభావః = కర్తయైన యాత్మయొక్క యదృష్టము భోక్తయైన యాత్మకు విషయోపరాగ మనెడి యుపకారము చేయగలుగుట, న=సంభవింపదు.

బౌద్ధులచే నంగీకరింపబడు నాత్మ క్షణిక మయినందున కర్తయైన ఆత్మ భోక్తయైన యాత్మ యున్నపు డుండదు. అట్టియెడ కర్తయొక్క యదృష్టము భోక్త కెట్లుపకరింపగలదు? ఉపకరింప జాలదు. కాబట్టి యదృష్టము ద్వారమున బంధమోక్ష వ్యవస్థ యేర్పడుననుట దోషయుక్తమే యనిభావము.

శంక :-

"పుత్రకర్మ వదితిచేత్" ౧. ౩౨.

పుత్రకర్మవదితిచేత్ = తండ్రియందుగల గర్భాధాన రూపకర్మము కాలాంతరమున జనించు పుత్రునియందు సంస్కార రూపమైన ఉపకారమును కలిగించునట్లు, కర్తయందలి యదృష్టము భిన్నకాలిక భోక్త కుపకారము కలిగింపగలదని చెప్పుదురేని,

సమాధానము :-

"న, అస్తి హితత్ర స్థిర ఏకాత్మా. యోగర్భాధానాది నా సంస్క్రియతే" ౧. ౩౩.

న = మీ దృష్టాంతము సరికాదు, హి = కారణమేమన, తత్ర = వైదికుల సిద్ధాంతమున, యః=ఏ జీవాత్మ, గర్భాధానాదినా = గర్భాధానాది సంస్కారము ద్వారమున, సంస్క్రియతే = సంస్కరింపబడు చున్నదో, ఆ యాత్మ, అస్తి=ఉన్నది. ఆ యాత్మ, స్థిరః=స్థితి శీలము, ఏకాత్మా=ఒకే జీవాత్మ – పురుషుడు.

తండ్రిచే చేయబడిన గర్భాధానాదికర్మ భిన్నకాలిక పుత్రున కుపకరించు చున్నట్లని చెప్పిన ఉదాహరణము బౌద్ధుల సిద్ధాంతమును సాధింపనేరదు. పితృనిష్ఠకర్మము భిన్నకాలీన పుత్రున కుపకరించుటను వైదికు లంగీకరింతురు. వారి సిద్ధాంతమున నాత్మ స్థిరము. క్షణికము కాదు. కాబట్టి తండ్రి యెవని నుద్దేశించి గర్భాధాన రూపసంస్కారము ద్వారా ఉపకారము చేయుచున్నాడో ఆ యాత్మ లేకపోలేదు. సంస్కారమనగా ఉన్న వస్తువునందు మఱియొక గుణమును కలిగించుటయే. కాబట్టి వైదికుల మతమున పితృకర్మ పుత్రున కుపకరించు ననుటలో దోష మావంతయు లేదు. కాని బౌద్ధులకు స్థిరమైన యాత్మ యొండులేదు. కాగాపై యుదాహరణముతో కాలాంతరమున నుండు ఆత్మగత యదృష్టము కాలాంతరమున నుండు ఆత్మ కుపకరింప గలదని చెప్పనెంచుట సాహసము. కాగా విషయోపరాగము వలన బంధ మేర్పడగలదను బౌద్ధుల వాద మసంగతమని భావము.

బంధవిషయమున బౌద్ధమతమును నిరాకరించి ప్రసంగవశమున వైభాషికులమతమే దోషయుక్తమని చెప్పదలచి యా మతమును మరల నుట్టంకించుచున్నాడు.

శంక :-

"స్థిరకార్యాసిద్ధేః క్షణికత్వమ్" ౧. ౩౪.

స్థిరకార్యాసిద్ధేః = స్థిరముగానుండు కార్యము (భావపదార్థము) ఒండును లభింపనందున, క్షణికత్వమ్=అన్నియు క్షణికములే.

లోకమున నొక్క వస్తువును స్థిరముగా నుండుటమనము చూడలేకున్నాము. ఉదాహరణమునకైన నొక పదార్థము స్థిరముగా నుండునది లభింపదు. కాబట్టి భావపదార్థము లన్నియు క్షణికములే. క్షణికమనగా పుట్టిన క్షణముననుండి మరుక్షణమున లేకుండునది.

సమాధానము :-

"న ప్రత్యభిజ్ఞాబాధాత్" ౧. ౩౫.

ప్రత్యభిజ్ఞాబాధాత్ = 'అదేయిది' యని గుర్తించుటచేత క్షణికత్వము బాధింపబడుచుండుటవలన, న=ఏవస్తువును క్షణికముకాదు.

ఒక క్షణమున నొక వస్తువును కంటితో చూచి మఱి యొక క్షణమున నా వస్తువును చేతితో స్పృశించి పూర్వ క్షణమున నేను కంటితో చూచిన వస్తువే యిది యని మరు క్షణమున గుర్తించుచున్నాను. ఇట్లు గుర్తించుటయే సంస్కృతమున ప్రత్యభిజ్ఞ యనబడును. వస్తువు లన్నియు క్షణికము లయినచో నిట్టి ప్రత్యభిజ్ఞ కలుగజాలదు. ప్రత్యభిజ్ఞ కలుగు చున్నది. కాబట్టి వస్తువులు క్షణికములు గావు.

"శ్రుతి న్యాయవిరోధాచ్చ" ౧ ౩౬.

శ్రుతి న్యాయవిరోధాచ్చ = "సదేవసోమ్య...." అను శ్రుతి "కథమసతః"........" అను న్యాయము, ఈ రెండును వస్తుసత్త్వమును బోధించుచు క్షణికత్వమును విరోధించుట వలనను క్షణిక వాదమసంగతము.

"సదేవసోమ్యేదమగ్ర ఆసీత్" ఛాం. ౬. ౨. ౧.

(ఈ ప్రపంచము ప్రథమమున సత్తుగానే యుండెను.)

"కథమసతః సజ్జాయేత" ఛాం. ౬. ౨౧.

(అసత్తునుండి సత్తెట్లు కలుగగలదు?) అను నీ వాక్యములు జగత్తుయొక్క సత్త్వమును-ఉనికిని - బోధించుచున్నవి. కాబట్టి వైభాషికులు చెప్పు జగత్తుయొక్క క్షణికత్వము శ్రుతికి, న్యాయమునకును విరుద్ధమగుచున్నదని భావము.

శంక :-

పైన ఉదాహరించిన శ్రుతిన్యాయములు భావపదార్థములన్నియు (జగత్తు) సత్త్వము గలవి యనియే బోధించుచున్నవి గాని క్షణికత్వమును నిషేధించుట లేదుగదా? యనః-

సమాధానము :-

"దృష్టాంతాసిద్ధేశ్చ" ౧. 32.

దృష్టాంతాసిద్ధేశ్చ = దృష్టాంతము సిద్ధింపనందువలన.

బౌద్ధులు జగత్తులోని భావపదార్థములన్నియు క్షణికములనుటకు దీపశిఖను ఉదాహరణముగ జెప్పుదురు. (యత్ సత్ తత్ క్షణికమ్ యథా దీపశిఖా) (ఏది సత్త్వమో యది క్షణికము-దీపశిఖవలె) భావపదార్థముక్షణికమనుట కుదాహరించు దీపశిఖ క్షణికమనుట సిద్ధముకాదు. దీపశిఖయందలి యనేక క్షణములను మనము సరిగా గుర్తింపజాలకపోవుటచే క్షణిక మనుచున్నాము. కాని వాస్తవమున నది క్షణికమే కాదు. కాబట్టి దృష్టాంతము సిద్ధింపనిది బౌద్ధవాదము సిద్ధము కాదని భావము.

మఱియు క్షణిక వాదుల మతము నంగీకరించినచో కార్యకారణ భావమును సంభవింపదనుచున్నాడు.

"యుగ పజ్జాయమానయో ర్న కార్య కారణ భావః" ౧.౩౮.

యుగ పజ్జాయమానయోః=ఒకే సమయమున నుత్పన్నమగు రెండు వస్తువులలో, కార్యకారణ భావః=కార్యకారణ భావము, న=ఉండనేరదు.

ఏక క్షణమున నుత్పన్నమగు రెండు వస్తువులు పరస్పరము కార్యకారణ భావము కలిగియుండనేరవు. కొమ్ములుండు జంతువులకు రెండు కొమ్ములొకే సమయమున నుత్పన్నమగుట చూచుచున్నాము. ఆ రెంటిలోనేది దేనికి కారణము? ఏదియును కాదు. కాబట్టి యొకే క్షణమున నుత్పన్నములగు వానిలో పరస్పరము కార్యకారణము నంగీకరింపజాల మనుట నిశ్చయము. కారణము కార్యమునకు పూర్వక్షణమున తప్పక యుండవలయు ననునది నియమము.

క్రమముగా నేర్పడువానిలోనే కార్యకారణ భావమేర్పడ గలదని యంగీకరింతురేని నయ్యదియు క్షణికవాదమున సంభవము కాదు.

"పూర్వాపాయే ఉత్తరాయోగాత్" ౧.౩౯

పూర్వాపాయే=కారణము నశించినపుడు, ఉత్తరాయోగాత్ = కార్యోత్పత్తి కలుగజాలనందున, కార్య కారణ భావ మేర్పడజాలదు.

మట్టి లేనపుడు కుండ యెట్లు కలుగును? కలుగదు. కార్యము ఉపాదాన కారణమందే యుండును. కాబట్టి యుపాదాన కారణములేని క్షణమున కార్యము కలుగనేరదు.

మట్టి, కుండ రెండు నొకే క్షణమున నంగీకరింతురేని కార్య కారణ భావము కలుగనేరదు. పూర్వోత్తర క్షణములలో నంగీకరింతురేని కుండ యేర్పడు క్షణమున కారణమైన మట్టి యుండదు. క్షణికము కాబట్టి. అందువలన కారణములేని క్షణమున కార్యమెట్లు కలుగగలదు? అసంభవము. కాగా క్షణికవాదుల సిద్ధాంత మంగీకరించినచో కార్య కారణ భావము కలుగనేరదని భావము.

మఱియు

"తద్భావే తదయోగా దుభయ వ్యభిచారా దపి న" ౧. ౪౦.

తద్భావే = కార్య - కారణములున్నపుడు, తదయోగాత్ = కారణ కార్యము లుండనందున, ఉభయ వ్యభిచారాదపి = అన్వయ వ్యతిరేకములు వ్యభిచరించుచున్నందున, న = కార్య కారణభావము సంభవింపదు.

క్షణికవాదుల సిద్ధాంతమున ప్రతి భావపదార్థమును క్షణికము కాబట్టి, కారణమున్నపుడు కార్యముండదు; కార్య మున్నపుడు కారణ ముండనేరదు. అట్టియెడ కార్య కారణ భావమే సంభవము కానేరదు. కార్య కారణభావము అన్వయ వ్యతిరేకములకు వ్యభిచారము లేనితావుననే యుండగలదు. అన్వయ వ్యతిరేకములు కార్యకారణభావఘటకములని భావము. కార్యోత్పత్తికలుగు క్షణమున నుపాదాన కారణ ముండుట అన్వయము. ఉపాదానకారణములేని క్షణమున కార్యోత్పత్తి కలుగకుండుట వ్యతిరేకము. క్షణికవాద మంగీక రింతుమేని ఉపాదానకారణమైన మట్టియున్న క్షణమున కుండ యేర్పడదు. మట్టిలేని క్షణమున కుండ యేర్పడును. ఈ స్థితి

పైన వర్ణించిన యన్వయ వ్యతిరేక నియమమును వ్యభిచరించు చున్నది. అందువలన కార్యకారణ భావ మేర్పడజాలదు. కాబట్టి క్షణికవాద మసంగతము.

కార్యోత్పత్తిక్షణమున నిమిత్తకారణముండదు. అట్లే యుపాదానకారణము సయితము కార్యోత్పత్తిక్షణమున నుండకున్న నేమి యన :—

"పూర్వభావమాత్రే ననియమః" ౧. ౪౧.

పూర్వభావమాత్రే = ఉపాదానకారణము కార్యముకంటె పూర్వ మున్న చాలునని యంగీకరించినచో, ననియమః = ఈ కార్యమున కిదియే యుపాదానకారణమని నియమము కలుగనేరదు.

కారణము కార్యముకంటె పూర్వభావియైన చాలునని మాత్ర మంగీకరించిన నయ్యది నిమిత్తకారణమున కన్వయింప వీలగును. నిమిత్తకారణము కార్యోత్పత్తి క్షణమున నుండవల యునను నియమము లేదు. కాని యది యుపాదానకారణ విషయమున నంగీకరింప వలనుపడదు. అంగీకరింతుమేని మట్టి కుండ కుపాదానకారణమైనట్లు కుండ యేర్పడు క్షణమునకు పూర్వముండు ప్రతి పదార్థమును దాని కుపాదానకారణమని యంగీకరింప వలసివచ్చును. అప్పుడు నిమిత్త కారణమునకును నుపాదానకారణమునకును గల భేదమును నియమించున దేమి యున్నది ? ఏమియు నుండదు. కాబట్టి యుపాదానకారణము కార్యోత్పత్తి క్షణమున లేకున్న నేమి యనుట పొసగదు. కార్య ముత్పన్నమగు క్షణమునందు కారణమే యుపాదాన కారణ మగును.

యోగాచార మత నిరాకరణము :-

"న విజ్ఞాన మాత్రం బాహ్యప్రతీతేః" ౧. ౪౨.

బాహ్యప్రతీతేః = బాహ్యమున వస్తుజ్ఞానము కలుగుచున్నందున, విజ్ఞానమాత్రం = జగత్తంతయు విజ్ఞానమే యనుట, న = తగదు.

బాహ్యమున ఘట పటాది వస్తు జాతమున్నట్లు ప్రతీతి (జ్ఞానము) కలుగుచున్నందున జగత్తంతయు విజ్ఞానమే కాని వేరొండు బాహ్యవస్తువు లేదనుట సరికాదని భావము.

స్వప్న జ్ఞానమువలెనే బాహ్యజ్ఞానము కలుగుచున్న దందురేని :-

"తదభావే తదభావా చ్ఛూన్యం తర్హి" ౧. ౪౩.

తర్హి = బాహ్యార్థమే లేకున్న, శూన్యం = జగత్తే శూన్యమగును. తదభావే = బాహ్యవస్తువే లేకున్నచో, తదభావాత్ = విజ్ఞానమును కలుగ జాలనందున.

బాహ్య వస్తువులుండుట వలననే విజ్ఞానము కలుగు చున్నది. ఘట పట విజ్ఞానసంతతి యవి యున్నచోటనే కలుగు చున్నది. అవి లేనియెడ నట్టి జ్ఞానమే కలుగదు. కాబట్టి బాహ్యవస్తువు నంగీకరింపని పక్షమున విజ్ఞానమే కలుగదు. కావున జగత్తు శూన్యమగునని భావము.

నిర్విషయమైన విజ్ఞానమొండు లోకమున కలుగదు. కాబట్టి స్వప్నవిషయిక జ్ఞానమునకును బాహ్యవస్తువులే మూల మని యంగీకరింతురు.

శూన్య వాది మతము :—

"శూన్యంతత్త్వం, భావోవినశ్యతి, వస్తు ధర్మత్వా ద్వినాశస్య"
౧. ౪౪.

వినాశస్య = నాశము, వస్తు ధర్మత్వాత్ = వస్తు స్వభావమగుట వలన, భావః = భావపదార్థ మంతయు, వినశ్యతి = నశించును. కావున, తత్త్వం = తత్త్వము. శూన్యం = శూన్యమే.

లోకమున ప్రతివస్తువు నశించుట చూచు చున్నాము. కాబట్టి నాశము వస్తు స్వభావమని తేలుచున్నది. కాగా శూన్యమే తత్త్వమని యభిప్రాయము.

సమాధానము :—

"అపవాద మాత్ర మబుద్ధానామ్" ౧. ౪౫.

భావ పదార్థములన్నియు నశించు నవియే యనుట, అబుద్ధానాం = శాస్త్రతత్త్వము నెఱుగనివారి, అపవాదమాత్రమ్=మిథ్యాప్రవాదము మాత్రమే.

(యో యో భావః స సర్వో వినశ్యత్యేవ) ప్రతిభావ పదార్థమును నశించునదియే యని బుద్ధిమంతు లంగీకరింపరు. ఇయ్యది శాస్త్రతత్త్వము నెఱుగనివారి యపవాదము. కారణ మేమన :— కారణవంతములైన పదార్థములే నశించును. నిరవ యవ పదార్థములు నశింపవు. మఱియు 'ఘటము జీర్ణించినది' అనునట్లు 'ఘట మతీతము' అనియు నందుము. అందువలన ఘటమునందలి యతీతావస్థయే సిద్ధించును కాని దానినాశము కాదు. కాబట్టి వినాశిత్వమును పురస్కరించుకొని శూన్య వాదము సిద్ధింపదని భావము.

కాబట్టి చేయవలసిన దేమన :-

"ఉభయ పక్ష సమాన క్షేమత్వాదయ మపి" ౧. ౪౬.

ఉభయ.... క్షేమత్వాత్ = పూర్వ నిరాకృత రెండు పక్షములతో సమానక్షేమము కలదగుటవలన, అయమపి = శూన్యవాదము సైతము త్యాజ్యమే యని సూత్రార్థము,

సౌత్రాంతిక వైభాషికు లిరువురును క్షణిక బాహ్య వస్తువుల నంగీకరింతురు. అదియొక పక్షము. యోగాచారుడు క్షణిక విజ్ఞానమును మాత్ర మంగీకరించును. ఇది రెండవ పక్షము. శూన్యవాదము మూడవపక్షము. ఇయ్యది పై రెండు పక్షములతో సమాన మగుటచే నియ్యదియు వానివలె నిరాకరణీయమే యని భావము.

దుఃఖనివృత్తి రూప పరమ పురుషార్థము, దానికి సాధనము, రెండును శూన్యములే యగుటచే సమానరూపత యేర్పడుచున్నది. కాబట్టి యీపక్షమేల త్యాజ్యమన :-

అపురుషార్థత్వ ముభయథా" ౧. ౪౭.

శూన్యవాదమునకు, ఉభయథాఽపి = రెండు విధములను, అపురుషార్థత్వం = పురుషార్థత సిద్ధింపదు.

దుఃఖనివృత్తి రూపమున గాని, తత్సాధన రూపమున గాని. ఆత్మకు శూన్యభావము సంపాదించుట పురుషార్థత్వ మెట్లుకాగలదు? కాజాలదు. కాబట్టి శూన్యవాదము సైతము త్యాజ్యమే కాని గ్రాహ్యము కాదని భావము.

ఇట్లు నాస్తికుల వాదములను నిరాకరించి, వారు చెప్పు విషయోపరాగాదులవలన పురుషునకు బంధమేర్పడ

జాలదని నిరూపించిన మీదట పురుషబంధము గతివిశేషము వలన కలుగగల దనగా దానిని నిరాకరించుచున్నాడు.

"న గతి విశేషాత్" ౧. ౪౮.

న గతి విశేషాత్ = దివ్యాదివ్య శరీరములందు ప్రవేశించుట వలన నాత్మకు బంధమేర్పడ జాలదు.

పురుషు డొక శరీరమునుండి మరియొక శరీరమున ప్రవేశించును. శరీరప్రవేశ రూపగతివలన బంధమేర్పడ గలదన నదియు సంభవము కాదని సూత్రాభిప్రాయము.

కారణ మేమన :-

"నిష్క్రియస్య తద సంభవాత్" ౧. ౪౯.

నిష్క్రియస్య = క్రియాపరిణామ రహితుడైన పురుషునకు, తద సంభావాత్ = గతి సంభవము కానందువలన.

నిష్క్రియుడైన పురుషునకు గతి కలుగనేరదు. కాబట్టి గతి బంధహేతువు కాదని భావము. పురుషుడు మధ్యమ పరిమాణము కలవాడని యంగీకరించిన గతి సంభవమే కదా యన :-

"మూర్తత్వాద్ ఘటాదివత్సమాన ధర్మాపత్తావపసిద్ధాంతః" ౧. ౫౦

ఘటాదివత్ = ఘటాదులవలె, మూర్తత్వాత్ = ఆత్మమధ్యమ పరిమాణము కలదగుటవలన, సమాన ధర్మాపత్తౌ = ఘటము మూర్తమగుటచే సావయవమైనట్లు ఆత్మయు మధ్యమపరిమాణము కలదగుటచే సావయవము కావలసివచ్చును, కాగా, అపసిద్ధాంతః = ఆత్మనిత్యమని యంగీకరించిన స్వసిద్ధాంతమునకు హాని కలుగును.

ఆత్మపదార్థము ఘటమువలె మూర్తము (మధ్యమ పరిమాణము కలది) అని యంగీకరించినచో ఘటమువలె నదియు సావయవ పదార్థమగును. ఘట మనిత్యమైనట్లు — అతీతాద్యవస్థల బొందునట్లు - ఆత్మయు ననిత్యమగును. ఆత్మ నిత్య మను స్వసిద్ధాంతమునకే హాని కలుగును. కాబట్టి ఆత్మ మధ్యమపరిమాణము కలది కాదని భావము.

పురుషుడు నిష్క్రియుడైన నతనియందు గతిని తెలుపు శ్రుతు లెట్లు సంగతము లగునన :-

"గతి శ్రుతి రప్యుపాధి యోగా దాకాశవత్" ౧. ౩౧.

గతి శ్రుతి రపి = గతిని తెలుపు శ్రుతికూడ, ఆకాశవత్ = ఆకాశమువలె, ఉపాధియోగాత్=ఉపాధి సంబంధమువలన నుపపన్నమగును.

"పుణ్యేన పుణ్యం లోకం, నయతి పాపేన పాపమ్"

ప్రశ్న ౨. ౭.

(పుణ్యముచే పుణ్యలోకమును, పాపముచే పాపలోకమును పొందును.) అను నిట్టి గతిని తెలుపు ఉపనిషద్వాక్యములు ఉపాధిసంబంధముచే నాత్మయందు గతిని బోధించుచున్నట్లు చెప్పిన సంగతములు కావచ్చు. ఆకాశము క్రియారహితము. అయినను ఘటాద్యుపాధుల సంబంధమున ఘటాకాశమునందు గమనాగమనములు వ్యవహరింపబడుచున్నవి. అట్లే యాత్మయందును బుద్ధిసత్త్వమనెడి యుపాధి సంబంధముచే గతి నంగీకరించిన దోషముండనేరదు - వాస్తవమున నందెట్టి క్రియాపరిణామము నుండనేరదని భావము.

'ఆత్మ అణుపరిమాణము కలది. ఆకాశము విభుపరిమాణము కలది. ఉపాధియుక్త పురుషునందు శ్రుతిబోధిత గతిని సమన్వయించుటకు ఉపాధియుక్త ఆకాశము ఉదాహరింపబడినది. కాబట్టి ఉపాధిగమనముచే నుపధేయమునందు గమనమున్నట్లెంచబడునని చెప్పుటయే, యీ యుదాహరణమున ప్రకృతము' అని వైదికుల మతము.

అటులయిన కర్మవలన నేర్పడు నదృష్టము పురుషబంధమునకు హేతువేల కాదన :-

"న కర్మణాప్యతద్ధర్మత్వాత్" ౧. ౫౨.

కర్మణాపి = కర్మమువలన కలిగెడి యదృష్టముచేతను, న=బంధమేర్పడదు - అతద్ధర్మత్వాత్=అదృష్టము పురుషధర్మము కానందున.

ఈ సూత్రమున కార్యమునకు బదులు కారణశబ్దము ప్రయోగింపబడినది. కాబట్టి 'కర్మణా అను పదమునకు కర్మజన్యమైన యదృష్టముచే' అని యర్థము వ్రాయబడినది. అదృష్టము పురుషధర్మము కాదు కావున నది పురుషబంధమునకు హేతువుకాదని భావము.

అన్యధర్మ మన్యునేల బంధింపదన :-

"అతిప్రసక్తి రన్యధర్మత్వే" ౧. ౫౩.

అన్యధర్మత్వే = బంధము దాని కారణములు భిన్నపదార్థములయినచో, అతిప్రసక్తిః=ముక్తులును బద్ధులుకావలసిన ప్రసంగమేర్పడును.

అన్యధర్మ మన్యుని బంధమునకు హేతువగునెడల ముక్తులును బద్ధులు కావలసి వత్తురు. కాబట్టి యిది పొసగదని భావము.

అదృష్టము పురుషధర్మమే యనిన కలుగు విరోధ
మేమనః-

"నిర్గుణాది శ్రుతివిరోధశ్చేతి" ౧. ౫౪.

(ఇందలి 'ఇతి' శబ్దము బంధకారణములను పరిశీలించుట
సమాప్తమైనట్లు సూచించుటకు) అదృష్టము పురుషధర్మముగా
నంగీకరించినచో-

("అసంగోహ్యయం పురుషః" బృ. ఆ ఉ. ౩. ౧౫.)

(పురుషు డసంగుడు) అని గుణసంగము పురుషునకు
లేదని చెప్పు నిర్గుణ శ్రుతితో విరోధము కలుగునని భావము—

కాలాదులవలె ప్రకృతి పురుషసంయోగము సైతము
బద్ధముక్త పురుషులకు సమానముగానే యుండును. కాబట్టి
ప్రకృతి సంబంధమువలన పురుషుడు బద్ధుడెట్లు కాగలడనః-

"తద్యోగోఽప్యవివేకా న్నసమానత్వమ్" ౧ ౫౫.

పురుషునకు, తద్యోగోఽపి=ప్రకృతి సంబంధముకూడ, అవివే
కాత్ = అవివేకమువలననే కలుగును. కావున, నసమానత్వమ్ =
కాలాదులవలె ప్రకృతిసంబంధము బద్ధముక్తులకు సమానము కాదు.

ఈ యధ్యాయమున పందొమ్మిదవ సూత్రమునందు
ప్రకృతి పురుషసంబంధమువలననే బంధమేర్పడగలదని చెప్పి
యుంటిమి. ప్రకృతిసంబంధము కాలాదుల సంబంధమువలెనే
బద్ధముక్తభేదము లేక యెల్లరికిని కలుగునుగదా ? అందువలన
ప్రకృతిసంబంధము పురుషబంధమునకు హేతువని యంగీకరించి
నచో ముక్తులును బద్ధులుకావలసి వత్తురని శంకించి దానికి
సమాధానముగా నీ సూత్రము రచియింపబడినది. ప్రకృతి

పురుషులకు గల సామాన్యసంబంధ మిట వివక్షితము కాద నియు, అవివేకమువలన కలిగెడి ప్రకృతి పురుషసంబంధమే బంధమునకు హేతువనియు నిందు వివరింపబడినది. ముక్త పురుషులతో ప్రకృతికి సామాన్యసంబంధ మున్నప్పటికిని, అవివేకకృతసంబంధ ముండదు. ముక్తులలో నవివేకముండ నేరదు కదా ! కాబట్టి దోషములేదని భావము.

అవివేకము బంధమునకు హేతువైనచో ముక్తి గలుగ వలయుననిన అవివేకము తొలగ వలయునుగదా ! అదియెట్లు సంభవ మనః—

"నియత కారణా త్తదుచ్ఛిత్తి ర్ధ్వాంతవత్" ౧. ౫౬

నియత కారణాత్ = వివేకమనెడి నియత కారణము వలన, తదుచ్ఛిత్తి = అవివేకము తొలగును. ధ్వాంతవత్ = ఆలోకమువలన చీకటి తొలగునట్లు.

ప్రకాశమువలన చీకటి నశించునట్లు వివేకమువలన నవివేకము నశించును. అటుపైన వివేకమువలన నేర్పడు ప్రకృతి పురుషులకు గల విశేష సంబంధము తొలగును. నాడు దుఃఖాత్యంత నివృత్తి యనెడు మోక్షము కలుగగల దని భావము. యోగశాస్త్రము నందును సమాధి పాదమున (వివేకఖ్యాతి రవిప్లవా హానోపాయః ఇతి) వివేకఖ్యాతి మోక్షము నెట్లు కలిగించునో వివరింప బడినది. వివరములు నాచే రచియింపబడిన యోగదర్శనమున చూడగలరు.

ప్రకృతి పురుష వివేకమువలన ప్రకృతి పురుషులకు సంబంధించిన అవివేకము నశించినను ఇతరావివేకము లెట్లు నాశము నందగలవన :—

"ప్రధానా వివేకా దన్యావివేకస్య తద్ధానే హానమ్" ౧, ౫౭.

ప్రధానా వివేకాత్ = ముఖ్యమైన యవివేకము వలన, అన్యా వివేకస్య = ఇతరావివేకము కలుగు చుండును. కాబట్టి తద్ధానే= మూలా వివేకము నశించిన, హానమ్ = మిగిలిన యవివేకము నశించును.

ఇందు ప్రధానావివేకమనగా మూలప్రకృతికి సంబంధించిన యవివేకమనియు, అన్యావివేకమనగా ప్రకృతి కార్యము లయిన మహత్తత్త్వాదికి సంబంధించిన యవివేకమనియు గ్రహింప వలయును. ప్రధాన యవివేకము వలననే యన్యావివేకములు కలుగును. కాబట్టి కారణ నాశమున కార్యనాశ మగునను నియమము ననుసరించి ప్రకృతిపురుషుల యవివేకము నశించిన మీదట యితరావివేకము లన్నియు నశించునని భావము.

వివేకమువలన మోక్షము నంగీకరించినచో పురుషుడు బద్ధుడని చెప్పక తప్పదు. కాబట్టి, పురుషుడు నిత్యశుద్ధ బుద్ధ ముక్తు డెట్లగు ననః-

"వాఙ్ మాత్రం నతు తత్త్వం చిత్తస్థితేః" ౧, ౫౮.

పురుషునకు చెప్పు బంధమంతయు, వాఙ్మాత్రం = మాట మాత్రమే, నతు తత్త్వం = వాస్తవము కాదు. చిత్తస్థితేః = బంధము చిత్తమునం దుండుట వలన.

మోక్షమునకు పూర్వముండు బంధమంతయు పురుషునిదే యనుట వాస్తవము కాదు. స్ఫటికమునందు కనబడు రంగులు స్ఫటికమునకు చెందనట్లు బంధము పురుషునికి చెందదు. అయ్యది చిత్తధర్మము-బంధము, మోక్షము, వివేకము, అవివేకము, సుఖము, దుఃఖము ననునవి యన్నియు

చిత్తమునందే యుండును. చిత్త సామీప్యమువలన నవి పురుషునందు ప్రతిభాసించును. కాబట్టి స్వతః బంధమోక్షములు పురుషునివి కావు. అందువలన నతని నిత్య శుద్ధ బుద్ధ ముక్తత్వమునకు లోటు వాటిల్లదు.

పురుషునకు బంధాదులు వాఙ్మాత్రములే యైనచో శ్రవణమననములవలననే యవితొలగిపోగలవు. శ్రుతిస్మృతులు మోక్షహేతువైన వివేకప్రత్యయమును సాక్షాత్కారము చేసికొనవలయునని సాక్షాత్కార పర్యంత ముపదేశింపనేల ?

"యుక్తితోఽపి న బాధ్యతే దిఙ్మూఢవ దపరోక్షాదృతే" ౧-౫౯.

బంధాదులు, వాఙ్మాత్రమైనను, దిఙ్మూఢవత్ = దిగ్భ్రమ కలిగినవానివలె, అపరోక్షాదృతే = ప్రత్యక్షము కలుగనంతవరకు, యుక్తితోఽపి = శ్రవణమననముల (వినికిడి, యుక్తి) వలనను, నబాధ్యతే = తొలగింపబడవు.

భ్రమ కలిగినవానికి యథార్థము సాక్షాత్కారము కానంతవరకు నా భ్రమ తొలగదు. అట్లే పురుషునకు విన్నంత మాత్రమున గానీ యుక్తులతో నాలోచించిన మాత్రమున గానీ బంధము తొలగనేరదు. దిగ్భ్రమజెందిన పురుషునకు సరియైన దిశకు సంబంధించిన సాక్షాత్కారము కలిగినపుడే యది తొలగును. అట్లే బంధాదులును వివేకజ్ఞాన సాక్షాత్కారమువలననే తొలగగలవు - కేవల శ్రవణాదులవలన తొలగవని భావము.

మోక్షసాధనమైన వివేకప్రత్యయ మేప్రకృత్యాదుల వలన కలుగవలయుననుచున్నారో యా ప్రకృత్యాదు లెట్లు సిద్ధించు ననః-

"అచాక్షుషాణా మనుమానేన బోధో
ధూమాదిభిరివ వహ్నేః" ౧.౬౦.

అచాక్షుషాణామ్ = ప్రత్యక్షముకాని ప్రకృత్యాది సూక్ష్మపదార్థములు, అనుమానేనబోధః = అనుమాన ప్రమాణముచే సిద్ధించును. వహ్నేః = అగ్ని, ధూమాదిభిరివ = ధూమాదిహేతువులచే సిద్ధించునట్లు పంచభూతము, లవాని కార్యములైన దేహాదులు, మనకు ప్రత్యక్షములగుచున్నవి, కాని వానికి కారణభూతములగు సూక్ష్మములయిన ప్రకృతి మహత్తత్వాదులు అనుమానముచే సిద్ధించునని భావము.

సూత్రమునందు ప్రత్యక్షానుమాన ప్రమాణములు స్పష్టముగా గ్రహింప బడినవి. ఈ సూత్రములను వ్యాఖ్యానించుచు విజ్ఞానభిక్షువు అనుమాన ప్రమాణమునకు గమ్యము కానివి యాగమముద్వారా తెలియనగునని వర్ణించియున్నారు. తన యీ వాక్యమును బలపరచుకొనుటకై కారిక యొకటి యుదాహరించిరి.

"సామాన్యతస్తు దృష్టాదతీంద్రియాణాం
ప్రతీతి రనుమానాత్,
తస్మాదపి చాసిద్ధం పరోక్ష
మాప్తాగమాత్సిద్ధమ్"

'ఇంద్రియగోచరములు కాని పదార్థములు సామాన్యతోదృష్టానుమానము ద్వారమున తెలియనగును. అనుమానముతోను సిద్ధపడని పదార్థము లాప్తవచనముద్వారా సిద్ధించును.'

అప్రత్యక్ష ప్రకృత్యాది పదార్థముల నూహించుట కనువగు సామాన్యతోదృష్ట కార్యలింగక అనుమానమును

ప్రదర్శించుటకు పూర్వము ప్రకృతి తత్కార్యములలో గల కార్యకారణభావమును ప్రదర్శించుచున్నాడు.

"సత్త్వరజస్తమసాం సామ్యావస్థా ప్రకృతిః ౧.
ప్రకృతేర్మహాన్; ౧. మహతోఽహంకారః; ౧.
అహంకారాత్ పంచ తన్మాత్రాణి ఉభయమింద్రియం ౧౬.
తన్మాత్రేభ్యః స్థూలభూతాని ౫.
పురుషః ౧. ఇతి పంచవింశతిర్గణః '' ౧.౬౧.

సత్త్వము, రజస్సు, తమస్సు నను మూటి సామ్యావస్థ ప్రధానము-ప్రకృతి; ప్రకృతినుండి మహత్తత్త్వము - బుద్ధి తత్త్వము; మహత్తత్త్వమునుండి అహంకారము; శబ్దస్పర్శరూప రసగంధ తన్మాత్రములు. త్వక్కు, చక్షువు, శ్రోత్రము, జిహ్వ, ఘ్రాణము నను జ్ఞానేంద్రియములు, వాక్కు, పాణి, పాదము, పాయువు, ఉపస్థ యను కర్మేంద్రియములు; మనస్సు, తన్మాత్రములనుండి ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి యను నైదుభూతములు నుత్పన్నములగును. పురుషుడు దేనినుండియు నుత్పన్నము కాడు. పురుషునినుండి యేదియు పుట్టదు. ఇట్లు ప్రకృతి మొదలు పురుషునివరకు గల తత్త్వములు ఇరువది యైదు.

ఇందు సత్త్వరజస్తమస్సులు మూడును ద్రవ్యములే కాని గుణములు కావు. ఇవి స్వయముగా సంయోగ విభాగ చలత్వాది గుణములు కలిగియున్నవి. సత్త్వగుణము, రజోగుణము, తమోగుణము నని గుణపదముచే వీనిని వ్యవహరించుటకు కారణము పురుషబంధమునకు ఇవి గుణములు-(త్రాళ్లు-గా నుపయోగించుటయే.

సత్త్వరజస్తమస్సుల సామ్యావస్థ యన నిట నా మూడు పదార్థములు నొక దానితో నొకటి న్యూనాధిక పరిమాణములలో కలియకుండుటయే యని తెలియవలయును. ఆ యవస్థయు కార్యము కాదు – కారణరూపమే. ప్రకృతి కార్యము మహత్తత్త్వము. తత్కార్యము అహంకారము– అహంకార కార్యములు పంచతన్మాత్రాదులని తెలియునది. వీని స్వరూపనిర్ణయము ముందుసూత్రములందు చేయబడును.

ప్రకృతి మహత్తత్త్వాదులు కార్య కారణములయిన నగునుగాక. కాని యిందే కార్యమువలన నే కారణము అనుమానముచే తెలియదగు ననః–

"స్థూలాత్ పంచతన్మాత్రస్య" ౧. ౬౨.

స్థూలాత్ = పృథివ్యాది స్థూల పంచభూతములనెడు కార్యము వలన, పంచతన్మాత్రస్య = గంధాది పంచ తన్మాత్రముల యొక్క బోధ సామాన్యముతో దృష్టానుమానముచే కలుగును.

బాహ్యేంద్రియములచే గ్రహింప వీలయిన గుణములు కలిగియుండుట స్థూలత యనబడును. పృథివిలో గంధ గుణ మున్నది. అది నాసికేంద్రియముచే గ్రహింపనగును. కాబట్టి పృథివి స్థూలము. ఇట్లే జలాదులు.

కార్యపదార్థము కారణవంతమై యుండవలయు నను నది సామాన్య న్యాయము. స్థూలములయిన భూమ్యాదులు కార్య పదార్థములు. వానికి కారణములైన సూక్ష్మపదార్థము లుండవలయును. అవియే గంధాది పంచతన్మాత్రములు.

"బాహ్యా భ్యంత రాభ్యాం తైశ్చాహంకారస్య" ౧. ౬౩.

బాహ్యాభ్యంతరాభ్యాం = మనస్సు, జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు నను కార్యముల వలనను, తైశ్చ=గంధాది తన్మాత్రముల వలనను, అహంకారస్య=అహంకారము యొక్క ప్రతీతి కలుగును.

బాహ్యములు నాభ్యంతరమునను నేకాదశేంద్రియములనెడు కార్యద్రవ్యములకును, ఇట్లే గంధాది తన్మాత్రములకును కారణముగా నహంకారము అనుమానము ద్వారమున నూహింప బడునని భావము.

"తేనాంతఃకరణస్య" ౧. ౬౪.

తేన = అహంకారరూప కార్యమువలన, అంతఃకరణస్య = బుద్ధితత్త్వ మూహింపబడును.

మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము నని యంతఃకరణము నలువిధముల చెప్పబడును. ఈ నాలుగు దశలు బుద్ధిసత్వమునకు సంబంధించినవే - బుద్ధిసత్వము సంకల్పించినపుడు మనస్సుగాను, నిశ్చయించినపుడు బుద్ధిగాను, ఆలోచించునపుడు చిత్తముగాను, అహంభావము కలిగినపుడు అహంకారముగాను, వ్యవహరింప బడును.

"తతః ప్రకృతేః" ౧ ౬౫.

తతః = అంతఃకరణమైన బుద్ధిసత్వమువలన, ప్రకృతేః=సర్వమునకు మూలమైన ప్రకృతియొక్క జ్ఞానము అనుమానమువలన కలుగును.

కార్య కారణభావమును పురస్కరించుకొని యనుమానముద్వారా ప్రకృత్యాది పదార్థములు సిద్ధించినను పురుషు డెట్లు తెలియనగు ననః

"సహంత పరార్థత్వాత్ పురుషస్య" ౧. ౬౬.

సంహత పరార్థత్వాత్ = అనేక వస్తువులు కలియుట యితర భోగాపవర్గములకొఱకే కాబట్టి, పురుషస్య = పురుషుని ప్రతీతి యను మానమువలన కలుగును.

పరస్పరము కలిసియుండు పదార్థములు సంహాతము లనబడును. ప్రకృతి మహత్తత్త్వాదులు సంహాతములు, శయ్యా, ఆసనము, భోజనము మున్నగునవి భోక్తకొఱకైనట్లు పరస్పర మిళితములయిన ప్రకృతి తత్కార్యములు పురుషునకు భోగము, నపవర్గమును కలిగించుటకే యని యూహింప నగును. ఇట పరార్థత్వము పరునకు భోగమును అపవర్గమును కలిగించుటయే. ప్రకృతి తత్కార్యముల సంహననము (కలయిక) పురుష బోధకమని భావము.

మహత్తత్త్వాదులకు వలె మూల ప్రకృతికిని కారణ మూహింపనగును కదాయన:—

"మూలే మూలాభావా దమూలం మూలమ్" ౧. ౬౭.

మూలే = మూలకారణమైన ప్రకృతియందు, మూలాభావాత్ = మఱియొక కారణము లేనందున, మూలం=మహదాది యిరువదిమూడు తత్త్వములకు మూలకారణమైన ప్రధానము, అమూలమ్ = కారణ రహితమే.

అన్నిటికి మూలకారణమైన ప్రకృతికి వేరు కారణము లేదని భావము.

మూలకారణమునకు కారణముండదని యేల యంగీక రింప వలయుననిన:—

"పారంపర్యేఽప్యేకత్ర పరినిష్ఠేతి సంజ్ఞామాత్రమ్" ౧. ౬౮.

పారంపర్యే=మూల ప్రకృతికి మఱియొక ప్రకృతి కలదనియు, దానికి మఱియొకటి యనియు నిట్లు పరంపర నంగీకరించినను, ఏకత్ర= చివరికొక తావున, పరినిష్ఠా=పర్యవసానము నంగీకరింపక తప్పదు. కాబట్టి యా చివరి కారణమే మూల ప్రకృతి యని యంగీకరింతుము. అందువలన, సంజ్ఞామాత్రం=సంజ్ఞలోనే వివాదమగును కాని భేదము లేదని యర్థము.

కారణ మేమన :–

"సమానః ప్రకృతేర్ద్వయోః" ౧. ౬౯.

ద్వయోః=వాది ప్రతివాదులకు, ప్రకృతేః = ప్రకృతి నంగీక రించుట, సమానః=సమానమే.

మూలకారణ మొకటి యంగీకరింపక తప్పదు కాబట్టి వివాదమునకు తావులేదు.

ప్రకృతి పురుషు లిట్లు అనుమానము వలన సిద్ధించు చుండ శాస్త్ర శ్రవణమువలననే సులభమగు నీ వివేక ప్రత్యయ మేల కలుగదన:–

"అధికారి త్రైవిధ్యాన్న నియమః" ౧. ౭౦.

అధికారి త్రైవిధ్యాత్ = అధికారులు మువ్విధములుగా నుండుట వలన, ననియమః = శ్రవణమాత్రమువలన నెల్లరికి వివేకజ్ఞానము దృఢముగా కలుగునను నియమములేదు.

మందులు, మధ్యములు, ఉత్తములు నని యధికారు లలో భేదములుండును. వినగానే యెల్లరికి వివేకముకలుగునని చెప్పవీలులేదు.

ప్రకృతి మహత్తత్త్వాదులలో మొదట కార్యమెయ్యది యన:–

"మహదాఖ్య మాద్యం కార్యం తన్మనః" ౧. ౭౧.

మహదాఖ్యం=మహత్తత్వమనెడి నామముగల, కార్యం = కార్యము. ఆద్యం = ప్రకృతినుండి యేర్పడు కార్యములలో మొదటిది, తన్మనః= అదియే మనస్సు.

ప్రకృతినుండి యేర్పడు మొదటికార్యము మనస్సు. మనస్సు మననమును తెలుపును. మనన మనగా నిశ్చయ జ్ఞానము. అదియే బుద్ధి యనబడును.

"చరమోఽహంకారః" ౧ ౬౨.

అహంకారః = అహంకారము, చరమః = బుద్ధితత్వమునకు తరువాత నేర్పడును.

"తత్కార్యత్వ ముత్తరేషామ్" ౧. ౬౩.

ఉత్తరేషామ్ = పంచతన్మాత్రాదులు, తత్కార్యత్వమ్ = ఆ యహంకారమునుండి జనించును.

ఇట్లే పంచతన్మాత్రములనుండి పంచభూతములని తెలిసి కొనవలయును.

అటులయిన నన్నియు ప్రకృతివలననే జనించినవి యని యెట్లు చెప్పగలమనః-

"ఆద్యహేతుతా తద్ద్వారా పారంపర్యేప్యణువత్" ౧. ౬౪

పారంపర్యేఽపి=పరంపరగానైనను, తద్ద్వారా = మహత్తత్వాదుల మూలమున, ఆద్యహేతుతా=మూలకారణమైన ప్రకృతియే కారణ మన వచ్చును. అణువత్ = అణువులవలె.

వైశేషికాదులు అణువులవలననే కార్యము లన్నియు నేర్పడునట్లంగీకరింతురు. అణువులచే ద్వ్యణుకములు, త్ర్యణుకములు నను క్రమముతో కార్యజాత మేర్పడును. అట్లే

ప్రకృతివలన మహత్తత్త్వాదు లేర్పడును. అహంకారము మొదలు మిగిలిన కార్యజాతమునకు ప్రకృతి సాక్షాత్తుగా కారణము గాకున్నను పరంపరగా కారణ మనుటలో నెట్టి దోషము లేదని భావము.

పురుషుడు ప్రకృతియు రెండును నిత్యములే కాబట్టి కార్యజగత్తేర్పడుటకు ముందు రెండు నుండును. అట్టియెడ జగత్తునకు ప్రకృతియే కారణము. పురుషుడు కాదనుటెట్లన:-

"పూర్వభావిత్వే ద్వయో రేకతరస్య హానేఽన్యతర యోగః" ౧ ౭౨.

ద్వయోః = ప్రకృతి పురుషులు, పూర్వభావిత్వే = జగత్తునకు పూర్వమున్నప్పటికిని, ఏకతరస్య = పురుషుడు పరిణామి కానందున, హానే = జగత్కారణమగుట సంభవము కాకపోవుటచేత, అన్యతర యోగః = ప్రకృతియే కారణముగా నంగీకరింపబడినది.

ప్రకృతి పురుషులలో ప్రకృతిపరిణామము నొందగలదు. పురుషు డపరిణామి. కాబట్టి ప్రకృతియే జగత్తునకు కారణము కాగలదని భావము.

ప్రకృతికంటె భిన్నముగా నొక పరిచ్ఛిన్నమైన పదార్థము నేల జగత్కారణముగా కల్పింపరాదన:-

''పరిచ్ఛిన్నం న సర్వోపాదానమ్'' ౧.౭౬.

పరిచ్ఛిన్నం = ఏకదేశ పదార్థము, సర్వోపాదానం = అన్నిటికి నుపాదాన కారణము, న = కాదు.

పరిచ్ఛిన్న మనగా పృథివ్యాదులవలె కొంతప్రదేశము నాక్రమింప గల పదార్థము. అట్టిది జగత్తులోని సర్వకార్య

జాతమునకు నుపాదాన కారణము కాజాలదు. కాబట్టి ప్రకృతి వంటి మహాత్కారణమే యంగీకరింపక తప్పదని భావము.

"తదుత్పత్తి శ్రుతేశ్చ" ౧. ౭౭.

మఱియు శ్రుతియందును ప్రకృతినుండియే జగత్తంతయు నుత్పన్నమైనట్లు వర్ణింపబడినది.

తద్ధేదం తర్హ్యవ్యాకృతమాసీత్త
న్నామరూపాభ్యామేవ వ్యాక్రియత"

బృ. అ. ౧. ౪. ౭.

(అవ్యాకృత ప్రకృతియే నామరూపములతో వ్యాకృతమయ్యెను.) అను శ్రుతి వాక్యములు సైతము ప్రకృతి మూలకమే జగత్తని చెప్పుచున్నందువలన నంతకుమించి మఱియొక పరిచ్ఛిన్నకారణ మంగీకరింపజనదని భావము.

"నావస్తునో వస్తుసిద్ధిః" ౧.౭౮.

అవస్తునః = అభావమువలన, వస్తుసిద్ధిః = భావోత్పత్తి, న = కలుగదు.

కార్యకారణములు రెండు సమానరూపము కలవిగా నుండవలయును కాబట్టి యభావము వలన భావ జగత్తేర్పడజాలదు.

ముత్యపు చిప్పలోకలుగు రజతజ్ఞానమువలె నీ జగత్తును అవస్తువేల కాదనః-

"అబాధా దదుష్ట కారణ జన్యత్వాచ్చ నావస్తుత్వమ్" ౧ ౭౯.

అబాధాద్ = బాధితము కానందువలన, అదుష్ట కారణజన్య త్వాచ్చ = దుష్టకారణమువలన జనింపనందునను, అవస్తుత్వం న = జగత్తు అభావము కాదు.

చీకటిలో తళతళలాడు ముత్యపు చిప్పను జూచి వెండి యని భ్రమ కలుగును దీనినే దార్శనికులు శుక్తి రజతజ్ఞాన మందురు. అనగా రజతము (వెండి) లేకున్నను రజతజ్ఞానము కలుగునన్నమాట. అట్లే జగత్తు వస్తువు (భావపదార్థము) కాకున్నను వస్తువుగా నేల కనబడరాదు? అని శంకాభి ప్రాయము. కాని ఇట్టిజ్ఞానము చీకటి తొలగగానే శుక్తి శుక్తి గానే కనబడును. రజతజ్ఞానము (బాధితమగును) తొలగిపోవును. అందువలన నది బాధితజ్ఞాన మనబడును. శుక్తి రజతజ్ఞానము బాధితమైనట్లు జగత్తు కొంతసేపు వస్తువుగా కనిపించి యటుపై అవస్తువుగా కనిపింపకపోవుటవలన నిది బాధితము కాదు. అందువలన జగత్తభావము—అవస్తువనుట సంగతముకాదని భావము.

మఱియు కంటిలో దోషమేర్పడినపుడు_పీతిమరోగము (కామెరలు) -కలిగినపుడు తెల్లని శంఖము పచ్చగా కన బడును_తెలుపు పచ్చగా కనబడుటకు_అనగా పచ్చదనము లేనిది పచ్చదనము కనిపించుటకు కంటిదోషము కారణము. కాబట్టి యది దుష్టకారణమువలన కలిగిన జ్ఞానము. కంటిలో పీతిమరోగము పోయినపుడు శంఖము తెల్లగానే కనిపించును. మనకు కలుగు జగత్తుయొక్క జ్ఞానము దుష్టకారణజన్యమును కాదు. కాబట్టి జగత్తు వస్తువే- భావమే-కాని యవస్తువు కాదు.

అభావమునుండి భావరూపజగత్తు కలుగకుండుటకు హేతువేమన :-

"భావే తద్యోగేన తత్సిద్ధి రభావే తదభావాత్ కుతస్తరాం తత్సిద్ధిః" ౧. ౮౦.

భావే=కారణము భావమైనపుడు (వస్తువైనపుడు) తద్యోగే=దాని సంబంధమువలన, తత్సిద్ధిః = భావమైన కార్యసిద్ధి కలుగును. అభావే= కారణ మభావమయిననాడు, తదభావాత్=కారణసంబంధము లేకపోవుట వలన, కుతుస్తరాం తత్సిద్ధిః =భావరూప కార్యమెట్లు సిద్ధింపగలదు ?

కారణము వస్తువైనపుడు దాని సంబంధము వలన నుత్పన్నమగు కార్యమును వస్తువగును. కారణమే యభావమైన దానితో సంబంధము కలుగుట కవకాశములేదు. కాబట్టి యభావమువలన భావ (వస్తు) రూపజగత్తు కలుగుననుట సంభవముకాదని భావము.

కర్మ జగత్కారణ మేల కాదనః-

"న కర్మణ ఉపాదానత్వాయోగాత్" ౧. ౮౧.

ఉపాదానత్వాయోగాత్ = ఉపాదానకారణము కాజాలనందున, కర్మణః=కర్మవలన న=జగదుత్పత్తి కలుగదు.

కర్మ జగదుత్పత్తికి నిమిత్త కారణమగును కాని ఉపాదాన కారణము కాజాలదని భావము.

కర్మ జగదుత్పత్తికి నిమిత్త కారణ మగు నెడల దాని వలననే మోక్షము కలుగవచ్చును కదా ? వివేకజ్ఞాన మేల ? యన :-

"నానుశ్రవికాదపి తత్సిద్ధిః, సాధ్యత్వే
నావృత్తి యోగా దపురుషార్థత్వమ్" ౧. ౮౨.

ఆనుశ్రవికాదపి = వైదికకర్మ వలనను, న తత్సిద్ధిః = మోక్ష సిద్ధి కలుగదు, సాధ్యత్వేన= మోక్షము కర్మ సాధ్యమైనచో, అవృత్తి యోగాత్ = పునరావృత్తి సంబంధమువలన, నయ్యది, అపురుషార్థత్వమ్ = పరమ పురుషార్థము - మోక్షము – కాదు.

వైదిక కర్మలకును మోక్షము సాధ్యము కాదు. మోక్షము పునరావృత్తితో కూడియుండ రాదు. కర్మసాధ్యము పునరావృత్తితో కూడియుండును. (తద్యథేహ కర్మచితో లోకః క్షీయతే ఏవమేవాముత్రపుణ్యాచితో లోకః క్షీయతే.) (క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి) (కర్మఫలము నశించును. పుణ్యము క్షీణించిన తదుపరి మర్త్యలోకమున మరల ప్రవేశింతురు.) అను నిట్టి శ్రుతిస్మృతులు కర్మసాధ్యము మోక్షము కాదనియే చెప్పుచున్నవి. వైదిక కర్మలే మోక్షమును సంపాదింప నేరనపుడు లౌకికకర్మల వలన మోక్ష మెట్లు సిద్ధింపగలదు ? కాబట్టి కర్మ మోక్షమునకు నిమిత్తము కానేరదని భావము.

ఉపాసనాదులద్వారా మోక్షసుఖము ననుభవింప బ్రహ్మలోకమును పొందిన వారికి పునరావృత్తి యేల కలుగదన.–

"తత్ర ప్రాప్తవివేకస్యానావృత్తిశ్రుతిః" ౧.౮౩.

తత్ర = బ్రాహ్మలోక గతులలో, ప్రాప్తవివేకస్య = వివేకము కలిగినవారికే, అనావృత్తిశ్రుతిః=పునరావృత్తికలుగదని శ్రుతి చెప్పును.

'తేషు బ్రహ్మలోకేషు పరాః పరావతో వసంతి.

తేషాం న పునరావృత్తిః' బృ. ఆ. ౮. ౨. ౧౫.

(బ్రహ్మలోకమున పరులు, పరావతులు నుందురు. వారికి పునరావృత్తి యుండదు.) అను నీ వాక్యములు వివేకము కలవారికి మోక్షప్రాప్తి కలుగునని చెప్పుచున్నవి. కాబట్టి వివేకమే మోక్షమునకు హేతువు ; కర్మలు కావు.

అటులయిన కర్మకు ఫలమేమనః—

"దుఃఖా ద్దుఃఖం జలాభిషేకవ న్నజాడ్యవిమోకః ౧. ౮౪.

జలాభిషేకవత్ = రోగికి జలాభిషేకమువలె, కర్మలవలన, దుఃఖా ద్దుఃఖం = దుఃఖపరంపరయే కలుగును. నజాడ్యవిమోకః = అవివేకము తొలగదు.

రోగికి స్నానము రోగమునుపెంచునట్లు దృష్టాదృష్ట కర్మములన్నియు హింసాది పాపములతో కూడి దుఃఖ పరంపరనే కలిగించును కాని, దుఃఖములకు మూలమైన యవివేకమును తొలగించి మోక్షమును కలిగింపజాలవని భావము.

కామ్యకర్మలు దుఃఖ ఫలకములు కావచ్చును కాని నిష్కామ కర్మలకు దుఃఖఫల మేల కలుగుననః—

"కామ్యేఽకామ్యేఽపి సాధ్యత్వా విశేషాత్" ౧. ౮౫.

కామ్యేఽకామ్యేఽపి= కామ్యమునందును అకామ్యమునందును, సాధ్యత్వా విశేషాత్=సాధ్యములో భేదములేనందున, దుఃఖమే కలుగును.

నిష్కామ కర్మఫలము సైతము సాక్షాత్తుగా మోక్షము కాదు. వివేకజ్ఞానమే మోక్షమునకు కారణము. నిష్కామ

కర్మముద్వారా అంతఃకరణము శుద్ధమగును. అటుపై వివేక జ్ఞానము కలుగును. తదనంతరమే మోక్షము. అందువలననే (తమేతం బ్రాహ్మణా వివిదిషన్తి యజ్ఞేనదానేన కర్మణాఽనాశకేన. బృ. ఆ. ౬. ౪. ౨౨) (యజ్ఞ దానాదులద్వారా ఆత్మనెఱుగ గోరుదురు-బ్రాహ్మణులు) యుపనిషత్తులలోను అంతఃకరణశుద్ధి ద్వారా మోక్షహేతువైన సత్వ పురుషాన్యతా ఖ్యాతి కలుగునని వర్ణింపబడినది. ఇయ్యదియు దుఃఖమే కాని సుఖముకాదు.

అటులయిన మోక్షము మాత్రము దుఃఖ మేల కాదు? అదియు సాధ్యమేకదా యన:-

"నిజముక్తస్య బంధధ్వంసమాత్రం పరం నసమానత్వమ్"

౧. ౮౬.

నిజముక్తస్య = ఆత్మీయవివేకమువలన ముక్తుడైనవానికి, పరం= అత్యంతమైన, బంధధ్వంసమాత్రం = బంధనివృత్తి కలుగును, నసమానత్వమ్ = కాబట్టి కర్మఫల సమానత యుండదు.

వివేకమువలన అవివేకజనిత దుఃఖముల సంబంధము తొలగును. అనగా దుఃఖము లతీతావస్థను బొందును. మరల బంధ మేర్పడదు. కాబట్టి కర్మసాధ్యములగు ఫలసమానత మోక్షమున కుండనేరదని భావము.

ప్రకృతి పురుషవివేకము మోక్షోపాయమైన కానిమ్ము. ప్రమాణము లన నేమో చెప్పనంతవరకు నది యెట్లు సిద్ధింప గలదన:-

"ద్వయో రేకతరస్యవాఽప్యసన్నికృష్టార్థ పరిచ్ఛిత్తిః ప్రమా, తత్సాధక తమం యత్ తత్ త్రివిధం ప్రమాణమ్" ౧. ౮౭.

ద్వయోః=బుద్ధి, పురుషుడు నను నీ రెంటిలో, ఏకతరస్యవాఽపి= బుద్ధియొక్క గానీ, లేక పురుషునియొక్క గానీ, అసన్నికృష్టార్థ పరిచ్ఛిత్తిః = పూర్వము తెలియని వస్తువు తనయందున్నట్లు తెలిసికొనుట, ప్రమా= ప్రమ యనబడును. యత్ = ఏది, తత్సాధకతమం=ఆ ప్రమకు అతిశయ సాధకమో, తత్ = అది, ప్రమాణమ్ = ప్రమాణము, త్రివిధం = ప్రమాణము మూడు విధములు.

సాంఖ్యుల జ్ఞాన ప్రక్రియయందు బాహ్య వస్తువులైన ఘట పటాదులు బుద్ధియందో లేక పురుషునందో ఆరోహించును. బుద్ధి సత్త్వము వస్త్వాకారమును బొందుటచే బుద్ధియం దారోహించును. సాన్నిధ్యము వలన బుద్ధి పురుషునందు ప్రతిబింబించుటచేత బుద్ధిగత వస్తువులును పురుషునం దారోహించి నట్లగును. పురుషుడును,బుద్ధియు ప్రమాత పదముచే వ్యవహరింపబడును. కాబట్టి ప్రమాతయందు బాహ్య వస్తువుల యారోహణ మిట సన్నికర్షముగా నెంచబడును. సన్నికృష్ట మనగా అధిగతము. అసన్నికృష్టమనగా అనధిగతము. పరిచ్ఛిత్తి యన తనయం దున్నట్లు తెలిసికొనుట. ఇట్లు బాహ్యమున నున్న వస్తువు అదివరకు తెలియబడక, పురుషునందో లేక బుద్ధియందో యారోహించును. అనగా స్వరూపముతో ప్రాప్తించును. ఇట్లు ప్రాప్తించుటయే ప్రమ యనబడును. ఆ ప్రమకు సాధనమైనది ప్రమాణ మనబడును. సాంఖ్యులు ప్రత్యక్షము, అనుమానము, శబ్దము నను మూడు ప్రమాణ ముల నంగీకరింతురు.

ఈప్రమ బుద్ధి నిష్ఠమైనపుడు బుద్ధి ప్రమాత్రియగును. పురుషుడు సాక్షియగును. 'ఇది ఘటము' 'ఇది పటము' అను నిట్టి జ్ఞానము ప్రమ యగును. నేత్రములు మున్నగు నింద్రియ

ములు ప్రమాణము లగును. ప్రమ పురుషనిష్ఠమయినపుడు బుద్ధియందు ప్రతిబింబించు పురుషుడు ప్రమాత యగును, బుద్ధిలో ప్రతిబింబించు పురుషునియందుండు ప్రమయే పురుషనిష్ఠ ప్రమ యని శాస్త్రమున వ్యవహరింతురు. ఆ ప్రతిబింబిత పురుషుడే సాక్షియు నగును. ఇది ఘటము, ఇది పటము, అను వస్త్వాకారమును బొందిన బుద్ధి వృత్తిప్రమాణమగును. నేత్రాదులు గౌణప్రమాణముగా నెంచబడును. ముఖ్యప్రమాణము బుద్ధి వృత్తియే యని భావము.

ప్రమాణము లనేకము లుండ మూడే యననేల యన:-

''తత్సిద్ధౌ సర్వసిద్ధేః నాధిక్యసిద్ధిః'' ౧. ౮౮.

తత్సిద్ధౌ=మూడు ప్రమాణములవలననే, సర్వసిద్ధౌ = అంతయు సిద్ధించుచుండ, ఆధిక్యసిద్ధిః న = ఉపమానాది ఇతర ప్రమాణములు సిద్ధింపనేరవు.

ప్రత్యక్షానుమాన శబ్ద ప్రమాణములతోనే సర్వ పదార్థజ్ఞానము కలుగును. కాబట్టి యితర ప్రమాణము లన్నియు నీ మూడు ప్రమాణములందే యంతర్భూతము లగు నని భావము.

ప్రత్యక్ష ప్రమాణ లక్షణము:-

“యత్సంబద్ధం సత్ తదాకారోల్లేఖి విజ్ఞానం తత్ప్రత్యక్షమ్’”

౧. ౮౯.

సంబద్ధం సత్ = ఇంద్రియ సన్నికర్షముద్వారా వస్తువుతో సంబద్ధమై, తదాకారోల్లేఖి=వస్తువు ఆకారమును ధరించు, యత్ = ఘటమిది, పటమిది యనెడు, విజ్ఞానం = బుద్ధి వృత్తిరూపజ్ఞాన మేది కలదో, తత్ ప్రత్యక్షమ్ = అది ప్రత్యక్ష ప్రమాణము.

ఇంద్రియ సన్నికర్షము ద్వారా వస్తువునుచేరి వస్తువు యొక్క యాకారమును ధరించి యా వస్తు వెయ్యదియో తెలుపునట్టి బుద్ధివృత్తి యనెడు జ్ఞానము ప్రత్యక్ష ప్రమాణ మని భావము.

యోగులు గతించి నట్టియు, భవిష్యత్కాలమున నేర్పడునట్టియు, దూరమున నుండునట్టియు వస్తువులను తెలిసి కొందురు గదా! అట్టియెడ ఇంద్రియ సన్నికర్ష ముండదు. కాబట్టి యోగి ప్రత్యక్షమునందు ప్రత్యక్ష లక్షణ మెట్లు వర్తింపగలదన:-

"యోగినా మబాహ్యప్రత్యక్షత్వా న్నదోషః" ౧. ౯౦.

యోగినామ్ = యోగుల ప్రత్యక్షము, అబాహ్య ప్రత్యక్షత్వాత్ = బాహ్యేంద్రియ సన్నికర్షము ద్వారమున నేర్పడునది కాదు, కాబట్టి న దోషః = దోషములేదు.

ప్రత్యక్ష లక్షణము ఇంద్రియ సన్నికర్షముద్వారా కలుగునని చెప్పుటవలన యోగి ప్రత్యక్ష మిట లక్ష్యము కాదని తెలిసికొనవలయునని భావము.

లేక యోగి ప్రత్యక్షము సైతము లక్ష్యమైనచో

"లీన వస్తు లబ్ధాతిశయ సంబంధాద్ వాఽదోషః" ౧. ౯౧.

లీన......సంబంధాత్ వా = అతీతా నాగతాది వస్తువులందును యోగశక్తివలనవిశేష సంబంధమును సంపాదించుటవలన, అదోషః = దోషముండదు.

యోగి తన శక్తిచే గతించినట్టియు, రానున్నట్టియు, దూర వ్యవహితములయినట్టియు వస్తువులతో తన యింద్రియ

ములను సంబద్ధమొనర్చి వాని నెఱుగగలడు. కాబట్టి ఇంద్రియ సన్నికర్షము యోగి ప్రత్యక్షమున నున్నదనియే తెలియును. అందువలన ప్రత్యక్ష లక్షణమున నెట్టి దోషమును లేదు.

ఈశ్వరునకును ప్రత్యక్షజ్ఞానము కలుగును గదా! అయ్యది జన్యమైనప్పటికిని ఇంద్రియ సన్నికర్షముద్వారా నేర్పడునది కాదు. కాబట్టి యీశ్వర ప్రత్యక్షమున లక్షణ మవ్యాప్తమగును గదా యన:—

"ఈశ్వరా సిద్ధేః ౧. ౯౨.

ఈశ్వరుడే సిద్ధింపనందున ఈశ్వర ప్రత్యక్షమున లక్షణ మవ్యాప్తమనుట యుక్తముకాదని భావము.

ఈశ్వరసిద్ధి యేల కలుగదన:—

"ముక్తబద్ధయో రన్యతరాభావాత్ న తత్సిద్ధిః" ౧. ౯౩.

ముక్త .... భావాత్ = ముక్తబద్ధ పురుషులలో నొకడును కానందున, తత్సిద్ధిః = ఈశ్వరసిద్ధి, న = కలుగజాలదు.

ఈశ్వరుడెట్లో సాధింపబడినను నతడు పురుషుడే కావలసియుండును. పురుషుడయిన పక్షమున నతడు బద్ధుడో, ముక్తుడో కావలసియుండును. బద్ధులు ముక్తులు నైన పురుషులలో నెవరును నీశ్వరుడు కానందువలన నీశ్వరుడు సిద్ధింప జాలడని భావము.

ఈశ్వరసిద్ధి కలుగకుండుటకు హేతు వేమన:—

"ఉభయథాప్య సత్కర్తృత్వమ్" ౧. ౯౪.

ఉభయథాఽపి = బద్ధుడైనను, ముక్తుడైనను, అసత్కర్తృత్వమ్= జగత్తు నుత్పన్నముచేయుట సంభవము కాదు.

బద్ధ పురుషుడు జగత్తునుత్పన్నము చేయగలఁడందుమా? అతఁడసమర్థుఁ డగుటచే చేయజాలఁడు. ముక్త పురుషుఁడు జగత్తు నుత్పన్నము చేయునందుమా? అతనికి ప్రయోజనము లేదు కాబట్టి జగత్తు నుత్పన్నము చేయఁడు. కాబట్టి యీశ్వర సిద్ధి యెట్లు కాగలదని భావము.

జగదుత్పత్తి యసంభవ మగుటచే నీశ్వరుఁడు సిద్ధింపకున్న పోనిండు. కాని యాగమములందు విధింపబడిన యీశ్వరుని ప్రశంస, ఉపాసన మున్నగువాని వలన నీశ్వరుని సిద్ధి సంభవమేకదా ? యనః—

"ముక్తాత్మనః ప్రశంసోపాసా సిద్ధస్యవా" ౧.౯౫.

ముక్తాత్మనః = ముక్తినిబొందిన జీవుని, ప్రశంసా = దుఃఖ రాహిత్యమువలన నీశ్వరునివలె ప్రశంసయు, వా = మఱియు, సిద్ధస్య = తపఃప్రభావమువలన సిద్ధిబొందిన జీవుని, ఉపాసా = ఉపాసనయు ఆగమములందు వర్ణింపబడుటవలన నీశ్వరసిద్ధి కలుగదు.

'ఈశ్వరాసిద్ధేః' అను సూత్రమునుండి యీ సూత్రము వరకు గల సందేహములన్నియు జైనులవిగా భావించి సమాధానములు చెప్పబడెను. ఆగమములును జైనులవిగానే గ్రహింపవలెను. జైనుల యాగమములందు గల ప్రశంసోపాసనలు జీవులలో ముక్తులను సిద్ధులు నయిన వారికి సంబంధించినవియే; ముక్తులు అసంగులు. వారికి జ్ఞాన మసంభవము. సిద్ధులు సశరీరులే కాబట్టి వారిజ్ఞాన మింద్రియజన్యమే యగును అందువలన ప్రత్యక్షలక్షణమున దోషములేదని భావము.

సాంఖ్యుల మతముననను ఈశ్వరుడు నిత్యశుద్ధ బుద్ధ ముక్తస్వభావుడే కాబట్టి యతడు ప్రకృతి పురుషాధిష్ఠాన మెట్లు కాగల డనః—

"తత్సన్నిధానా దధిష్ఠాతృత్వం మణివత్" ౧. ౯౬.

మణివత్ = అయస్కాంతమణి సామీప్య మాత్రముచే లోహమును ప్రేరించునట్లు, తత్సన్నిధానాత్ = ప్రకృతి పురుషుల సామీప్యము వలన, అధిష్ఠాతృత్వం = పరమేశ్వరునందు ప్రకృతి పురుష నియంతృత్వము సిద్ధించును.

సాంఖ్యుల మతమున పరమేశ్వరుడు క్లేశకర్మ విపాకాశయముల సంస్పర్శము లేనివాడు కాబట్టి నిత్యశుద్ధ బుద్ధ ముక్త స్వభావుడనుట నిస్సంశయము. అయినను నతడు జ్ఞాన క్రియాశక్తులు గలవాడుగా నంగీకరింతురు. అతనితో సమానుడుగాని అధికుడుగాని లేడని భావము. కాబట్టి సంనిధి మాత్రముననే యతనియందు ప్రకృతి పురుషుల యధిష్ఠానము సిద్ధించును. ప్రకృతి పురుషులతో నతినికిగల సాక్షాత్సంబంధమే సన్నిధి యనబడును. ఆ సంబంధము సంయోగము కానీ, సమవాయముకానీ కాదు. స్వస్వామిభావ సంబంధము. ఈశ్వరుడు స్వామి; ప్రకృతి పురుషులు స్వత్వము (స్వమ్)—

ఈ స్వస్వామిభావసంబంధము నిత్యము. అందువలననే యతడు సర్వదా ముక్తుడు, సర్వదా ఈశ్వరుడు నని వైదికు లందురు. నిత్యశుద్ధ బుద్ధ ముక్తస్వభావుడయ్యు నిఖిల శక్తి సంపన్నుడు కాబట్టి ప్రకృతి పురుషుల కాధారుడగుటలో నెట్టి దోషము లేదని భావము.

చైతన్యమునందు జీవులు నీశ్వరసమానులే కాబట్టి జీవులవలె నీశ్వరుడు సంకల్పముద్వారా ప్రకృతి పురుషుల కధిష్ఠాత యేల కాగూడదు? సన్నిధిమాత్రముననే యననేల యన :-

"విశేషకార్యేష్వపి జీవానామ్" ౧. ౯౭.

జీవానామపి = జీవులకును, విశేషకార్యేషు = ఆహారవిహారాది కార్యములందు, (తత్సన్నిధానాదధిష్ఠాతృత్వమ్) బుద్ధిసాన్నిధ్యమువలన బుద్ధ్యధిష్ఠాతృత్వమే కాని సంకల్పాదులవలన కాదు.

బుద్ధియందు ప్రతిబింబితములైన యహంకారముతో కూడిన చేతనములు జీవులు. కాబట్టి జీవులకును బుద్ధిసాన్నిధ్యము కలదు. ఆ సాన్నిధ్యమువలననే జీవులు బుద్ధికధిష్ఠాతలు. ఆ యధిష్ఠాతృత్వమువలననే బుద్ధియందు సంకల్పాదులు కలుగును. ఆహార విహారాదులు సంపన్నము లగును. కాబట్టి జీవులున్ను సంకల్పాదులచే కార్యసంపాదకులనుట యుక్తము కాదు. బుద్ధికి సమీపముననుండుటచే బుద్ధియందు సంకల్పాదులు కలుగును. అటుపై కార్యములు. కాబట్టి జీవసాదృశ్యముచే నీశ్వరునందు సంకల్పాదు లంగీకరింప నవసరములేదని భావము.

అటులయిన సర్గారంభమున జీవులకు వేదవాక్యార్థోపదేశ మెట్లు కలిగిన దన :-

"సిద్ధరూప బోద్ధృత్వాద్వాక్యార్థోపదేశః" ౧. ౯౮.

సిద్ధరూప బోద్ధృత్వాత్ = నిఖిలశక్తి సంపన్న రూపుడైన పరమాత్ముడు సన్నిధి మాత్రము చేతనే జ్ఞానదానము చేయగలడు కాబట్టి వాక్యార్థోపదేశః = అగ్ని మున్నగు మహర్షులద్వారా వేద వాక్యార్థము లను బోధించుట యుక్తమే.

సమస్త శక్తి సంపన్నుడగు పరమాత్ముడు సామీప్యమున నుండి జ్ఞానము నొసంగ గలడు. ఈశ్వర సాన్నిధ్యము వలననే శుద్ధాంతఃకరణులయిన ఋషులకు వేద వాక్యముల యర్థము బోధపడినదని భావము.

పురుషుడు సామీప్యము వలననే యధిష్ఠాన మగుచో పురుషునియందు గల యధిష్ఠాతృత్వము గౌణమగును. ముఖ్యమగు నధిష్ఠాతృత్వ మెట నుండు నన :-

"అంతఃకరణస్య తదుజ్జ్వలితత్వాత్ లోహ వదధిష్ఠాతృత్వమ్" ౧. ౯౯.

లోహవత్ = ఇనుమువలె. తదుజ్జ్వలితత్వాత్ = చితిశక్తి యనబడు పురుషునిచే చేతనవంతముగా చేయబడినందున, అంతఃకరణస్య = బుద్ధిసత్వమునకు, అధిష్ఠాతృత్వం = ముఖ్యమైన యధిష్ఠాతృత్వము.

దహనశక్తిగల వహ్ని సమీపమున నున్న ఇనుము జ్వలించును. అగ్ని సంయోగముచే ఇనుము కాలి యితర పదార్థములను కాల్చును. అట్లే చేతనశక్తి గలిగిన పురుషుని సామీప్యమున నున్న బుద్ధిసత్వము (అంతఃకరణము) చేతనము గలదై సంకల్పాదులకు ఆశ్రయమగును. కాబట్టి సంకల్పాదులకు అధిష్ఠానము (ఆశ్రయము) బుద్ధిసత్వ మగుచున్నది. అందువలన ముఖ్యాధిష్ఠాతృత్వము బుద్ధిసత్వమునందే కలదని యంగీకరింపవలయును. పురుషుడు సంకల్పాదులకు వాస్తవమున నాశ్రయము కాకపోవుటచే నతనియం దెట్టి పరిణామము నుండదని భావము.

ప్రత్యక్షమును వర్ణించి తదుపరి అనుమాన ప్రమాణ లక్షణము చెప్పుచున్నాడు.

"ప్రతిబంధదృశః ప్రతిబద్ధజ్ఞాన మనుమానమ్" ౧ ౧౦౦.

ప్రతిబంధదృశః = వ్యాప్తిదర్శనము వలన, ప్రతిబద్ధజ్ఞానమ్ = వ్యాపకజ్ఞానము, అనుమానమ్ = అనుమాన ప్రమాణమగును.

ప్రతిబంధ మనగా వ్యాప్తి. ఈ సూత్రమునందలి ప్రతిబంధ శబ్దము వ్యాప్తితో కూడిన హేతువును తెలుపును. (ప్రతిబంధదృక్) వ్యాప్తి విశిష్టహేతువును పక్షధర్మముగా చూచునట్టి పురుషునకు కలుగు (ప్రతిబద్ధజ్ఞానమ్) సాధ్యమునకు సంబంధించిన జ్ఞానము అనుమాన మనబడునని భావము.

ఈ జ్ఞానము బుద్ధివృత్త్యాత్మక మగును. ఇయ్యది ప్రమాణము. దానికి ఫలము పౌరుషేయబోధ. అయ్యది ప్రమితి - అనుమితి యనబడు నని వివేకము.

వ్యాప్తి, పక్షము, పక్ష ధర్మతాజ్ఞానము మున్నగు విషయములు స్పష్టముగా తెలిసికొన గోరువారు నాచే రచియింపబడిన న్యాయదర్శనము - (అంబావ్యాఖ్యాన సహితము)న అనుమానలక్షణము జదువగోరుచున్నాడ.

శబ్దప్రమాణ లక్షణము :-

"ఆప్తోపదేశః శబ్దః" ౧. ౧౦౧.

ఆప్తోపదేశః = ఆప్తవాక్యము, శబ్దః = శబ్దప్రమాణము.

ఉన్నది యున్నట్లు తెలుపుట ఆప్తి. అట్లు తెలుపు వాడు ఆప్తుడు. ఉపదేశమనగా వాక్యము. ఈ సూత్రము నందలి 'ఆప్తోపదేశము' అను పదము కర్మధారయ సమాస ముగా నెంచబడిన పక్షమున (ఆప్తశ్చాసౌ ఉపదేశః = ఆప్తోపదేశః) ఆప్తవాక్యము వేదవాక్య మని బోధ పడును.

వేదవాక్యమువలన కలుగు బుద్ధివృత్తి రూప జ్ఞానము శబ్ద ప్రమాణ మనబడునని భావము. అటుపై కలుగు పౌరుషేయ బోధ శాబ్దప్రమ యనబడునని వివేకము.

ఈ ప్రమాణము లేల వర్ణింపబడిన వన :-

"ఉభయసిద్ధిః ప్రమాణాత్తదుపదేశః" ౧. ౧౦౨.

ప్రమాణాత్=ప్రమాణము వలననే, ఉభయసిద్ధిః ప్రకృతి పురుషులు సిద్ధింతురు; కాబట్టి, త దుపదేశః=ప్రమాణము లుపదేశింపబడినవి.

ప్రమాణము మూలముననే లోకమునగల వస్తువుల యునికి తెలియనగును. ప్రమాణమే యంగీకరింపని పక్షమున 'ఇది యున్నది; ఇది లేదు' అని నిరూపింప వలను పడదు. కాబట్టి ప్రమాణము లిట వర్ణింపబడినవని సూత్రకారుడు వివరించి యున్నాడు.

ప్రకృతి పురుషుల యునికి యిందే ప్రమాణమున తెలియ నగు నన :-

"సామాన్యతో దృష్టా దుభయ సిద్ధిః" ౧. ౧౦౩.

సామాన్యతోదృష్టాత్=సామాన్యతోదృష్టానుమానము వలన, ఉభయ సిద్ధిః = ప్రకృతి పురుషులసిద్ధి కలుగును.

అనుమానప్రమాణము పూర్వవత్తు, శేషవత్తు, సామాన్యతోదృష్టము నని ముప్విధములు. అందు అన్వయ మాత్ర వ్యాప్తిగల యనుమానము పూర్వవత్తనియు, వ్యతిరేక మాత్ర వ్యాప్తిగలది శేషవత్తనియు, సామాన్యతో దృష్టాన్వయ వ్యతిరేక మాత్ర వ్యాప్తిగలది సామాన్యతో దృష్టానుమాన మనియు తెలిసికొనవలయును. ("ఇయ్యది

వివరముగా తెలియగోరు వారు న్యాయ దర్శనము చూతురు గాత.)

ప్రమాణము వలన కలుగు విషయజ్ఞానము బుద్ధి వృత్త్యాత్మకమగుట వలన నయ్యది పౌరుషేయ మెట్లు కాగల దన :–

"చిదవసానో భోగః" ౧. ౧౦౪.

భోగః = ఇష్ట విషయమునుగానీ, అనిష్ట విషయమునుగానీ యనుభవించుట భోగ మనబడును - అయ్యది, చిదవసానః = పురుషుని యందు పర్యవసానము నొందును.

బుద్ధిసత్త్వము ఘట పటాది వస్తువుల యాకారమును బొందుట వృత్తి యనబడును. బుద్ధివృత్తియే విషయానుభవము – భోగ – మన బడును. బుద్ధి విషయాకారలను సంపాదించి, యనగా వృత్తి రూపమునొంది యంతట విరమింపదు – పర్యవసానము నొందదు. సమీపమున నున్న పురుషునం దా విషయాకృతిని చేర్చును. అనగా బుద్ధి తనలో ప్రతిబింబించు పురుషునియం దాయా విషయాకారములను జేర్చునని భావము. ఇట్లు చేతన స్వరూపుడగు పురుషుడు బుద్ధి వృత్తి రూప భోగమును పొంది భోక్త యగును. బుద్ధి చేతనము గానందున వృత్తులకు కర్త్రియయ్యు భోక్త్రి కానేరదు. పురుషుడు వృత్తులకు కర్త కాకపోయినను చేతను డగుటచే భోక్త యనబడును.

లోకమున క్రియాఫలమును కర్త యనుభవించుట చూచుచున్నాము. అట్టియెడ బుద్ధి కర్తృక విషయభోగము పురుషున కెట్లు చెందునన :–

"అకర్తురపి ఫలోపభోగోఽన్నాద్యవత్" ౧. ౧౦౫.

అకర్తురపి = కర్మచేయని పురుషునకు, ఫలోపభోగము = బుద్ధి క్రియకు ఫలమైన విషయ భోగము, అన్నాద్యవత్ = అన్నాదులవలె యుక్తమే యగును.

పాచకుడు మున్నగు భృత్యులచే సంపాదింపబడిన అన్నాది పదార్థములు యజమానునకు భోగమగుట లోకమున జూచుచున్నాము. అట్లే పురుషుడు కర్త కాక పోయినను బుద్ధిక్రియలకు ఫలరూపమైన విషయోపభోగ మునకు భోక్త కాగలడని భావము.

ఫలము కర్తకు లభింపవలయుననెడి శాస్త్రవాక్యముల కియ్యది విరుద్ధము కాదా యన :—

"అవివేకాద్ వా తత్సిద్ధేః కర్తుః ఫలావగమః" ౧. ౧౦౬.

వా = లేక, అవివేకాత్ = ప్రకృతి పురుషవివేకము లేనందున, తత్సిద్ధేః = కర్తృత్వము సిద్ధించుటవలన, కర్తుః = కర్తకే, ఫలావగమః= క్రియాఫలభోగము కలుగును.

విషయావగమమునకు బుద్ధియే కర్త్రి యగును. కాని యట్టి విషయబోధ బుద్ధియందు ప్రతిబింబిత పురుషున కుపలబ్ధమగును. బుద్ధిచే నుపరక్తుడయిన పురుషునకు వివేకము లేకపోవుటచేత విషయావబోధను పురుషుడు తనదిగా నెంచును. కాబట్టి పురుషున కీవిధముగ కర్తృత్వము లభింప గలదని భావము.

అటులయిన పురుషునకు లభించు భోగము వాస్తవమే కావలసివచ్చును గదా? భోగము వాస్తవమైనచో మోక్ష మెట్లు లభింపగల దన :—

"నో భయం చ తత్త్వాఖ్యానే" ౧. ౧౦౭.

తత్త్వాఖ్యానే = ప్రకృతి పురుషవివేకము సాక్షాత్కారమయిననాడు, ఉభయంచన=కర్తృత్వము భోక్తృత్వము నను రెండును నుండవు.

పురుషునకు కర్తృత్వము బుద్ధిద్వారా సంక్రమించుచున్నది. కాబట్టి యది యౌపాధికము. అట్లే భోక్తృత్వమును నౌపాధికమే. కాబట్టి వివేకము కలుగగానే కర్తృత్వ భోక్తృత్వములు రెండును తొలగిపోవును. మోక్షము సిద్ధించుటలో దోషముండనేరదు.

లోకమునగల పదార్థములు ప్రత్యక్షముగా తెలియబడును. ప్రత్యక్షప్రమాణముచే తెలియబడనివి లేనట్లే యెంచబడును. అట్టియెడ సామాన్యతోదృష్టమువలన ప్రకృతి పురుషు లెట్లు సిద్ధింప గలరన :—

"విషయోఽవిషయోఽప్యతి దూరాదేర్
హానోపాదానాభ్యా మింద్రియస్య" ౧. ౧౦౮.

అతి దూరాదేః = అతి దూరత్వము, అతి సామీప్యము, మున్నగు దోషముల వలనను, హానో పాదా నాభ్యాం = ఘాతానవస్థానములచేతను, ఇంద్రియస్య = ఇంద్రియమునకు, విషయోఽపి = విషయమయ్యు, అవిషయః = విషయముకాదు.

ఇంద్రియముల ద్వారా తెలిసికొనదగిన పదార్థము కూడ కొన్ని యాటంకములవలన తెలియరాని దగుచున్నది. ఆ యాటంకములు; అతిదూరము, అతిసామీప్యము, ఇంద్రియమునకు దెబ్బతగిలి చెడిపోవుట, మనస్సున నిలుకడ లేకుండుట, సూక్ష్మత, మున్నగునవి. ఇట్టి యాటంకము

లున్నపుడు పదార్థముండియు తెలియబడదు. కాబట్టి పదార్థమే లేదనరాదు.

ఈ యాటంకములే సాంఖ్యకారికయం దిట్లు సంగ్రహింప బడినవి.

"అతిదూరాత్ సామీప్యా దింద్రియఘాతాత్
మనోఽనవస్థానాత్, సౌక్ష్మ్యాద్ వ్యవధానా
దభి భవాత్ సమానాభిహారాచ్చ."

అతి దూరత, అతి సామీప్యము, ఇంద్రియఘాతము (దెబ్బతగిలి ఇంద్రియము చెడుట), మనశ్చాంచల్యము. సూక్ష్మత, వ్యవధానము (మఱియొక వస్తువుద్వారా అడ్డగింప బడుట), అభిభవము (ఒక దానిచే మఱియొకటి తిరస్కరింప బడుట), సమానాభిహారము (సమాన జాతీయములగు వస్తువులలో కలసిపోవుట). ఇట్టి దోషములున్నచోట వస్తువున్నప్పటికి తెలిసికొన వీలుపడదు.

సూర్యకాంతిచే దీపపుకాంతి యభిభూతమై - తిరస్కృతమై - తెలియరాదు. గేదెపాలలో ఆవుపాలు కలిసినపుడు ఆవుపాలు వేరుగా తెలియజాలము. ఈ రెండును అభిభవము, సమానాభిహారమునకు నుదాహరణములు. మిగిలినవి సులభములగుటచే స్వయముగా నూహింపదగును.

ప్రకృతి పురుషుల యునికి తెలియరామి కీ దోషములలో నెయ్యది కారణ మన :-

"సౌక్ష్మ్యాత్తదనుపలబ్ధిః" ౧. ౧౦౯.

సౌక్ష్మ్యాత్ = సూక్ష్మతవలన, తదనుపలబ్ధిః = ప్రకృతి పురుషుల జ్ఞానము ప్రత్యక్షము కాదు.

ఇట సూక్ష్మత యనగా నిరవయవత్వము - అవయవ రాహిత్యమని గ్రహింపవలయును. ప్రకృతి పురుషు లత్యంత సూక్ష్మములగుట వలన నింద్రియగోచరములు కానేరవని భావము.

అతి సూక్ష్మము లగుటచే ప్రకృతి పురుషులు ఇంద్రియ గోచరములు కావనుటకంటె నా పదార్థములే లేవనిన నేమన :—

"కార్యదర్శనా త్తదుపలబ్ధేః" ౧. ౧౧౦.

కార్యదర్శనాత్ = మహత్తత్త్వము మొదలు పంచమహాభూతముల వరకు గల స్థూల పదార్థములను చూచుచున్నాము కాబట్టి, తదుపలబ్ధేః = ప్రకృతి పురుషుల యుపలబ్ధి (జ్ఞానము) కలుగుచున్నది.

కార్యమును చూచినపుడు కారణము తెలియనగును. కారణములేని కార్యముండనేరదు. కాబట్టి స్థూలములయిన పంచమహాభూతాదులకు కారణముగా సూక్ష్మ ప్రకృతియొకటి కలదనియు, భోక్తగా పురుషు డొండు కలడనియు తెలియ నగును. అందువలన ప్రకృతిపురుషులను వస్తువులు లేవనజెల్లదు. కార్యదర్శనము వలన కారణ మూహింప నగును కాని ప్రకృతి యెట్లు సిద్ధింపగలదని శంకించుచున్నాడు.

"వాది విప్రతిపత్తే స్తదసిద్ధిరితి చేత్" ౧. ౧౧౧.

వాది విప్రతిపత్తేః = వాదులలో విరోధముండుటవలన, తద సిద్ధిరితిచేత్ = ప్రకృతి సిద్ధింపదనినచో.

బౌద్ధులు, అద్వైతులు, చార్వాకులు మున్నగువారు జగత్కారణము, భిన్న భిన్నముగా నంగీకరింతురు. ఒకరు శూన్యమందురు. మఱియొకరు బ్రహ్మమందురు. ఇంక

కొందఱు పరమాణువు లందురు. కాబట్టి జగత్కారణము ప్రకృతి యని చెప్పుటెట్లు? అని శంకాభిప్రాయము.

వాదముకొఱకు తాత్కాలికముగ శంకాగత యభిప్రాయము సరియే యని యంగీకరించి సమాధానము చెప్పుచున్నాడు.

"తథాప్యేకతర దృష్ట్యాన్యతర సిద్ధేర్నాపలాపః" ౧.౧౧౨.

తథాపి = వాదులకు ప్రకృతి విషయమున విప్రతిపత్తి యున్నప్పటికిని, ఏకతర దృష్ట్యా = కార్య కారణములలో నొకటియైన కార్య దర్శనము వలన, అన్యతరసిద్ధేః = కారణవస్తువు సిద్ధించుచున్నందున, నాపలాపః = ప్రకృతిని కారణముగా నూహించుట యుచితమే.

"త్రివిధ విరోధా పత్తేశ్చ" ౧. ౧౧౩.

కారణభూతమైన ప్రకృతి నంగీకరింపని పక్షమున ముప్విధములైన విరోధములును కలుగును. విరోధము లెయ్యవియన :- ఒకటి శ్రుతి విరోధము. (అజామేకాం....) ఇత్యాది శ్రుతి వాక్యములు ప్రకృతిని బోధించుచున్నవి. రెండవది స్మృతి విరోధము. (ప్రకృతేః క్రియామాణాని-) ఇత్యాది గీతావాక్యములు ప్రకృతి బోధకములు. మూడవది న్యాయవిరోధము. 'కార్యమెట్టిదో కారణమునట్టిదై యుండును' అను న్యాయము ప్రకృతిబోధకమే. ఇట్లు శ్రుతి స్మృతిన్యాయములు ప్రకృతి నంగీకరించుచుండగా ప్రకృతిలేదనుట వానిని విరోధించి నట్లగునని సూత్రాభిప్రాయము.

సత్కార్యవాదము :-

ఉత్పత్తికి పూర్వమే కార్యమున్నదని యంగీకరించిన పక్షమున జగత్తునకు ఆధారముగా ప్రకృతి యంగీకరింప

నగును. కాని, కార్యోత్పత్తికి పూర్వ మది యున్నదనుట పొసగదు. కారణ వ్యాపారమువలన నదివరకు లేని (అసత్) కార్య ముత్పన్న మగునన :-

"నా సదుత్పాదో నృశృంగవత్" ౧. ౧౧౪.

నృశృంగవత్ = మనుజునకు కొమ్ములుండవు. అందువలననే కారణ వ్యాపారమువలన నవి జనింపవు. అట్లే, న అసదుత్పాదః = అదివరకు లేని (అసత్) కార్యము కారణ వ్యాపారమువలన కలుగనేరదని తాత్పర్యము.

ఎందువలన కలుగ దన :-

"ఉపాదాన నియమాత్" ౧. ౧౧౫.

కుండకు మట్టియుపాదానకారణము. జ్ఞానమునకు చేతన ముపాదానకారణము. ఇట్లొక కార్యమున కొక యుపాదాన కారణము నియమముగా నుండును. లేని (అసత్) కార్యము ఉత్పన్నమగు పక్షమున నీ కార్యమున కియ్యది యుపాదాన కారణమను నియమము సంభవింపదు. కాబట్టి కార్యోత్పత్తికి పూర్వమది యున్నది (సత్) అని యంగీకరింపక తప్పదని భావము.

"సర్వత్ర సర్వదా సర్వాసంభవాత్" ౧. ౧౧౬.

మఱియు, సర్వత్ర ప్రతి కారణమునందును, సర్వదా = యెల్లప్పుడు సర్వాసంభవాత్ = సర్వకార్యములు నుద్భవింపనందున, కార్యము ఉత్పత్తికి పూర్వము లేకున్న నది జనింపదు.

అసత్కార్యము నంగీకరింతుమేని యొకే కారణము నుండి కార్యములన్నియు నుద్భవింపవలసివచ్చును. మట్టిలో కుండ పూర్వ మట లేకయే నుత్పన్నమగునెడల, సువర్ణాదుల

వలన జనించెడి భూషణాదులును మట్టినుండియే జనింపవలసి వచ్చును. మట్టిలో కుండలేనట్లు భూషణాదులును లేవు గదా! కాబట్టి యేల జనింపవు ?

"శక్తస్య శక్యకరణాత్" ౧. ౧౧౭.

శక్తస్య = కారణము, శక్యకరణాత్ = కార్యమును జనింప జేయును; కాబట్టి అసత్ (లేని) కార్య ముత్పన్నము కానేరదు.

కారణములోనుండు కార్యముయొక్క యనాగతావస్థ యీ సూత్రమున శక్తి యని చెప్పబడినది. అట్టి శక్తి కాశ్రయము కారణము – శక్తము.

"కారణభావాచ్చ" ౧. ౧౧౮.

మఱియు, కార్యము కారణాత్మకమగుట వలనను కార్యోత్పత్తికి పూర్వ మది యున్నట్లే యెంచవలయును.

ఉపాదాన కారణమే కార్యరూపమును ధరించును. కాబట్టి కారణము కార్యము యొక్క పూర్వావస్థ యగు చున్నది. అందువలన లేని (అసత్) కార్యము కారణ వ్యాపారము వలన కలుగుననుట యయుక్తము.

"న భావే భావయోగశ్చేత్" ౧. ౧౧౯.

భావే = కారణవ్యాపారమునకు పూర్వమును కార్యము భావ రూపముననుండు పక్షమున, భావయోగశ్చేత్ = కారణవ్యాపారము వలన ఉత్పత్తిసంబంధము మాత్రము కార్యమున కేర్పడును. అట్టియెడ, కార్యోత్పత్తికి పూర్వమునను పరమునను కార్యమునందు భేదముండ నేరదు. అందువలన, న = 'కార్య ముత్పన్నమైనది', 'కార్యము లేదు' అను వ్యవహారములు పొసగవు.

ఉత్పత్తికి పూర్వమే కార్యముండు పక్షమున సత్కార్యాది నిత్యమనవలసి వచ్చును. నిత్యమగు భావ కార్యమునందు ఉత్పత్తి సంబంధ మేర్పడజాలదు. పూర్వము లేక యిప్పుడేర్ప డుటయే భావము – కార్యము – అనబడును. కాబట్టి సత్కా ర్యవాదము సరికాదన సమాధానము చెప్పు చున్నాడు :–

"నాఽభివ్యక్తి నిబంధనౌ వ్యవహారావ్యవహారౌ" ౧.౧౨౦.

వ్యవహారావ్యవహారౌ = 'కార్యముత్పన్నమైనది. కార్యముత్పన్నము కాలేదు,' అను వ్యవహారములు, అభివ్యక్తి నిబంధనౌ అభివ్యక్తి నిమిత్త ములు, న = ఉత్పత్తి నిమిత్తములు కావు.

సాంఖ్యులు కారణ వ్యాపారము వలన కార్య మభి వ్యక్తమగు నందురు. ఉత్పన్నమైనదని చెప్పరు. కాబట్టి 'కార్య ముత్పన్నమైనది. కాలేదు' అను వ్యవహారములు అభివ్యక్తిని. అనభివ్యక్తిని మాత్రమే తెలుపును. అందువలన దోషము లేదని భావము.

కార్యము యొక్క వర్తమానావస్థయే యిట అభి వ్యక్తి యనబడును. కాబట్టి కారణవ్యాపారమునకు పూర్వ మా కార్యము మరియొక యవస్థయందుండునని చెప్పిన దోష మావంతయు నుండదు.

అటులయిన కార్యము అనాది భావముగలది యగును గదా ? అది యెట్లు నశింపగలదన :–

"నాశః కారణలయః" ౧. ౧౨౧.

కారణలయః = కార్యము కారణమునం దవిభక్తమై యుండుటయే, నాశః = నాశ మనబడును.

సాంఖ్యుల మతమున కార్యనాశము కార్యధ్వంసము కాదు. కార్యమతీతావస్థను బొంది కారణమునందు విభజించుటకు వీలుగాని స్థితిలో కలిసియుండునని భావము.

కారణవ్యాపారమువలన కార్యము జనింపదు. కాని యభివ్యక్తమగునని గదా! సత్కార్యవాదులయిన సాంఖ్యుల మతము. అటులయినచో నా యభివ్యక్తికి పూర్వము మఱియొక యభివ్యక్తి నంగీకరింపవలసి యుండును. లేకున్న నది యసదభివ్యక్తి కాగలదు. సత్కార్యవాదమునకు భంగము వాటిల్లును. అంగీకరింతుమేని ఆ యభివ్యక్తికి పూర్వము మఱియొకటి, యంతకుపూర్వ మింకొకటి యని యనేక అభివ్యక్తుల నంగీకరింపవలసి వచ్చును. కాగా యనవస్థ యగునన :-

"పారంపర్యతో౽న్వేషణా బీజాంకురవత్" ౧. ౧౨౨.

పారంపర్యతః = పరంపరగా నొక దానికి పూర్వ మింకొకటి యని. అన్వేషణా = అభివ్యక్తిని వెదకుట, బీజాంకురవత్ = విత్తనము నుండి మొలక, మొలకనుండి విత్తనము, మరల విత్తనమునుండి మొలక యని యిట్లు బీజాంకురములలో నేది దేనికంటె ముందు ? అని వెదకినట్లగును.

అభివ్యక్తుల పరంపర నంగీకరించుట బీజాంకుర న్యాయమువంటి దగును - కాబట్టి యట్టి పరంపర నూహింపరాదని భావము.

"ఉత్పత్తివద్వా౽దోషః" ౧. ౧౨౩.

ఉత్పత్తివద్వా=కార్యోత్పత్తివలెనే. అదోషః = దోషము లేదు.

సూత్రము నందలి 'వా' మఱియొక సమాధానమును సూచించును.

అసత్కార్య వాదులు కార్యము కారణ వ్యాపారము వలన జనించును - ఉత్పన్నమగును; ఆ ఉత్పత్తికి పూర్వమది 'సత్'కాదు. అనికదా యంగీకరింతురు. ఆ కార్యోత్పత్తికి మఱియొక యుత్పత్తి; యందుల కింకొకటి యని యంగీకరించినచో అనవస్థ యేర్పడగలదను భయముతో కార్యోత్పత్తి యుత్పత్తి రూపమే యందురు. అట్లే సత్కార్య వాదులును కార్యాభివ్యక్తి అభివ్యక్తి రూపమే కాని, యాయభివ్యక్తి కింకొకయభివ్యక్తి యుండునని యంగీకరింపరు. అందువలన నుత్పత్తి వాదుల కనవస్థా దోషము లేనట్లు తమకును దోషము లేదని సత్కార్యవాదులందురని భావము.

సత్కార్యవాద మిట్లు దోషరహితము కాగా కార్య జాతము నంతటికి నాధారముగా మూలభూతమయిన ప్రకృతి యొకటి సిద్ధించును. కాని, కార్యము అభివ్యక్తికి పూర్వము సత్తే కాబట్టి యనగా కారణరూపమున నుండును కాబట్టి కార్యకారణములలో భేదము లేదనవలసివచ్చును. అందువలన కారణమేదో కార్యమేదో తెలిసికొన - వివేకింప - ననువగు నట్లు వానిలోగల సాధర్మ్య వైధర్మ్యములను తెలుపుచున్నాడు. ముందుగా మహత్తత్త్వము మొదలు పంచమహాభూతములవరకుగల వ్యక్తకార్యముల సాధర్మ్యమును వర్ణించుచున్నాడు :-

"హేతుమద నిత్యమవ్యాపి సక్రియ మనేక
మాశ్రితం లిఙ్గమ్" ౧. ౧౨౪.

లింగం = మహత్తత్వ ప్రభృతికార్యము, హేతుమత్ = కారణము కలిగియుండును, అనిత్యం=నాశస్వభావము కలదై యుండును. అధ్రువము,

అవ్యాపి = వ్యాపించు స్వభావములేనిది, సక్రియం = క్రియతో కూడి యుండును, అనేకం = అనేకము – నానా – ఆశ్రితం = ఆధారము గలదై యుండును.

ప్రతికార్యమునందును సూత్రార్థమున జెప్పిన హేతుమత్త్వాది ధర్మము లుండునని భావము.

మహత్తత్త్వాదులకంటె ప్రకృతి భిన్నము కానందున, మహత్తత్త్వాది కార్య జాతమునకుగల హేతుమత్త్వాది ధర్మములు ప్రకృతియందును నంగీకరింపవలసి వచ్చును. అది సంగతము కాదు–కాబట్టి హేతుమత్త్వాది సాధర్మ్య మెట్లంగీకరింప నగునన :–

"ఆంజస్యాదభేదతోవా గుణ సామాన్యా దేస్తత్సిద్ధిః
ప్రధానవ్యపదేశాద్వా" ౧. ౧౨౫.

ఆంజస్యాత్ = అన్వయవ్యతిరేక శాలియైన, గుణసామాన్యాదేరభేదతోవా =సుఖము దుఃఖము మున్నగు సాధారణ గుణముల యన్వయమనెడి లింగము వలనగానీ ప్రధానవ్యపదేశాద్వా = శాస్త్రమున ప్రధాన శబ్దముచే వ్యవహరింప బడుట వలనగానీ, తత్సిద్ధిః - కార్యాతిరిక్తమైన ప్రకృతి యొండుగలదని సిద్ధమగు చున్నది.

ప్రపంచమునందలి ప్రతి కార్యపదార్థమును సుఖ దుఃఖాది సామాన్యగుణములతో కూడియున్నది. కాబట్టి యీ కార్య పదార్థములన్నియు సుఖ దుఃఖాది సామాన్య గుణములతో యుక్తమైన పదార్థము కారణముగలవియై యుండవలయును. ఇదియును గాక, శాస్త్రమున ప్రధాన శబ్దము ప్రయోగింపబడియున్నది. కార్యపదార్థము లెందు లీన

మగునో యది ప్రధానమని ప్రధానశబ్దవ్యుత్పత్తి. (ప్రధీయతే లీయతే కార్యజాతమస్మిన్ ఇతి ప్రధానమ్) ఇట్లు ప్రకృతి సిద్ధించుననని భావము.

వ్యక్త కార్యములకుగల సాధర్మ్యమును జెప్పి, వ్యక్తములు అవ్యక్తములు నయిన కార్యకారణములకు గల సాధర్మ్యము నిందు వర్ణించుచున్నాడు.

"త్రిగుణ చేతనత్వాది ద్వయోః" ౧. ౧౨౬.

త్రిగుణ చేతనత్వాది = సత్వ రజస్తమము లనెడి మూడు గుణములు కారణముగా గలిగియుండుట, చేతనములు గాకుండుట, అవివేకిత, విషయత్వము, సమానత్వము, పరిణామిత్వము, మున్నగునవి, ద్వయోః=కార్యకారణములకు సాధర్మ్యములు. సూత్రమునందలి ఆది పదముచే అవివేకము, విషయత్వము మున్నగునవి గ్రహింపబడినట్లు గ్రహింపనగును.

సత్వ రజస్తమస్సు లనెడు మూడు గుణములందును గల పరస్పరసాధర్మ్య వైధర్మ్యము లేమనః—

"ప్రీత్యప్రీతి విషాదాద్యై ర్గుణానా
మన్యోఽన్యం వైధర్మ్యమ్" ౧. ౧౨౭.

ప్రీతిః = సుఖము, అప్రీతిః = దుఃఖము, విషాదః=మోహము ఆద్యైః = మున్నగు ధర్మములచే, గుణానామ్=సత్వాది గుణములలో, వైధర్మ్యమ్ = పరస్పర వైరుధ్య మున్నది.

ప్రసన్నత, లాఘవము, ప్రీతి, తితిక్ష, సంతోషము, ఆర్జవము, మృదుత, లజ్జ, శ్రద్ధ, క్షమ, దయ, జ్ఞానము, మున్నగునవి సత్త్వధర్మములు. దుఃఖము, ద్వేషము, ద్రోహము, మత్సరము, నింద, పరాభవము, మున్నగునవి రజోధర్మములు.

మోహము, భయము, వంచకత, నాస్తిక్యము, కౌటిల్యము, కృపణత, అజ్ఞానాదులు తమోధర్మములు.

త్రిగుణముల సాధర్మ్యము :-

"లఘ్వాది ధర్మైః సాధర్మ్యం వైధర్మ్యంచ గుణానామ్'' ౧.౧౨౮

గుణానామ్ = సత్త్వాది = గుణములలో, లఘ్వాది ధర్మైః = లఘుత్వాది ధర్మములచే, సాధర్మ్యం = సమాన ధర్మత, వైధర్మ్యంచ= విధర్మతయు నేర్పడుచున్నది.

పురుషార్థత, పరస్పర మొకదాని నొకటి యభిభవము చేయుట మున్నగునవి సమాన ధర్మములు. లఘుత్వము, చలత్వము మున్నగునవి విరుద్ధ ధర్మములు.

మహత్తత్త్వాహంకారాదులలో కార్యత్వ మెట్లు సిద్ధించునన :-

''ఉభయాన్యత్వాత్ కార్యత్వం మహదాదే ర్ఘటాదివత్'' ౧ ౧౨౯

మహదాదేః = మహత్తత్వాదులు. ఘటాదివత్ = ఘట పటములవలె, ఉభయాన్యత్వాత్ = ప్రకృతి పురుషులకంటె భిన్నములగుట వలన, కార్యత్వం = కార్యములు – జన్యములు

మహత్తత్వము మొదలు స్థూల భూతములవరకు గల పదార్థములన్నియు వినాశము నొందుచుండును; మఱియు భోగ్యములు; కాబట్టి యవి కార్యములు. అనగా పుట్టి నశించునవి యని భావము.

"పరిమాణాత్" ౧. ౧౩౦.

మఱియు మహత్తత్త్వాది పదార్థములన్నియు పరిమిత ములు. ఘటపటాదులవలె పరిచ్ఛిన్నములు – సీమితములు. కాబట్టి యవి కార్యములే.

"సమన్వయాత్" ౧. ౧3౧.

కారణగుణములు కార్యమునందు సమానరూపమున నన్వయించుట సమన్వయ మనబడును మహదాదులం దట్టి సమన్వయ మున్నందున నవి జన్యములే యని భావము.

ఉపవాసాదులవలన క్షీణించిన బుద్ధ్యాదులు అన్న గ్రహణమున మరల వృద్ధినొందును. వృద్ధినిబొందు వస్తువులు కార్యములే యని విజ్ఞానభిక్షువు.

"శక్తితశ్చేతి" ౧. ౧3౨.

శక్తితశ్చ =న్యూనాధిక్యములతో కూడిన శక్తి గలిగి యున్నందున బుద్ధ్యాదులు జన్యవస్తువులే. సూత్రములోని 'ఇతి' పదము మహత్తత్త్వాదులు కార్యవస్తువులే యని చెప్పుటకు వాడిన హేతువులు సమాప్తము లైనవని బోధించును.

భాష్యకారు లీ సూత్రమునందలి శక్తి శబ్దమునకు కరణము అని యర్థముచెప్పి, పురుషునకు బుద్ధి (మహత్తత్త్వము) మున్నగునవి కరణములుకాబట్టి యవి జన్యవస్తువులని వర్ణించి యున్నారు. చక్షురాదులు పురుషునకు కరణములు. అవి జన్యవస్తువులే. అట్లే బుద్ధ్యాదులు నని భావము.

మహత్తత్త్వాదులు కార్యములుగా నంగీకరింపకున్న దోష మేమన :–

"తద్ధానే ప్రకృతిః పురుషోవా" ౧. ౧33.

తద్ధానే = మహత్తత్త్వాదులు కార్యపదార్థములు కావనిన, నవి, ప్రకృతిః పురుషోవా = ప్రకృతియో పురుషుడో కావలసివచ్చును.

మహదాది పదార్థములన్నియు భోగయోగ్యములై

నశించునవి కాబట్టి యవి కార్యవస్తువులే. ప్రకృతి పురుషుడు నను రెండే కార్యములుకావు. అవి నిత్యములు.

ప్రకృతి పురుషులుకాక కార్యముకాని వస్తువొండు లేదా యన:-

"తయోరన్యత్వే తుచ్ఛత్వమ్" ౧. ౧౩౪

తయోః = ప్రకృతి పురుషులకంటె, అన్యత్వే = భిన్నమైకార్యము కాకుండునది, తుచ్ఛత్వమ్=కుందేటి కొమ్మువలె తుచ్ఛమే.

ప్రకృతి పురుషులకు మించి వేరొండు కార్యముకాని వస్తువు లేదని భావము.

ఇట్లు మహదాదులలో కార్యత్వమును సాధించి యటుపై వానికిగల కారణము నూహించుచు నందలి విశేషమును బోధించుచున్నాడు.

"కార్యాత్ కారణానుమానం తత్సాహిత్యాత్" ౧. ౧౩౫.

కార్యాత్ = మహదాదులవలన, కారణానుమానం = ప్రకృతి యూహింపబడును. తత్సాహిత్యాత్=కార్యము కారణమున నిమిడియుండుట వలన.

కార్యకారణములు భిన్నముగా నంగీకరింపనందున కారణమున కార్య మిమిడి యుండునని భావము.

కారణ ప్రకృతి యెట్టిదన:-

"అవ్యక్తం త్రిగుణా ల్లింగాత్" ౧. ౧౩౬

త్రిగుణాత్ = త్రిగుణాత్మకమైన, లింగాత్ = మహదాది వ్యక్త పదార్థములకంటె, కారణమగు ప్రకృతి, అవ్యక్తం = సూక్ష్మతరము

మహదాదులకంటె ప్రకృతి సూక్ష్మమని భావము.

ప్రకృతి వ్యక్తము కానియెడల నది యున్నదను టెట్లనః-

''తత్కార్యతస్తత్సిద్ధే ర్నాపలాపః'' ౧. ౧౩౭

తత్కార్యతః = ప్రకృతి కార్యములయిన మహత్తత్త్వాదులవలన, తత్సిద్ధేః = కారణమైనప్రకృతి సిద్ధించుచుండ, నాపలాపః = అదిలేదనుట తగదు.

జగద్రూపకార్యము లభించుచున్నది కాబట్టి దానికి కారణముగా ప్రకృతి యొకటి యంగీకరింప నను వగుచున్నది. కాని, పురుషు డెట్లు సాధింపనగుననః-

''సామాన్యేన వివాదాభావాద్ధర్మవత్ నసాధనమ్'' ౧. ౧౩౮.

సామాన్యేన = సామాన్యముగ, వివాదా భావాత్ = వివాదములేనందున, ధర్మవత్ = ధర్మమువలె, నసాధనమ్ = సాధింపవలసిన యవసరములేదు.

లోకమున నెల్లరు చేతన ము (పురుషుడు) న్నట్లే యంగీకరింతురు. ఈ విషయమున నెవ్వరును వివదింపరు కాబట్టి సాధింపవలసిన పనిలేదని భావము.

సామాన్యముగ చేతనమున్నట్లంగీకరించినను శరీరము మొదలు ప్రకృతి వరకుగల పదార్థములలో నా (చేతనము) పురుషు డెవడు ? అతడెట్టి స్వరూపముగలవాడు ? అని తెలియుట యవసరము. కాబట్టి, ముందుగా పురుషుడు శరీరము కంటె భిన్నుడని చెప్పుచున్నాడు.

"శరీరాది వ్యతిరిక్తః పుమాన్'' ౧. ౧౩౯.

పుమాన్ = పురుషుడు, శరీరాదివ్యతిరిక్తః = శరీరము మొదలు ప్రకృతివరకుగల పదార్థములకంటె భిన్నుడు.

కారణ మేమన :-

''సంహత పరార్థత్వాత్'' ౧. ౧౪౦.

శరీరాది ప్రకృత్యంత పదార్థములు సంహత మన బడును. దానిచే సాధింపబడు భోగము అపవర్గము నను రెండును పరార్థములు. శరీరాది పదార్థము లన్నియు నితరులకు భోగము కలిగింప నేర్పడును. కాబట్టి పురుషుడు శరీరము కాదని భావము.

''త్రిగుణాది విపర్యయాత్'' ౧. ౧౪౧.

ప్రకృతి మున్నగునవి త్రిగుణములు, అచేతనములు. వివేకము లేనివి. కాని, పురుషుడు త్రిగుణములు లేనివాడు. చేతనము, వివేకి, కాబట్టి శరీరాదులు పురుషుడు కావు.

''అధిష్ఠానాచ్చేతి'' ౧. ౧౪౨.

రథమునకు రథికు డధిష్ఠాతయైనట్లు, శరీరాదులకు పురుషు డధిష్ఠాత. శరీరాదులు జడములు. చేతనములు కావు. అందువలన నవి యధిష్ఠేయములే యగును, అధిష్ఠాత కాజాలవు.

''భోక్తృ భావాత్'' ౧. ౧౪౩.

భోక్త యగుటవలన పురుషుడు శరీరాదులకంటె భిన్నుడే. అట్లుకాక శరీరాదులలో నంతర్భూతుడగు పక్షమున నయ్యవి యచేతనము లగుటవలన భోక్తృత్వమే సిద్ధింపదని భావము.

''కైవల్యార్థం ప్రవృత్తేశ్చ'' ౧. ౧౪౪.

అధిష్ఠానాభావము - కైవల్యము - మోక్షము - అన

బడును. అందులకై ప్రవృత్తి కనబడుచున్నందున, పురుషుడు శరీరాదులకంటె భిన్నుడు.

పురుషుడు శరీరాదులకంటె భిన్నుడు కానిపక్షమున మోక్షమునకై ప్రవృత్తి కలుగనేరదు.

పురుషుని స్వరూపము :—

"జడప్రకాశా యోగాత్ ప్రకాశః" ౧. ౧౪౫.

జడప్రకాశాయోగాత్ = ప్రకృతికి సంబంధించిన ప్రకాశము ఆత్మ కాజాలనందున, పురుషుడు, ప్రకాశః = ప్రకాశ స్వరూపుడు — జ్ఞానస్వరూపుడు,

ఈ సూత్రమునందు జడప్రకాశము ఆత్మ కాదని చెప్పినందువలన బుద్ధిసత్వమాత్మ (పురుషుడు) అనుట తగదని భావము.

పురుషుడు ప్రకాశ స్వరూపుడగుచో నతనియందు జ్ఞానము ధర్మముగా నుండునా ? యన :—

"నిర్గుణత్వాన్న చిద్ధర్మా" ౧. ౧౪౬.

నిర్గుణత్వాత్ = గుణముల కాశ్రయము కానందున, పురుషుడు, నచిద్ధర్మా = జ్ఞానము ధర్మముగా గలవాడుకాదు.

'నా కుపలబ్ధి కలుగుచున్నది. నేను తెలిసికొనుచున్నాను.' అను నిట్టి ప్రతీతివలన జ్ఞానము పురుషుని ధర్మముగా తెలియుటలేదా ? యన :—

"శ్రుత్యా సిద్ధస్య నాపలాపః తత్ ప్రత్యక్షబాధాత్" ౧. ౧౪౭.

(అసంగోహ్యాయం పురుషః .... బృ. ౬. 3. ౧౫.)

'పురుషుడు సంగరహితుడు' అను నిట్టి శ్రుతులమూలమున

పురుషుడు నిర్గుణు డనుట సిద్ధము. కాబట్టి దానిని కాదన రాదు. 'నే నెరుగుచున్నాను' అను నిట్టిప్రతీతి 'నే నెట్టిని వాడను' అను ప్రతీతివలె శ్రుతిచే బాధింపబడుచున్నందున జ్ఞానము స్వరూపమే కాని పురుషునకు ధర్మముకాదని భావము.

శాస్త్రమున యుక్తికి ప్రాధాన్య ముండవలయును. అట్టి యెడ శ్రుతికి ప్రాధాన్యమిచ్చి పురుషునకు జ్ఞానము ధర్మము కాదను టెట్లు యుక్తమన:-

"సుషుప్త్యాద్యసాక్షిత్వమ్" ౧. ౧౪౮.

పురుషుడు ప్రకాశ స్వరూపుడు - జ్ఞానస్వరూపుడు - కాని పక్షమున, అనగా జ్ఞానమతనికి గుణమగునెడల, సుషుప్తి, స్వప్నము జాగృతి యనెడి యవస్థలకతడు సాక్షి కాజాలడు.

"జాగ్రత్ స్వప్నః సుషుప్తంచ గుణతో బుద్ధి వృత్తయః
తాసాం విలక్షణో జీవః సాక్షిత్వేన వ్యవస్థితః"

జాగ్రత్ స్వప్నాద్యవస్థలు బుద్ధి వృత్తులు. జీవుడు వానికంటె భిన్నుడై సాక్షి యనబడునని యితరగ్రంథము లందును వర్ణింపబడి యున్నది.

ఇంద్రియములద్వారా బుద్ధి విషయాకారమున పరిణమించుట జాగ్రదవస్థ యనబడును. సంస్కార మాత్రమువలన కలిగెడి బుద్ధియొక్క విషయాకార పరిణామము స్వప్నావస్థ. సుషుప్త్యవస్థ అర్ధలయము, సమగ్రలయమునని రెండువిధములు. అర్ధలయమున విషయాకారవృత్తి యుండదు. బుద్ధియందే సుఖాకార వృత్తియో, లేక దుఃఖాకారవృత్తియో, లేక మోహాకారవృత్తియో యుండును. అందువలననే నిద్రనుండి

లేచిన తదుపరి 'నేను సుఖముగ నిద్రించితిని.' 'నేను తెలియకుండ నిద్రించితిని' అను నిట్టి ప్రత్యయములు కలుగును. సమగ్రలయమునందు బుద్ధి వృత్తియే యుండదు.

ఈ యవస్థలలో గల బుద్ధివృత్తులకన్నిటికిని పురుషుడు సాక్షి. కాబట్టి జ్ఞానము పురుషునకు స్వరూపమే కాని యతనికది గుణము కాదని భావము.

పురుష స్వరూపానంతర మతని యందుగల బహుత్వము చెప్పుచున్నాడు.

"జన్మాదివ్యవస్థాతః పురుషబహుత్వమ్" ౧. ౧౪౯.

జన్మాదివ్యవస్థాతః = ఒకడు జన్మించినాడు, మరియొకడు మరణించినాడు, ఇంకొకడు బద్ధుడు; వేరొకడు ముక్తుడు నను నిట్టి వ్యవస్థ లోకమున నుండుటవలన, పురుషబహుత్వమ్ = పురుష లనేకులని యంగీకరింపవలయును.

పురుషు డొక్కడైనను నుపాధి భేదమువలన జన్మమరణాది వ్యవస్థ యేర్పడగలదు గదా? యన :-

"ఉపాధిభేదేఽప్యేకస్య నానాయోగ ఆకాశస్యేవ ఘటాదిభిః" ౧. ౧౫౦.

ఆకాశస్యేవఘటాదిభిః = ఘటాదులతో నాకాశమునకువలె, ఏకస్య = ఒకే పురుషునకు, నానాయోగః = నానాభూతములనెడి యుపాధులతో సంబంధము చెప్పవలయును. ఉపాధిభేదేఽపి = ఉపాధులు భిన్నములైనను ఉపధేయ మొక్కటియే కాబట్టి జన్మాది వ్యవస్థ యేర్పడనేరదని భావము,

చేతనుడగు పురుషు డొక్కడైనను, ఉపాధితో కూడినపు డతడు భిన్నుడయినందున వ్యవస్థ యేర్పడగలదన :-

"ఉపాధి ర్భిద్యతే నతు తద్వాన్" ౧. ౧౫౧.

ఉపాధి వైశిష్ట్యము వలన భేదమేర్పడి వ్యవస్థ యేర్పడ గల దందుమేని, ఉపాధియే భిన్నమగును కాని, ఉపాధికలిగిన పురుషుడు భిన్నుడెట్లు కాగలడు ? కాజాలడు; కాబట్టి పురుష బహుత్వ మంగీకరింపక జన్మాదివ్యవస్థ యేర్పడజాలదని భావము.

"ఏవ మేకత్వేన పరివర్తమానస్య నవిరుద్ధ ధర్మాధ్యాసః"
౧. ౧౫౨.

ఏవమ్ = జన్మాది వ్యవస్థ యేర్పడజాలనట్లు, ఏకత్వేన = సర్వోపాధులం దొకే రూపమున, పరివర్తమానస్య = అంతటను నుండు పురుషునందు, విరుద్ధ ధర్మాధ్యాసః = పరస్పరము విరుద్ధములయిన సుఖ దుఃఖాది ధర్మములలో 'నేను సుఖిని' 'నేను దుఃఖిని,' అను విరుద్ధ ధర్మ సంబంధము, న = కలుగనేరదు.

నానా భేదములుగల 'యుపాధులలో నొకే పురుషు డంగీకరింపబడినపుడు జన్మాది వ్యవస్థ లేర్పడనట్లు, ఒకేసమయ మున సుఖ దుఃఖాది విరుద్ధ ధర్మసంబంధము నతనికి కలుగ నేరదు. కాబట్టి పురుషబహుత్వ మంగీకరింపక తప్పదని భావము.

సుఖదుఃఖాదులు నుపాధి ధర్మములే కాబట్టి యవి యేక కాలమున నొకే పురుషునం దారోపింపబడును, దోష మేమి? యన :-

"అన్యధర్మత్వేఽపి నారోపాత్ తత్సిద్ధి రేకత్వాత్" ౧. ౧౫౩.

అన్యధర్మత్వేఽపి = సుఖదుఃఖాదు లుపాధుల ధర్మములైనను, ఆరోపాత్ = పురుషునం దారోపించినందు వలన, తత్సిద్ధిః = సుఖ దుఃఖాది వ్యవస్థ, న = సిద్ధింపదు, కారణమేమన, ఏకత్వాత్ = ఆరోప మున కధిష్ఠానమైన పురుష డొక్కడే యగుటవలన, సుఖ దుఃఖవ్యవస్థ కలుగనేరదని భావము.

ఇట్లు పురుషు లనేకులని యంగీకరించినచో అద్వైత బోధక శ్రుతులకు విరుద్ధమగునుకదా యన :-

"నాద్వైత శ్రుతివిరోధో జాతిపరత్వాత్" ౧. ౧౫౪.

జాతిపరత్వాత్ = చైతన్యసామ్యముచే పురుషజాతిని బోధించునవి కాబట్టి, అద్వైత శ్రుతివిరోధః న=అద్వైత శ్రుతవిరోధము వాటిల్లదు.

ప్రత్యక్షానుభవము ననుసరించి పురుష బహుత్వ మంగీకరించినట్లు, పురుషుడు నానారూపు డేల కాడన :-

"విదితబంధకారణస్య దృష్ట్యాఽతద్రూపమ్" ౧. ౧౫౫.

విదితబంధకారణస్య = బంధకారణ మవివేకమని తెలిసిన పురుషుని, దృష్ట్యా = దృష్టితో, అతద్రూపమ్ = ప్రత్యక్షముగా కనబడు భేదరూపము పురుషునిది కాదు.

బంధకారణమునెఱిగిన వివేకికి పురుషుని రూపము శ్రుతి బోధితమగు జ్ఞానరూప మొక్కటియే యని తెలియును. అందువలన అద్వైతశ్రుతులు జాతిపరములనుట దోషములేదని భావము.

పురుషుల స్వరూపమొక్కటే యగునెడల నట్లు కనబడ వలయును గదా ? కనబడనందున నది యట్లు కాదన :-

"నాంధదృష్ట్యా చక్షుష్మతా మనుపలంభః" ౧. ౧౫౬.

అంధదృష్ట్యా = వివేకదృష్టి లేనివారికట్లు కనబడకున్నను, చక్షుష్మ తాం = వివేకులకు, నఅనుపలంభః = ఉపలంభము కాకపోదు.

వివేకులకు పురుషుల స్వరూపమొక్కటేయని తెలియ గలదని భావము.

"వామదేవాదిర్ముక్తో నాద్వైతమ్" ౧. ౧౫౭.

వామదేవాదిః = వామదేవుడు, భరతుడు మున్నగువారు, ముక్తః= ముక్తులయిరి. కాబట్టి, అద్వైతమ్ న = ఆత్మయొక్కటి కాదు.

ఆత్మయొక్కటియే యగు పక్షమున వామదేవాదులు ముక్తులయిన పిమ్మట లోకమున బద్ధజీవు లుండరాదు. బద్ధజీవులు నేటికి నెందరో గలరు. కాబట్టి యద్వైత మంగీకరింప జనదు.

వామదేవాదులు ముక్తులు కాలేదనిన :-

"అనాదా వద్యయావ దభావాత్ భవిష్య దప్యేవమ్" ౧. ౧౫౮.

అనాదౌ = అనాదియగు నీ ప్రపంచమున, అద్యయావత్ = నేటివరకు, అభావాత్ = ముక్తికలుగనందున, భవిష్యదపి = భవిష్యత్ప్రపంచమునందును, ఏవమ్ = ఇట్లే ముక్తిగలుగదని యంగీకరింప వలసివచ్చును.

అనాదిగా ప్రవర్తించు నీ ప్రపంచమున నేటివరకును వామదేవాదు లెవరును ముక్తులే కాలేదని యందుమేని యికముందును నెరికిని ముక్తికలుగుట సంభవముకాదన వలసివచ్చునని సూత్రాభిప్రాయము.

అనేకాత్మల నంగీకరించినను క్రమముగా నొక్కరొక్కరు ముక్తులయి యెల్లరు ముక్తులయిననాడు ప్రపంచమే లేకపోవలసి వచ్చును గదా యన :-

"ఇదానీమివ సర్వత్ర నాత్యంతోచ్ఛేదః" ౧. ౧౫౯.

ఇదానీమివ = ఇప్పటివలెనే, సర్వత్ర = ఎల్లకాలములందును, నాత్యంతోచ్ఛేదః = ప్రపంచము బొత్తుగా నశింపదు.

వర్తమానకాలమున నెట్లు కొందఱు బద్ధులు కొందఱు ముక్తులు నుండుటచే ప్రపంచము వర్తించుచున్నదో యట్లే

భూత భవిష్యత్కాలములందు నుండును. ప్రపంచాత్యంత నాశమెన్నడు కలుగదని భావము.

ఈ సూత్రమునకు వ్యాఖ్యానము భాష్యకారుడు విజ్ఞాన భిక్షు విట్లు వ్రాసియున్నాడు.

"సర్వత్ర కాలే బంధస్యాత్యంతోచ్ఛేదః కస్యాపి పుంసో నాస్తి వర్తమానకాలవత్"

ఏ పురుషునకును నెన్నడును బంధము పూర్ణముగా తొలగనేరదు. వర్తమానస్థితిని బట్టి యట్లూహింపనగును. అనగా పురుషునకు బంధము సంపూర్ణముగా తొలగక కొంత కాలము తొలగి యటుపై మరల నా పురుషునకు బంధ మేర్పడుచుండునని భావమేమో !

ఈ ప్రసంగమున శ్రీమద్దయానంద స్వామివారు తమ ప్రసిద్ధ 'సత్యార్థప్రకాశము' నందు నిట్లే వర్ణించియున్నారు.

"జైసే ఇస్ సమయమే బంధముక్తజీవహైఁ వైసేహీ సర్వదా రహతేహైఁ. అత్యంతవిచ్ఛేద బంధముక్తికా కభీనహీఁ హూతా; కింతుబంధ్ ఔర్ ముక్తి సదా నహీఁ రహతీ" (నవమ సముల్లాసము)

"ఇప్పుడు బద్ధజీవులు, ముక్తజీవులు నున్నట్లు ఎల్లప్పుడు నుందురు. బంధమున కత్యంత విచ్ఛేద మెన్నడును కాదు. అనగా సదాముక్తిగానీ, సదాబంధముగానీ జీవులకు కలుగదని భావము."

వర్తమానయుగమున దయానందమహర్షి యొక్కడే 'ముక్తి యాత్యంతికము కాదనియు, ముక్తజీవులు సర్గా

రంభమున మరల జన్మవంతు లగుదురనియు' స్పష్టపరచి యున్నాడు. ఈవిషయమును వివరముగా తెలిసికొన గోరువారు సత్యార్థప్రకాశమున నవమసముల్లాసము చదువుదురుగాత.

జీవుల ప్రయత్నానుగుణముగ నీ బంధ మోక్ష వ్యవస్థ నొనర్చుచు ప్రపంచమును నడుపు పదార్థ స్వరూప మేమన :-

"వ్యా వృత్త్యోభయరూపః" ౧. ౧౬౦.

ప్రకృతి, పురుషుడు నను నీ యుభయుల రూపముకంటె విలక్షణమైన రూపము కలిగియుండును.

ఈశ్వరుని రూపము ప్రకృతి పురుషుల రూపముకంటె విలక్షణమైనదని భావము.

(క్లేశకర్మ విపాకాశయైరపరామృష్టః పురుష విశేష ఈశ్వరః) క్లేశాదులతో సంసర్గములేని విశిష్ట పురుషు డీశ్వరు డని యోగులు.

ఈశ్వర స్వరూపము ప్రకృతి స్వరూప విలక్షణమైన కావచ్చును. కాని, జీవ (పురుష) విలక్షణమెట్లు కాగలదన :-

"సాక్షాత్సంబంధాత్ సాక్షిత్వమ్" ౧. ౧౬౧.

సాక్షాత్ సంబంధాత్ = స్వస్వామిభావాది లక్షణ సంబంధము వలన, నీశ్వరునకు, సాక్షిత్వం = విశ్వ సాక్షిత్వ మంగీకరింపవలయును.

జీవునకు జగత్ సాక్షిత్వములేదు, ఈశ్వరుడు జగత్సాక్షి. వేదమున నిట్లే వర్ణింపబడినది.

"ద్వాసుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం

పరిషస్వజాతే తయోరన్యః పిప్పలం స్వాద్వ
త్త్యనశ్నన్నన్యోఽభిచాకశీతి" ఋ. ౨. ౩. ౧౭. ౨౦.

రెండు పక్షులొకే వృక్షమునంటియున్నవి. అందొకటి దాని ఫలములను రుచిచూచును. రెండవది తినక సర్వత్ర ప్రకాశించుచుండును. ఇట వృక్షము ప్రకృతి; ఫలములరుచి నెఱుగు పక్షి జీవుడు; తినక చూచుచుండు వా డీశ్వరుడని వివేకము. ఈ మంత్రమున నీశ్వరుని జగత్ + సాక్షిత్వము సుస్పష్టము.

"నిత్య ముక్తత్వమ్" ౧. ౧౬౨.

మఱియు నీశ్వరుడు సదా ముక్తుడు. జీవులకు సదా ముక్తి యుండనేరదని పూర్వసూత్రములందు జెప్పియుంటిమి. ఇట్లు విశ్వ సాక్షిత్వము, నిత్య ముక్తత్వము నీశ్వరుని విలక్షణ రూపమని తెలియవలయును.

ఈశ్వరునకు నిత్యముక్తత్వ మెట్లంగీకరింపనగు నన :-

"ఔదాసీన్యం చేతి" ౧. ౧౬౩.

ఈశ్వరుడు జగత్తున కధిపతియయ్యు పక్షపాతము వహింపక యౌదాసీన్యము - మాధ్యస్థ్యము-ను వహించును. కాబట్టి నిత్యముక్తుడు.

అటులయిన నీశ్వరునకు జగత్కర్తృత్వ మెట్లు పొసగు నన :-

"ఉపరాగాత్కర్తృత్వం చిత్సాన్నిధ్యాత్
చిత్సాన్నిధ్యాత్" ౧. ౧౬౪.

ఉపరాగాత్ = ప్రకృతి సన్నిధానమువలన నీశ్వరునకు, కర్తృత్వమ్ = ప్రయోజక కర్తృత్వ మేర్పడుచున్నది. ప్రకృతికి,

చిత్సాన్నిధ్యాత్ = ఈశ్వర సాన్నిధ్యమువలన ముఖ్య కర్తృత్వ మేర్పడుచున్నది.

ఈశ్వరుడు ప్రకృతికి సమీపమున నుండుటచేత ప్రకృతియందు ప్రేరణ కలుగును. అనగా చేతన సామీప్యము వలన ప్రకృతి ప్రవర్తించును. సృష్టి కనుకూలించు క్రియ కలుగునని భావము. అందువలన కర్తృత్వము ప్రకృతియందే యుండును. కాని ఈశ్వరుడందులకు ప్రేరకుడు - ప్రయోజకుడు - కాబట్టి యతనియందు ప్రయోజక కర్తృత్వము - నిమిత్తత్వము - మాత్ర ముండును. ముఖ్యకర్తృత్వము - ఉపాదానకారణత్వము - ప్రకృతియందే యుండునని భావము.

ఈ సూత్రమున 'చిత్సాన్నిధ్యాత్' అని రెండు సారులు వాడబడినది. ఇందొకటి యధ్యాయ సమాప్తిని బోధించును.

నిఖిలశాస్త్రనిష్ణాత శ్రీమత్పండితముక్తిరామోపాధ్యాయశిష్య
గోపదేవ విరచితాంబా వ్యాఖ్యానమున
ప్రథమాధ్యాయము.

సాంఖ్య దర్శనము

ద్వితీయాధ్యాయము

ప్రథమాధ్యాయమునందు శాస్త్రవిషయము చెప్పబడినది. ఇందు ప్రకృతివలన నేర్పడు సృష్టిప్రక్రియ విస్తారముగ వర్ణింపబడును.

సృష్టి రచనలో ప్రకృతికి ప్రయోజనము లేనందున దానియందు ముఖ్యకర్తృత్వ మెట్లు పొసగు నన :-

"విముక్తమోక్షార్థం స్వార్థం వా ప్రధానస్య" ౨. ౧.

విముక్తమోక్షార్థం = వివేకముచే ముక్తుడైన పురుషుని మోక్షము కొఱకో, వా = లేక, స్వార్థం = తనకొఱకో, ప్రధానస్య = ప్రకృతియందు ముఖ్యకర్తృత్వ మంగీకరింపబడును.

పురుషునకు భోగాపవర్గములను కలిగించుటకు ప్రకృతి ప్రవర్తించును. అదియే దానికి ప్రయోజనము. కాబట్టి ప్రకృతియందు ముఖ్యకర్తృత్వము సిద్ధింపగలదని భావము.

వివేకము మూలమున ముక్తుడగు పురుషునికి మోక్షము కల్పించుటకు ప్రకృతివలన సృష్టి యేర్పడునేని యొకసారి సృష్టికలిగిన చాలదా ?

"విరక్తస్య తత్సిద్ధేః" ౨. ౨.

విరక్తస్య = వివేకమువలన నేర్పడిన పర వైరాగ్యము గలవానికే, తత్సిద్ధేః = మోక్షము సిద్ధించును. ఇతరులకు కలుగదు. కాబట్టి యొకమాటు సృష్టి కలిగిన చాలదు.

ఒక్క సృష్టియందే శ్రవణమువలన పరవైరాగ్యము కలుగునుగదా? పునఃసృష్టి యేల యన :-

"న శ్రవణమాత్రాత్ తత్సిద్ధి రనాది వాసనాయా బలవత్త్వాత్" ౨. 3.

అనాది వాసనాయాః = వైరాగ్యమును కలుగ నీయనట్టి యనాది సంసార వాసన, బలవత్త్వాత్ = ప్రబలముగా నుండును కాఁబట్టి, శ్రవణ మాత్రాత్ = బహుజన్మలలో చేసిన పుణ్యఫలముచే లభింపదగు సత్త్వ పురుషాన్యతా శ్రవణమాత్రమున, తత్సిద్ధిః=వైరాగ్యసిద్ధి, న=కలుగదు.

"బహుభృత్యవద్వా ప్రత్యేకమ్" ౨. ౪.

వా = లేక, ప్రత్యేకం బహుభృత్యవత్ = ప్రతి గృహస్థుడు ననేకులను పోషింప వలసియున్నట్లు ప్రకృతియు ననేక జీవులకు మోక్షము కల్పింపవలసి యున్నది. కాబట్టి యొక్కమాటు సృష్టికై ప్రవర్తించిన నిర్వాహము కాదని భావము.

('తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః) అను నిట్టి శ్రుతులందు పరమాత్మవలన సృష్టి యేర్పడినట్లు కనబడు చుండ ప్రకృతియే సృష్టించుచున్నదను టెట్లన :-

"ప్రకృతివాస్తవేచ పురుషస్యాధ్యాససిద్ధిః" ౨. ౫.

ప్రకృతివాస్తవే = వాస్తవమున ప్రకృతియే కర్తయైనప్పటికి, పురుషస్యచ = పరమేశ్వరునకు గూడ, అధ్యాససిద్ధిః = అధ్యాసము వలన సృష్టి కర్తృత్వము కలుగుచున్నది.

అధ్యాసమనగా ప్రకృత్యుపరాగము. ప్రకృతిలో నున్న కర్తృత్వమే ప్రకృతితో గూడిన పరమేశ్వరునందు వ్యవహరింపబడుచున్నదని భావము.

ప్రకృతి సృష్టికి ముఖ్యకర్త యను టెట్లన :-

"కార్యతస్తత్సిద్ధేః" ౨. ౬.

కార్యతః = మహదాది పంచభూతములవరకు గల కార్యపదార్థముల వలన, తత్సిద్ధేః = ప్రకృతి ముఖ్యకర్త యని సిద్ధించుచున్నది.

ప్రకృతి ముఖ్యకర్తయగునెడల దాని ప్రవృత్తి నివృత్తులకు నియామక మెయ్యది యన :-

"చేతనోద్దేశాన్నియమః కంటక మోక్షవత్" ౨. ౭.

చేతనోద్దేశాత్ = పరమేశ్వరుని యభిలాషవలన, నియమః=ప్రకృతి తనకొఱకో లేక పరులకొఱకో ప్రవర్తించును. మఱియు నివర్తించును, కంటకమోక్షవత్ = రాజు కోరికననుసరించి నిరపరాధులకు కంటకము (శూలము) నుండి మోక్షము, సాపరాధులకు శూలప్రయోగము జరుగునట్లు.

ఏ జగదీశ్వరుని యభిలాష మాత్రమున ప్రకృతిలో ప్రవృత్తి నివృత్తులు కలుగుచున్నవో యతడే కర్తయని యంగీకరింపక ప్రకృతి కర్త యననేల యన :-

"అన్యయోగేఽపి తత్సిద్ధిః నాంజస్యే నాయోదాహవత్" ౨. ౮.

అన్యయోగేఽపి = ప్రకృతి యోగమున్నందు వలననే, తత్సిద్ధిః = పరమేశ్వరునందు స్రష్టృత్వము సిద్ధించును. నాంజస్యేన = సాక్షాత్తుగా సిద్ధింపదు, అయోదాహవత్ = లోహమునందలి దాహకత్వమువలె.

అగ్ని సంయోగమువలన లోహమున దాహకశక్తి కలుగునట్లు ప్రకృతి సంయోగమున్నందుననే పరమేశ్వరుడు సృష్టికర్త యనిపించుకొనగలడని భావము.

సృష్టి యన నేమి ?

"రాగ విరాగ యోర్యోగః సృష్టిః" ౨. ౯.

రాగ విరాగయోః = ప్రకృతి పరమేశ్వరుల, యోగః=సంబంధము, సృష్టిః = సృష్టికి హేతువు. కాబట్టి యిదియే సృష్టి యని యర్థము.

రంజింపజేయునది కావున ప్రకృతి రాగ మనబడును. ఎల్లపుడు నుదాసీనుడై రాగరహితుడై యుండును కాబట్టి పరమేశ్వరుడు విరాగి. ప్రకృతి పరమేశ్వర సంబంధము సనాతనము. కాబట్టి సృష్టియు సనాతనమే.

సాంసారిక విషయములందు స్నేహము రాగ మనియు, అట్టి స్నేహము లేకుండుట విరాగ మనియు చెప్పుదురు. అందు రాగమువలన సృష్టియు, విరాగమువలన మోక్షమును కలుగునని భాష్యకారులు వ్రాసియున్నారు.

సృష్టిక్రమ మెట్టిదన :—

"మహదాది క్రమేణ పంచభూతానామ్" ౨. ౧౦.

మహదాదిక్రమేణ = ప్రకృతినుండి మహత్తత్త్వము, దానినుండి యహంకారము, అందుండి పంచతన్మాత్రములు, వానినుండి, పంచ భూతానామ్ = భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము నను వాని యొక్క సృష్టి క్రమముగా కలుగును.

ప్రకృతి సృష్టికంటె మహదాది సృష్టిలోగల విశేష మేమి ?

"ఆత్మార్థత్వాత్ సృష్టేర్నైషా మాత్మార్థ ఆరంభః" ౨. ౧౧.

సృష్టేః = మహదాది సృష్టి, ఆత్మార్థత్వాత్ = పురుషుని కొఱకగుటవలన, ఏషాం = మహదాదుల, ఆరంభః = సృష్టి, న ఆత్మార్థః = ప్రకృతి సృష్టివలె తనకొఱకు గాదు.

ప్రకృతివలన నేర్పడు సృష్టి స్వార్థము, పరార్థము నని రెండువిధములు. మహదాదులవలన కలిగెడి సృష్టి పరార్థమే కాని స్వార్థముకాదు. ఇదియే భేదము.

వ్యవహార సిద్ధములైన దిక్కు, కాలము నేల గణింప లేదు ? —

"దిక్కాలా వాకాశాదిభ్యః" ౨. ౧౨.

దిక్కాలౌ = పూర్వము, పశ్చిమము, ఉత్తరము, దక్షిణము దిక్కులు. దినము మాసము మున్నగునవి కాలము. ఇయ్యవి ఆకాశాదిభ్యః= ఆయా యుపాధులతో కూడిన ఆకాశమునందే యంతర్భూతములు.

దిక్కు, కాలము ఆకాశముకంటె భిన్నములు కానందున వేరుగ లెక్కింపలేదని భావము.

మహదాదుల లక్షణము, కార్యములు చెప్పుచున్నాడు.

"అధ్యవసాయో బుద్ధిః" ౨. ౧౩.

అధ్యవసాయః = 'ఇది యిట్లే' అను నిశ్చయాత్మక వ్యాపారము (క్రియ) బుద్ధిః = మహత్తత్త్వమునకు లక్షణము.

"తత్కార్యం ధర్మాది" ౨. ౧౪.

తత్కార్యం = అమహత్తత్త్వము యొక్క కార్యములు ధర్మాది =ధర్మము, జ్ఞానము, వైరాగ్యము మున్నగునవి.

"మహదుపరాగా ద్విపరీతమ్" ౨. ౧౫.

మహత్=అమహత్తత్త్వమే, ఉపరాగాత్=రజస్తమస్సులసంబంధము వలన, విపరీతమ్ = విపరీత కార్యములు గలది — అధర్మము, అజ్ఞానము, అవైరాగ్యము, అనైశ్వర్యము, మున్నగు కార్యములు గలది యగును.

అహంకార లక్షణము :—

"అభిమానో౽హంకారః" ౨. ౧౬.

అహం (నేను) అనెడి యభిమానము అహంకార మనబడును.

"ఏకాదశ పంచతన్మాత్రం తత్కార్యమ్" ౨. ౧౭.

పదునోకండింద్రియములు, ఐదు తన్మాత్రములు మొత్తము పదునారును అహంకారము వలన జనించును.

"సాత్త్విక మేకాదశకంప్రవర్తతే వైకృతా దహంకారాత్" ౨.౧౮

వైకృతాత్ అహంకారాత్ = సాత్త్వికాహంకారమువలన, సాత్త్వికం ఏకాదశకం = సాత్వికము లయిన పదకొండింద్రియములు ప్రవర్తతే = జనించును — మిగిలిన పంచతన్మాత్రములు తామసాహంకారమువలన జనించు నని భావము.

"కర్మేంద్రియ బుద్ధీంద్రియై రాంతర మేకాదశకమ్" ౨. ౧౯.

వాక్కు, పాణి, పాదములు, పాయువు, ఉపస్థము నను నైదు కర్మేంద్రియములు, నేత్రములు, శ్రోత్రములు, త్వక్కు, జిహ్వా, నాసిక యనెడి పంచజ్ఞానేంద్రియములు, అంతరింద్రియము మనస్సు కలిసి పదునోకం డింద్రియములు.

ఇంద్రుని (జీవుని) కర్మమునకు, జ్ఞానమునకు సాధన మగునది ఇంద్రియ మని వ్యుత్పత్తి. అహంకారమునుండి జనించి కరణమగునది ఇంద్రియ మని దాని లక్షణము. ఇంద్రియములు భూతములలోని గంధాది విశేషగుణములను గ్రహించును, కాబట్టి యవి భూతములనుండి జనించినవి యని యేల చెప్పరాదు ?

"అహంకారికత్వ శ్రుతే ర్నభౌతికాని" ౨. ౨౦.

అహంకారికత్వ శ్రుతేః = ఇంద్రియములు అహంకారజన్యములని శ్రుతి చెప్పుచున్నందున, నభౌతికాని — భౌతికములు కావు.

ఇంద్రియములు అహంకారజన్యములని చెప్పుశ్రుతి యొండును కానరాదు. అయినను ముండకోపనిషత్తునందు

"ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేంద్రియాణిచ ఖం వాయుర్జ్యోతిరాపః పృథివీ విశ్వస్యధారిణీ" ౨. ౧. ౩.

భూతములకంటె ముందుగా మనస్సు, ఇంద్రియములు పుట్టినట్లు వర్ణింపబడియున్నది. ఇట్టి శ్రుతుల యాధారమున నింద్రియములు ఆహంకారికము లని సూత్రకారుడు చెప్పి నట్లూహింపనగును.

(అగ్నిం వాగప్యేతి. వాతం ప్రాణః, చక్షురాదిత్యమ్ ....బృ. ౫. ౨.) 'వాక్కు అగ్నిలో లీనమగుచున్నది. చక్షువు ఆదిత్యునిలో లీనమగుచున్నది.' అను నిట్టి శ్రుతివాక్యముల వలన నింద్రియములు భూతములందు లీనము లగుచున్నట్లు తెలియుచున్నది. అందువలన నవి భౌతికములే యగును. కాని ఆహంకారికము లెట్లగును?

"దేవతాలయ శ్రుతి ర్నారంభకస్య" ౨. ౨౧.

దేవతాలయశ్రుతిః = 'అగ్నిం వాగప్యేతి' యను నిట్టి శ్రుతి ఇంద్రియములు దివ్యగుణములు గలిగిన భూతములందు లీనమగుటను తెలుపు శ్రుతియే కాని, నారంభకస్య = ఇంద్రియ కారణములను తెలుపునదికాదు.

'భూతలమున జలబిందువులు లయమగుచున్నవి.' అనిన జలమునకు భూతలము కారణమగునా? కాదు. అట్లే ఇంద్రియములు భూతములందు లీనము లగునని చెప్పినంత మాత్రమున నింద్రియములకు భూతములు కారణము లని చెప్పరాదు.

అటులయిన నింద్రియములు నిత్యములా? యన :—

"తదుత్పత్తి శ్రుతేర్వినాశ దర్శనాచ్చ" ౨. ౨౨.

(పూర్వ సూత్రమునుండి నకార మీ సూత్రమునకు తెచ్చుకొనవలయును.)

తదుత్పత్తిశ్రుతేః = ఇంద్రియము లుత్పన్నములయినట్లు శ్రుతి చెప్పుచున్నందునను, వినాశదర్శనాచ్చ = ఉత్పన్నములైనవి నశించునను న్యాయ ముండుట వలనను, న=ఇంద్రియములు నిత్యములు కావు.

అనిత్యములగు నెడల నింద్రియ గోలకములే యింద్రియములా?

"అతీంద్రియ మింద్రియం భ్రాంతానా మధిష్ఠానమ్" ౨. ౨౩.

ఇంద్రియం = ఇంద్రియము, అతీంద్రియమ్ = ఇంద్రియములకు గోచరము కాదు. భ్రాంతానామ్ = భ్రాంతులయిన వారికి, అధిష్ఠానమ్ = గోలకమే యింద్రియము.

ప్రత్యక్షముగా గనబడు నేత్ర తారకాదులు ఇంద్రియములు కావు. అవి ఇంద్రియముల కధిష్ఠానములు - ఇంద్రియముల కాధారములు. తెలియనివారు వానినే ఇంద్రియము లందురు.

గోలకము లింద్రియములు కానిపక్షమున ననేకేంద్రియముల నంగీకరింప నేల? ఒకే యింద్రియము శక్తిభేదముతో నా యా గోలకములందు పనిచేయుచున్నదని యందుమేని దోషమేమి?

"శక్తిభేదేఽపి భేదసిద్ధౌ నైకత్వమ్" ౨. ౨౪.

శక్తిభేదేఽపి = భిన్నశక్తుల నంగీకరించినపుడు, భేదసిద్ధౌ = ఇంద్రియములు భిన్నములని సిద్ధించును. కాబట్టి, నైకత్వమ్ = ఇంద్రియ మొక్కటి కాదు.

శక్తిభేదము నంగీకరించినపుడు శక్తికి ఆశ్రయము భిన్నమగును. కాబట్టి యేకత్వ ముండనేరదని భావము.

శక్తిభేదము ననుసరించి భేదమును కల్పించుట విరుద్ధము కాదా ?

"న కల్పనా విరోధః ప్రమాణదృష్టస్య" ౨. ౨౫.

ప్రమాణదృష్టస్య = ప్రమాణాముద్వారా తెలియబడిన భేదమునకు, కల్పనావిరోధః = కల్పనావిరోధము, న = కలుగదు.

ప్రత్యక్షాది ప్రమాణములద్వారా ఇంద్రియములు భిన్నములని తెలిసికొనబడినపుడు భేదకల్పన విరుద్ధము కాదని భావము.

"ఉభయాత్మకం మనః" ౨. ౨౬.

మనః = మనస్సు, ఉభయాత్మకం = జ్ఞాన కర్మేంద్రియాత్మకము.

ఒకే యహంకారమునుండి యింద్రియములు భూతములు నను భిన్నకార్యము లెట్లు కలిగినవి ? :-

"గుణపరిణామ భేదాన్నానాత్వ మవస్థావత్." ౨. ౨౭.

అవస్థావత్ = ఒకేదేహమున బాల్యయౌవనాద్యవస్థలవలె, గుణపరిణామభేదాత్ = సత్త్వ రజ స్తమోగుణముల పరిణామభేదము వలన, నానాత్వం = ఒకే యహంకారమునుండి నానాకార్యము లేర్పడినవి

ఇంద్రియముల యసాధారణవృత్తిని తెలుపుచున్నాడు.

"రూపాదిరసమలాంత ఉభయోః." ౨. ౨౮.

ఉభయోః = జ్ఞానేంద్రియములకు, కర్మేంద్రియములకు, రూపాదిరసమలాంతః = రూపము ఆదియందు కలవి, (రసమలము) పురీషము అంతమందు కలవి విషయము లని యెఱుగవలయును.

రూపము, రసము, గంధము, స్పర్శము, శబ్దము నను నివి చక్షురాది జ్ఞానేంద్రియములకు విషయములు. మాటలు,

తీసికొనుట, తిరుగుట, మలము, ఆనందము నను నివి వాగాది కర్మేంద్రియములకు విషయములు.

దర్శనము, శ్రవణము మున్నగునవి జ్ఞానేంద్రియముల వ్యాపారము. ఇట్లే వచించుట మున్నగునవి కర్మేంద్రియముల వ్యాపారము.

ఇంద్రియములు ప్రకాశకములు. కాబట్టి యవియే దర్శనాదులకు కర్త లేల కావు? :-

"ద్రష్టృత్వాదిరాత్మనః కరణత్వ మింద్రియాణామ్" ౨. ౨౯

ద్రష్టృత్వాదిః = ద్రష్టృత్వ వక్తృత్వాదులు, ఆత్మనః = పురుషునివే. ఇంద్రియాణామ్ = ఇంద్రియములు, కరణత్వం = కరణములు మాత్రమే.

చక్షురాదీంద్రియములు సాధనములే కాని దర్శనాదులకు కర్తలు కావు.

అంతఃకరణత్రయముయొక్క యసాధారణవృత్తి -

"త్రయాణాం స్వాలక్షణ్యమ్" ౨, ౩౦.

త్రయాణామ్ = బుద్ధి, అహంకారము, మనస్సు నను మూటికి, స్వాలక్షణ్యమ్ = స్వస్వలక్షణమే యసాధారణవృత్తి.

బుద్ధి లక్షణము అధ్యవసాయము (నిశ్చయాత్మకక్రియ) కాబట్టి యదియే దాని యసాధారణవృత్తి. అహంకారమున కభిమానము లక్షణము. కావున నదియే దానికి వృత్తి. మనస్సునకు సంకల్పము.

బాహ్యాభ్యంతరకరణముల సాధారణవృత్తి :-

"సామాన్యకరణవృత్తిః ప్రాణాద్యావాయవః పంచ' ౨. ౩౧.

ప్రాణాద్యాః = ప్రాణ మాదియందుగల, పంచవాయవః = పంచ వాయువులు. సామాన్యకరణవృత్తిః=కరణముల సాధారణవృత్తి.

ప్రాణము, అపానము, సమానము, ఉదానము, వ్యానము ననునవి పంచవాయువులు. ఇయ్యవి వాయువువలె సంచరణశీలము కలవి కాబట్టి వాయువు లనబడినవి. వాస్తవమున నివి యింద్రియవృత్తి యని భావము.

వ్యాసమహర్షి యోగభాష్యమునందొకచో ("ఉదాన.... ఉత్క్రాన్తిశ్చ." వి-పా 39) 'సమస్తేంద్రియవృత్తిః ప్రాణాదిలక్షణా జీవనం' ప్రాణాపానాది లక్షణముగల జీవనమనెడి యొక సామాన్యవృత్తి సమస్తేంద్రియములకు సంబంధించినది కలదని వర్ణించియున్నాడు. సమస్తేంద్రియము లనగా పదమూడింద్రియములని భావము. (జ్ఞానేంద్రియము లైదు; కర్మేంద్రియము లైదు; మనస్సు. అహంకారము బుద్ధి.)

ఇంద్రియముల వృత్తి బాహ్యము, అభ్యంతరము నని రెండు విధములు. రూపరసాదుల నెఱుగుట బాహ్యావృత్తి. రెండవదియగు అభ్యంతర వృత్తి జీవన మనబడును. ఇదియు నొక విధమగు ప్రయత్నమే. ఈ ప్రయత్నమువలన శరీరమునందలి వాయువులో భిన్నభిన్న క్రియలు కలుగును. అట్టి క్రియా సహాయముననే వమనాదులు కలుగుచున్నవి. ఈ జీవనమనెడి సర్వేంద్రియముల వృత్తియే శాస్త్రములందును, లోక వ్యవహారమునందును 'పంచప్రాణము' లని చెప్పబడుచున్నది. పంచప్రాణము లనగా శరీరములోని వాయువు మాత్రమని యెంచక యా వాయువునందు నానా విధములగు

క్రియలను కలిగించుటకు హేతువయిన ఇంద్రియముల ప్రయత్న విశేష మని గుర్తింపవలయును.

ఇంద్రియముల యసాధారణ వృత్తిలోగల క్రమమును, అక్రమమును చెప్పుచున్నాడు.

"క్రమశోఽక్రమశశ్చేంద్రియవృత్తిః" ౨. ౩౨.

ఇంద్రివృత్తిః = చక్షురాదీంద్రియముల వ్యాపారము, క్రమశోఽక్రమశశ్చ = ఒకప్పుడు క్రమముగాను, మఱియొకప్పుడు అక్రమముగాను జరుగుచుండును.

దర్శనము, సంకల్పము, నిశ్చయవ్యాపారము మున్నగు నింద్రియ వ్యాపారము లొకప్పు డొకదాని తరువాత మరియొకటి యని క్రమముగాను, అట్టి క్రమములేక యొకే క్షణమున ననేక వ్యాపారము లొకప్పుడును జరుగునని సూత్రాభిప్రాయము.

బుద్ధివృత్తు లెన్నివిధములు ? :-

"వృత్తయః పంచతయ్యః క్లిష్టా క్లిష్టాః" ౨. ౩౩

వృత్తయః = బుద్ధివృత్తులు, పంచతయ్యః = ఐదు విధములు. అవి మరల, క్లిష్టాక్లిష్టాః = క్లిష్టములు అక్లిష్టములు నని రెండు విధములు.

ప్రమాణము, విపర్యయము, వికల్పము, నిద్ర, స్మృతి యని వృత్తులైదు. వానిలో సాత్త్వికవృత్తులు అక్లిష్టములు- కష్టము కలిగింపనివి. రాజస తామసవృత్తులు క్లిష్టములు - క్లేశము కలిగించునవి.

వృత్తులు లేనపుడు పురుషు డెట్లుండును ? :-

"తన్నివృత్తా వుపశాంతోపరాగః స్వస్థః ౨. ౩౪.

తన్నివృత్తౌ = ఆ వృత్తులు లేనపుడు, ఉపశాంతోపరాగః = వృత్తిసంబంధము లేనివాడై, స్వస్థః = పురుషుడు తన స్వరూపమునందు తా నుండును.

అందుల కుదాహరణము :-

"కుసుమవచ్ఛమణిః" ౨. ౩౫.

స్వచ్ఛమయిన స్ఫటికమణి యెఱ్ఱని పుష్పసంబంధముచే నెఱ్ఱనగును. పుష్పసంబంధములేనపుడు మణిస్వచ్ఛముగా తన రూపమున తానుండును. అట్లే పురుషుడు వృత్తిసంబంధమున నస్వస్థుడగును. వానిసంబంధము లేనపుడు స్వస్థుడగునని భావము.

బుద్ధ్యాదులలో ప్రవృత్తి యేలకలుగుచున్నదన :-

పురుషార్థం కరణోద్భవోఽప్యదృష్టోల్లాసాత్" ౨. ౩౬

అదృష్టోల్లాసాత్ = అభివ్యక్తమగు నదృష్టకారణమున, కరణోద్భవః = కరణము (బుద్ధ్యాదు)ల ప్రవృత్తి, పురుషార్థం = పురుషుని కొఱకు కలుగుచున్నది.

ఇతరులకొఱకు స్వతః ప్రవృత్తి కలుగుటలో నిదర్శన మేమి ?

"ధేనువద్ వత్సాయ" ౨. ౩౭.

వత్సాయ = దూడకొఱకు, ధేనువత్ = తల్లియైన ఆవునందు స్వయముగా క్షీరప్రవృత్తి కలుగుచున్నది. అట్లే పురుష ప్రయోజనార్థమై బుద్ధ్యాదీంద్రియములందు స్వతః ప్రవృత్తి కలుగుచున్నదని భావము.

ఈ కరణము లెన్ని విధములు? :-

"కరణం త్రయోదశ విధ మవాంతర భేదాత్" ౨. ౩౮.

అవాంతరభేదాత్ = బాహ్యము, అభ్యంతరము నను భేదము వలన, కరణం = ఇంద్రియములు, త్రయోదశవిధమ్ = పదమూడు విధములు.

చక్షురాది పంచజ్ఞానేంద్రియములు, వాగాది పంచ కర్మేంద్రియములు కలిసి పది బాహ్యేంద్రియములు. మనస్సు, అహంకారము, బుద్ధి మూడు అంతరింద్రియములు. మొత్తము పదమూడింద్రియములు.

ఇంద్రియములలో కరణత్వ మెట్లు సిద్ధించును ? :—

"ఇంద్రియేషు సాధకతమత్వగుణయోగాత్ కుఠారవత్" ౨. ౩౯

ఇంద్రియేషు = చక్షురాదీంద్రియములలో, సాధకతమత్వగుణ యోగాత్ =జ్ఞాన క్రియను మిక్కిలిగ సాధించునట్టి గుణసంబంధముండుట వలన, కుఠారవత్ = ఛేదించుటలో నెక్కుడుగా నుపయోగించుటచే గొడ్డలికరణమైనట్లు ఇంద్రియములను కరణము లనబడును.

'వ్యాపార వదసాధారణకారణం కరణమ్' వ్యాపార యుక్తమైన యసాధారణ కారణము కరణమనబడును. కరణ, కారణ లక్షణాదులను తెలియగోరువారు నాచే రచియింపబడిన వైశేషిక, న్యాయదర్శనముల యంబా వ్యాఖ్యానమును చూతురుగాత.

బాహ్యాభ్యంతర కరణములలో ప్రధాన మెయ్యది యన :—

"ద్వయోః ప్రధానం మనో లోకవద్ భృత్యేషు" ౨. ౪౦

భృత్యేషు=సేవకుల విషయమున, లోకవత్ = లోకవ్యవహారము నందువలెనే, ద్వయోః = బాహ్యాభ్యంతరేంద్రియములలో, మనః = మనస్సు, ప్రధానమ్ = ప్రధానము.

బాహ్యములయిన దశేంద్రియములకు మనస్సు అధిపతి. భృత్యులకు స్వామివలె. అందువలన నయ్యది ప్రధానముగా నెంచబడును. మనస్సుకంటే అహంకారము, దానికంటె బుద్ధి ప్రధానమని వివేకము.

మనస్సు ప్రధాన మనుటలో హేతువేమి ?

"అవ్యభిచారాత్" ౨. ౪౧.

ఏ యింద్రియముతో జ్ఞానముకలిగినను మనస్సంబంధము లేక కలుగజాలదు. కాబట్టి మనస్సు ప్రధానమగుచున్నది.

"తథాఽశేషసంస్కారాధారత్వాత్" ౨. ౪౨.

అట్లే సమస్త సంస్కారములకు మనస్సాధారమగుట వలనను నయ్యది ప్రధానమగుచున్నది.

స్మృత్యాఽనుమానాచ్చ" ౨. ౪౩.

స్మృత్యా = స్మరణముద్వారా, అనుమానాచ్చ = సంస్కారముల కాశ్రయమని యనుమానించుటవలనను,

పూర్వము తనకు తెలిసినదానిని మనుజుడు ఆ పదార్థము తన యెదుట లేనపుడు స్మరించును. ఈ స్మరణము పూర్వానుభవజన్య సంస్కారములకు లింగము - బోధకము. అనగా స్మృతివలన సంస్కారము లున్నట్లు తెలియును. ఆ సంస్కారములకు మనస్సాధారము. కాబట్టి మనస్సు ప్రధానమని యెఱుగునది.

బుద్ధినే కరణముగా నంగీకరించిన చాలదా ? యన :-

"సంభవేన్న స్వతః" ౨. ౪౪.

చక్షురాదీంద్రియముల ద్వారా బుద్ధికరణము కాగలదు. స్వతః = స్వయముగా, నసంభవేత్ = స్వయముగా కరణము కాజాలదు.

కాబట్టి చక్షురాదులు కరణములుగా నంగీకరింపబడు చున్నవి.

''ఆపేక్షికో గుణ ప్రధానభావః క్రియావిశేషాత్'' ౨. ౪౫.

క్రియావిశేషాత్ = వ్యాపార విశేషమువలన, గుణ ప్రధాన భావః = ముఖ్యాముఖ్యభావము, ఆపేక్షికః = పరస్పరాపేక్షితమై యుండును.

ఆ యా యింద్రియముల వ్యాపారమునుబట్టి వానిలో నొక దానికంటె మఱియొకటి ముఖ్యముగా నెంచబడును. ఇట్లు చక్షురాదులకంటె మనస్సు, దానికంటె నహంకారము. అంతకంటె బుద్ధి ప్రధానమని భావము.

ఇయ్యవి పురుషార్థ మేల ప్రయత్నించు చున్నవన :-

''తత్కర్మార్జితత్వాత్ తదర్థ మభిచేష్టా లోకవత్'' ౨. ౪౬.

తత్కర్మార్జితత్వాత్ = పురుషకర్మ సంపాదితమగుట వలన. తదర్థం = పురుషుని కొఱకు, అభిచేష్టా = కరణములు ప్రవర్తించును, లోకవత్ = లోకమునందువలె.

ఒకడు ప్రయత్నపడి కుఠారాది సాధనములను సంపాదించును అయ్యది వానికొఱకు పనిచేయును. అట్లే పురుష కర్మార్జితము లగుటచే నింద్రియములు పురుషుని కొఱకై ప్రవర్తించు నని భావము

పురుషునికొఱకు కరణములన్నియు నా యా క్రియలను సమానముగా సంపాదించుచుండ బుద్ధికి ప్రాధాన్య మేల యన ? :-

"సమాన కర్మయోగే బుద్ధేః ప్రాధాన్యం
లోకవల్లోకవత్" ౨. ౪౭.

సమాన కర్మయోగే = బుద్ధిమున్నగు కరణములన్నియు పురుషుని కొఱకు సమానముగా క్రియలందు ప్రవర్తించినను, బుద్ధేః = బుద్ధికే, ప్రాధాన్యం = ప్రధానత, లోకవత్ = లోకమునందువలె నంగీకరింప బడును.

లోకమున రాజుకొఱకు భృత్యులు ప్రవర్తింతురు. సేనాపతి యాజ్ఞ ననువర్తింతురు. అందు సేనాపతికి ప్రాధాన్య ముండును. అట్లే కరణములలో బుద్ధికి ప్రాధాన్యమనిభావము.

సూత్రమున రెండవ 'లోకవత్' పదము అధ్యాయ సమాప్తిని సూచించును.

నిఖిలశాస్త్రనిష్ణాత శ్రీమత్పండితముక్తి రామోపాధ్యాయశిష్య
గోపదేవ విరచి తాంబా వ్యాఖ్యానమున
ద్వితీయాధ్యాయము.

సాంఖ్య దర్శనము

తృతీయాధ్యాయము

మహాభూతముల యుత్పత్తి :-

"అవిశేషాద్ విశేషారంభః" 3. ౧.

అవిశేషాత్ = విశేషములులేని పంచతన్మాత్రములనుండి, విశేషారంభః = విశేషములుగల పంచభూతము లేర్పడినవి.

శాంతము, ఘోరము, మూఢత యనెడి విశేషములు లేనివి పంచతన్మాత్రములు. ఇవియే సూక్ష్మభూతము లన బడును. వీనినుండి శాంత ఘోర మూఢము లయిన పంచ మహాభూతములు కలుగునని భావము.

"తస్మాచ్ఛరీరస్య" 3. ౨.

తస్మాత్ = ఆ పంచమహాభూతములనుండి, శరీరస్య = స్థూల శరీరము కలుగుచున్నది.

ఈ స్థూలశరీరము నశించునది కాబట్టి పురుషుడు భోగాపవర్గములకొఱకై యొక దేహామునుండి మరియొక దేహాము నెట్లు పొందుననన :-

"తద్బీజాత్ సంసృతిః" 3. 3.

తద్బీజాత్ = ఆ స్థూలశరీరమునకు కారణమైన లింగశరీరము వలన, సంసృతిః = ఒకదేహమునుండి మఱియొక దేహమునకు గతి గలుగును.

అహంకారముతో కూడిన బుద్ధి, పంచతన్మాత్రములు

ఏకాదశేంద్రియములు కలిసి లింగశరీరము లేక సూక్ష్మశరీర మనబడును. ఈ శరీరముతోనే పురుషుడొక శరీరమునుండి మఱియొక శరీరమునకు బోవుచుండును.

సూక్ష్మభూతముల వలన శరీర మెంతవరకు కలుగు చుండు నన :-

"ఆ వివేకాచ్చ ప్రవర్తన మవిశేషాణామ్" 3. ४.

ఆ వివేకాచ్చ = వివేకము కలుగనంతవరకే, అవిశేషాణామ్ = శాంతాది విశేషములు లేని సూక్ష్మభూతములు, ప్రవర్తనమ్ = స్థూల శరీరము కలిగించుటకై ప్రవర్తించుచుండును.

ప్రకృతి పురుషవివేకము కలిగిన తదుపరి సూక్ష్మ భూతము (తన్మాత్రము) ల నుండి స్థూలశరీర మేర్పడజాలదు. అందువలన పురుషున కపవర్గ మేర్పడు నని భావము.

ఇది యెట్లు తెలియు నన :-

"ఉపభోగా దితరస్య" 3. ౫.

ఇతరస్య = వివేకము కలుగని పురుషునకు, ఉపభోగాత్ = ప్రకృతి వలన నుపభోగము తప్పక కలుగుచుండుట వలన వివేక మేర్పడిన వాని కయ్యది యుండదని తెలియనగును.

పురుషు డొక శరీరమునుండి మఱియొక శరీరమునకు బోవుసమయమున సుఖ దుఃఖముల ననుభవించునా? యన :-

"సంప్రతి పరిముక్తో ద్వాభ్యామ్" 3. ౬.

సంప్రతి = సంసరణ సమయమున, పురుషుడు, ద్వాభ్యామ్ = సుఖ దుఃఖములనుండి, పరిముక్తః = ముక్తు డగును.

పురుషునకు సంసరణ సమయమున సుఖ దుఃఖము లుండవు. పురుషు డా సమయమున మూర్ఛితుడై యుండునని భావము.

స్థూల సూక్ష్మ శరీరములలో గల భేదము :—

"మాతా పితృజం స్థూలం ప్రాయశ ఇతరన్నతథా" 3. 7.

స్థూలం = స్థూలశరీరము, మాతా పితృజం = మాతాపితరుల శరీరమునుండి కలుగును. ఇతరత్ = సూక్ష్మశరీరము, న తథా = అట్లు మాతాపితరుల వలన కలుగదు.

సూత్రమునందు (ప్రాయశః) అను పదము కలదు. దాని కర్థము 'తఱచుగా' అని. కాబట్టి స్థూలశరీరము తఱచుగా మాతాపితరులనుండి కలుగునని తేలుచున్నది. దీనింబట్టి యొకప్పుడు అనగా సర్గారంభమున శరీరములు మాతా పితరుల వలన కలుగక అయోనిజము లగునని తెలియవలెను.

ఈ రెండు విధములగు దేహములందును భోగాయతన మెయ్యది యన?

"పూర్వోత్పత్తేః తత్కార్యత్వం భోగా దేకస్య నేతరస్య" 3. 8.

పూర్వోత్పత్తేః = ప్రథమమున నుత్పన్నమయిన, ఏకస్య = ప్రతి పురుషున కొక్కటియైన సూక్ష్మశరీరము వలన, భోగాత్ = సుఖదుఃఖాను భూతి కలుగుటచేత, తత్కార్యత్వం = భోగాయతనత్వము, సూక్ష్మశరీరము నకే, నేతరస్య = స్థూలశరీరమునకు లేదు.

మృతశరీరమునందు సుఖదుఃఖముల యనుభూతి కలుగదు. కాబట్టి స్థూలశరీరము సుఖదుఃఖముల కాయతనము కాదు. అందువలన సూక్ష్మశరీరమే సుఖదుఃఖానుభూతి కాయతనమని చెప్పదగునని భావము.

సూక్ష్మశరీర మన నేమి?

"సప్తదశైకం లింగమ్" 3. 9.

సప్తదశ = ఏకాదశేంద్రియములు, పంచతన్మాత్రములు, అహంకారముతో కూడిన బుద్ధి యొకటి మొత్తము పదునేడు, లింగమ్ = లింగ

శరీర మనబడును. ఏకం = అయ్యది ప్రతి పురుషున కొక్కటిచొప్పున నుండును.

లింగశరీర స్వరూపములో భేదము లేనందున నది యనేకమగు టెట్లన? :-

"వ్యక్తిభేదః కర్మవిశేషాత్" 3. ౧౦.

వ్యక్తిభేదః = లింగశరీరమున భేదము, కర్మవిశేషాత్ = జీవుల యదృష్ట విశేషమువలన కలుగును.

లింగశరీరము భోగాయతన మగునెడల లోకమున స్థూలశరీరము భోగాయతన మని యెట్లు వ్యవహరింపబడు చున్న దన :-

"తదధిష్ఠానాశ్రయే దేహే తద్వాదా త్తద్వాదః" 3. ౧౧.

తదధిష్ఠానాశ్రయే = కర్మ (అదృష్ట) మున కాధారమైన బుద్ధి తత్వమున కాశ్రయము సూక్ష్మశరీరము. కాబట్టి వానియందు, తద్వాదాత్ = భోగాయతన వ్యవహార మేర్పడినది అట్లే, దేహే = స్థూలదేహమునందు, తద్వాదః = భోగాయతన వ్యవహారము.

జీవుల యదృష్టము బుద్ధియందుండును. అట్టి బుద్ధి కాశ్రయము సూక్ష్మ (లింగ) శరీరము. అందువలన నయ్యది భోగాయతన మగుచున్నది. అట్లే యా సూక్ష్మశరీరమునకు ఆధారము స్థూలశరీరము. కాబట్టి స్థూలశరీరమే లోకమున భోగాయతన మని చెప్పబడు నని భావము.

అటులయిన బుద్ధివలననే పురుషునకు భోగముసిద్ధించు చున్నదనవలసివచ్చును. అట్టియెడ సూక్ష్మశరీర మెందులకు?

"నస్వాతంత్ర్యాత్ తదృతే, ఛాయావ చ్చిత్రవచ్చ." 3.౧౨.

తదృతే = లింగశరీరములేక, న స్వాతంత్ర్యాత్ =స్వతంత్రముగ బుద్ధిసత్వ ముండనేరదు. ఛాయావత్ చిత్రవచ్చ = ఛాయవలె, చిత్రము

వలె - ఆధారములేని ఛాయగానీ, చిత్రముగానీ యుండునట్లు లింగశరీరము లేనిది కేవల బుద్ధిసత్త్వము భోగముల ననుభవింపజేయ నేరదని భావము.

అటులయిన లింగశరీరముతోనే కార్యము సిద్ధించును గదా? స్థూలశరీర మేల యన :-

"మూర్తత్వేఽపి న సంఘాత యోగాత్ తరణివత్" ౩. ౧౩.

మూర్తత్వేఽపి = లింగశరీరము మూర్తము (క్రియకాశ్రయము) అయినప్పటికిని, తరణివత్ = సూర్యునివలె, న = స్వయముగా భోగము కలిగింపజాలదు, సంఘాతయోగాత్ = స్థూలశరీర యోగము వలననే కలిగించును.

సూర్యుని తాపము స్థూలశరీరముతోనే యనుభవింపనగును. లింగశరీరమున క్రియ యేర్పడు నవకాశమున్నప్పటికిని స్థూలశరీరము లేనిది భోగము ననుభవింప జేయనేరదు. కాబట్టి స్థూలశరీరమును అవసరమే యని భావము.

సూక్ష్మశరీర పరిణామ మేమి? యన :-

"అణుపరిమాణం తత్కృతిశ్రుతేః" ౩. ౧౪.

అణుపరిమాణం = లింగశరీరము మధ్యమపరిమాణము కలది. తత్కృతిశ్రుతేః = దానినుండి నిర్మాణము శ్రుతి చెప్పుచున్నందున.

(ఏ తస్మాత్ జాయతే ప్రాణో మనః సర్వేంద్రియాణిచ, ముం. ౨.౧. ౩.) 'సూక్ష్మశరీరము నుండి ప్రాణాదులు కలుగుచున్నవి.' అని శ్రుతి బోధించుచున్నది. కాబట్టి సూక్ష్మశరీర పరిమాణము మధ్యమ మని తేలుచున్నది. వ్యాపకము కాదని భావము.

మఱియొక హేతువు :-

"తదన్నమయత్వ శ్రుతేశ్చ" ౩. ౧౫.

(అన్నమయం హి సోమ్య మన ఆపోమయః ప్రాణ స్తేజో మయీవాగ్.... ఛా. ౬. ౫.) మనస్సు అన్నమయము. ప్రాణము జలమయము. వాక్కు తేజోమయము....,అని శ్రుతి చెప్పు చున్నందునను, లింగశరీరము మధ్యమ పరిమాణము కలది యనియే యంగీకరింప వలయునని భావము.

లింగశరీరము మధ్యమ పరిమాణమైన కానిమ్ము. అది యచేతనము. దానియందు సంసరణము (గతి) ఎట్లు కలుగుచున్న దన :-

"పురుషార్థం సంసృతి ర్లింగానాం సూపకారవత్" 3.౧౬.

సూపకారవత్ = యజమానుని నిమిత్తము పాకశాలయందు వంట వారిలో ప్రవృత్తికలుగునట్లు, లింగానాం = లింగశరీరము లందు, పురుషార్థం = పురుషునికొఱకు, సంసృతిః = గతికలుగును.

వంటచేయువారు యజమాని నిమిత్తము వంటచేయుదురు. అట్లే లింగశరీరమునందు పురుషునికొఱకు ప్రవృత్తి కలుగునని భావము.

స్థూల శరీర మెట్టిది? యన :-

''పాంచభౌతికో దేహః 3. ౧౭.

పాంచభౌతికః = పంచభూతముల పరిణామము, దేహః = స్థూలదేహ మనబడును.

''చాతుర్భౌతిక మిత్యేకే'' 3. ౧౮.

ఆకాశము తక్క మిగిలిన పృథివి, జలము, వాయువు, అగ్ని యను నాలుగు భూతముల పరిణామమే స్థూలశరీరమని కొందఱందురు.

"ఏకభౌతిక మిత్యపరే" 3. ౧౯.

ఇంక కొందఱు కేవలము పృథివియొక్క పరిణామ మనియే యందురు.

ప్రసంగ వశమున చైతన్యము శరీరమునకు చెందినది కాదని చెప్పుచున్నాడు.

"న సాంసిద్ధికం చైతన్యం ప్రత్యేకాదృష్టేః" 3. ౨౦.

ప్రత్యేకాదృష్టేః= పృథివ్యాదిభూతములలో వేరువేరుగ నొక్కొక్క దానియందు చైతన్యములేనందున, దేహమునకు, నసాంసిద్ధికంచైతన్యం = స్వాభావికమైన చైతన్యము లేదని తెలియచున్నది.

"ప్రపంచ మరణాద్యభావశ్చ" 3. ౨౧.

మఱియు దేహమునందు స్వాభావిక చైతన్య మంగీకరింతుమేని లోకమున మరణాదులు సంభవింపవు. దేహము సహజచైతన్యము కలదయినచో మరణముగానీ, సుషుప్తిగానీ సంభవింపదని భావము.

"మదశక్తివచ్చేత్ ప్రత్యేకపరిదృష్టే సాంహత్యే తదుద్భవః" 3. ౨౨.

మదశక్తివచ్చేత్ = ప్రత్యేకవస్తువునందు లేని మదబలము అనేక వస్తువులు కలిసినపు డేర్పడునట్లు ప్రత్యేకభూతమునందు చైతన్యము లేకున్నను కొన్ని భూతములు కలిసినపు డేర్పడునందుమేని, యదియును తగదు. కారణ మేమన, ప్రత్యేకపరిదృష్టే = ప్రతివస్తువునందు నేవి సూక్ష్మముగనుండునో యవియే, సాంహత్యే = అనేకము కలిసినపుడు, తదుద్భవః = స్పష్టముగ ప్రకటమగును.

ఇసుక రేణువులందు ప్రత్యేకముగ తైలముండదు. అందువలన నెంత యిసుక గానుగలోవేసి త్రిప్పినను తైలము తులమైనను రాదు. ఒక్కొక్క నువ్వు గింజలోను కొంచెముగ తైలముండును. అందువలన నెక్కుడు నువ్వులు గానుగలో

వేసి త్రిప్పినపుడు తైల మెక్కువ లభించును. కాబట్టి ప్రత్యే కమునందు సూక్ష్మముగనైన నుండని వస్తువు అనేకము పరస్పరము కలిసినంతమాత్రమున నుద్భవింపనేరదని తెలియు చున్నది. అట్లే ఒక్కొక్క భూతమునందులేని చైతన్య మనేక భూతములు కలిసిన నేర్పడుననుట యుక్తముకాదని భావము.

పురుషునకు ముక్తి యెట్లు కలుగు నన :-

"జ్ఞానాన్ముక్తిః" ౩. ౨౩.

జ్ఞానాత్ = ప్రకృతి పురుషుల వివేకజ్ఞానము వలన, ముక్తిః = శరీర సంబంధమువలన కలిగెడి త్రివిధదుఃఖములనుండి ముక్తి కలుగును.

బంధ మెట్లేర్పడునన :-

"బంధో విపర్యయాత్" ౩. ౨౪.

విపర్యయాత్ = ప్రకృతి పురుషుల యవివేకజ్ఞానమువలన, బంధః= శరీరసంబంధమువలన కలిగెడి దుఃఖములు కలుగును.

కర్మముకూడ ముక్తికి హేతువగుచుండ జ్ఞానమువలన ముక్తి కలుగు నను టెట్లు చెల్లు నన :-

"నియత కారణత్వాన్న సముచ్చయ వికల్పౌ" ౩. ౨౫.

నియతకారణత్వాత్ = జ్ఞానము ముక్తికి నియతకారణ మగుట వలన, న సముచ్చయ వికల్పౌ = ముక్తి కర్మయుక్త జ్ఞానముచే కలుగునని కానీ, ఒకప్పుడు జ్ఞానమువలనను, మఱియొకప్పుడు కర్మము వలనను కలుగునని కానీ చెప్పుట యుక్తముకాదు.

"స్వప్నజాగరాభ్యా మివమాయికామాయికాభ్యాం
నోభయోర్ముక్తిః పురుషస్య" ౩. ౨౬.

మఱియు, ఉభయోః = జ్ఞానము, కర్మము నను రెండిటివలన, ముక్తిః న=ముక్తి కలుగదు. ఒక్క జ్ఞానము వలననే కలుగునని భావము

మాయికామాయికాభ్యాం స్వప్నజాగరాభ్యామ్ = కల్పితములయిన కలలోని పదార్థములు, అకల్పితములయిన జాగరపదార్థములు నను నీ రెండు విధములయిన పదార్థముల వలన, పురుషస్య ఇవ = మనుజుని, ఆకలితీరదు, కేవలము జాగ్రదవస్థలో తెలియబడు యదార్థము (అకల్పితము) లయిన పదార్థములవలననే మనుజుని ఆకలి తీరునని యర్థము.

యథార్థములయిన వస్తువులను సేవించుటవలననే యాకలి తీరునట్లు కేవలము జ్ఞానమువలననే ముక్తి కలుగును. కర్మముతోఁగూడిన జ్ఞానము వలన నొకప్పుడును, మఱి యొకప్పుడు కేవల జ్ఞానమువలనను ముక్తి కలుగనేరదు. అందు వలననే వేదమునందును "తమేవ విదిత్వాఽతి మృత్యుమేతి నాన్యః పంథా విద్యతేఽయనాయ" 'పరమాత్ముని జ్ఞానము వలననే ముక్తి కలుగును. మరియొక మార్గములేదు' అని చెప్పబడినది.

"ఇతరస్యాపి నాత్యంతికమ్" 3. ౨౭.

ఇతరస్యాపి = నిత్యకర్మమువలె నైమిత్తిక కర్మముచేతను, నాత్యంతికమ్ = ముక్తి లభింపనేరదు.

"సంకల్పితేఽప్యేవమ్" 3. ౨౮.

సంకల్పిత కర్మము అనగా కామ్యకర్మము. దానితో కూడిన జ్ఞానమును ముక్తికి సాధనముకాదు.

ఇట్లు కర్మ సముచ్చితముకాక ముక్తికి సాధనమైన జ్ఞానమెట్లు కలుగు ననః—

"భావనోపచయాచ్ఛుద్ధస్య సర్వంప్రకృతివత్" 3. ౨౯.

భావనోపచయాత్ = ధ్యానాధిక్యమువలన, శుద్ధస్య = శుద్ధుడైన పురుషునకు, ప్రకృతివత్ = ప్రకృతివలె, సర్వం = సమస్త జ్ఞానమును కలుగును,

భావన యన ధ్యానము ధ్యానమెక్కుడుగా జేసి నందువలన ముక్తిసాధనమైన జ్ఞాన ముదయింపగలదని భావము.

ధ్యాన మన నేమి ?

''రాగోపహతి ర్ధ్యానమ్'' 3. ౩౦.

రాగోపహతిః = రాగము నశించుటయే, ధ్యానమ్=ధ్యానము.

చిత్తమును చలింపజేయు విషయానురాగ మీా సూత్రమున రాగ మనబడినది. ఆ రాగము యొక్క యుపహతి - నాశము - ధ్యాన మని భావము.

అది యెట్లు సిద్ధించు నన :-

''వృత్తి నిరోధాత్త త్సిద్ధిః'' 3. ౩౧

ప్రమాణము, విపర్యయము, వికల్పము, నిద్ర, స్మృతియనెడి వృత్తు లైదును విషయములం దనురాగము కల్గించును. అట్టి వృత్తులను నిరోధించుటవలన ధ్యానము సిద్ధింపగలదు.

వృత్తులను నిరోధించు టెట్లన :-

"ధారణాసన స్వకర్మణా తత్సిద్ధిః'' 3. ౩౨.

ధారణ, ఆసనము. స్వకర్మలు నను వానిచే వృత్తులు నిరోధింపబడును.

ధారణ లక్షణము :-

''నిరోధ శ్ఛర్ది విధారణాభ్యామ్'' 3. 33.

ఛర్దివిధారణాభ్యామ్ = రేచన విధారణములద్వారా, నిరోధః = ప్రాణ నిరోధము ధారణ యనబడును.

ఛర్ది యన రేచనము. అనగా శ్వాసకోశములనుండి వాయువును వెడలఁగ్రక్కుట. ఇట్లే శ్వాసకోశములను వెలుపలి వాయువుతో నింపుట పూరక మనబడును. ఇదియు నిట గ్రాహ్యము. రేచించిన తరువాత వెలుపలను, పూరించిన తదుపరి లోపలను వాయువును కొంతతడవు నిలుపుట నిరోధము - కుంభకము - అనబడును. ఇయ్యదియే యిట ధారణ యనబడినదని భావము.

ఆసన లక్షణము :-

"స్థిరసుఖ మాసనమ్" ౩. ౩౪.

స్థిరమై సుఖమునిచ్చు కూర్చుండు విధానము ఆసన మనబడును ఈ యాసనము లనేకములు హఠయోగాదు లందు వర్ణింపబడినవి

స్వకర్మ లక్షణము :-

"స్వకర్మ స్వాశ్రమవిహిత కర్మానుష్ఠానమ్'' ౩. ౩౫

బ్రహ్మచర్యాద్యాశ్రమములలో తన యాశ్రమమునకు విధించిన కర్మముల ననుష్ఠించుటయే స్వకర్మ మనబడును.

వృత్తి నిరోధమునకు మఱియొక యుపాయము :-

''వైరాగ్యా దభ్యాసాచ్చ" ౩. ౩౬.

ఐహికాముష్మిక విషయములందు తృష్ణనువిడుచుట వైరాగ్య మనబడును. చిత్తైకాగ్రతకై చేయు యత్నము అభ్యాస మనబడును. అభ్యాస వైరాగ్యములద్వారా వృత్తి నిరోధము కలుగును.

''విపర్యయభేదాః పంచ'' ౩. ౩౭.

వివేకజ్ఞానమునకు విపరీతమైనది విపర్యయ మనబడును. అది నైదువిధములు, అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము అభినివేశము. ఈ నైదును విపర్యయ భేదములని భావము.

"అశ క్తి రష్టా వింశతిధా" ౩. ౩౮.

అవిద్యాది విపర్యయములకు కారణమైన యశక్తి యిరువది యెనిమిది విధములు.

"తుష్టిర్నవధా" ౩. ౩౯.

తుష్టి తొమ్మిది విధములు.

"సిద్ధిరష్టధా" ౩. ౪౦.

సిద్ధి యెనిమిది విధములు.

ఈ తుష్టిసిద్ధుల విపర్యయము వలన బుద్ధియందు పదునేడు విధములయిన యశక్తి కలుగును. ఇంద్రియములు పదునొకండు. వాని వైకల్యము వలన పదునొకండు విధముల యశక్తి బుద్ధియందు కలుగును. ఇట్లు మొత్తము ఇరువది యెనిమిది విధములయిన బుద్ధియందలి యశక్తి విపర్యయ జ్ఞానము (అవివేకము) నకు కారణమని భావము.

"అవాంతరభేదాః పూర్వవత్" ౩. ౪౧.

పూర్వవత్ = అవిద్యాదులు విపర్యయ భేదము లయినట్లు, ఆయ విద్యాదులలో గల యవాంతర భేదములు అరువది రెండని యెఱుగునది.

అవ్యక్త ప్రకృతి, మహత్తత్త్వము, అహంకారము, పంచతన్మాత్రములు నను నీ యెనిమిది తత్త్వములును ఆత్మ కావు. వీనిని ఆత్మగా నెంచుట యవిద్య - తమస్సు - అన

బడును. ఇది యెనిమిది విధములు. అణిమాద్యష్టైశ్వర్యము లందును తాదాత్మ్య బుద్ధితో తాను అణ్వాది రూపుడైన ట్లభిమానించుట యస్మితామోహ మనబడును. ఇదియు నెనిమిది విధములు శబ్ద స్పర్శ రూప రస గంధము లనెడు విషయములు దివ్యములు, అదివ్యములు నను భేదముతో పది విధములు. అందలి రాగము మహామోహ మనబడును. అదియు పది విధములు. అస్మితకు విషయములైన యష్టైశ్వర్యములకును, రాగవిషయములయిన దివ్యాదివ్యము లగు దశవిధ శబ్దాది విషయములకును విఘాతకములైన వానియందు క్రోధ మేర్పడును. ఆ క్రోధమే ద్వేషము - తామిస్ర మనబడును. అది పదునెనిమిది విధములు. ఇట్లు అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము ననెడి విపర్యయము అవాంతర భేదములతో నరువది రెండు విధము లని భావము.

"ఏవ మితరస్యాః" 3. ౪౨.

ఏవమ్ = ఇట్లే, ఇతరస్యాః = అశక్తి యొక్క భేదము లిరువది యెనిమిది యని ఇంతకు పూర్వము (౩౮ సూత్రములో) చెప్పబడినవి.

"ఆధ్యాత్మికాది భేదాన్నవధా తుష్టిః" 3. ౪3.

తుష్టిః = తుష్టి, ఆధ్యాత్మికాదిభేదాన్నవధా = ఆధ్యాత్మికాదిభేదమున తొమ్మిది విధములు.

ప్రకృతి తుష్టి, ఉపాదాన తుష్టి, కాల తుష్టి, భాగ్య తుష్టియని యాధ్యాత్మిక తుష్టి నాలుగు విధములు. మఱియు, పారము, సూపారము, పారపారము, అనుత్తమాంభము, ఉత్తమాంభము నని బాహ్యతుష్టి యైదు విధములు. మొత్తము తొమ్మిది విధములు.

"వివేకము కలుగువరకును గల పరిణామమంతయు ప్రకృతిదే. ప్రకృతియే పరిణామము నొనర్చుచున్నది. నేను మాత్రము కూటస్థుడను" అని భావించుట వలన పురుషునకు కలిగెడి పరితోషము ప్రకృతి తుష్టి యనబడును దీనినే 'అంభస్సు' అందురు. అటుపై ప్రవజ్యను గ్రహించుట వలన నేర్పడెడి తుష్టి ఉపాదాన తుష్టి యగును. అదియే సలిల మన బడును. ప్రవ్రజ్య (సన్యాసము) లో చాలకాల ముండి యోగాభ్యాసము నొనరించుటచే నేర్పడెడి తృష్టి కాలతుష్టి యందురు. ఇదియే ఓఘు మనబడును. అటుపై ప్రసంఖ్యాన మను పేరుగల వివేకఖ్యాతి రూపముగు ధర్మమేఘ సమాధి కలిగినందున నేర్పడెడి తుష్టి భాగ్యతుష్టి యనబడును. దీనినే వృష్టి యందురు. ఈ నాలుగును ఆధ్యాత్మిక తుష్టులు. మిగిలిన యైదు తుష్టులు బాహ్య విషయములయిన శబ్దాదు లకు సంబంధించినవి. అయ్యవి శబ్దాదుల విషయమున సంపా దించుట, రక్షించుట, నశించుట, అనుభవించుట, హింసిం చుటలో గల దోషముల వలన నుపరతి కలిగినపుడు కలుగును.

అష్టవిధ సిద్ధులు :-

"ఊహాదిభిః" సిద్ధిః 3. ४४.

ఊహాది భేదములతో సిద్ధి యెనిమిది విధములు. ఈ సూత్రమునందలి ఆది పదముచే శబ్దము, అధ్యయనము, సుహృత్ప్రాప్తి, దానము, దుఃఖ విఘాతము గ్రహింపవలెను. ఇందు దుఃఖములు ముప్విధము లు కాబట్టి దుఃఖ విఘాతము

మూడు రకములని యెంచవలెను. ఇట్లు దుఃఖములకు సంబంధించిన సిద్ధులు మూడు ముఖ్యములు. మిగిలిన ఐదు సిద్ధులు అముఃఖ్యము లని వివేకము.

(౧) ఉపదేశాదుల నపేక్షింపకయే పూర్వజన్మము నకు సంబంధించిన యభ్యాస బలముతో కొండొక విషయము నూహించుట ఊహాసిద్ధి యగును.

(౨) ఇతరులు పఠించుటను వినినందుననో, లేక స్వయముగ శాస్త్రము నాకలనము చేసికొనుట వలననో కలుగు జ్ఞానము శబ్దసిద్ధి యనబడును.

(3) ఆచార్యుని సమీపమున శిష్య భావముతో శాస్త్రము నభ్యసించుటచే కలుగు జ్ఞానము అధ్యయన సిద్ధి యగును.

(౪) ఉపదేశించు బుద్ధితో స్వయముగ గృహమున కరుదెంచిన దయాలువు వలన జ్ఞానలాభము కలుగుట సుహృత్ప్రాప్తి యనబడును.

(౫) ధనాదుల నొసగి సంతోషపెట్టి సంపాదించిన జ్ఞానము దానసిద్ధి యగును. ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతిక దుఃఖములను పోనాడు సిద్ధులు దుఃఖ విఘాతకము లనబడును. అయ్యవి మూడు.

తపస్సు మున్నగు వానిచే సిద్ధులు కలుగవా యన:—

"నేతరా దితర హానేన వినా" 3. ౪౫.

ఇతరహానేనవినా = విపర్యయ జ్ఞాన నాశము కలుగదు కాబట్టి, ఇతరాత్ = తపస్సు మున్నగు వానిచే, న = సిద్ధి కలుగదు.

తపస్సు మున్నగువానిచే విపర్యయ జ్ఞానము నశింపదు. కాబట్టి వానివలన సిద్ధులు కలుగవు. ఊహాదులవలననే కలుగు నని భావము.

ఇట్లు బుద్ధికి సంబంధించిన ఆంతరిక సృష్టినిగురించి చెప్పి యిప్పుడు బాహ్యసృష్టిని వర్ణించుచున్నాడు.

"దైవాది ప్రభేదా." 3. ౪౬.

బాహ్యసృష్టి దైవాది భేదములు కలిగియుండును. దైవీసృష్టి. మానుషీసృష్టి. తిర్యక్సృష్టి యని బాహ్యసృష్టి ముమ్విధములు.

దైవీసృష్టి యెనిమిది విధములు, తిర్యక్సృష్టి యైదు విధములు, మానుషీసృష్టి యొక విధము నని భాష్యకారులు.

ఈ సృష్టి యెవరికొఱకు ? ఎంతవరకుండు నన :-

"అబ్రహ్మస్తంబపర్యంతం తత్కృతే సృష్టి రావివేకాత్. 3. ౪౭

అబ్రహ్మస్తంబపర్యంతం=బ్రహ్మమొదలు స్తంబము వరకు గల, సృష్టిః = సృష్టి, తత్కృతే = పురుషునికొఱకు, అదియు, ఆవివేకాత్ = వివేకజ్ఞానము కలుగునంతవరకే యుండును.

ఈ సూత్రమునందలి బ్రహ్మ శబ్దము చతుర్వేదముల నెఱిగిన బ్రాహ్మణుని తెలుపును. అట్లే స్తంబ శబ్దమునకు స్థావర మని యర్థము.

"ఊర్ధ్వం సత్వవిశాలా." 3. ౪౮.

సత్త్వవిశాలా = సత్త్వప్రధానమైన సృష్టి, ఊర్ధ్వం = ఊర్ధ్వ గతి కలిగియుండును.

సత్త్వగుణ మెక్కుడుగాను, రజస్తమస్సులు తక్కువ గాను ఉండు సృష్టి దైవీసృష్టి యనబడును.

ద్యుస్థానము (ఆకాశము)న జ్యోతిష్మంతములై ప్రకశించు పదార్థము లన్నియు నీ సృష్టియందు చేర్పవచ్చును.

"తమోవిశాలా మూలతః." ౩. ౪౯.

తమోవిశాలా = తమోగుణము బహుళముగా నుండు సృష్టి మూలతః = పశువులు మొదలు స్థావరాంత తిర్యక్కులుగా వెలువలెను.

"మధ్యే రజోవిశాలా." ౩. ౫౦.

మధ్యే = పై రెండువిధము లయిన సృష్టికి మధ్యగానుండు, రజోవిశాలా = రజోగుణ మెక్కుడుగానుండు సృష్టి మానవీయ మః యెలుగునది.

ప్రకృతి యెందుల కిట్టి విచిత్ర సృష్టి యొనరించు ననః-

"కర్మ వైచిత్ర్యాత్ ప్రధానచేష్టా గర్భదాసవత్." ౩. ౫౧

గర్భదాసవత్ = దాస్యవాసనలుగల వ్యక్తి పుట్టినప్పటినుండియు నితరుల దాస్యమునకై యత్నించునట్లు, కర్మ వైచిత్ర్యాత్ = పురుషుని యదృష్ట వైచిత్ర్యము వలన, ప్రధానచేష్టా = ప్రకృతి విచిత్ర సృష్టి కలిగింప యత్నించుచున్నది.

కర్మ వైచిత్ర్యము వలననే పురుషుడు ఊర్ధ్వాదిగతులు కలిగి కృతార్థుడు కాగలడు గదా ? మోక్ష మెందుల కన :-

"ఆ వృత్తి స్తత్రా ప్యుత్తరోత్తర యోనియోగాద్ధేయః" ౩. ౫౨

తత్రాపి = ఊర్ధ్వగతి కలిగినను, ఉత్తరోత్తరయోనియోగాత్ = శ్రేష్ఠ జన్మల సంబంధ ముండుట వలన, ఆ వృత్తిః = పునరావృత్తి తప్పదు. కాబట్టి హేయః = ముముక్షువులకు ఊర్ధ్వగతియు త్యజింప దగినదే.

"సమానం జరా మరణాదిజం దుఃఖమ్" ౩. ౫౩

మఱియు, ఊర్ధ్వాది గతులందును, అనగా శ్రేష్ఠజన్మ

సంపాదనమందును, జరామరణ శోక మోహాదులవలన కలిగెడి దుఃఖము సమానమే కాబట్టి ముముక్షువు లూర్ధ్వగతులను సైతము త్యజింతురు.

సృష్టికారణమైన ప్రకృతియందు లీనమైన కృతార్థత కలుగదా యన :—

"న కారణలయాత్ కృతకృత్యతా మగ్నవదుత్థానాత్." 3. ౫౪

మగ్నవదుత్థానాత్= జలమున మునిగిన వ్యక్తి మరల పైకితేలును. అట్లే కారణలయాత్ = ప్రకృతియందు లీనమైనను పురుషునకు, కృతకృత్యతా = కృతార్థత, న = కలుగదు.

వైరాగ్యము కలిగిన వ్యక్తి ప్రకృతినే ఆత్మగాభావించి యుపాసించినచో నందు లీను డగును. అంతమాత్రమున నతనికి ముక్తి లభింపదు. ముక్తికి వివేకఖ్యాతి యవసరము. వైరాగ్యము కలిగిన తదుపరి వివేకఖ్యాతి కలిగినగాని పురుషుడు ముక్తుడు కాజాలడని భావము.

సమస్త జగత్తునకు మూలకారణమైన ప్రకృతి తనయందు లీనమయిన వ్యక్తికి మరల నేల ఉత్థానము కలుగునట్లు చేయు నన :—

"అకార్యత్వేఽపి తద్యోగః పారవశ్యాత్" 3. ౫౫.

అకార్యత్వేఽపి = సర్వమునకు ప్రకృతి మూలకారణమైనను, పారవశ్యాత్ = పరవశమగుటవలన, తద్యోగః = పునరుత్థానయోగము పురుషునకు కలుగును.

ప్రకృతి యీశ్వరాధీనమై పరవశమగుట వలన నది తనయందు లీనమయిన పురుషునకు మరల ఉత్థానయోగము కలుగునట్లు ప్రవర్తించునని భావము.

ప్రకృతి పరవశవర్తిని యెట్లయిన దన :-

"స హి సర్వవిత్ సర్వకర్తా" ౩. ౫౬.

స హి=ఆ పరమేశ్వరుడు, సర్వవిత్ = సర్వజ్ఞుడు, సర్వకర్తా = సర్వ జగత్తునకు తండ్రి వంటివాడు.

ఈశ్వరుడు సర్వజ్ఞుడు, సర్వ కర్తయు కాబట్టి ప్రకృతి యతని వశమున నుండి ప్రవర్తించునని భావము.

అట్టి యీశ్వరు డెట్లు సిద్ధింపగల డన :-

"ఈదృశేశ్వరసిద్ధిః సిద్ధా." ౩. ౫౭.

సర్వజ్ఞాది గుణములు గల యీశ్వరుడు శ్రుతుల వలన సిద్ధించును.

"స విశ్వకృ ద్విశ్వవిదాత్మయోనిః
జ్ఞః కాలకాలో గుణీ సర్వవిద్యః।
ప్రధాన క్షేత్రజ్ఞపతి ర్గుణేశః
సంసార మోక్ష స్థితి బంధ హేతుః॥"

శ్వేతాశ్వ ౬. ౧౬.

'అతడు విశ్వకృత్తు, విశ్వవిదుడు, స్వయంభువు, కాలమునకు కాలుడు. గుణి, సర్వవిద్యలు కలవాడు. ప్రకృతికి, జీవులకు పతి. గుణముల కీశుడు. సంసారముయొక్క మోక్షస్థితి బంధములకు హేతువు.'

ప్రకృతిసృష్టి తనకొఱకు గాక పురుషుని కొఱ కెట్లగు ? నన :-

"ప్రధానసృష్టిః పరార్థం స్వతోఽప్య
భోక్తృత్వా దుష్ట్రకుంకుమ వహనవత్" ౩. ౫౮.

స్వతః అభో క్తృత్వాత్ = స్వయముగ భో క్తకానందున, ఉష్ట్రి కుంకుమవహనవత్ = ఒంటె యితరుల కొఱకు కుంకుమమును మోయు నట్లు, పరార్థం అపి = ఇతరులకొఱకే, ప్రధానసృష్టిః = ప్రకృతి సృష్టించుచున్నదని యర్థము.

అయినను చేతనములేని ప్రకృతి యీశ్వర వశమున నుండి యెట్లు పరులకొఱకు ప్రవర్తించుచున్న దన :-

''అచేతనత్వేఽపి క్షీరవచ్చేష్టితం ప్రధానస్య'' 3. ౫౯.

ప్రధానస్య అచేతనత్వేఽపి = ప్రకృతి చేతనము లేనిదైనప్పటికిని, క్షీరవత్ = క్షీరమువలె, చేష్టితం = పురుషుల కొఱకు జగత్తును సృష్టించును

పాలు చేతనరహితము లయ్యు దూడకొఱకు ప్రవర్తించునట్లు ప్రకృతి చేతనము లేనిదైనను పురుషుల కొఱకు జగత్తును రచించుచున్నదని భావము.

''కర్మవద్ దృష్టేర్వా కాలాదేః'' 3. ౬౦.

మఱియు, కాలాదేః కర్మవద్వా = వసంతాది ఋతువులు చేతన రహితము లయ్యు నొకదాని తరువాత మఱియొకటి ప్రవర్తించు చున్నట్లు, దృష్టేః = చూచు చున్నందున ప్రకృతి చైతన్యరహితమయ్యు పురుషునకై ప్రవర్తించు చున్నట్లు తెలిసికొనవలయునని భావము.

ప్రకృతిలో చైతన్యము లేనందున నయ్యది 'నాకిది కర్తవ్యము' అని యెఱుగజాలదు. కాబట్టి పురుషునికొఱకది యెట్లు ప్రవర్తించు నన :-

"స్వభావాచ్చేష్టిత మనభి సంధానాత్ భృత్యవత్'' 3. ౬౧.

భృత్యవత్ = సేవకునివలె, ప్రకృతి, స్వభావాచ్చేష్టితమ్ = సహజముగానే ప్రవర్తించును. అనభిసంధానాత్ = 'నాకిది కర్తవ్యము' అని యుద్దేశించి ప్రవర్తింపదు.

"కర్మాకృష్టే ర్వానాదితః" ౩. ౬౨.

సృష్టి యనాది. కర్మములు ననాదులు. వాని యాకర్షణము ననాది. కాబట్టి యనాది కర్మల యాకర్షణమున ప్రకృతి చేష్టించుచున్నదని భావము.

స్వభావముచేతనో లేక కర్మల యాకర్షణము చేతనో ప్రకృతి ప్రవర్తించునెడల యెల్లప్పుడును సృష్టి జరుగుచునే యుండవలయును. దానికి నివృత్తి యుండరాదుగదా? యన:—

"వివిక్తబోధాత్ సృష్టినివృత్తిః ప్రధానస్య సూదవత్ పాకే." ౩.౬౩.

వివిక్తబోధాత్ = పురుషునకు సత్వపురుషాన్యతాఖ్యాతి కలిగిన తదుపరి, ప్రధానస్య=ప్రకృతియొక్క, సృష్టినివృత్తిః = సృజించు క్రియ నివృత్తిచెందును. సూదవత్పాకే = పాకము సిద్ధించినమీదట, పాచకుని పాకక్రియ ముగియునట్లు.

పాకము సిద్ధించిన తదుపరి పాచకుడు తన వ్యాపారమును మానునట్లు, పురుషునకు వివేకఖ్యాతి కలిగినమీదట ప్రకృతి యతనికొఱకు ప్రవర్తింపదు; సృష్టి నొనరింపదని భావము.

ప్రకృతి యనునది యొక్కటియే కాబట్టి వివేకి పురుషునకై ప్రవర్తింపకున్నచో నవివేకికిని సృష్టి యుండనేరదు కదా? యన :—

"ఇతర ఇతరవత్ తద్దోషాత్." ౩. ౬౪.

తద్దోషాత్ = ప్రకృతిదోషము వలన, ఇతరః=వివేకము కలుగనివాడు, ఇతరవత్ = వివేకము లేనివానివలె నుండును. కాబట్టి యతనికొఱకు ప్రకృతి ప్రవర్తించుచుండునని భావము.

వివేకజ్ఞానము వలన సృష్టి నివృత్తి కలుగుచో నయ్యదియే మోక్షమగును కదా ? యన :—

"ద్వయోః రేకతరస్య వౌదాసీన్య మపవర్గః" 3. ౬౫.

వివేకజ్ఞానము వలన, ద్వయోః = ప్రకృతి పురుషులలో, ఏకతరస్య = ఒకడయిన పురుషుని, ఔదాసీన్యం = ఉదాసీనత = ఒంటరితనము = పరస్పర సంగభావము లేకుండుట, అపవర్గః = మోక్షము.

వివేకజ్ఞానము కలిగినమీదట ప్రకృతి పురుషులలో నొకరు ఉదాసీనతను వహించుటయే మోక్షమని భావము.

వివేకియైన పురుషుని కొఱకు ప్రకృతి ఉదాసీనత వహించినపుడు అవివేకి యెడల మాత్ర మా యౌదాసీన్య ముండదా ? యన :-

"అన్యసృష్ట్యుపరాగేఽపి న విరజ్యతే
ప్రబుద్ధ రజ్జుతత్త్వస్యే వోరగః 3. ౬౬.

ప్రబుద్ధరజ్జు తత్త్వస్య ఉరగ ఇవ = 'ఇది త్రాడేకాని సర్పము కాదు' అని తెలిసిన వానికి మాత్రము భయ కంపాదులు పోవును అట్లు తెలియనివానికి భ్రమవలన కలుగు భయాదు లట్లే యుండును. అదే విధముగ, అపి = వివేకి విషయమున నుదాసీనత వహించినను, అన్య సృష్ట్యుపరాగే = అవివేకి విషయమున సృష్టించుటలో, న విరజ్యతే = ప్రకృతి విరక్తిని జెందదు.

"కర్మ నిమిత్త యోగాచ్చ" 3. ౬౭.

మఱియు, ప్రకృతియందు కర్మ యనెడి నిమిత్త ముండుట చేతను అవివేకి విషయమున ప్రవర్తించుచునే యుండును.

ప్రత్యుపకారము నపేక్షింపని ప్రకృతి పురుషుల కుపకరించుటకు గల కారణ మేమన :-

నైరపేక్ష్యేఽపి ప్రకృత్యుపకారేఽవివేకో నిమిత్తమ్" 3. ౬౮.

నైరపేక్ష్యేఽపి = ప్రత్యుపకారాపేక్ష లేకున్నను, ప్రకృత్యుప కారే = పురుషులకు భోగాప వర్గము లనెడి యుపకారము కలిగించు టలో, నిమిత్తం = కారణము, అవివేకః = అవివేకమే.

ప్రవృత్తి స్వభావము గలిగినప్రకృతి వివేకము కలిగిన తదుపరి యేల ప్రవర్తింపదు ? అన :-

"నర్తకీ వత్ ప్రవృత్తస్యాపి నివృత్తి శ్చారితార్థ్యాత్" ౩. ౬౯

ప్రవృత్తస్యాఽపి = స్వభావముచే ప్రవృత్తి గలదైనను ప్రకృతి, నర్తకీవత్ = నర్తకివలె. చారితార్థ్యాత్ = చేయవలసిన పని పూర్తి యైనందున, నివృత్తిః = మరల ప్రవర్తింపదు.

సభాసదులను రంజింపజేయ బూనిన నర్తకి తన కార్యము పూర్తియైన తదుపరి నాట్యమును ముగించును. అట్లే ప్రకృతియు పురుషునకు వివేకము కలిగినమీదట ప్రవర్తింపదని భావము.

"దోషబోధేఽపి నోపసర్పణం ప్రధానస్య కులవధూవత్" ౩. ౭౦.

అపి=మఱియు, దోషబోధే=పరిణామము నొందుట, దుఃఖము కలిగించుట మున్నగునవి ప్రకృతి దోషములు. అట్టి దోషములు తెలిసిన మీదట, కులవధూవత్ = కులీనస్త్రీ వలె, ప్రధానస్య = ప్రకృతి, నోపసర్పణం = ప్రవర్తింపదు.

తన దోషముల నెరిగినందున లజ్జించు కులస్త్రీ భర్త సమీపమునకు జేరనట్లు ప్రకృతి దోషముల నెఱిగిన పురుషుని విషయమున నది ప్రవర్తింపదని భావము.

ప్రకృతియొక్క ప్రవృత్త్యప్రవృత్తుల వలన పురుషు నకు బంధమోక్షములు కలుగు పక్షమున పురుషుడు పరిణామి కాడా ? యన :-

"నైకాంతతో బంధ మోక్షౌ పురుష స్యావివేకాదృతే" ౩. ౭౧.

అవివేకాదృతే = అవివేకము లేక, ఏకాంతతః=యథార్థముగ, బంధమోక్షౌ = బంధమోక్షములు. న=లేవు.

పురుషునకు బంధమోక్షములు అతని యవివేకము వలన కలుగును కాని ప్రకృతియొక్క ప్రవృత్త్యప్రవృత్తుల వలన కాదని భావము.

యథార్థ బంధమోక్షములు పురుషునకు లేకున్న మరి యెవరి కవి గలవన :-

''ప్రకృతే రాంజస్యాత్ ససంగత్వా త్పశువత్'' ౩. ౭౨.

ప్రకృతే రాంజస్యాత్ = యథార్థబంధ మోక్షములు ప్రకృతికే, ససంగత్వాత్ = బంధమోక్షములకు కారణమైన ధర్మాధర్మములతో సంబంధము సంగ మనబడును. అట్టి సంగము ప్రకృతి కున్నందున దానికే బంధమోక్షములు. పశువత్=బంధించుట కనువగు త్రాటితో సంబంధము పశువున కున్నందున నది బంధింపబడును. అట్లే ప్రకృతియు నని భావము.

ప్రకృతియెన్ని గుణములచే తనకు బంధ మోక్షము లను కలిగించుకొను నన :-

''రూపైః సప్తభి రాత్మానం బధ్నాతి ప్రధానం
కోశ కారవత్ విమోచయ త్యేకరూపేణ'' ౩. ౭౩.

కోశకారవత్ = తన గూడును తాను నిర్మించి యందు బంధింప బడు గొంగడిపురుగువలె, ప్రధానం=ప్రకృతి, సప్తభిః రూపైః = ధర్మము, వైరాగ్యము, ఐశ్వర్యము, అధర్మము, అజ్ఞానము, అవైరాగ్యము, అనైశ్వర్యము నను సప్త గుణములద్వారా, ఆత్మానం = తనను, బధ్నాతి = బంధించుకొనును, ఏకరూపేణ = వివేకమనెడి యొక్క గుణముద్వారా, విమోచయతి=విడిపించుకొనును.

''నిమిత్తత్వ మవివేకస్యేతి నదృష్టహానిః'' ౩. ౭౪.

పురుష బంధమునకు, అవివేకస్య = అవివేకము, నిమిత్తత్వమ్ = నిమిత్త కారణమే, ఇతి=అందువలన, నదృష్టహానిః = లోకమున గుణ

ములు నిమిత్తములుగా చూచుట విరుద్ధము కాదు.

అవివేకమువలన బంధమేర్పడు నని చెప్పుటవలన నవివేకము ఉపాదాన కారణమని బోధపడును. అవివేకము గుణమగుటచే నయ్యది యుపాదానము కాదు. అందువలన లోక విరోధము కలుగవచ్చును. కాబట్టి యవివేకము బంధము నకు నిమిత్త కారణమని సూత్రకారుడు వివరించినాడు.

ఈ సూత్రము నందలి (ఇతి) పదము కొన్ని గ్రంథము లలో కానరాదు.

అవివేకమును తొలగించు వివేక మెట్లు సిద్ధించునన :-

తత్త్వాభ్యాసాత్ నేతి నేతీతి త్యాగాత్ వివేకసిద్ధిః'' 3. ౭౫.

నేతి నేతీతి త్యాగాత్ = (పంచ మహా భూతములు మొదలు ప్రకృతివరకు గల తత్త్వములలో నొక్కొక్క దానిని) ఇది యాత్మ కాదు, ఇది యాత్మ కాదు, అని విడిచిపెట్టుట వలనను, తత్త్వాభ్యాసాత్ = ఆత్మతత్త్వమును నిరంతరము దీర్ఘకాలము శ్రద్ధతో చింతనజేయుట వలనను, వివేకసిద్ధిః = సమస్త సంశయములు పోయి యాత్మ సాక్షాత్కారమనెడి వివేకము సిద్ధించును,

తత్త్వాభ్యాసము వలన వివేకము కలుగుచో నొకే జన్మ యందభ్యాసకుల కెల్లరకు మోక్షము సిద్ధించునా ? యన -

''అధికారిభేదా న్న నియమః 3. ౭౬.

అధికారిభేదాత్ = అభ్యాసకులలో గల ఉత్తమ మధ్యమాది భేదముల వలన, న నియమః=ఒకే జన్మయం దెల్లరు ముక్తులగుదురను నియమము సంభవింపదు

వివేకము కలిగినపుడు అవివేకము పోయి దానితో బాటు దుఃఖము లన్నియు నశించును. అట్టియెడ వివేకికి భోగము (సుఖ దుఃఖానుభూతి) కలుగునా ? యన :-

"బాధితానువృత్త్యా మధ్యవివేకతోఽప్యుపభోగః" 3. ౭౭.

మధ్య వివేకతః = మధ్య వివేకము వలన, బాధితాను వృత్త్యా = తొలగిన దుఃఖములు ప్రారబ్ధ బలమున మరల కలుగు చుండును. కాబట్టి, ఉపభోగోఽపి =ఉపభోగముకూడ సంభవించును.

మంద మధ్యమ ఉత్తమ భేదములతో వివేకము ముప్విధములు. అందు మధ్యవివేకము కలిగినవారికి దుఃఖోప భోగముండక పోదని భావము.

వివేకము కలిగిన తదుపరి యుపభోగముండు పక్షమున వివేక ప్రయోజన మేమన :—

"జీవన్ముక్తశ్చ" 3. ౭౮.

ప్రారబ్ధము నశింపకముందు వివేకము వలన తొలగింప బడిన దుఃఖములు మరలమరల కలుగుచుండినను వివేక ప్రభావము వలన జీవించియుండగానే ముక్తునివలెనుండుననిభావము.

దుఃఖాదుల ననుభవించు వ్యక్తులలో కొండొకడు జీవన్ముక్తు డనుడెట్లు పొసగు నన :—

"ఉపదేశ్యోపదేష్టృత్వాత్ తత్సిద్ధిః" 3. ౭౯.

ఉపదేశ్యోపదేష్టృభావము లోకమున జూచు చున్నాము. అందువలన జీవన్ముక్తు డుండుటలో నాశ్చర్యము లేదు. ఉత్తమ వివేకి ముక్తుడగును. మధ్యవివేకి యుపదేశింప నర్హుడగును. మందవివేకి యుపదేశమును గ్రహింప నర్హుడు. ఇట్లు మధ్యవివేకి జీవన్ముక్తు డనుటలో దోషముండదని భావము

"శ్రుతిశ్చ" 3. ౮౦.

("తస్యతావదేవచిరమ్...." ఛాం. ౬. ౧౪. ౨.) ఇట్టి శ్రుతి వాక్యములు జీవన్ముక్తు లుందురనుటకు ప్రమాణము.

"ఇతరథాఽంధ పరంపరా" 3 ౮౧.

జీవన్ముక్తులు లోకమున నుండని పక్షమున ఉపదేశమనునది లేక 'గురువు అంధుడు శిష్యుడు నంధుడే' అని యంధపరంపర యేర్పడు నని భావము.

వివేకము కలిగినమీదట ప్రకృతి యతనినుండి విరమించును గదా! అట్టియెడ జీవన్ముక్తు డెట్లుండగలడన :—

"చక్రభ్రమణ వద్ధృత శరీరః" 3. ౮౨.

కుమ్మరి దండముతో చక్రమును ద్రిప్పి దండమును తొలగించును. దండము తొలగించినను చక్రము తిరుగుచుండును. అట్లే వివేకము కలిగినమీదట ప్రకృతి నివర్తించినను ప్రారబ్ధ కర్మబలమున శరీరము కొంతకాలము నిలిచి యుండును. కాబట్టి జీవన్ముక్తి కలుగుటలో దోష మావంతయు లేదని భావము.

"సంస్కారలేశత స్తత్సిద్ధిః" 3 ౮౩.

శరీరధారణకు కారణములైన సంస్కారములు లేశములుగా నున్నంతవరకు శరీరధారణ యుండును. అంతవరకు జీవన్ముక్తు డనబడునని భావము.

"వివేకా న్నిఃశేష దుఃఖ నివృత్తౌ
కృతకృత్యో నేతరా న్నేతరాత్" 3. ౮౪.

ఉత్తమ వివేకమువలన సమస్త దుఃఖములు తొలగగా కృతకృత్యుడు – ముక్తు డగును. ఇతరము లయిన కర్మాదుల వలన ముక్తుడు కాడని భావము.

నిఖిలశాస్త్రనిష్ణాత శ్రీమత్పండితముక్తి రామోపాధ్యాయశిష్య
గోపదేవ విరచితాంబావ్యాఖ్యానము తృతీయాధ్యాయము.

—o—

సాంఖ్య దర్శనము

చతుర్థాధ్యాయము

దుఃఖములు నిః శేషముగా తొలగించు వివేక మెట్లు కలుగు నన :-

"రాజపుత్రవత్ తత్త్వోపదేశాత్" ౪. ౧.

తత్త్వోపదేశాత్ = ఆత్మ తత్త్వము నుపదేశించుట వలన, రాజ పుత్రవత్ = రాజపుత్రునకు వలె, వివేకము కలుగును.

ఒకానొక రాజపుత్రుడు పరులచే పెంచబడి తాను రాజకుమారుడని యెఱుగజాలకుండును. కాలాంతరమున నతని బంధువులు 'నీవు రాజ కుమారుడవు' అని చెప్పగా తన్నుదాను తెలిసికొని నాటినుండియు రాజపుత్రుడుగా వర్తింపగలుగును. అట్లే యవివేకము వలన ప్రకృతి కార్యములు తనవిగా భావించువానికి ఆత్మ తత్త్వమును గురు వుపదేశించినపుడు వివేకము కలుగ గలదని భావము.

గురు వెవరి కుపదేశించునో వానికే వివేకము కలుగునా ? సమీపమున నుండి వినువారికిని కలుగునా ? యన :-

"పిశాచవత్ అన్యార్థోపదేశేఽపి" ౪. ౨.

అన్యార్థోపదేశేఽపి = గురువు శిష్యుని కొఱకై యుపదేశించినను సమీపమున నుండి వినువారికిని వివేకము కలుగవచ్చును. పార్వతికి శివుడు తత్త్వోపదేశము చేయుచుండగా సమీపముననుండి వినిన పిశాచమునకును వివేకము కలిగినట్లు పౌరాణికగాథ నిందుల కుదా

హారణముగ నుల్లేఖించినాడు. (శివ పార్వతులకు పిశాచము భృత్యుడు కనోపు)

ఒకసారి తత్త్వోపదేశము చేసినందున వివేకము కలుగు నపు డేమి చేయవలయును ?

"ఆవృత్తి రసకృ దుపదేశాత్" ౪. 3.

అసకృదుపదేశాత్= పలుమారు లుపదేశించుట వలన, ఆవృత్తిః= ఆవృత్తి చేయవలయును.

ఒకసారి యుపదేశించిన వివేకము కలుగనపుడు పలుమారు లుపదేశింపవలయును. పుత్రుడైన శ్వేతకేతువునకు ఆరుణిపలుమారులు తత్త్వోపదేశము చేసినట్లు ఛాందోగ్యోప నిషత్తులో చూడగలము.

తండ్రి పుత్రున కనేక పర్యాయము లుపదేశింప వచ్చును; కాని, గురువు శిష్యునకు పలుమారు లెట్లుపదేశింప గలడు ?

"పితాపుత్రవ దుభయోర్ దృష్టత్వాత్" ౪. ౪.

దృష్టత్వాత్ = లోకమునందు జూచుచున్నాము; కావున ఉభయోః = గురు శిష్యులకు, పితాపుత్రవత్ = తండ్రి కొడుకులకువలె ఉపదేశము పలుమారులు కలుగుట సంభవమే.

తండ్రి కొడుకున కనేక పర్యాయము లుపదేశించు నట్లు గురువు శిష్యునకు పలుమారు లుపదేశించుట లోకమున జూచుచునే యున్నాము. ఇందు సంభవముకాని దేమియు లేదని భావము.

వివేకము కలిగినమీదట దానిని స్థిరపరచు కొనుట కేమి చేయవలయును ?

"శ్యేనవత్ సుఖదుఃఖీ త్యాగవియోగాభ్యామ్" ౪. ౫.

శ్యేనవత్ = డేగవలె, త్యాగవియోగాభ్యామ్ = త్యాగవియోగము లచే, సుఖదుఃఖీ = సుఖియు, దుఃఖియు నగును.

విషయములను (శబ్దాదులను) త్యజించుట వలన పురుషుని వివేకము స్థిరమగును. అతడు సుఖి యగును. డేగ స్వాయముగ మాంసమును విడిచినచో సుఖపడును. పరులు దాని నోటినుండి మాంసమును విడిపింపజేసిన నయ్యది బాధ పడును. అట్లే పురుషుడును స్వాయముగ శబ్ద స్పర్శాది విషయములను పరిత్యజించి సుఖి యగును. ఇతరు లతనికి విషయముల నందకుండ జేసిన దుఃఖి యగును. కాబట్టి త్యాగము వివేకమును స్థిరపరచునని భావము.

స్వాయముగ విషయములను త్యజించు టెట్లు?

"అహినిర్ల్వయనీవత్" ౪. ౬

పాము కుబుసమును విడుచునట్లు వివేకియైన పురుషుడు విషయ భోగములను విడిచి సుఖించును.

"ఛిన్నహస్తవద్ వా" ౪. ౭.

ఒకానొకడు హస్తమున వ్రణము లేర్పడినపుడు తన హస్తమే తనకు బాధకరమని తెలిసికొని దానిని ఖండింప జేసికొనును. అపుడా బాధనుండి విముక్తినొంది సుఖించును. అట్లే వివేకి విషయములను స్వాయముగ త్యజించునని భావము.

విషయములను పరిత్యజించి వానిని మనస్సుతో ధ్యానించుట వలన నేమి దోషము?

"అసాధనాను చింతనం బంధాయ భరతవత్" ౪.౮.

భరతవత్=భరతు డొక రాజర్షి, అత డొక లేడి పిల్లను పెంచెను. అది యతనికి బంధహేతువైనది. అట్లే, అసాధనాను చింతనం = వివేకమునకు సాధనములుకాని విషయములను ధ్యానించు చుండుట, బంధాయ= బంధనమునకు కారణ మగును.

విషయ చింతనము చేయకున్నను, అనేకుల సాంగత్యము వలన దోష మేమైన కలదా ?

''బహుభిర్యోగే విరోధో రాగాదిభిః కుమారీశంఖవత్'' ౪. ౯.

బహుభిర్యోగే = భిన్న స్వభావులగు ననేకులతో సాంగత్యము చేసినందున, రాగాదిభిః = రాగద్వేషాదులద్వారా, విరోధః = విరోధము = కలహము కలుగును. కుమారీశంఖవత్ = బాలికలు తమ చేతులకు గజ్జెలు కట్టుకొందురు. అవి పరస్పరము కొట్టుకొనినపుడు ధ్వని కలుగును.

బాలికలు చేతికి కట్టుకొను గజ్జెలు పరస్పరము కొట్టుకొని మ్రోయునట్లు, పరస్పరము విరుద్ధ స్వభావముగల వ్యక్తు లొకచో చేరినపుడు రాగద్వేషాదులు కలిగి కలహ మేర్పడును. కాబట్టి వివేకికి విరుద్ధ స్వభావము గలవారి సాంగత్యమును చేయుట తగదు.

''ద్వాభ్యామపి తథైవ'' ౪. ౧౦.

అనేకుల సాంగత్య మెట్లు దోషజనకమో యట్లే యిరువురితోను సాంగత్యముచేయుట తగదని సూత్రాభిప్రాయము.

''నిరాశః సుఖీ పింగలావత్'' ౪. ౧౧.

పింగల యను పేరుగల కొండొక వేశ్య కాంతుని కొఱకు ఆశ కలిగియున్నంత వరకు దుఃఖపడి యనంతర

మా యాంశను విడిచి సుఖపడినదట. అట్లే వివేకి యన్ని కోరిక లను విడిచి సుఖి యగును.

పరుల సంబంధమును విడిచి యేకాకిగా నుండు వ్యక్తి తన నివాసమున కవసరమగు గృహాదుల నైన నిర్మించుకొన జాలడు గదా ? అతడు సుఖి యెట్లు కాగలడు ?

"అనారంభేఽపి పరగృహే సుఖీ సర్పవత్" ౪. ౧౨.

సర్పము పిపీలికలు నిర్మించిన పుట్టలో నివసించి సుఖించును. తాను స్వయముగ నివాసము నేర్పరచుకొనదు. అట్లే యేకాకియైన వివేకి తన కొఱకు గృహాదుల నిర్మించు కొనలేకపోయినను, పరులచే నిర్మింపబడిన స్థానములలో వీలయిన తావున నుండి సుఖింపగలడని భావము.

"బహుశాస్త్ర గురూపాసనేఽపి సారాదానం షట్పదవత్" ౪. ౧౩.

మఱియు, తుమ్మెద పువ్వులలోని సారమును గ్రహించు నట్లు వివేకి గురువుల ననేకుల నుపాసించి, బహుశాస్త్రముల నభ్యసించి వివేకమును గలిగించు సారవిషయములను గ్రహింపవలయును.

సారమును గ్రహించు వివేకికి జనాకులమగు సంసార మున సమాధి హాని కలుగదా ?

"ఇషుకారవన్నైక చిత్తస్య సమాధి హానిః" ౪. ౧౪.

బాణము నెక్కుపెట్టి లక్ష్యమును భేదింప నుంకించు వ్యక్తి కిరుపార్శ్వముల నేమి జరుగుచుండునదియు తెలియదు, అట్లే యేకాగ్రచిత్తుడైన వివేకికి సంసారమునం దున్నను సమాధి హాని కలుగదు.

ఏక చిత్తుడైన వివేకి ప్రమాదవశమున శాస్త్ర నియమముల నుల్లంఘించిన నేమగును ?

"కృతనియమ లంఘనాదానర్థక్యం లోకవత్'' ४. ౧౫.

లోకవత్ = లోకమున రోగి శాస్త్రమున జెప్పబడిన పథ్యపానముల నుల్లంఘించి హానిని పొందునట్లు, కృతనియమ లంఘనాత్ = శాస్త్ర నియమముల నుల్లంఘించినందున, చిత్తసమాధానముకొఱకు యత్నించు వివేకికి సైతము, ఆనర్థక్యం = హానియే కలుగును. కాబట్టి శాస్త్రనియమములను దాటుట శ్రేయస్సుకాదు.

నియమముల నెఱిగి యుల్లంఘించిన హాని కలుగును. విస్మరించి నియమోల్లంఘనము చేసిన నేమగును ?

"తద్విస్మరణేఽపి భేకీవత్" ४. ౧౬.

భేకి యను నామము గల యొక రాజకన్య వివాహ సమయమున తన భర్తతో 'నీవు నన్ను విడిచి యెక్కడికిని వెళ్ళవద్దు. అట్లు వెళ్ళిన నీకు నా వియోగము కలుగును.' అని నియమ మొనర్చుకొనెను. ఒకనాడామెభర్త యా నియమమును విస్మరించి యొంటరిగ బయటికి వెళ్ళెను. అందువలన నా భేకి యతనిని త్యజించినది. అట్లే శాస్త్రనియమమును విస్మరించి దాని నుల్లంఘించినను వివేకికి హాని కలుగక తప్పదు.

వివేకము కలిగినవాడు పైనజెప్పినట్లు మెలగవలయును. కాని వివేకము కొఱకు గురూపదేశ శ్రవణ మొనర్చువాడు చేయవలసిన దేమి ?

"నోపదేశశ్రవణేఽపి కృతకృత్యతా, పరామర్శాదృతే విరోచనవత్" ४. ౧౭.

విరోచనవత్ = విరోచనునివలె, పరామర్శాదృతే = పరామర్శ

లేక, ఉపదేశ శ్రవణేఽపి=గురుముఖమున నుపదేశమును వినినప్పటికిని, న కృతకృత్యతా = కృతార్థత కలుగదు.

గురువు చెప్పిన వాక్య తాత్పర్యమును నిర్ణయించుట కొఱకు చేయు విచారము (ఆలోచన) పరామర్శ మనబడును. ఉపదేశ శ్రవణము తరువాత నట్టి పరామర్శము చేయవలయు నని భావము.

విరోచనుడు ఉపదేశ శ్రవణానంతరము పరామర్శ చేయనందున నతనికి కృతార్థత కలుగలేదు.

శ్రవణానంతరము పరామర్శ చేసినదెవరు ?

"దృష్టస్తయో రింద్రస్య" ౪. ౧౮.

వివేకజ్ఞానము సంపాదించు నిమిత్త మింద్ర విరోచనులు గురువైన ప్రజాపతిని జేరి యుపదేశమును పొందిరి. కాని వారిలో నింద్రుడు మాత్రము పరామర్శము జేసి కృతార్థుడైనట్లు ఉపనిషత్తులో చూడబడుచున్నది.

శ్రవణానంతరము పరామర్శము చేయగానే వివేక ముదయించునా ?

"ప్రణతి బ్రహ్మచర్యోప సర్పణాని కృత్వా
సిద్ధి ర్బహు కాలాత్ తద్వత్. ౪. ౧౯.

తద్వత్ = ఇంద్రునివలె, ప్రణతి....సర్పణాని = ప్రణత్యాదులను' కృత్వా = చేసి, బహుకాలాత్ = బహుకాలానంతరమున, సిద్ధిః = సిద్ధి,

వినమ్ర భావము ప్రణతి యనబడును. ఇంద్రియములన్నింటిని నియమించుట బ్రహ్మచర్యము. శ్రద్ధాభక్తులతో గురువును సమీపించుట యుపసర్పణము. ఇవి యన్నియు

నియమ పూర్వకముగ నాచరించి దీర్ఘకాలానంతరమున శ్రవణ పరామర్శముల ద్వారా వివేకము సంపాదింపనగును. ఇంద్రు డిట్లే వివేకము సంపాదించినాడు.

ఎల్లరికి నిట్లే దీర్ఘ కాల నియమముండునా ? :-

"న కాలనియమో వామదేవ వత్' ౪. ౨౦.

వామదేవ వత్ = వామదేవునికివలె, కాలనియమః = 'వివేకము సిద్ధించుట కింత కాలము కావలయును' అను నియమము, న = లేదు.

వామదేవుడు పూర్వజన్మ సంస్కార సహకారము వలన నీ జన్మమునందు విశేషసాధనము లభింపకున్నను త్వరలో వివేక సిద్ధిని పొందెను. కాబట్టి 'వివేకము కలుగుట కింత కాలము పట్టును' అని సమయ నియమము జేయుటకు వీలు లేదు. కొందరకు శీఘ్రముగాను, మరికొందరకు బహుకాలము నకును వివేకము లభింపవచ్చును.

ప్రణత్యాదుల నొనర్చు వారికి గురూపదేశము వలన తత్త్వోపదేశము కలుగునపుడు బహు కాలాపేక్ష యెందులకు ?

"అధ్యస్త రూపోపాసనాత్ పారంపర్యేణ యజ్ఞోపాసకానామివ" ౪. ౨౧.

యజ్ఞోపాసకానామివ = యజ్ఞాదుల నాచరించువారికి వలె, అధ్యస్త రూపోపాసనాత్ = గురువుచే నుపదేశింపబడిన దానిని శ్రద్ధా భక్తులతో ననుష్ఠించినందున, పారంపర్యేణ = క్రమముగా వివేకము సిద్ధించునని యర్థము.

ముందుగా నమ్రభావము సంపాదింపవలెను. దానితో పాటు బ్రహ్మచర్యాదుల నభ్యసింపవలయును అటుపై గురువుల సమీపమున జేరి తత్త్వోపదేశమును శ్రవణ మొనర్పవలయును. అనంతర మా శ్రవణముద్వారా తెలిసికొనిన దానిని

చక్కగా మననము చేయవలయును. పిదప నిది ధ్యాసనము (ధ్యానము) చేయవలయును. ఆ ధ్యానము పక్వమయిన తరువాత సంప్రజ్ఞాతసమాధి లభించును. అటు తరువాత చిత్సాక్షాత్కారము (ఋతంభరాప్రజ్ఞ) కలుగును. చిట్టచివరకు సత్త్వపురుషాన్యతాఖ్యాతి (వివేకము) కలుగును. ఇదియే పరంపర. ఇట్లు వివేకము సిద్ధించుటకు బహుకాలము కావలసియుండును క్షణకాలమున సిద్ధింపదని భావము. ఇట్లే యజ్ఞఫలమును కాలాంతరమున లభించును. కాబట్టి యది యీ సూత్రమున నుదాహరింపబడినది.

అటులయిన నింత పరంపరాయాస సాధ్యమగు వివేక ప్రత్యయము కొఱకు యత్నించుటకంటె యజ్ఞాదుల నొనర్చి యూర్ధ్వగతిని సంపాదించుకొనుట శ్రేయస్కరము కాదా ?

"ఇతరలాభేఽప్యావృత్తిః పంచాగ్ని యోగతో జన్మశ్రుతే" ౪ ౭౨

ఇతరలాభేఽపి=యజ్ఞాదులచే నూర్ధ్వగతి లభించినను, ఆవృత్తిః = పునరావృత్తి కలుగును. కారణ మేమన :- పంచాగ్ని యోగతః = పంచాగ్నుల సంబంధముద్వారా, జన్మశ్రుతేః = జన్మము కలుగునని శ్రుతి చెప్పుచున్నది.

ఆకాశము, మేఘము, భూమి, పురుషుడు, స్త్రీ, అను నీ యైదును పంచాగ్ను లనబడును. జీవుడు వీని సంబంధముతో జన్మము నందుచుండును. యజ్ఞాదులవలన జీవుడు క్రమముగా నుత్తమ జన్మముల నందగలుగునే కాని, జన్మము నుండి విముక్తుడు కాజాలడు. కాబట్టి కష్టసాధ్యమైనను వివేక ప్రత్యయము మోక్ష సాధనము కాబట్టి యదియే శ్రేయస్కర మని భావము.

ఎట్టివారికి వివేక ప్రత్యయముద్వారా సంసార హానియు, మోక్షప్రాప్తియు లభింపగలదు ?

"విరక్తస్య హేయహాన ముపాదేయోపాదానం హంసక్షీరవత్"

౪. ౨౩.

హంసక్షీరవత్ = నీరమిశ్రితమైన జలమును వేరుజేసి హంస క్షీరమును గ్రహించునట్లు, విరక్తస్య = విరక్తుడైన వ్యక్తికి, హేయ హానం = విడువదగిన సంసారహానియు, ఉపాదేయోపాదానం = గ్రహింపదగిన మోక్షప్రాప్తియు కలుగును.

హంస నీటిని విడిచి పాలను గ్రహించునట్లు ఐహికా ముష్మిక విషయములందు విరక్తుడైన వ్యక్తియే సంసారమును త్యజించి మోక్షమును పొందునని భావము.

విరక్తునకు మోక్షప్రాప్తి కలుగును. అట్టియెడ సత్సాం గత్యమువలన ప్రయోజన మేమైన నుండునా ?

"లబ్ధాతిశయయోగాద్ వా తద్వత్" ౪. ౨౪.

తద్వత్ = ఒక హంస మరియొక హంస సాంగత్యమువలన నీర క్షీరములను వేరుచేయగలుగునట్లు, లబ్ధాతిశయయోగాత్ = వివేక పరా కాష్ఠను సంపాదించిన సత్పురుషుని సాంగత్యమువలన సంసారమును త్యజించి మోక్షప్రాప్తిని పొందవచ్చును.

రక్తుడైనవానికి హానోపాదేయములు ప్రాప్తించునా ?

"న కామచారిత్వం రాగోపహతే శుకవత్" ౪. ౨౫.

శుకవత్ = చిలుకవలె, రాగోపహతే = అనురాగ గుణముతో కూడినవానికి, కామచారిత్వం న=ఇష్టము వచ్చినట్లు సంచరించుటయే సంభవింపదు. కాబట్టి, హానోపాదేయములు బొత్తిగా లభింపనేరవని భావము.

రాగికి ఇష్ట సంచారిత్వ ముండనేరదన నేమి ?

"గుణయోగాద్ బద్ధః శుకవత్" ౪. ౨౬.

శుకవత్ = చిలుక మాటలు నేర్వఁగలదు. అట్టి గుణము దానియం దుండుటచే నయ్యది పంజరమున బంధింపబడుచున్నది. అందువలన చిలుక తన యిష్టము వచ్చినట్లు సంచరింపజాలక పోవును. అట్లే గుణ యోగాత్ = రాగాది గుణములతో యుక్తుడైనందున, బద్ధః = జన్మ మరణాది రూప సంసారమున బద్ధు డగును. కాబట్టి మోక్షప్రాప్తి దుర్లభ మగునని భావము.

భోగముద్వారా రాగముపోయి వైరాగ్యము అను రక్తునకును కలుగునుకదా ?

"న భోగాద్ రాగశాంతి ర్మునివత్" ౪. ౨౭.

మునివత్ = సౌభరి యను మునికి రాగశాంతి కలుగనట్లు, భోగాత్ = భోగముద్వారా, న రాగశాంతిః = రాగము శాంతింప నేరదు.

సౌభరి తన విషయమున నిట్లు వర్ణించియున్నాడు.

(ఆ మృత్యుతో నైవ మనోరథానామ్
అంతోఽస్తి విజ్ఞాత మిదం మయాద్య
మనోరథాసక్తి పరస్య చిత్తం
న జాయతే వై పరమార్థ సంగి.)

'మృత్యుపర్యంతము భోగించినను మనోరథములు శాంతింపవు. నేనిది యిపుడు తెలిసికొంటిని మనోరథము (కోరిక) లందాసక్త చిత్తము పరమార్థము నంటదు.' కాబట్టి భోగమువలన రాగము శాంతించుననుట భావ్యము కాదు.

అటులయిన రాగశాంతి యెట్లు కలుగును ?

"దోషదర్శనా దుభయోః" ౪. ౨౮.

ఉభయోః = ప్రకృతి, దాని కార్యములు, నను నీ రెంటియందలి, దోషదర్శనాత్ = దోషముల నెఱుగుటవలన రాగము శాంతించును.

ప్రకృతి, దాని కార్యములయిన మహత్తత్త్వాదులు నన్నియు నిత్యము పరిణామమును చెందుచుండునవియు, అయ్యావి దుఃఖాత్మకములనియు వానిలోగల దోషములను గుర్తించి నందువలన రాగగుణము నశించును; కాని భోగము వలన నశింపదని భావము.

ఉపదేశమువలన వివేకము సిద్ధించుచుండ ప్రకృతి, దాని కార్యములలోని దోషముల నెఱుగు టేల ?

"న మలినచేత స్యుపదేశ బీజప్రరోహోఽజవత్" ४. ౨౯.

అజవత్ = అజునకువలె, మలినచేతసి = మలిన చిత్తమునందు, న, ఉపదేశ బీజప్రరోహః = ఉపదేశ మనెడి బీజము అంకురింపదు.

భార్యా వియోగము వలన శోకించు నజునకు వసిష్ఠుని యుపదేశము కార్యకారి కాకపోయినది. అట్లే మలిన చిత్తునకు ఉపదేశము ఫలజనకము కాదు. అందువలన ప్రకృతి యొక్కయు, దాని కార్యముల యొక్కయు దోషముల నెఱిగి యందుండి విరక్తుడగుటయు నవసరమని భావము.

ఉపదేశము మలినచిత్తున కొకింతయైన నుపయోగింపదా ?

"నాభాసమాత్రమపి మలిన దర్పణవత్" ४. ౩౦.

మలినదర్పణవత్=మలిన దర్పణమునం దొకింతయు ముఖబింబము కనిపింపనట్లు, న ఆభాస మాత్రమపి = మలినచిత్తునకు గురూపదేశ మొకింతయు నుపకరింపదు.

అయినను గురూపదేశమువలన జ్ఞానము కలుగును కాబట్టి యది వ్యర్థము కాదుగదా ?

" న తజ్జస్యాపి తద్రూపతా పంకజవత్" ४. ౩౧.

పంకజవత్ = కమలమువలె, తజ్జస్యాపి = గురూపదేశమువలన, జనించినను జ్ఞానమునకు, న తద్రూపతా = ఉపదేశమునకు తగిన రూప ముండదు.

బీజమునుండి యుత్పన్నమైన కమలము బురదతో కూడి యున్నందున బీజరూపమున నుండనట్లు, చిత్తమాలిన్యము తొలగనంతవరకు గురూపదేశమువలన జనించిన జ్ఞానము సైతము ఉపదేశమునకు తగినట్లు ఉండజాలదని భావము.

"న భూతియోగేఽపి కృతకృత్యతా
ఉపాస్య సిద్ధివదుపాస్య సిద్ధివత్" ౪. ౩౨.

ఉపాస్య సిద్ధివత్ = ఉపాసింపదగిన వివేకము సిద్ధించినందువలన నెట్లు కృతార్థత కలుగునో అట్లు, భూతియోగేఽపి=అణిమాది విభూతులు లభించినను, న కృతకృత్యతా=కృతార్థత కలుగదు.

వివేకము సిద్ధించినందువలననే కృతార్థత కలుగును కాని, అణిమాది సిద్ధులు లభించిన మాత్రమున కృతార్థత కలుగనేరదని భావము.

'ఉపాస్య సిద్ధివత్' అను నీ పదము సూత్రమున రెండుమాట్లు వాడబడినది. అందొక పదము అధ్యాయ సమాప్తిని తెలుపును.

నిఖిలశాస్త్రనిష్ణాత శ్రీమత్పండితము క్తి రామోపాధ్యాయశిష్య
గోపదేవ విరచితాంబా వ్యాఖ్యానమున
చతుర్థాధ్యాయము.

—o—

సాంఖ్య దర్శనము

పంచమాధ్యాయము

పూర్వపు నాలుగధ్యాయములందును స్వసిద్ధాంతములను వివరించి యికముందు పరుల సిద్ధాంతములను నిరాకరించుట కీ యధ్యాయమును మహర్షి ప్రారంభించుచున్నాడు. వివేకప్రత్యయము వలన దుఃఖము లన్నియు పోయి మోక్షము సిద్ధించు పక్షమున లౌకికములు, వైదికములు నైన శుభకర్మములు (మంగలాచరణములు) చేయనేల ? యను శంకను ముందుగా తీర్చుచున్నాడు :-

"మంగలాచరణం శిష్టాచారాత్ ఫలదర్శనా చ్ఛ్రుతితశ్చేతి" ౫.౧

మంగలాచరణం = శుభకర్మముల నాచరించుట, శిష్టాచారాత్ = శిష్టులాచరించినందున, ఫలదర్శనాత్ = ఆచరించిన కర్మములకు శుభ ఫలము లభించుటవలన, శ్రుతితశ్చ = మఱియు శ్రుతులయం దట్లాచరింప వలయు నని చెప్పియుండుటవలన.

స్వస్వధర్మములందు నిష్ఠగల పెద్ద లందఱు శుభకర్మమున నాచరించిరి. అట్లాచరించినవారికి నభ్యుదయమును కలిగినది. శ్రుతులలో (కుర్వన్నే వేహ కర్మాణి జిజీవిషేచ్ఛతగ్ం సమాః) శుభకర్మమున నాచరించుచునే జీవింపగోరుమని బోధించియుంరుట చేతను శుభకర్మములు (మంగలాచరణము) చేయవలసియున్నదని భావము. ఇట్టి శుభకర్మాచరణము వివేకజ్ఞానము కలిగించుట కుపయోగించును. కాబట్టి దోషము లేదు.

కర్మల నాచరించుట వలన ఫలము లభించుచున్నది. అట్టియెడ కర్మ ఫలముల నొసంగుట కొఱకు యీశ్వరు నంగీకరించుట వ్యర్థము కాదా ? యన :—

"న, ఈశ్వరాధిష్ఠితే ఫలనిష్పత్తిః కర్మణా తత్సిద్ధేః" సూ. ౨.

న = వ్యర్థము కాదు, కర్మణా=కర్మము హేతువుగా, తత్సిద్ధేః = ఫలము లభించుచున్నందున, ఈశ్వరాధిష్ఠితే = కర్మము ఈశ్వరాధిష్ఠితమైనపుడే, ఫలనిష్పత్తిః = ఫలము లభించుచున్నది.

లోకమున కర్మకరులుచేయు పనుల కొఱకు డధిష్ఠాతయై యుండి వారు చేయు పనులకు ఫలముల నొసంగును. అట్లే యీశ్వరుడు జీవు లొనర్చు కర్మల కధిష్ఠాతయై ఫలముల నొసంగును. కాబట్టి యీశ్వరు నంగీకరించుట వ్యర్థముకాదని భావము.

పరు లొనర్చు కర్మల కీశ్వరు డేల యధిష్ఠాత యగును ?

"స్వోపకారా దధిష్ఠానం లోకవత్" సూ. 3.

లోకవత్ = లోకమున కారుణికుడైన రాజు ప్రజలుచేయు పనుల కధిష్ఠాతగా నుండి ఫలము లొసంగు విధమున, స్వోపకారాత్ = స్వకీయులైన జీవుల కుపకారమొనర్చుటకై, అధిష్ఠానం = ఈశ్వరు డధిష్ఠాత యగుచున్నాడు.

స్వోపకార మన స్వకీయుల కుపకార మని చెప్పినట్లు తన కుపకారమనియు చెప్పవచ్చును. తన యుపకారము కొఱ కీశ్వరుడు కర్మాధిష్ఠాత యగునందుమేని దోషమేమి ?

"లౌకికేశ్వరవ దితరథా" సూ. ४.

ఇతరథా = తన యుపకారముకొఱ కధిష్ఠాతయగు నెడల,

లౌకికేశ్వరవత్ = లోకమునందు రాజులకు వలె నీశ్వరుడును కోరికలు గలవాడగును.

"పారిభాషికో వా" ౫. ౫.

కోరికలుండువాడు నీశ్వరుడని యంగీకరించిన నతడు సర్వసమ్మతమైన ఈశ్వరుడు కాక కొందరిచే నంగీకరింపబడినవాడే యగును.

ఈశ్వరుడు కోరికలు లేనివాడు; అనగా కోరికలు లేనివాడు ఆప్తకాముడని భావము కాబట్టి దేనియందును రాగము లేనివాడగును. అట్టియెడ జీవు డొనరించు కర్మల కధిష్ఠాత యెట్లగుచున్నాడు ?

"న రాగదృతే తత్సిద్ధిః ప్రతినియత కారణత్వాత్" ౫, ౬.

ప్రతినియత కారణత్వాత్ = రాగము లేనిది ప్రవృత్తి కలుగ నేరదు కావున. రాగాదృతే = రాగములేక యనగా కరుణ యనెడి రాగము లేక, న తత్సిద్ధిః = అధిష్ఠాతృత్వము సిద్ధింపదు.

ఇతరుల కామములను దీర్చు బుద్ధితో ననగా దయాభావముతో నీశ్వరుడు కర్మాధిష్ఠాత యగుచున్నాడని భావము.

అటులయినను నిత్యముక్తు డీశ్వరు డెట్లగును ?

"తద్యోగేఽపి న నిత్యముక్తః" ౫. ౭.

(ఇందు పై సూత్రమునుండి నకారము తీసికొనబడును.) తద్యోగేఽపి=కరుణతో సంబంధమున్నందునను, న న నిత్యముక్తః = ఈశ్వరుడు నిత్యముక్తుడు కాదనజనదు, నిత్యముక్తుడే.

ఈశ్వరునందు అవిద్యాది క్లేశములకు చెందిన రాగ ముండదు; కాని స్వాభావికమైన కరుణ యుండును. అందు

వలన నతడు కర్మాధిష్ఠాత కాగలడు. అయినను కరుణ క్లేశ
ములలో చేరదు. కాబట్టి యతని నిత్యముక్తత్వమునకు
లోటు కలుగదని భావము.

జీవుడే యీశ్వరుడు కాగలడు. జీవునకు ప్రకృతి సంబం
ధము వలన నీశ్వరత్వ మేర్పడును. అదియును స్వాభావికము
గాదు. కాబట్టి జీవుడే యీశ్వరు డగు నన :-

''ప్రధానశక్తి యోగాచ్చేత్ సంగాపత్తిః'' ౫. ౮.

ప్రధాన.........చేత్ = ప్రకృతి సంబంధమువలన జీవున కీశ్వరత్వ
మేర్పడు నందుమనిన, సంగాపత్తిః = అప్పు డతడు నిస్సంగి - సంగ
రహితుడు కాజాలడు.

ప్రకృతి సంబంధము వలన జీవుడే యీశ్వరు డగునందు
మేని యీశ్వరునందు నిస్సంగిత్వ ముండ నేరదని భావము.

ప్రకృతి సత్తామాత్రమున జీవు డీశ్వరు డగునందు
మేని :-

''సత్తామాత్రాచ్చేత్ సర్వైశ్వర్యమ్'' ౫. ౯.

ప్రకృతి తటస్థముగా నుండుట యీ సూత్రమున 'సత్తా' యన
బడినది. సత్తామాత్రాచ్చేత్ = ప్రకృతితో సంబంధము లేకయే దాని
యునికి మాత్రముననే జీవు డీశ్వరు డగునందుమేని, సర్వైశ్వర్యమ్ =
జీవు లెల్లరు నీశ్వరులు కావలసియుందురు. కాబట్టి యదియు పొసగదని
సూత్రార్థము.

ప్రకృతి యునికి జీవుల కందఱకు సమానమగుటచే
నెల్లఱు నీశ్వరులయిన కానిండు దోష మేమన :-

ప్రమాణాభావాన్న తత్సిద్ధిః'' ౫. ౧౦.

ప్రమాణాభావాత్ = జీవులెల్లఱు నీశ్వరులే యనుటకు ప్రత్యక్ష
ప్రమాణములేదు; కాబట్టి, న తత్సిద్ధిః = అయ్యది సిద్ధింపదు.

లోకమునగల జీవులందఱు నీశ్వరులే యనుట ప్రత్యక్ష ప్రమాణ విరుద్ధమని భావము.

ప్రత్యక్ష ప్రమాణ సిద్ధము కాకున్నచో ననుమాన ప్రమాణముచే సిద్ధింపగల దందు మనిన :—

''సంబంధా భావా న్నానుమానమ్'' సూ. ౧౧.

సంబంధాభావాత్ = వ్యాప్తిగ్రహము లేనందున, న అనుమానమ్ = అనుమాన ప్రమాణమును జీవు డీశ్వరు డగునని సాధింపనేరదు.

అటులయిన జీవుడే యీశ్వరు డగునని శ్రుతియే బోధింపగల దందుమేని :—

''శ్రుతిరపి ప్రధానకార్యత్వస్య'' సూ. ౧౨.

శ్రుతిరపి = "అజామేకాం' అను నిట్టి శ్రుతియును, ప్రధాన కార్యత్వస్య = ప్రకృతి కార్యరూపమున పరిణమించుననియే బోధించును, కాని జీవు డీశ్వరు డగునని బోధింపదు.

జీవు డీశ్వరుడు కాజాలకున్న పోనిండు. కాని, విజ్ఞానాత్మకమైన బ్రహ్మము అవిద్యాశక్తి సంబంధము వలన నీశ్వరుడు కాగల దందుమేని :—

''నా విద్యాశక్తియోగో నిఃసంగస్య'' సూ. ౧౩.

నిఃసంగస్య = సంగరహితమైన బ్రహ్మమునకు, అవిద్యాశక్తి యోగః = మాయాశక్తితో సంబంధము - సంగము, న = కలుగ నేరదు,

నిస్సంగబ్రహ్మమునకు మాయాశక్తితో సంగభావము కల్పించుటయును యుక్తముకాదు. కాబట్టి విజ్ఞాన బ్రహ్మము ఈశ్వరు డగుననుట తగదు.

ఆ యవిద్యా సంబంధము సైతము పారమార్థికము కాదు. ఆవిద్యకమే - అయథార్థమే యనిన :—

"తద్యోగే తత్సిద్ధా వన్యోన్యాశ్రయత్వమ్" ౫. ౧౪.

తద్యోగే = అవిద్యా సంబంధము సిద్ధించిన, తత్సిద్ధౌ = అవిద్య సిద్ధింపగలదు. అందువలన, అన్యోన్యాశ్రయత్వమ్ = అన్యోన్యాశ్రయ దోష మేర్పడును.

అవిద్య యనున దొక వస్తువున్ననాడు దాని సంబంధము పారమార్థికమో యపారమార్థికమో సిద్ధించుట యంగీకరింప వీలగును. అట్టి యవిద్యయే సిద్ధింపనపుడు దాని సంబంధమువలన నయ్యది సిద్ధించు ననుట యుక్తము కాదు. అట్లెందుమేని, అవిద్యా సంబంధము నంగీకరించిన నవిద్య సిద్ధించుటయు, అవిద్య సిద్ధించిన దాని సంబంధము నంగీకరించుటయు నను పరస్పరాశ్రయ దోష మేర్పడునని భావము.

బీజాంకురముల వలె నవిద్యయు దాని సంబంధమును ననాదు లగుటచే పైదోషము వాటిల్ల దందుమేని :—

"న బీజాంకురవత్ సాదిసంసార శ్రుతేః" ౫. ౧౫

సాదిసంసార శ్రుతేః=అవిద్య, దాని సంబంధము ననెడి లక్షణము గల యీ ప్రపంచము ఆదిగలది (సాది) యని శ్రుతి చెప్పుచున్నందున, బీజాంకురవత్ = బీజాంకురములవలె, న=అనాది యనుట తగదు.

అవిద్యయు, దాని సంబంధమును బీజాంకురములవలె ననాదియనుట శ్రుతి విరుద్ధమని భావము.

విద్యాభిన్నత్వమే యవిద్య యనుటవలన నయ్యది సిద్ధింప దనుట తగదనిన :—

"విద్యాతోఽన్యత్వే బ్రహ్మబాధప్రసంగః" ౫. ౧౬.

విద్యాతోఽన్యత్వే = విద్యాన్యత్వమే యవిద్య యగునెడల, బ్రహ్మబాధప్రసంగః = బ్రహ్మము బాధింపబడును.

అవిద్య యనగా విద్యాన్యత్వమే యందుమేని విద్యోదయము వలన నవిద్య నశించునట్లు, బ్రహ్మము సైతము విద్యాన్యత్వమే కాబట్టి యదియును నాశము నందవలసి వచ్చును. బ్రహ్మము నశించుననుట యనిష్ట ప్రసక్తి యగును. అందువలన విద్యాన్యత్వమే యవిద్య యని దానిని సిద్ధింప జేయ జనదు.

బ్రహ్మము బాధింపబడ దందుమేని :-

"అబాధే నైష్ఫల్యమ్" సూ. ౧౭.

అబాధే = విద్యాన్యత్వమయిన బ్రహ్మము విద్యవలన బాధింపబడ దందుమేని, నైష్ఫల్యమ్ = విద్య నిష్ఫలమగునని సూత్రార్థము.

విద్యాన్యత్వము అవిద్య కాదు. కాని విద్యాబాధ్యత్వము అవిద్య యందుమేని :-

"విద్యాబాధ్యత్వే జగతోఽప్యేవమ్" సూ. ౧౮.

విద్యాబాధ్యత్వే = అవిద్య యనగా విద్యచే బాధింపబడునది - అందుమేని, జగతోఽప్యేవమ్ = జగత్తు కూడ విద్యచే బాధింపబడునదియే కాబట్టి యదియు నవిద్యయే యగును.

జగత్తు కూడ అవిద్యయైన కానిండు; అందుమేని :-

"తద్రూపత్వే సాదిత్వమ్" సూ. ౧౯.

తద్రూపత్వే = జగత్తు అవిద్యారూప మగునెడల, సాదిత్వమ్ = జగత్తువలె నవిద్యయు సాదియగును. కాబట్టి యవిద్య యనాది యనుట పొసగదని భావము.

సాంఖ్యవాది వైన నీకును జీవులకు సంబంధించిన ధర్మాధర్మము లనెడి యదృష్టము సిద్ధించిననే కదా యా యదృష్టమునకు తగిన ఫలము నొసంగు నీశ్వరుడు సిద్ధించును?

ఆ యదృష్టమే లేనపు డీశ్వరు డెట్లు సిద్ధించును ?

"న ధర్మాపలాపః ప్రకృతి కార్య వైచిత్ర్యాత్" ౫. ౨౦.

ప్రకృతికార్య వైచిత్ర్యాత్ = సుఖాదులలో గల వైచిత్ర్యము వలన, ధర్మాపలాపః = అదృష్టము లేదనియనుట, న = తగదు.

లోకము నందలి ప్రాణులలో కొందఱు సుఖులుగాను, మఱికొంద ఱంతకంటె నెక్కుడు సుఖులుగాను, ఇంకను కొందఱు వారికంటె మిక్కిలి సుఖులుగాను నుండుట జూచు చున్నాము. ఇట్లే ప్రాణుల దుఃఖము లందును తరతమ భేదము గానవచ్చు చున్నది. ఈ తరతమ భేదములతో గానవగు సుఖ దుఃఖములే ప్రకృతి కార్యములు. అదృష్ట శబ్దముచే శాస్త్ర కారులు వీనిని జెప్పుదురు. అదృష్ట మనబడెడి యీ ప్రకృతి కార్యములయిన సుఖదుఃఖములలోని వైచిత్ర్యము ధర్మా ధర్మములు లేక యేర్పడదు. కాబట్టి ధర్మాధర్మములు లేవనుట యొప్పదు.

స్వభావముగానే ప్రకృతి కార్యములందు వైచిత్ర్య ముండును. ఇందుల కదృష్ట మేల ?

"శ్రుతిలింగాదిభిః తత్సిద్ధిః" ౫. ౨౧.

శ్రుతిలింగాదిభిః= శ్రుతి, లింగము, యోగజప్రత్యక్షము మున్నగు వానిచే, తత్సిద్ధిః =ధర్మసిద్ధి కలుగును.

('పుణ్యో వై పుణ్యేన కర్మణా భవతి పాపః పాపేన' బృ. ౫. ౨. ౧౩.) ('పుణ్య కర్మచే సుఖియు పాపకర్మముచే పాపియు నగును' అని శ్రుతివాక్యము. లింగ మనగా హేతువు. సుఖదుఃఖములు హేతువు సహాయమున నదృష్ట జన్యములని యూహింప నగును. యోగికి అదృష్టము ప్రత్యక్ష మగును.

కాబట్టి ధర్మము సిద్ధించుటలో నియ్యవి యుపకరించును. అట్టియెడల స్వభావమును కల్పించుట గౌరవ మగును.

మనకు ప్రత్యక్షము కానిది లేదని యేల చెప్పరాదు ?

''న నియమః ప్రమాణాంత రావకాశాత్'' సూ. ౨౨.

ప్రమాణాంతరావకాశాత్ = ప్రత్యక్షముకాని వస్తువు శబ్దానుమానములచే సిద్ధించును: కాబట్టి, న నియమః = ప్రత్యక్షముకాని వస్తువు లేదనియే చెప్పవలయునను నియమము లేదు.

''ఉభయత్రా ప్యేవమ్'' సూ. ౨౩.

పై సూత్రములందు ధర్మము నూహించినట్లే యధర్మము నైత మూహింపదగునని యీసూత్రాభిప్రాయము.

ధర్మమువలె నధర్మము నూహింపనేల ? అది యర్థాపత్తి వలన సిద్ధింపదా ?

"అర్థాత్ సిద్ధిశ్చే త్సమాన ముభయోః'' సూ. ౨౪.

అర్థాత్ సిద్ధిశ్చేత్ = అధర్మమర్థాపత్తివలన సిద్ధించినచో, ఉభయోః సమానమ్= ధర్మము, అధర్మము నను రెండిటి విషయముననువిట్టి ప్రశ్నము సేయనగును.

సంబద్ధములైన రెండు పదార్థములలో నొకటి సిద్ధించినపుడు దానితో సంబంధము కలది యగుటచే రెండవదియు సిద్ధించుట అర్థాపత్తి - అర్థసిద్ధి - యనబడును. కాబట్టి యధర్మము అర్థాపత్తిచే నేల సిద్ధింపదని ప్రశ్నించినచో ధర్మము మాత్ర మర్థాపత్తిచే నేల సిద్ధింపదు ? అని ప్రశ్నింపవచ్చునని భావము.

ధర్మాధర్మము లంగీకరించినచో పురుషుడు నిర్గుణుడెట్లు కాగలడు ?

"అంతఃకరణ ధర్మత్వం ధర్మాదీనామ్" ౫. ౨౫

ధర్మాదీనామ్ = ధర్మాధర్మాదులు, అంతఃకరణ ధర్మత్వమ్ = అంతఃకరణ గుణములు. కాబట్టి పురుషగుణములు కావు.

ధర్మాధర్మములు అంతఃకరణ గుణము లగుపక్షమున నయ్యవి పురుషునియం దారోపింపబడు ననవలయును. ఆరోపితములు వివేకజ్ఞానము కలిగినపుడు నశించును. ఇట్లు ధర్మాదుల నాశ మంగీకరించిన సత్కార్యవాదమునకు హాని కలుగదా ?

"గుణాదీనాంచ నాత్యంత బాధః" ౫. ౨౬.

గుణాదీనాంచ = సత్త్వము, రజస్సు మున్నగు గుణములు వాని ధర్మములైన సుఖాదులు నన్నియు, నాత్యంతబాధః=స్వరూపనాశమునందవు.

అగ్ని సంయోగముచే లోహమునందు కలుగు నుష్ణము లోహమునుండి విడివడునట్లు సుఖదుఃఖాదులును పురుషుని నుండి వేరగును. లోహమునుండి యుష్ణము తొలగినంతమాత్రమున నది సత్తారహితము కాదుగదా ? అట్లే సుఖాదులు నని భావము.

తనకు సుఖాదులు తెలిసినను పరులకును సుఖాదు లున్నట్లు తెలియు టెట్లు ?

"పంచావయవ యోగాత్ సుఖసంవిత్తిః" ౫. ౨౭.

పంచావయవయోగాత్ = ప్రతిజ్ఞ, హేతువు మున్నగు నైదవయవములు గల యనుమాన ప్రమాణము ద్వారమున, సుఖసంవిత్తిః = ఇతరుల సుఖమును గుర్తింపగలము.

అనుమానము వ్యాప్తిజ్ఞానము వలన కలుగునుగదా ? అది యెట్లు కలుగును ?

"న సకృద్ గ్రహణాత్ సంబంధ సిద్ధిః" సూ. ౨౮.

న సకృద్ గ్రహణాత్ = సాధ్యసాధనముల సాహచర్యము (ఒకచో నుండుట) పలుమారు గ్రహించుటచేత, సంబంధ సిద్ధిః =వ్యాప్తి తెలియనగును.

వ్యాప్తి యన నేమి ?

"నియత ధర్మసాహిత్యముభయో రేకతరస్య వా వ్యాప్తిః" సూ. ౨౯.

ఉభయోః = సాధ్యసాధనములయొక్క గానీ, ఏకతరస్య వా = సాధనముయొక్క గానీ, నియత ధర్మసాహిత్యం = అవ్యభిచరిత సాహచర్యము, వ్యాప్తిః = వ్యాప్తి యనబడును.

సమము, విషమము నని వ్యాప్తి రెండు విధములు. సాధ్యసాధనములు రెండును నెల్లతావులందును నియమముగా నొకచో నుండును - సాధ్యమున్నచోట సాధనముండును. సాధన మున్నతావున సాధనము నుండును. ఇట్లుండుట సమవ్యాప్తి. కృతకత్వము అనిత్యత్వము నిందుల కుదాహరణము. కొన్నియెడల సాధ్యసాధనములు రెండును సమముగానుండవు. అనగా సాధన మున్నతావున సాధ్యముండును. కాని సాధ్యమున్నను నొకతావున సాధనముండదు. ఇందులకుదాహరణము ధూమాగ్నులు. ధూమమున్న తావున నగ్ని తప్పకయుండును. కాని అగ్ని యున్నను నొకచో ధూమముండదు. కాబట్టి ధూమాగ్నుల వ్యాప్తి విషమము.

నియతధర్మసాహిత్యమే వ్యాప్తి యన నేల ? అయ్యది తత్త్వాంతర మేల కాదు ?

"న తత్త్వాంతరం వస్తుకల్పనా ప్రసక్తేః" సూ. 30.

వస్తుకల్పనా ప్రసక్తేః = క్రొత్త పదార్థమును కల్పింపవలసి వచ్చును. కాబట్టి, న తత్త్వాంతరం = ధర్మ సాహిత్యమునకు మించి వేరు పదార్థము వ్యాప్తి యన నొప్పదు.

ఈ నియతధర్మ సాహిత్య మెట్టిది ?

"నిజశక్త్యుద్భవ మిత్యాచార్యాః" సూ. ౩౧.

ఆచార్యాః = సాంఖ్యాచార్యులు, నిజశక్త్యుద్భవం = వస్తువు యొక్క స్వాభావిక శక్తి వలన ప్రకటమగునట్టి సాహిత్యము, ఇతి = అని చెప్పుదురు.

స్వభావము చేతనే రెండు వస్తువు లొకదానితో నొకటి సంబద్ధములై యుండును. అందు ఏది ప్రతిబద్ధ (సంబద్ధ) మగునో యది వ్యాప్య మనబడును. దేనితో సంబద్ధమగునో యది వ్యాపక మనబడును. స్వభావముచే ప్రకటమగు (నా వస్తువుల) సంబంధము (ప్రతిబంధము) వ్యాప్తి యని వివేకము.

"ఆధేయశక్తియోగః ఇతి పంచశిఖః" సూ. ౩౨.

ఆధేయశక్తి యోగః ఇతి = సాంకేతిక శక్తి లక్షణ సంబంధమని, పంచశిఖః = పంచశిఖాచార్యుడు.

ఆధాన మనగా సంకేతము. అట్టిది విషయముగా గల శక్తి ఆధేయశక్తి యనబడును. అనగా 'ఇది వ్యాప్యము; ఇది వ్యాపకము' ననెడి శక్తి ఆధేయశక్తి యనబడును. ఇట్టి లక్షణము గల వస్తువుల నియత సంబంధము వ్యాప్తి యని పంచశిఖాచార్యుని మతము.

స్వరూపశక్తిని విడిచి యాధేయ (సాంకేతిక) శక్తి వ్యాప్తి యననేల ?

"న స్వరూపశక్తి ర్నియమః పునర్వాదప్రసక్తేః" సూ. ౩౩.

పునర్వాదప్రసక్తేః=పునరుక్తి ప్రసక్తి కలుగును కావున, స్వరూప శక్తిః = స్వరూపభూతశక్తి, న నియమః = వ్యాప్తికాదు.

స్వరూపశక్తియే వ్యాప్తియని చెప్పిన పునరుక్తిదోష ప్రసక్తి కలుగునని భావము.

పునరుక్తి ప్రసంగ మెట్లు కలుగును ? అన :-

"విశేషణానర్థక్య ప్రసక్తేః" ౫. ౩౪.

విశేషణము వ్యర్థమగుటయే యిట పునరుక్తిదోష ప్రసంగమని సూత్రాభిప్రాయము.

'ఘటము కలశము' 'శక్తుడు దేవదత్తుడు' అను తావు లందు విశేషణములుగా వాడబడు ఘట, శక్త శబ్దములు విశేషమును తెలుపక పునరుక్త మాత్రములయి వ్యర్థములగును. ఇట్లు నిరర్థకము లగుట పునరుక్తి ప్రసంగ దోషమగునని భావము. కావున స్వరూపశక్తి సంబంధము వ్యాప్తి కానేరదు.

స్వరూపశక్తి వ్యాప్తి యనుటలో ననుపపత్తి కానరా నందున పునరుక్తి ప్రసంగము దోష మెట్లగును ?

"పల్లవాది ష్వనుపపత్తేః" ౫. ౩౫.

పల్లవాదిషు = వృక్షములనుండి కోసి యొకచో ప్రోవుజేయబడిన ఆకులలో గల స్వరూపశక్తి విషయమున, అనుపపత్తేః = వ్యాప్తిత్వ మనుపపన్న మగుచున్నందున దోషమే యగును.

స్వరూపశక్తియే వ్యాప్తి యని యంగీకరించినచో దూరమునుండి కనిపించు పత్రసముదాయము వృక్షముల నూహింపజేయునట్లు, స్వరూపశక్తిగల ఛిన్నపత్రములును వృక్షముల నూహింపజేయవలయును. కాని, అట్లు ఛిన్నపత్ర ములు వృక్షముల ననుమానింపజేయవు. కాబట్టి సాంకేతిక (ఆధేయ) శక్తి సంబంధమే వ్యాప్తి యని చెప్పవలయునని పంచశిఖాచార్యుని మతము.

స్వరూపశక్తి వ్యాప్తి కాకున్న పోనిండు. కాని, నిజ శక్తిచే ప్రకటితమగు సంబంధమే వ్యాప్తి యేల కాదు ? ఆధేయ (సాంకేతిక) శక్తి యెందులకు ?

"ఆధేయశక్తిసిద్ధౌ నిజశక్తియోగః సమానన్యాయాత్" సూ. ౩౬.

సమాన న్యాయాత్ = యుక్తి సామ్యమువలన, ఆధేయ శక్తి సిద్ధౌ = సాంకేతిక శక్తిచే తెలియబడు సంబంధము వ్యాప్తి యని సిద్ధించిన, నిజశక్తియోగః = స్వాభావిక శక్తిచే ప్రకటితమగు సంబంధము సైతము వ్యాపి యని సిద్ధించినట్లే.

ఆధేయశక్తి సంబంధము వ్యాప్తియైనట్లు, నిజశక్తి సంబంధమును వ్యాప్తియే యగును. అందువలననే సాంఖ్యా చార్యులు నిజశక్తి సంబంధము వ్యాప్తి యనిరి. పంచశిఖా చార్యుడు ఆధేయశక్తి సంబంధము వ్యాప్తి యని చెప్పి యున్నాడు.

అనుమానప్రమాణమును తెలుపుటకు సాధ్యసాధన సంబంధము నిరూపించినట్లు శబ్దప్రమాణమును ప్రమాణీక రించుటకు శబ్దార్థములకు గల సంబంధము నిరూపింపవలయును గదా ? అది యెట్టిదనిన :-

"వాచ్యవాచకభావః సంబంధః శబ్దార్థయోః" సూ. ౩౭.

శబ్దార్థయోః=శబ్దము, అర్థము, నను నీ రెంటికిని మధ్య వాచ్య వాచకభావః=వాచ్యవాచకత్వమనెడి సంబంధః=సంబంధము కలదు.

శబ్దము వాచకము. అర్థము వాచ్యము. వాచ్య వాచ కత్వ సంబంధమే శబ్దార్థముల సంబంధము. ఇయ్యది వృత్తి యనియు చెప్పబడును.

శబ్దార్థముల సంబంధము తెలియబడిన నయ్యది యర్థ బోధకము కాగలదు. తెలియకున్న కాదు.

కాబట్టి సంబంధజ్ఞాన మెట్లు కలుగును ?

"త్రిభిః సంబంధసిద్ధిః'' సూ. ౩౮.

త్రిభిః = మూటిచే, సంబంధసిద్ధిః = సంబంధము తెలియును.

ఆప్తోపదేశము, వృద్ధవ్యవహారము, ప్రసిద్ధపద సాన్నిధ్యము నను మూడింటిచే సంబంధము తెలియునని భావము.

వృద్ధ వ్యవహారాదులచే తెలియు నా సంబంధ జ్ఞానము కార్యబోధక వాక్యమునందు నిశ్చయ మగునా ? లేక సిద్ధ వస్తువునందా ? లేక యుభయము నందా ?

"నకార్యేనియమ ఉభయథా దర్శనాత్" సూ. ౩౯.

ఉభయథా దర్శనాత్ = రెండు విధముల చూడబడుటచే, కార్యే = కార్యబోధక వాక్యమునందే సంబంధ నిశ్చయము కలుగును అను, నియమః = నియమము, న = లేదు.

'కఱ్ఱతో తెల్లని యావును తోలుకొనిరమ్ము' (గామానయ శుక్లాం దండేన) అనునది కార్యబోధక వాక్యము. 'నీకు పుత్రుడు జన్మించినాడు' (పుత్ర స్తే జాతః) అనునది సిద్ధ వస్తు బోధక వాక్యము. ఇట్టి రెండువిధము లయిన ప్రయోగము లందును ఆప్తోపదేశాదుల ద్వారా సంబంధ నిశ్చయము కలుగుచున్నందున సాంఖ్యులమైన మా మతమున నొక్కే విధమగు వాక్య ప్రయోగముచే నిశ్చయము కలుగునను నియమము లేదు.

లౌకికభాషయం దిట్లు శబ్దార్థ జ్ఞాన మేర్పడినను వైదిక శబ్దముల యర్థజ్ఞాన మెట్లు కలుగును ?

"లోకేవ్యుత్పన్నస్య వేదార్థప్రతీతిః" సూ. ౪౦

లోకే వ్యుత్పన్నస్య = ఆప్తోపదేశాదులద్వారా లౌకిక శబ్దముల యర్థమును గ్రహించిన వ్యక్తికి, వేదార్థప్రతీతిః = వైదిక శబ్దార్థ జ్ఞానము కలుగును.

లౌకిక శబ్దములవంటివే వైదికశబ్దములు కాబట్టి లౌకిక శబ్దముల యర్థము తెలిసినవానికి వైదిక శబ్దముల యర్థమును తెలియునని భావము.

"న త్రిభి రపౌరుషేయత్వాద్ వేదస్య తదర్థ
స్యాతీంద్రియత్వాత్" సూ. ౪౧.

వేదస్య = వేదము, అపౌరుషేయత్వాత్ = పురుష ప్రణీతము కానందున, తదర్థస్య = వేదార్థము, అతీంద్రియత్వాత్ = ఇంద్రియ గోచరము కానందునను, న త్రిభిః = ఆప్తోపదేశాది త్రివిధోపాయముల ద్వారా వైదిక శబ్దార్థ సంబంధ జ్ఞానము కలుగజాలదు.

ఋగ్యజుస్సామాథర్వములను వేదములు మానవ ప్రణీతములు కానందున నందలి శబ్దముల నాప్తులుపదేశించుటకు వీలులేదు వేదార్థములు ఇంద్రియ గోచరములు కానందున వృద్ధవ్యవహారాదుల వలన తెలియ వీలుపడదు. కాబట్టి వైదిక శబ్దార్థ సంబంధ జ్ఞానమే కలుగజాలదు. అట్టియెడల నర్థజ్ఞానము కలుగుటకు సుతరాం వీలులేదని శంకాభిప్రాయము.

వేదార్థము లతీంద్రియములు కావని ముందుగా సమాధానము చెప్పుచున్నాడు.

"న యజ్ఞాదేః స్వరూపతో ధర్మత్వం వైశిష్ట్యాత్" సూ. ౪౨.

యజ్ఞాదేః = యజ్ఞము, దానము, తపస్సు మున్నగు వైదిక కర్మములు, వైశిష్ట్యాత్ = విశిష్ట ఫలమును కలిగించును కావున, స్వరూపతః = సాక్షాత్తుగ, ధర్మత్వం = వేదార్థములని యంగీకరింప

బడుచున్నవి. అందువలన, న = వేదార్థము లతీంద్రియము లనుట తగదు.

యజ్ఞము, దానము, తపస్సు మున్నగు వేదవిహిత కర్మములు ఇంద్రియగోచరములు కావనుట యుక్తముగాదని భావము. అందువలన వృద్ధవ్యవహారాదులచే శబ్దార్థ సంబంధ జ్ఞానము కలుగవచ్చును.

అపౌరుషేయము లగుటచే నాప్తోపదేశము సంభవము కాదనుటకు సమాధానము :-

"నిజశక్తిర్ వ్యుత్పత్త్యా వ్యవచ్ఛిద్యతే" సూ. ౪౩.

నిజశక్తిః = శబ్దార్థముల స్వాభావికసంబంధము, వ్యుత్పత్త్యా= 'ఈ శబ్దమున కిది యర్థము' అను శబ్దార్థములను తెలుపు శక్తిద్వారా, వ్యవచ్ఛిద్యతే = వేరుజేసి యుపదేశింపబడును.

అంతర్వాణి నెఱుగు నాప్తులు వైదిక శబ్దార్థముల సంబంధము నెఱిగినవారై దాని నుపదేశింపగలరు. కాబట్టి వేదము లపౌరుషేయము లయినను నాప్తుల యుపదేశ మసంభవము కాదని భావము.

యజ్ఞాదులు క్రియాత్మకము లగుటచే నాప్తోపదేశ యోగ్యములు కావచ్చును. అందువలన సంబంధజ్ఞాన మేర్పడ వచ్చును. కాని, యట్లు యోగ్యములుకాని వేదార్థములకు సంబంధించిన జ్ఞాన మెట్లు కలుగగల దన :-

"యోగ్యాయోగ్యేషు ప్రతీతి జనకత్వాత్ తత్సిద్ధిః" సూ. ౪౪.

యోగ్యాయోగ్యేషు = ఇంద్రియ గోచరములగు యజ్ఞాదుల వలె నింద్రియ యోగ్యములు కాని యర్థ విషయకములగు పదములును, ప్రతీతి జనకత్వాత్ = జ్ఞాన జనకము లగుటవలన, తత్ సిద్ధిః = సంబంధసిద్ధి కలుగును.

శబ్దార్థముల సంబంధము స్వాభావికమగుచో శబ్దరాశి యైన వేదము సైతము స్వాభావిక మేల కాదు? అనగా నిత్య మేల కాదు ?

"న నిత్యత్వం వేదానాం కార్యత్వశ్రుతేః" ౫. ౪౫.

కార్యత్వశ్రుతేః = కార్యములని బోధించు శ్రుతి యుండుట వలన, వేదానాం = ఋగాది వేదములు, నిత్యత్వం న = నిత్యములు కావు.

(తస్మాద్యజ్ఞాత్ సర్వహుత ఋచః సామాని జజ్ఞిరే। ఛందాంసి జజ్ఞిరే తస్మాద్ యజుస్తస్మా దజాయత॥ య. 3. 3౧. ౯.)

సర్వ పూజ్యుడగు పరమాత్మని వలన ఋక్కులు, సామములు, ఛందములు (అథర్వ వేదము), యజుస్సు నను వేదము లుత్పన్నమైనట్లు శ్రుతులు చెప్పుచున్నందున నవి నిత్యములు (స్వాభావికములు) అనుటయుక్తము కాదని భావము.

వేదములు స్వాభావికములై నిత్యములు కాక కార్య రూపములే యగునెడల పౌరుషేయము (మానవ ప్రణీతము) లేల కావు ?

"న పౌరుషేయత్వం తత్కర్తుః పురుషస్యాభావాత్" ౫. ౪౬.

తత్కర్తుః = వేదములను రచియించిన, పురుషస్య = మానవుడు, అభావాత్ = లేనందున, పౌరుషేయత్వం న = వేదములకు పౌరుషేయత్వము (మనుజ ప్రణీతత్వము) లేదు.

వేద రచయిత లెవరో తెలియనంతమాత్రమున నయ్యవి యపౌరుషేయము లెట్లగును ?

"ముక్తా ముక్తయో రయోగ్యత్వాత్" ౫. ౪౭.

జీవులలో ముక్తులో లేక యముక్తులో వేదములను రచియింపవలసి యుందురు. కాని, ముక్తలయిన జీవులు నిస్సంగులగుటచే వారు వేదములను రచియింపరు. అముక్తులు సర్వజ్ఞులు కానందున వేదములను రచియింప యోగ్యులు కాజాలరు. కాబట్టి వేదములు మానవ (జీవ) రచితము లన నొప్పదు; ఈశ్వరీయములే యని భావము.

జీవులు వేదములను రచియింప యోగ్యులు కారు. మఱియు వేదరచయిత లెవరో తెలియుటలేదు. అట్టియెడ వేదములు నిత్యము లేల కారాదు ?

''నాపౌరుషేయత్వాత్ నిత్యత్వ మంకురాదివత్'' సూ. ౪౮.

అంకురాదివత్ = మొలకలవలె, అపౌరుషేయత్వాత్ = పురుష (జీవ) నిర్మితములు కానంతమాత్రమున, వానికి, ననిత్యత్వం = నిత్యత్వము లేదు.

భూమిపై నెన్నో యంకురము లుత్పన్నము లగుట జూచుచున్నాము. అవి జీవులచే నిర్మింపబడుటలేదు. కాని యవి యనిత్యములే. అందువలన నపౌరుషేయము లయినంత మాత్రమున నిత్యము లన వలనుపడదని భావము. అట్లే వేదములు జీవనిర్మితములు కానంతమాత్రమున నవి నిత్యము లన జాలము.

అంకురములు కార్యములు (ఉత్పన్న మగునవి) కాబట్టి జీవులే వాని నంకురింపజేసిన ట్లేల యనుమానింపరాదు ?

''తేషామపి తద్యోగే దృష్టబాధాదిప్రసక్తిః'' సూ. ౪౯.

తేషామపి = జీవులచే నంకురింపజేయబడని మొలకలకును, తద్యోగే = జీవులే కర్త లని చెప్పుదుమేని, దృష్టబాధాదిప్రసక్తిః =

ప్రత్యక్షము నంగీకరింపకపోవుటయేకాక యదృష్టమును కల్పింపవలసిన దోషము నేర్పడును.

అటులయిన జీవకర్తృక మేదియో యీశ్వర కర్తృక మేదియో తెలిసికొను టెట్లు ?

"యస్మిన్నదృష్టేఽపి కృతబుద్ధి రుపజాయతే తత్పౌరుషేయమ్" ౫. ౫౦.

అదృష్టేఽపి = కర్త ప్రత్యక్షముకాని, యస్మిన్ = ఏవస్తువునందు, కృతబుద్ధిః = 'ఈ వస్తువు జీవ నిర్మితము' అను బుద్ధి ఉపజాయతే = కలుగునో, తత్ = ఆ వస్తువు, పౌరుషేయమ్=పురుష (జీవ) నిర్మితమని తెలియనగును,

కొండొక వస్తువునకు కర్త యెవరో గోచరింపక పోయినను ఆ వస్తువు విషయమున 'ఈ వస్తువు పురుష నిర్మితమే' యను బుద్ధి కలిగినచో నా వస్తువు పురుష నిర్మిత మనియు, మిగిలినవి కాదనియు తెలిసికొన వలయును. అంకుర వేదాదులు జీవ నిర్మితములని బుద్ధి వొడమనందున నయ్యవి పురుష నిర్మితములు కాక యీశ్వర నిర్మితములని యెఱుగ వలయును.

వేదము లీశ్వరోక్తము లయినచో నవి పరతః ప్రమాణము లేల కావు ?

"నిజశక్త్యభి వ్యక్తేః స్వతః ప్రామాణ్యమ్" ౫. ౫౧.

నిజశక్త్యభి వ్యక్తేః = శబ్దార్థ మనెడి స్వాభావిక శక్తితో, అభివ్యక్తేః = సృష్టికి నాదియందు సృష్టికర్త వలన ప్రకటితము లగుట చేత, వేదములు, స్వతః ప్రామాణ్యమ్ = తమ యర్థమును తెలుపుటకు ప్రమాణాంతరము నపేక్షింపవు (స్వతః ప్రమాణములు).

స్వతః ప్రామాణ్యము, పరతః ప్రామాణ్యము నని ప్రామాణ్యము రెండు విధములు. స్వతః ప్రామాణ్య మనగా

స్వార్థసిద్ధియందు ప్రమాణాంతరము నపేక్షింపని ప్రమాత్వము. తన జ్ఞానమును కలిగించుట కితర ప్రమాణము నపేక్షించుట పరతః ప్రామాణ్య మనబడును.

వేదము లీశ్వరోక్తము లయినను నాది రహితము లయినందున నిజశక్తిచే ప్రమాణము లగుటచేత స్వతః ప్రమాణము లని భావము. ఇట సాంఖ్యులు 'రూపవిషయమున సూర్యుడు ప్రమాణమైనట్లు' అని యుదాహరింతురు. సూర్యుడు లోకమునగల పదార్థముల రూపమును ప్రకాశింపజేయును. తన రూపమును ప్రకాశింపజేయుట కితర ప్రమాణము నపేక్షింపక స్వయముగా ప్రకాశించును. ఇట్లే వేదము లని యెఱుగునది.

సూత్రకారుడు భ్రాంతిజ్ఞాన విషయమున స్వమతమును జెప్పదలచి ముందుగా పరమతమును నిరాకరించుచున్నాడు.

"నాసతః ఖ్యానం నృశృంగవత్" ౫. ౫౨.

నృశృంగవత్ = నరశృంగము వలె, అసతః = సత్తారహితమయిన (సర్వథా అలీకమగు) వస్తువుయొక్క, ఖ్యానం = జ్ఞానము, న=కలుగదు.

కొండొక సమయమున ముత్యపు చిప్పను (శుక్తి) జూచి 'ఇది రజతము' అని భ్రమపడుట కలదు. ఇట్టి జ్ఞానము భ్రాంతి యనబడును. ఈ భ్రాంతి జ్ఞాన విషయమున కొందఱు (నవీన వేదాంతులు) – ముత్యపు చిప్ప యున్న స్థలమున రజతము లేకున్నను రజతజ్ఞానము కలుగుచున్నది. కాబట్టి వస్తువు జాత్తిగా లేకున్నను వస్తుజ్ఞానము కలుగునందురు. ఈ మతమును సాంఖ్యు లంగీకరింపరు. జాత్తిగాలేని వస్తువు (అసద్వస్తువు) యొక్క జ్ఞానము కలుగనేరదు. మనుష్యునకు

కొమ్ములుండవు. అందువలన మనుజునకు కొమ్ములుండు నను జ్ఞాన మెన్నడును కలుగనేరదు. కాబట్టి అసద్వస్తుఖ్యాతి (జ్ఞానము) అంగీకరింపబడదు. శుక్తియందు రజతము లేకున్నను మఱియొకచో రజతము లేకపోదని భావము.

"న సతోబాధ దర్శనాత్" ౫. ౫౩.

సతః = ముత్యపు చిప్పలో (విజ్ఞాన రూపమున) సద్రూపమున నున్న రజత జ్ఞానము కలుగునందురేని, న=అదియును సరికాదు. బాధ దర్శనాత్ = 'ఇది రజతము కాదు' అని బాధ. పూర్వము రజతమని కలిగిన జ్ఞానమునకు విరుద్ధజ్ఞానము కలుగుచున్నందున.

విజ్ఞానవాదులు ప్రపంచమునందలి ప్రతి వస్తువును విజ్ఞానాత్మక మందురు. కాబట్టి 'శుక్తియందు కలుగు రజతజ్ఞానము విజ్ఞానరూపమున నున్న (సద్రూపమైన) రజతజ్ఞానమే కాని యసత్ఖ్యాతి కాదు' అని యందురేని యదియును యుక్తము కాదు. శుక్తియందు కలుగు రజతజ్ఞానము విజ్ఞానరూపమున సత్ఖ్యాతి యగునెడల నా జ్ఞానము 'ఇది రజతము కాదు. శుక్తియే.' అని బాధింపబడరాదు. కాని బాధింపబడుచున్నది. కాబట్టి విజ్ఞానవాదుల 'సద్ఖ్యాతి'యు సరికాదని భావము.

''నానిర్వచనీయస్య తదభావాత్'' ౫. ౫౪.

అనిర్వచనీయవాదులు శుక్తియందు కలుగు రజత జ్ఞానము సదసద్విలక్షణమైన యనిర్వచనీయ భావమందురు. కాని, అనిర్వచనీయ మనెడి పదార్థ మొందు లేనందున నదియు సాంఖ్యులకు నంగీకృతము కాదని యీ సూత్రాభిప్రాయము.

"నాన్యథాఖ్యాతిః స్వవచో వ్యాఘాతాత్" ౫. ౫౫.

అన్యథాఖ్యాతివాదులు కొందఱు శుక్తియందు కలిగెడి రజతభానము ఎదుటనున్న శక్తికంటె నన్యమైన రజత రూపమున కలుగును. కాబట్టి యది 'యన్యథా ఖ్యాతి' యందురు. కాని యదియును సరికాదు. కారణ మేమన :- ఎదుట శుక్తి యుండగా నన్యథాఖ్యాతి కలుగుననుట స్వవచన వ్యాఘాత మగును. కాబట్టి యన్యథా ఖ్యాతియు సరికాదు.

ఇక సాంఖ్యుల మత మేమి ? యన :-

"సదసత్ఖ్యాతిర్ బాధాబాధాత్" ౫. ౫౬.

సదసత్ ఖ్యాతిః = (సాంఖ్యుల మతమున,) ఇతరస్థలముననున్న రజతము ఎదుట లేకున్నప్పటికిని, ఎదుటనున్న శుక్తియందలి ధావళ్య సామ్యముచే శుక్తి రజతముల యసంబంధము గ్రహింపబడక 'ఇది రజతము' అను భ్రాంతిజ్ఞానము కలుగుచున్నది. దీనినే 'సదసత్ ఖ్యాతి' యందురు. కారణమేమన :- బాధాబాధాత్ = ఎదుటనున్న శుక్తి యందు రజత సంసర్గము లేకపోవుటచే (ఇది రజతము కాదు) అని బాధింపబడినను, ఇతర స్థలమున రజత ముండుటచే రజత జ్ఞానమున కట బాధ కలుగదు.

సాంఖ్యాచార్యులు అఖ్యాతివాదులు. వారు భ్రాంతి జ్ఞానమును అఖ్యాతి యందురు. శుక్తిని జూచి (ఇది రజతము) అని జ్ఞానము కలుగు స్థలమున అనగా భ్రాంతి కలుగుచోట సాంఖ్యదృష్టిలో రెండు జ్ఞానములు కలుగును. చీకటి వలన గానీ, కంటిదోషము వలనగానీ, యెదుటపడియున్న ముత్యపు చిప్పను జూచి 'ఇది వెండి' అందుము. ఇందు 'ఇది' యనున దొక జ్ఞానము. 'వెండి' యనున దిందొక జ్ఞానము. ఎదుటపడి యున్న ముత్యపుచిప్ప (శుక్తి) లోని విశేషత (శుక్తిత్వము)

గ్రహింపబడకపోవుటచే సామాన్యముగ 'ఇది' యను జ్ఞానమొకటి కలుగును. చూచువానిలో గల లోభాది దోషములతో బాటు ముత్యపుచిప్పలోని ధావళ్య (తళుకు) సామ్యము వలన నుద్బుద్ధమైన (ద్రష్టయొక్క) రజత సంస్కారము వలన నేర్పడు రజతస్మరణము – జ్ఞానము – కలుగును. ఇట్లు రెండు జ్ఞానములు కలుగుచున్నను ప్రమాణాది (కంటి) దోషముల వలన 'నా యందు రెండుజ్ఞానములు కలుగుచున్నవి' అని వివేకము కలుగక దానికి విరుద్ధమైన యవివేకము కలుగును. ఈ యవివేకమే భ్రమ – విపర్యయము – మిథ్యాజ్ఞానము – భ్రాంతి యనబడును. 'వెండి' అను జ్ఞానమునకు విషయమైన వెండి యన్యస్థలమునందుండియున్నను ఆ జ్ఞానము కలిగినపుడది యెదుట లేదు. కాబట్టి 'ఇది వెండి కాదు' అని బాధ (జ్ఞానము) కలిగినపుడు దేశాంతరమున వెండి యున్నందున దానికి స్వరూప బాధ కలుగకున్నను, ఎదుట నున్న వస్తువు (శుక్తి)తో వెండికి సంబంధము లేనందున బాధ (సంసర్గతః) కలుగుచున్నది. ఇట్లు 'బాధా బాధ' వలన సాంఖ్యులు సదసద్ ఖ్యాతి నంగీకరింతురు.

ఈ ప్రకరణమున జెప్పబడిన 'అసత్ ఖ్యాతి' 'సత్ ఖ్యాతి' 'అనిర్వాచనీయ ఖ్యాతి' అను మూడు ఖ్యాతులు వైదికు లంగీకరింపరు. 'అన్యథా ఖ్యాతి' 'సదసద్ ఖ్యాతి' అను రెండును వైదికుల కిష్టము.

ఇట్లు భ్రాంతి విషయమున స్వమతమును ప్రదర్శించి యికముందు శబ్ద విషయమున స్వమతమును జెప్పదలచి

ముందుగా స్ఫోట వాదమును నిరాకరించు చున్నాడు.

"ప్రతీ త్యప్రతీతిభ్యాం న స్ఫోటాత్మకః శబ్దః" ౫. ౫౭.

శబ్దః = గోవు, ఘటము నను శబ్దము, స్ఫోటాత్మకః = స్ఫోటాత్మకము, న = కాదు. కారణ మేమన :— ప్రతీత్యప్రతీతిభ్యాం = గకారాది వర్ణముల జ్ఞానమునకు మించి వేరు స్ఫోటమనునది యొకటి తెలియుటలేదు.

కొందఱు (వ్యాకరణ శాస్త్రకారులు) హస్త పాదాద్యవయవముల కతిరిక్తముగా నఖండమైన మూర్తివంతమగు నవయవి వలె గోవు, అనగా గకార, ఓకార, వకార, ఉకార వర్ణముల కతిరిక్తముగా నఖండమైన యొక మూర్తి యర్థజ్ఞానమునకు హేతువై 'పదము' అనెడి పేరు గలిగిన 'గోవు' అను నొక శబ్దవిశేషము 'స్ఫోటము' అనబడు నని యందురు. సాంఖ్యు లియ్యది యంగీకరింపరు. కారణ మేమన :- 'గోవు' అను శబ్దమున గకారాది వర్ణములకు అతిరిక్తముగ వేరొండేమియు తెలియుట లేదు. కాబట్టి స్ఫోటమనున దొండేమియు లేదు.

శబ్దము స్ఫోటాత్మకము కాకున్న పోనిండు. అది నిత్యమేల కాదు ?

"న శబ్ద నిత్యత్వం కార్యతా ప్రతీతేః" ౫. ౫౮.

కార్యతా ప్రతీతేః = 'గ కార ముత్పన్నమైనది. అది నశించినది' అని గకారాది శబ్దములలో కార్యత్వము తెలియుటవలన, శబ్ద నిత్య త్వం న = శబ్దము నిత్యము కాదు.

శంక :-

"పూర్వ సిద్ధసత్త్వ స్యాభివ్యక్తిర్ దీపేనేవ ఘటస్య" ౫ ౫౯.

దీపేన = దీపముద్వారా, ఘటస్య ఇవ = ఘటము వలె, పూర్వ సిద్ధసత్త్వస్య = కారణ వ్యాపారమునకు పూర్వమే ఉనికిగలిగిన శబ్దము, అభి వ్యక్తిః = ప్రకట మగును.

దీపము తెచ్చుటకు ముందే యంధకారమునందు ఉన్న ఘటపటాది పదార్థములు దీప ప్రకాశము ద్వారా ప్రకటమగును. అప్పుడు క్రొత్తగా జనింపవు. అట్లే గోవు, ఘటము మున్నగు శబ్దములును క్రొత్తగా పుట్టక ఉచ్చారణాది కారణ వ్యాపారములకు పూర్వమే యునికి గలవై యుండి ప్రకటమగును. ఉచ్చారణాదుల వలన ధ్వని యుత్పన్న మగును కాని, గోవు మున్నగు శబ్దము లుత్పన్నములు కావని శబ్ద నిత్యత్వవాది అభిప్రాయము.

సమాధానము :-

"సత్కార్యసిద్ధాన్తశ్చేత్సిద్ధసాధనమ్" సూ. ౬౦.

చేత్ సత్కార్యసిద్ధాన్తః = సత్కార్యసిద్ధాంత మగునెడల, సిద్ధ సాధనమ్ = సిద్ధించిన దానిని సాధించుటయే యగును.

సాంఖ్యులు సత్కార్యవాదులు. కారణ వ్యాపారము లకు పూర్వమూ కారణరూపమున నున్న కార్యములే వ్యాపా రానంతరమున ప్రకటమగు నని వారి మతము. కాబట్టి శబ్ద నిత్యత్వవాదులు గోవు మున్నగు శబ్దములు కూడ సత్కార్యవాద సిద్ధాంతము ననుసరించి యభివ్యక్తములే యందురేని తమ కేమియు నందు భిన్నాభిప్రాయము లేదను సాంఖ్యుల యభిమతము నీ సూత్రము చెప్పుచున్నదని భావము.

ఆత్మలనేకములు కావను ఆత్మాద్వైతవాద నిరసనము :-

"నాద్వైత మాత్మనో లింగాత్తద్భేదప్రతీతేః" సూ. ౬౧.

లింగాత్ = హేతువుద్వారా, తద్భేదప్రతీతేః = ఆత్మలలోని భేదము తెలియుచున్నందున, ఆత్మనః = ఆత్మయొక్క అద్వైతం న = అద్వైతము — ఏకత, యంగీకరింప తగదు.

లోకమున ప్రాణులు సుఖము, దుఃఖము, వార్ధక్యము, మరణాదులు ననుభవించుట జూచుచున్నాము. ఈ సుఖాదులు ప్రతి ప్రాణికి వేరువేరుగా లభించును. ఒక క్షణమున నొకరు సుఖపడుచుండ మరి యొకరు దుఃఖము ననుభవింతురు. కాబట్టి యాత్మ యొక్కటియే యన వలనుపడదు. ప్రతి శరీరమునందును నొక్కొక్క యాత్మ భిన్నముగా నుండి యందు సుఖ దుఃఖముల ననుభవించునని యంగీకరింప వలయును.

సజాతీ యాత్మాద్వైతము నంగీకరింపకున్నను, విజాతీ యాద్వైత మేల యంగీకరింప జనదు ?

"నానాత్మనాఽపి, ప్రత్యక్ష బాధాత్" ౫. ౬౨.

ప్రత్యక్ష బాధాత్ = భేదమును తెలుపు ప్రత్యక్షముచే బాధ కలుగుచున్నందున, న అనాత్మనాఽపి = ఆత్మకాని జగత్తుతోను, అద్వైతత్వము — అ భేదము సిద్ధింపదు.

ప్రత్యక్ష ప్రమాణము వలన జగత్తు వేరుగాను, ఆత్మలు వేరుగాను తెలియుచున్నందున ఆత్మ జగత్తులలో భేదము లేదనుట యుక్తము కాదని భావము.

ఆత్మ, జగత్తు రెండును సముచ్చితములై యద్వైత మన నొప్పదా ?

"నోభాభ్యాం తేనైవ" ౫. ౬౩.

తేనైవ = పై కారణము చేతనే, నోభాభ్యాం = ఆత్మ జగత్తులు సముచ్చితము లయ్యు నేకమన రాదు. ఆత్మజగత్తులు సముచ్చి

తము లై యద్వైత మనుటయు ప్రత్యక్ష విరుద్ధమే యగునని సూత్ర భావము.

అటులయిన నద్వైత ప్రతిపాదక శ్రుతితో విరోధము కలుగదా ?

"అన్య పరత్వ మవివేకానాం తత్ర" ౫. ౬౪.

తత్ర = శ్రుతియందు, అవివేకానాం = శాస్త్రజ్ఞానము లేని వారికే అన్య పరత్వం = ద్వైతమునకంటె భిన్నత్వము బోధపడును.

శ్రుతి యద్వైతమును బోధించు ననుట యవివేకమే కాని వేరొండు కాదు. శాస్త్రజ్ఞానము లేనివారికి శ్రుతి యద్వైత బోధకముగా దోచునని భావము.

మట్టి యుపాదాన కారణముగా గల ఘటాదులు మట్టి కంటె వేరుగానట్లు, జగత్తున కాత్మ ఉపాదాన కారణము కావున జగత్తు ఆత్మకంటె భిన్న మెట్లగును ?

"నాత్మా ౽విద్యా నోభయం జగ దుపాదానకారణం
నిః సంగత్వాత్" ౫. ౬౫.

నిఃసంగత్వాత్ = సంగ (సంబంధ) రహితములగుటచే, జగ దూపాదాన కారణం = జగత్తున కుపాదాన కారణము, న ఆత్మా= ఆత్మకాదు, న అవిద్యా = అవిద్యయుకాదు, నోభయం = ఆత్మ, అవిద్య అను నీ రెండును కాదు.

జగత్తు ఆత్మోపాదానకము (జగత్తునకు ఆత్మ ఉపాదాన కారణము) అని మాయావాదు లందురు. ఆత్మోపాదానక మనగా నేమి ? ఆత్మ మాత్రోపాదానకమా ? లేక ఆత్మా శ్రిత మగు నవిద్యోపాదానకమా ? లేక ఆత్మయు నవిద్యయు నను రెండును జగత్తున కుపాదాన కారణమా ? ఆత్మ కూటస్థమై పరిణామరహితమైనది; కావున నయ్యది జగత్తున

కుపాదానము కాజాలదు. అవిద్య కల్పితమగుటచే నయ్యదియు జగత్తున కుపాదానము కాదు. ఆత్మ అవిద్య అను నీ రెండును పరస్పరము సంగము (సంబంధము) లేని వగుటచే రెండును కలిసి జగత్తున కుపాదాన కారణమగుననుటయు పొసగదు. కాబట్టి జగత్తు ఆత్మోపాదానకము కావున నాత్మాభిన్నమగు ననుటయు యుక్తివిరుద్ధమని భావము.

జీవుని యానంద రూపత్వమును నిరాకరించు చున్నాడు.

"నైకస్యానంద చిద్రూపత్వే ద్వయోర్భేదాత్" సూ. ౬౬.

ఏకస్య = ప్రతి శరీరమునందు నొక్కడొక్కడుగ నుండు జీవాత్మనకు, న ఆనంద చిద్రూపత్వే = సుఖరూపత, జ్ఞానరూపత అను రెండు రూపములు లేవు. ద్వయోః =సుఖము, జ్ఞానము నను రెండింటిలో, భేదాత్ = భేదముండుట వలన.

జీవుడు జ్ఞానరూపుడైనట్లు ఆనందరూపుడు నని కొందఱు (అద్వైతులు) చెప్పుదురు. కాని సాంఖ్యుల కది యభిమతము కాదు. జ్ఞానమునకు, ఆనందమునకు భేదముకలదు. మనుజుడు దుఃఖము ననుభవించునపుడు సుఖము ననుభవింపడు. జీవుడు సుఖ (ఆనంద) రూపుడగునెడల దుఃఖము ననుభవించునపుడును సుఖానుభూతి యుండవలయును. కాబట్టి జీవుడు జ్ఞానస్వరూపుడే కాని సుఖస్వరూపుడు కాడని భావము

కొండొకవేళ జీవుడు తనను సుఖరూపుడుగా నెంచునేల ?

"దుఃఖనివృత్తేర్ గౌణః" సూ. ౬౭.

దుఃఖనివృత్తేః = దుఃఖము తొలగినపుడు, గౌణః = కలుగు సుఖ జ్ఞానము గౌణము.

ఒకప్పుడొక తీవ్ర దుఃఖమునుండి ముక్తుడై జీవుడు 'దుఃఖ ముక్తుడ నైతి'నని చెప్పుటకు బదులు సుఖి నైతిని - సుఖ స్వరూపుడ నైతి నను. (ఆనందో౽హమస్మి).

ముక్తావస్థయందు కొందఱు జీవున కానందరూపమును వర్ణింతురు కదా ?

"విముక్తి ప్రశంసా మందానామ్" సూ. ౬౮

మందానాం = వేదశాస్త్ర జ్ఞానహీనులు, విముక్తి ప్రశంసా = ముక్త్యవస్థయందు జీవున కానంద స్వరూపమును జెప్పుదురు.

శాస్త్రజ్ఞానము లేనివారు ముక్తి నట్లు ప్రశంసింతురని భావము.

మనస్సుయొక్క విభుత్వమును నిరాకరించుచున్నాడు :-

"న వ్యాపకత్వం మనసః కరణత్వా దింద్రియత్వాద్వా" సూ. ౬౯.

కరణత్వాత్ = గొడ్డలి మున్నగు వానివలె సాధన మగుట వలనను, ఇంద్రియత్వాద్వా = నేత్రాదులవలె నింద్రియ మగుట వలనను, మనసః = మనస్సునకు, వ్యాపకత్వం = వ్యాపకత-విభుత్వము, న = లేదు.

"సక్రియత్వాత్ గతిశ్రుతేః" సూ. ౭౦.

మఱియు, గతిశ్రుతేః = మనస్సుతో కూడిన జీవుడు లోకాంతరమునకు వెళ్ళునట్లు శ్రుతి చెప్పుచున్నందున, సక్రియత్వాత్ = మనస్సు క్రియావంత మగుచున్నది. కాబట్టి యది వ్యాపకము కానేరదని భావము.

అటులయిన మనస్సు అణుపరిమాణము కలిగినదా ?

"న నిర్భాగత్వం తద్యోగాద్ ఘటవత్ సూ. ౭౧.

ఘటవత్ = ఘటమువలె, తద్యోగాత్ = భాగములు (అవయవములు) కలదగుట వలన, నిర్భాగత్వం = మనస్సు భాగములు లేని యణు పరిమాణము కలదనుట, న = తగదు.

మనస్సు సావయవియే కాని యణువు కాదని భావము.
మనస్సు సావయవి యైన నది నిత్య మెట్లగును ?

"ప్రకృతి పురుషయోరన్యత్ సర్వ మనిత్యమ్" ౫. ౭౨.

ప్రకృతి, పురుషులు కాక మిగిలినదంతయు ననిత్యమే. కావున మనస్సు ననిత్యమే యని సూత్రార్థము.

"న భాగలాభో భోగినో నిర్భాగత్వ శ్రుతేః" ౫. ౭౩.

నిర్భాగత్వశ్రుతేః = శ్రుతి (అజో నిత్యః శాశ్వతోఽయం పురాణః ... కఠ. ౧. ౨. ౧౮.) వలన జీవుడు నిరవయవి – భాగరహితుడు అని తెలియుచున్నందున, భోగినః = జీవుడు, న భాగలాభః = సావయవి కాడు.

సంసారావస్థయందు వ్యక్తము కాని యానందము వ్యక్తమగుటయే ముక్తియని కొందఱు చెప్పుదురు. ఆ మతమును నిరాకరించుచున్నాడు :-

"నానందాభివ్యక్తిర్ ముక్తిర్ నిర్ధర్మత్వాత్" ౫. ౭౪.

నిర్ధర్మత్వాత్ = ఆత్మలో నానందమనెడి ధర్మమొకటి లేనందున, ఆనందాభివ్యక్తిః = ముక్తియందు ఆనందము అభివ్యక్తము (ప్రకటము) అగుటయే, న ముక్తిః = ముక్తి కాదు.

ఆత్మ జ్ఞానస్వరూపము. అందు జ్ఞానాది ధర్మము లుండవు. కాబట్టి ముక్తి యందు ఆనందము అభివ్యక్తమగు ననుట పొసగదని భావము.

అటులయిన నెల్లగుణముల విచ్ఛేదము ముక్తియగునా?

"న విశేషగుణోచ్ఛిత్తి స్తద్వత్" ౫. ౭౫.

తద్వత్ = ఆనందాభివ్యక్తి ముక్తికానట్లు, న విశేషగుణోచ్ఛిత్తిః = విశేషగుణములు కలుగకుండుటయు ముక్తి కానేరదు.

ఆత్మ మనః సంయోగము వలన జ్ఞానాది విశేషగుణములు కలుగుచుండును. అట్టి గుణములు కలుగకుండుటయు ముక్తి కానేరదని భావము.

"న విశేషగతిర్ నిష్క్రియస్య" ౫. ౭౬.

నిష్క్రియస్య = క్రియారహితమైన ఆత్మయందు, న విశేషగతిః = నిరంతరము ఊర్ధ్వగతి కలుగుటయే ముక్తి యనుటయు తగదు.

కొందఱు (జైనులు) జీవునకు నిరంతరము ఊర్ధ్వగతి కలుగుటయే ముక్తియందురు. అదియును యుక్తి సంగతము కాదు. కారణ మేమన :- జీవుడు క్రియారహితుడు. కాబట్టి యూర్ధ్వగతి ముక్తి యనుటయు తగదని భావము.

విజ్ఞాన వాదుల మత నిరాకరణము :-

"నాకారోపరాగోచ్ఛిత్తిః క్షణికత్వాది దోషాత్" ౫. ౭౭.

క్షణికత్వాది దోషాత్ = క్షణికత్వము మున్నగు దోషముల వలన, న ఆకారోపరాగోచ్ఛిత్తిః=విషయాకార వాసనా లక్షణ సంబంధము తొలగుటయు ముక్తి కాదు.

కొందఱు (విజ్ఞాన వాదులు) క్షణిక విజ్ఞానమే ఆత్మ యందురు. అయ్యది ప్రతి క్షణమును విషయాకారముల నేర్పడుచుండును. అట్టి విషయాకారముల వాసన యనెడి సంబంధ విశేషము నశించుటయే ముక్తి యందురు. కాని యదియును సాంఖ్యుల కభిమతము కాదు. కారణమేమన :- విజ్ఞానవాదుల మతమున పదార్థము లన్నియు క్షణికములే యగును. అట్టియెడ ముక్తి యన నేమి ? అది యెవ్వరికి ? ఈ మతమును యుక్తి విరుద్ధమే యని భావము.

అటులయిన సర్వనాశమే ముక్తి యేల కాదు ?

"న సర్వోచ్ఛిత్తి రపురుషార్థత్వాది దోషాత్" ౫. ౭౮.

అపురుషార్థత్వాది దోషాత్ = పురుషార్థము కానందువలనను, జీవనాశ మసంభవ మగుటవలనను. సర్వోచ్ఛిత్తిః = విషయోపరాగము, జీవుడు నన్నియు నశించుట, న = ముక్తి కాదు.

విజ్ఞానాత్మ, విషయోపరాగము నన్నియు నశించుటయే ముక్తి యనుటయు తగదు సర్వనాశము పురుషార్థము కానేరదు. మఱియు జీవుడు నశించుననుట యసంగతమని భావము.

"ఏవం శూన్య మపి" ౫ ౭౯.

పై జెప్పిన దోషములవలననే సర్వము శూన్య మగుటయే ముక్తి యను శూన్యవాదుల మతముకూడ నంగీకరింప దగనిదే యని భావము.

"సంయోగాశ్చ వియోగాంతా ఇతి న దేశాదిలాభోఽపి" ౫. ౮౦.

సంయోగాశ్చ = సంయోగములు, వియోగాంతాఃఇతి = వియోగము చెందునవి కాబట్టి, దేశాదిలాభోఽపి=కొండొక విశేష ప్రదేశమున జేరుటయు, న = ముక్తి కాదు.

కొందఱు కొండొక విశేషస్థానమును పొందుట ముక్తి యందురు. కాని యొకానొక స్థానమున జేరుట యన నొక క్రొత్త ప్రదేశముతో సంబంధము కలుగుటయే కదా ? అది యొక సంయోగవిశేష మనక తప్పదు. సంయోగ మనగా ప్రాప్తి. అట్టిది విడిపోవక తప్పదు. కాబట్టి సంయోగము లన్నియు వియోగాంతములు అందువలన గోలోక, వైకుంఠ కైలాస, ముక్తిపీఠములు మున్నగు స్థానములను బొందుట ముక్తి యనుటయు ప్రమాణ విరుద్ధమే.

"న భాగియోగో భాగస్య॥" సూ. ౮౧.

భాగస్య = ఈశ్వరాంశమైన జీవునకు, భాగియోగః = అంశియైన ఈశ్వరునితో చేరుట, న = ముక్తి కాదు.

కొందఱు జీవుడు ఈశ్వరుని యంశము (భాగము) కాబట్టి మరలనీశ్వరునియందు జేరిపోవుటయే ముక్తి యందురు. అదియును ముక్తి కాదు. ఈశ్వరుని జేరుట యన - నీశ్వరునితో జీవునకు సంయోగము గలుగుటయే కదా ! సంయోగము వియోగాంతమే యగును కాబట్టి యీశ్వర సంయోగము ముక్తి కాదని భావము. వాస్తవమున జీవు డంశము (భాగము) కాదు. అంశ మగునెడల ననిత్య మగును.

అటులయిన నణిమాది ప్రాప్తియే ముక్తి యగునా ?

"నాణిమాది యోగోఽప్యవశ్యంభావిత్వా
త్తదుచ్ఛిత్తి రితరయోగవత్॥" సూ. ౮౨.

ఇతరయోగవత్=స్థానాది ఇతర సంయోగములవలె, తదుచ్ఛిత్తిః=. అణిమాదుల ప్రాప్తినాశమును, అవశ్యంభావిత్వాత్ = తప్పక కలుగును. కాబట్టి, అణిమాదియోగోఽపి న = అణిమ, మహిమ, మున్నగు విభూతుల ప్రాప్తియు ముక్తి కానేరదు.

యోగశాస్త్రమున వర్ణింపబడిన అణిమాది విభూతులను పొందుటయు ముక్తి కానేరదని భావము.

"నేంద్రాది పదయోగోఽపి తద్వత్" సూ. ౮3.

తద్వత్ = అణిమాదుల ప్రాప్తి నశించునట్లు నశించునదియే కాబట్టి, ఇంద్రాది పదయోగోఽపి న = ఇంద్రాదిపద ప్రాప్తియు ముక్తి కాదు.

ఇంద్ర, బృహస్పతి, ప్రజాపత్యాది పదవుల ప్రాప్తియు ముక్తి కాదని భావము.

నాసికాది ఇంద్రియములు పంచభూతముల నుండి యేర్పడినట్లు న్యాయ వైశేషికకారులు (గౌతమ కణాదులు) చెప్పుదురు. అహంకారము నుండి నాసికా దీంద్రియములేర్ప డునని సాంఖ్యుల మతము. అది యిట నిరూపించుచున్నాడు.

"న భూతప్రకృతిత్వ మింద్రియాణామ్ అహంకారికత్వ శ్రుతేః"
౨. ౮౪.

ఆహంకారికత్వశ్రుతేః = అహంకారమునుండి యింద్రియము లుత్పన్నము లైనట్లు శ్రుతి చెప్పుచున్నందున, ఇంద్రియాణామ్ = నాసికా దీంద్రియములు, భూత ప్రకృతికత్వం న = భూతములనుండి యుత్పన్న మగుననుట సరికాదు.

"న షట్పదార్థ నియమస్త ద్బోధాన్ముక్తిః" ౨. ౮౫.

మఱియు సాంఖ్యులమైన మాకు షట్పదార్థ నియమః = పదా ర్థము లారే యను నియమము కాని, తద్బోధాత్ ముక్తిః = వాని తత్త్వ జ్ఞానము వలన ముక్తి కలుగునని కానీ, న = అంగీకారము కాదు. ద్రవ్య గుణ కర్మాది షట్ పదార్థ జ్ఞానమువలన గాక, పంచవింశతి (ఇరువది యైదు) తత్త్వముల వివేకము వలన ముక్తి కలుగునని భావము.

''షోడశాది ష్వప్యేవమ్'' ౨. ౮౬.

ఇట్లే నైయాయికులు పదార్థములు ప్రమాణ, ప్రమే యాది భేదములతో పదునాఱనియు వాని తత్త్వజ్ఞానము వలన నిఃశ్రేయసప్రాప్తి (ముక్తి) కలుగుననియు జెప్పుదురు. అదియు సాంఖ్యులకు సమ్మతము కాదని యీ సూత్రాభిప్రాయము.

షట్ పదార్థములు, షోడశపదార్థములు నన నేమో వాని వివరణ మేమో తెలియగోరువారు నాచే రచియింప బడిన న్యాయ వైశేషిక దర్శనముల (అంబా వ్యాఖ్యానము) జదువగోరుచున్నాడ.

"నాణునిత్యతా తత్కార్యత్వ శ్రుతేః" ౫. ౮౭.

అణునిత్యతా = అణువు నిత్యత్వము, న = సంభవము కాదు. తత్కార్యత్వ శ్రుతేః = అణువులు ప్రకృతి కార్యము లగుటవలన.

ఇతర శాస్త్రములందు చెప్పబడు అణువుల నిత్యము లనుట యుక్తము కాదు. అవి కార్యము లగుటచే ననిత్యములే యని భావము. ఈ సూత్రమున జెప్పబడిన అణు పదము ద్వ్యణుకమో లేక త్రసరేణువగు త్ర్యణుకమో నై యుండ వలయును. ద్వ్యణుకాదులే కార్యములనుట యుక్తము. వైశేషికాదులందు జెప్పబడిన అణుపదముపరమాణువు పరము. అయ్యది కార్యము కాదు - నిరవయవము - నిత్యము. కాబట్టి ద్వ్యణుకాద్యణుపదార్థ మిట గ్రహించుట యుక్త మగును.

విజ్ఞానభిక్షువు మాత్రము అణుపదము పరమాణు పరమే యనియు, అణుపదము ద్వ్యణుకాద్యణుపదార్థ పరముగా జెప్పుటకు ప్రమాణము గానమనియు వర్ణించి యున్నాడు. అణువు కార్యమని చెప్పు శ్రుతిమాత్రము ప్రస్తుతము లోపించిన దనియు నతడు భాషించి యున్నాడు.

వాస్తవమున సాంఖ్య మతమున సత్త్వ రజస్తమో రూప ప్రకృతి కార్యము లయిన తన్మాత్రరూపములే యిట యణువులుగా జెప్పి యవి కార్యములు కాబట్టి నిత్యములు కావనిన నెంతయు బాగుండును.

"న నిర్భాగత్వం కార్యత్వాత్" ౫. ౮౮.

కార్యత్వాత్ = కార్య మగుటవలన, న నిర్భాగత్వం = భాగ రహితము = అవయవరహితము అనరాదు.

అణువను పదార్థము కార్యపదార్థము కాబట్టి నిరవయవము - నిర్భాగము అనజనదని భావము.

''న రూపనిబంధనాత్ ప్రత్యక్ష నియమః'' సూ. ౮౯.

రూప నిబంధనాత్ = కేవల రూప మున్నంత మాత్రమున, న ప్రత్యక్ష నియమః = వస్తువు ప్రత్యక్షము కావలయునను నియమము యుక్తము కాదు.

కేవల రూపము వస్తువు ప్రత్యక్షమునకు నిమిత్తము కాదు. అటులయిన ద్వ్యణుకము కూడ ప్రత్యక్షము కావలసి వచ్చును.

''న పరిమాణచాతుర్విధ్యం ద్వాభ్యాం తద్యోగాత్'' సూ. ౯౦.

ద్వాభ్యాం=అణువు, మహత్తు, నను రెండు విధములగు, తద్యోగాత్ = పరిమాణ సంబంధమువలన, పరిమాణచాతుర్విధ్యం న = పరిమాణము నాలుగు విధము లనజనదు.

కొందఱు అణువు, మహత్తు, హ్రస్వము, దీర్ఘము నని పరిమాణము:ను నలువిధముల వ్యవహరింతురు. ఈ వ్యవహారము సాంఖ్యవాదుల కనంగీకృతము. అణువు, మహత్తు నని రెండు విధముల వ్యవహరించుటయే యుక్తమని సాంఖ్యాభిప్రాయము.

'వాడే వీడు'. 'అదియే యిది' యని గుర్తించుట ప్రత్యభిజ్ఞ యనబడును. అయ్యది సామాన్యవిషయక మని వర్ణించుచున్నాడు :-

"అనిత్యత్వేఽపి స్థిరతాయోగాత్ ప్రత్యభిజ్ఞానం సామాన్యస్య" సూ. ౯౧.

అనిత్యత్వేఽపి = అనిత్యమయినప్పటికి. స్థిరతాయోగాత్ = చిరకాలముండునదిగా నంగీకరింపబడుటవలన, ప్రత్యభిజ్ఞానమ్ = ప్రత్యభిజ్ఞానము (గుర్తించుట), సామాన్యస్య = సామాన్యము విషయము.

సాంఖ్యమతమున ప్రకృతి పురుషులకు వ్యతిరిక్త మంతయు ననిత్యమగుటచే ప్రత్యభిజ్ఞానమునకు ననిత్యమే. అయినను నయ్యది చిరకాలముండును కాబట్టి సామాన్య విషయకమని యభిప్రాయము. సామాన్యమనగా నిట అనేక వస్తువులలో సమానబుద్ధిని గలిగించు ధర్మమని గ్రహింపవలయును. అట్టిది యొకటి లేకున్నచో 'అదియే యిది' 'వాడే వీడు' అను ప్రత్యభిజ్ఞ కలుగజాలదని భావము. ఇయ్యది బౌద్ధులంగీకరింపరు.

ప్రత్యభిజ్ఞకు సామాన్యము విషయమైన నేమి ?

''న తదపలాప స్తస్మాత్'' ౫. ౯౨.

తస్మాత్ = సామాన్యము (అనుగత ధర్మము) ప్రత్యభిజ్ఞకు విషయము కాబట్టి, న తదపలాపః = సామాన్యము నంగీకరింప కుండుట యుక్తము కాదు.

ఘటపటాదులలో ఘటత్వము, పటత్వము నను సామాన్యము (అనుగత ధర్మము) 'ఘటము పటము కాదు' అను పటత్వాభావరూపమే కాబట్టి దానిని వేరుగా నంగీకరింపనేల ? అతద్వ్యావృత్తి రూపమే యన జనదా ? యన :-

''నాన్యనివృత్తి రూపత్వం భావప్రతీతేః'' ౫. ౯౩.

భావప్రతీతేః = భావ (ఉనికి) జ్ఞానము కలుగుటవలన, అన్యనివృత్తి రూపత్వం న = (సామాన్యము) అభావ రూపము (ఘటత్వమునగా పటాన్యత్వము) కాదు.

'అదియే యిది', 'వాడే వీడు' అను ప్రత్యభిజ్ఞకు విషయము ఘటమో. లేక, దేవదత్తుడో యగును కాని, పటాన్యత్వమో, యజ్ఞదత్తాభావమో కాదు. కాబట్టి

సామాన్యము భావరూపమే కాని యభావము కాదు.

అటులయిన ప్రత్యభిజ్ఞకు విషయము సాదృశ్యమేల కాదు ?

"న తత్త్వాంతరం సాదృశ్యం. ప్రత్యక్షోపలబ్ధేః ౫. ౯౪.

సాదృశ్యం=సమానత, న తత్త్వాంతరం=అనే కావయవములలో గల సమానతకంటె వేరే వస్తువు కాదు. కారణ మేమన :- ప్రత్యక్షోపలబ్ధేః = ప్రత్యక్షప్రమాణము వలన తెలియబడుచున్నందున

'గోవువంటిదే గవయము' అను తావున సాదృశ్యము ప్రత్యక్ష గోచరమైనట్లు 'అదే యిది' అను ప్రత్యభిజ్ఞా స్థలము నందును సాదృశ్యము ప్రత్యక్షమే యగును. కాబట్టి యది తత్త్వాంతరముకాదు అందువలననే సాదృశ్యము ప్రత్యక్షమున నకు విషయమే యగును కాని ప్రత్యభిజ్ఞకు విషయము కానేరదని భావము.

సాదృశ్యము అన్యవస్తుజ్ఞానము నపేక్షించును. కాబట్టి యది వస్త్వంతర మేల కాదు ?

"నిజశక్త్యభివ్యక్తిర్వా వైశిష్ట్యాత్తదుపలబ్ధేః" ౫. ౯౫.

వా = లేక, వైశిష్ట్యాత్తదుపలబ్ధేః = వైశిష్ట్యమువలన సాదృశ్య జ్ఞానము కలుగుచున్నందున, నిజశక్త్యభివ్యక్తిః = మరియొక వస్తువు యొక్క దర్శనము నపేక్షించు వస్తువుయొక్క స్వాభావికశక్తియే సాదృశ్యమనబడును.

సాదృశ్యమనగా మఱియొక వస్తువుయొక్క జ్ఞానము నపేక్షించు కొండొక వస్తువుయొక్క స్వాభావికశక్తియే కాని వేరొండు వస్తువుకాదు. కాబట్టి సాదృశ్యము వేరొండు వస్తువు కాదు.

సాదృశ్యమువలన సంజ్ఞాసంజ్ఞి సంబంధజ్ఞానము కలుగుచున్నది. కాబట్టి సాదృశ్యము స్వాభావికశక్తి యనుట యుక్తిసంగత మెట్లగును ?

''న సంజ్ఞా సంజ్ఞి సంబంధోఽపి'' సూ. ౯౬.

సంజ్ఞాసంజ్ఞి సంబంధోఽపి = సంజ్ఞాసంజ్ఞి సంబంధము కూడ, న = సాదృశ్యమువలన తెలియదు.

సంజ్ఞ యనగా పేరు. సంజ్ఞి యనగా పేరుగల వస్తువు. ఆ రెండింటికి గల సంబంధము సాదృశ్యము వలన తెలియు ననుట సరికాదు. ఆ సంబంధము వృద్ధుల యుపదేశాదుల వలననే కలుగును. కాబట్టి సంజ్ఞాసంజ్ఞి సంబంధజ్ఞానమునకు సాదృశ్యము హేతువైనందున నయ్యది వస్త్వంతరమనుటయు క్తము కాదని భావము.

దిక్కాలాదుల సంబంధము నిత్యమనుట యుక్తము కాదని యీ సూత్రమున వర్ణించుచున్నాడు.

''న సంబంధనిత్యతోభయా నిత్యత్వాత్'' సూ. ౯౭.

ఉభయానిత్యత్వాత్ = దిక్కాలములు, కాలాకాశములు ననునవి నిత్యములు కానందున, న సంబంధనిత్యతా = వాని సంబంధమును నిత్యము కాదు.

సాంఖ్య మతమున కాలాకాశాములన్నియు ననిత్యములు. అందువలన వాని సంబంధమును నిత్యము కానేరదు.

సంబంధము గల వస్తువు లనిత్యములయినను వాని సంబంధము నిత్య మేల కాదు ?

"నాజః సంబంధః ధర్మిగ్రాహకమాన బాధాత్" ౫. ౯౮.
ధర్మిగ్రాహకమానబాధాత్ = సంబంధము గల వస్తువులను గ్రహింప జేయు ప్రమాణముచేతనే బాధింపబడుట వలన, న అజః సంబంధః = వాని సంబంధము నిత్యము కాదు.

సంబంధము విభాగపూర్వకమే యగును. అనగా నొక ప్పుడు విడివిడిగానుండు వస్తువుల కలయికయే సంబంధ మన బడును. ఇట్టి జ్ఞాన మే ప్రమాణము వలన కలుగునో యా ప్రమాణమే యా సంబంధము నిత్యము కానేరదని తెలుపునని భావము.

అటులయిన కార్యకారణములకు గల సమవాయ సంబంధము కూడ నిత్యము కాదా ?

"న సమవాయోఽస్తి ప్రమాణాభావాత్" ౫. ౯౯.
ప్రమాణాభావాత్ = ప్రమాణమే లేనందున, సమవాయః న అస్తి = సమవాయము లేదు.

కార్యకారణముల మధ్య సమవాయ మను పేరు గల సంబంధమే లేదు. అట్టి సంబంధమును సాధించు ప్రమాణమును లేదు. కాబట్టి యా సంబంధ మంగీకరింప తగినదికాదు, సంబంధమే లేనపుడు దాని నిత్యత్వము సుతరాం చెల్లదని భావము.

ప్రత్యక్షానుమాన ప్రమాణముల వలన నేల యది సిద్ధింపదు ?

"ఉభయత్రాప్యన్యథాసిద్ధేర్ న ప్రత్యక్షమనుమానం వా" ౫. ౧౦౦
ఉభయత్రాపి = ప్రత్యక్షానుమాన ప్రమాణద్వయము నందును, అన్యథాసిద్ధేః = స్వరూపసంబంధముచేతనే కార్యము సిద్ధించుచున్నందున, న ప్రత్యక్షమనుమానం వా=ప్రత్యక్షముకానీ, అనుమానము కానీ సమవాయ సంబంధమును తెలుపజాలవు.

నైయాయికులు వైశేషికులు దేనిని సమవాయ సంబంధమందురో యా సంబంధమునే యోగులు సాంఖ్యులు స్వరూపసంబంధ మందురు. కాబట్టి సాంఖ్య మతమున సమవాయ సంబంధ మొండు లేదనియు, నది నిత్యము కాదనియు పై సూత్రములందు వర్ణింపబడినవి.

బౌద్ధులు 'క్రియ ప్రత్యక్షగమ్యము కాదు. కేవలము అనుమానగమ్యమే' యని యందురు. ఆ మతము సరికాదని యనుచున్నాడు

"నానుమేయత్వమేవ క్రియాయా నేదిష్ఠస్య తత్తద్వతో రేవాపరోక్షప్రతీతేః" ౫. ౧౦౧.

నేదిష్ఠస్య = మిక్కిలి సమీపముననుండు వానికి, తత్తద్వతో రేవ = క్రియయొక్కయు, క్రియగల వస్తువు యొక్కయు, అపరోక్ష ప్రతీతేః = ప్రత్యక్ష జ్ఞానము కలుగుట వలన, క్రియాయాః = క్రియ యొక్క జ్ఞానము, నానుమేయత్వమేవ = అనుమాన ప్రమాణము వలన మాత్రమే కలుగుననుట యుక్తము కాదు.

'ఒక వస్తు వొక స్థానమున ముందు కనబడి మఱియొక క్షణమున నయ్యది మఱియొక స్థానమున కనబడుననుకొనుడు. అప్పు డా వస్తువు పూర్వప్రదేశమునువిడిచి క్రొత్తప్రదేశమును చేరినదని యెంచవలయును. ఇట్లు పూర్వదేశ విభాగము మఱియొక ప్రదేశ సంయోగమును మన మా వస్తువున జూతుము. అనగా ప్రత్యక్ష మగును. ఈ సంయోగ వియోగముల వలన నా వస్తువునందు ఒక చోటునుండి మఱియొకచోటుకు పోవుట యను క్రియ గలిగిన ట్లూహింతుము. అనగా అనుమానము వలన తెలిసికొందుము. కాబట్టి క్రియ అనుమానమువలననే తెలియును కాని ప్రత్యక్ష ప్రమాణగమ్యము కాదు.' అని

"నాజః సంబంధః ధర్మిగ్రాహకమాన బాధాత్" ౫. ౯౮.
ధర్మిగ్రాహకమానబాధాత్ = సంబంధము గల వస్తువులను గ్రహింప జేయు ప్రమాణముచేతనే బాధింపబడుట వలన, న అజః సంబంధః = వాని సంబంధము నిత్యము కాదు.

సంబంధము విభాగపూర్వకమే యగును. అనగా నొక్కప్పుడు విడివిడిగానుండు వస్తువుల కలయికయే సంబంధ మన బడును. ఇట్టి జ్ఞాన మే ప్రమాణము వలన కలుగునో యా ప్రమాణమే యా సంబంధము నిత్యము కానేరదని తెలుపునని భావము.

అటులయిన కార్యకారణములకు గల సమవాయ సంబంధము కూడ నిత్యము కాదా ?

"న సమవాయోఽస్తి ప్రమాణాభావాత్" ౫. ౯౯.

ప్రమాణాభావాత్ = ప్రమాణమే లేనందున, సమవాయః న అస్తి = సమవాయము లేదు.

కార్యకారణముల మధ్య సమవాయ మను పేరు గల సంబంధమే లేదు. అట్టి సంబంధమును సాధించు ప్రమాణమును లేదు. కాబట్టి యా సంబంధ మంగీకరింప తగినదికాదు, సంబంధమే లేనపుడు దాని నిత్యత్వము సుతరాం చెల్లదని భావము.

ప్రత్యక్షానుమాన ప్రమాణముల వలన నేల యది సిద్ధింపదు ?

"ఉభయత్రాప్యన్యథాసిద్ధేర్ న ప్రత్యక్షమనుమానం వా" ౫. ౧౦౦

ఉభయత్రాపి = ప్రత్యక్షానుమాన ప్రమాణద్వయము నందును, అన్యథాసిద్ధేః = స్వరూపసంబంధముచేతనే కార్యము సిద్ధించుచున్నందున, న ప్రత్యక్షమనుమానం వా=ప్రత్యక్షముకానీ, అనుమానము కానీ సమవాయ సంబంధమును తెలుపజాలవు.

నైయాయికులు వైశేషికులు దేనిని సమవాయ సంబంధమందురో యా సంబంధమునే యోగులు సాంఖ్యులు స్వరూపసంబంధ మందురు. కాబట్టి సాంఖ్య మతమున సమవాయ సంబంధ మొండు లేదనియు, నది నిత్యము కాదనియు పై సూత్రములందు వర్ణింపబడినది.

బౌద్ధులు 'క్రియ ప్రత్యక్షగమ్యము కాదు. కేవలము అనుమానగమ్యమే' యని యందురు. ఆ మతము సరికాదని యనుచున్నాడు

''నానుమేయత్వమేవ క్రియాయా నేదిష్ఠస్య తత్తద్వతోరే వాపరోక్షప్రతీతేః'' ౫. ౧౦౧.

నేదిష్ఠస్య = మిక్కిలి సమీపముననుండు వానికి, తత్తద్వతోరేవ = క్రియయొక్కయు, క్రియగల వస్తువు యొక్కయు, అపరోక్షప్రతీతేః = ప్రత్యక్ష జ్ఞానము కలుగుట వలన, క్రియాయాః = క్రియ యొక్క జ్ఞానము, నానుమేయత్వమేవ = అనుమాన ప్రమాణము వలన మాత్రమే కలుగుననుట యుక్తము కాదు.

'ఒక వస్తు వొక స్థానమున ముందు కనబడి మఱియొక క్షణమున నయ్యది మఱియొక స్థానమున కనబడుననుకొనుడు. అప్పు డా వస్తువు పూర్వప్రదేశమునువిడిచి క్రొత్తప్రదేశమును చేరినదని యెంచవలయును. ఇట్లు పూర్వదేశ విభాగము, మఱియొక ప్రదేశ సంయోగమును మన మా వస్తువున జూతుము. అనగా ప్రత్యక్ష మగును. ఈ సంయోగ వియోగముల వలన నా వస్తువునందు ఒక చోటునుండి మఱియొకచోటుకు పోవుట యను క్రియ గలిగిన ట్లూహింతుము. అనగా అనుమానము వలన తెలిసికొందుము. కాబట్టి క్రియ అనుమానమువలననే తెలియును కాని ప్రత్యక్ష ప్రమాణగమ్యము కాదు.' అని

బౌద్ధుల మతము. సాంఖ్యు లట్లంగీకరింపరు దగ్గరగా నుండి చూచువానికి వస్తువు ప్రత్యక్షమైనట్లు వస్తువులో జరుగు క్రియయు ప్రత్యక్ష మగును. ఆకాశమువ దూరమున నెటనో యుండు సూర్యాది గోళములందు జరుగు క్రియ ప్రత్యక్షము కాకపోవచ్చును. అది యనుమాన గమ్యమైన కావచ్చు. కాబట్టి క్రియ కేవల మనుమానగమ్య మనుట యుక్తము కాదని సాంఖ్య మతము.

కొందఱు ప్రాణుల స్థూలదేహము పాంచభౌతికమందురు. అనగా పృథివ్యాది పంచభూతముల న్యూనాధిక భాగములతో నీ శరీరమేర్పడు నందురు. అది యుక్తము కాదనుచున్నాడు.

"న పాంచభౌతికం శరీరం బహూనా ముపాదానాయోగాత్"

సూ. ౧౦౨.

బహూనా ముపాదానాయోగాత్ = భిన్నజాతులకు సంబంధించిన అనేక పదార్థము లొక వస్తువునకు ఉపాదానకారణము కాజాలవు కాబట్టి, శరీరం = స్థూలశరీరము, పాంచభౌతికం న = పంచభూతాత్మకము కాదు _ పంచభూతములచే నేర్పడినది కాదు.

ఒక పదార్థ మేర్పడుట కనేక భిన్నజాతీయ పదార్థములు ఉపాదానకారణము కాజాలవు. కాబట్టి స్థూలదేహము పాంచభౌతికము కాదని సూత్రాభిప్రాయము.

కొందఱు స్థూల శరీరము తప్ప వేరొండు శరీరము లేదందురు. ఆ మత మయుక్త మనుచున్నాడు :_

"న స్థూలమితినియమ అతివాహికస్యాపి విద్యమానత్వాత్"

సూ. ౧౦౩.

అతివాహికస్యాపి విద్యమానత్వాత్ = జీవాత్మ నొక శరీరము నుండి మఱియొక శరీరమునకు గొంపోవు సూక్ష్మశరీర ముండుట వలన,

స్థూల మితినియమః న = స్థూలశరీరము తక్క వేరొక శరీరము లేదను నియమము యుక్తము కాదు.

స్థూలశరీరము కాక జీవుని శరీరాంతరమునకు గొంపోవు సూక్ష్మశరీర మొందు కలదని సూత్రాభిప్రాయము.

తమతో సంబద్ధముకాని వస్తువుల జ్ఞానము నింద్రియ ములు కలిగించునని బౌద్ధు లందురు ఆ మతమును నిరాక రించు చున్నాడు.

''నా ప్రాప్తప్రకాశకత్వ మింద్రియాణా
మప్రాప్తేః సర్వప్రాప్తేర్ వా". ౫. ౧౦౪.

ఇంద్రియాణాం = ఇంద్రియములు. అప్రాప్త ప్రకాశకత్వం న = తమతో అసంబద్ధ వస్తువులను ప్రకాశింప జేయవు. కారణ మేమన :— అప్రాప్తేః=అసంబద్ధ వస్తువుల జ్ఞానము కలుగకుండుట జూచుచున్నాము. అసంబద్ధ వస్తుజ్ఞానము కలుగునెడల, సర్వప్రాప్తేర్వా=ఎల్ల వస్తుజ్ఞానము కలుగవలయును.

వస్తువు లింద్రియములతో సంబద్ధమును కాకున్నను వాని జ్ఞానము కలుగునని యంగీకరింతుమేని, దూరము, దగ్గర, అడ్డంకుగలది, అడ్డంకు లేనిది యను భేదము లేక యెల్ల వస్తువుల జ్ఞానము కలుగవలసివచ్చును. అట్లు కలుగదు; కాబట్టి ఇంద్రియములు తమతో సంబద్ధవస్తువుల జ్ఞానమే కలి గింప గలవని భావము.

అటులయిన చక్షురింద్రియము తైజసమే యగును కాని, ఆ అహంకారజన్య మెట్లగును ? తైజసమగునెడల కిరణరూప మున వస్తువున్న స్థలమునకేగి దానితో సంయుక్తమై దానిని ప్రకాశింప జేయగలుగును. కాబట్టి ఇంద్రియములు భూత

ప్రకృతికములు కావు; ఆహంకారికములే యన నెట్లు చెల్లు నన :—

"న తేజోఽపసర్పణాత్ తైజసం చక్షుర్వృత్తితస్తత్సిద్ధేః" ౫.౧౦౫

తేజోఽపసర్పణాత్ = దూరముననుండు వస్తువును ప్రకాశింప జేయుటకు కిరణరూపమున తేజస్సు (అగ్ని) ప్రసరించుచున్నందున, చక్షుః = నేత్రము, తైజసమ్ = తేజోజన్యము అనుట న = తగదు. వృత్తితః తత్సిద్ధేః=చక్షురింద్రియములో శరీరమును విడిచి వస్తుప్రదేశమునకు జేరు వృత్తియొకటి కలదు.

గోలకములు ఇంద్రియములు కావు. ఇంద్రియములాయా గోలకములందుండును. అయ్యవి వస్తువులను జేరి వాని జ్ఞానమును కలిగించును. కాబట్టి చక్షురింద్రియము తైజసమే కాని ఆహంకారికము కాదనుట చెల్లదని భావము.

చక్షువునం దొకవృత్తి వస్తువును జేరునది యున్నట్లు సిద్ధము కానందున దానివలన నయ్యది వస్తువును జేరు ననుటెట్లు ?

"ప్రాప్తార్థప్రకాశ లింగాద్ వృత్తిసిద్ధిః" ౫. ౧౦౬.

ప్రాప్తా....లింగాత్ = తమతో సంబద్ధమగు నర్థము నింద్రియములు ప్రకాశింప జేయును. అట్టి హేతువు వలన, వృత్తి సిద్ధిః = ఇంద్రియములందు వస్తువులను జేరు వృత్తి యున్నట్లు సిద్ధించును.

ఆ వృత్తి ఇంద్రియముల భాగమా? లేక ద్రవ్యములోని రూపాదులవలె నది గుణమా ?

"భాగగుణాభ్యాం తత్త్వాంతరం వృత్తిః సంబంధార్థం సర్పతీతి" ౫. ౧౦౭.

సంబంధార్థం సర్పతీతి = వస్తువులతో సంబంధ మేర్పరచుటకు ప్రసరించును కాబట్టి, వృత్తిః = ఇంద్రియ వృత్తి, భాగగుణాభ్యాం = భాగ గుణములకంటె, తత్త్వాంతరం = భిన్నపదార్థము.

ఇంద్రియ వృత్తి యనునది అగ్నికి విస్ఫులింగము (నిప్పు కణము) భాగమైనట్లు భాగము కానీ, ద్రవ్యములోని రూప రసాదులవలె గుణము కానీ కాదు. అది యొక భిన్న పదార్థ మని భావము.

చక్షురాదీంద్రియములు ద్రవ్యము లగు నెడల నవి వృత్తులద్వారా వస్తువులను జేరి వానిని ప్రకాశింపజేయు ననుట యుక్త మగును. అవి యహంకార జన్యము లయి నందున నది యెట్లు సంభవ మగును? అన :_

"న ద్రవ్య నియమ స్తద్యోగాత్" సూ ౧౦౮.

న=ద్రవ్యమగుటచే నది క్రియగలది యగునను నియమము లేదు. తద్యోగాత్ = క్రియాసంబంధము వలన, ద్రవ్య నియమః = ద్రవ్య మనబడును.

సాంఖ్య మతమున ద్రవ్య మయినంత మాత్రమున నది క్రియ గలదగునను నియమము లేదు. కాని, క్రియా సంబంధము గల ప్రతి పదార్థమును ద్రవ్య మనబడును. కాబట్టి వృత్తిరూప క్రియా సంబంధ ముండుటచే నింద్రియ ములు ద్రవ్యము లనబడును. అందువలన నయ్యవి యహంకార జన్యములయినను దోషము లేదని భావము.

ఒకచో నింద్రియము లాహంకారికము (అహంకార జన్యము) లయినను మఱియొకచో నవి భౌతికములు (భూత జన్యములు) కాగలవా?

"న దేశభేదేఽప్యన్యోపాదానతా అస్మదాదివ న్నియమః"

సూ. ౧౦౯.

దేశభేదేఽపి = భిన్నదేశము నందును, అన్యోపాదానతా న = ఇంద్రియముల కుపాదాన కారణము అహంకారమే కాని భూతములు

కావు. అస్మదాదివత్ నియమః = మన ఇంద్రియము లాహంకారికము లయినట్లు సర్వదేశములందును ఇంద్రియములు అహంకారికములే.

ఒకచో నింద్రియములాహంకారికములై మఱియొకచో నవి భూత ప్రకృతికము లగుననుట యుక్తముకాదని భావము.

"నిమిత్త వ్యపదేశా త్తద్వ్యపదేశః" సూ. ౧౧౦.

నిమిత్తవ్యపదేశాత్ = ఇంద్రియముల కాధారములై భూతము లొకింత నిమిత్తము లగుట వలన, తద్వ్యపదేశః = ఇంద్రియములు భౌతికము లనబడును.

(అన్నమయం హి సౌమ్య మనః) 'మనస్సు అన్నమయము' అను నిట్టి వాక్యములందు మనస్సు మున్నగు నింద్రియములు భూత ప్రకృతికములు (పంచభూత జన్యములు) అయినట్లు వ్యవహరించుట జూచుచున్నాము. అట్టి వ్యవహారము అగ్న్యాదిభూతము లింద్రియముల కాధారములైనందున సంభవము కావచ్చును. అంతియేకాని అగ్ని ప్రభృతి భూతము లింద్రియముల కుపాదానకారణ మగుట వలన కాదు. కాబట్టి యింద్రియము లాహంకారికములే యని భావము.

శరీర భేదములు :—

"ఊష్మజాండజ జరాయుజోద్భిజ్జసాంకల్పిక సాంసిద్ధికంచేతి ననియమః" సూ. ౧౧౧.

ఊష్మజములు, అండజములు, జరాయుజములు, ఉద్భిజ్జములు, సాంకల్పికములు, సాంసిద్ధికములు నని శరీరము లారు విధములు. కాబట్టి కొందఱు జెప్పునట్లు (అండజ, స్వేదజ, జరాయుజ, ఉద్భిజ్జములు) నాలుగు విధముల శరీరములే యను నియమము లేదని సూత్రార్థము.

క్రిములు, దోమలు మున్నగునవి ఊష్మజములు. అనగా వేడివలన వాని శరీరము లేర్పడును. పక్షులు, సరీసృపాదులు అండములనుండి జనించును; కావున నండజములు. జరాయువనగా గర్భవేష్టనము. దానినుండి పుట్టునవి జరాయుజములు. భూమిని ఛేదించి జనించున వియుద్భిజ్జములు. సృష్టికి నాదియందు ప్రజాపతి సంకల్పమున నుత్పన్నములగు ఋషుల శరీరములు సాంకల్పికములు. యోగసంసిద్ధిచే నేర్పఱచుకొనబడు శరీరములు సాంసిద్ధికము లనబడును.

లోకమున నీ శరీరములన్నియు పార్థివములని వ్యవహరింపబడుచున్నవి. అట్టియెడ నీ శాస్త్రమునందు (పాంచభౌతికో దేహః ౩.౧౦) దేహము పాంచ భౌతికమని యేల చెప్పబడినది ?

''సర్వేషు పృథివ్యుపాదాన మసాధారణ్యా
త్తద్వ్యపదేశః పూర్వవత్'' ౫. ౧౧౨.

పూర్వవత్ = ఇంద్రియములు ఆహంకారికము లయినను భౌతికములని వ్యహరించినట్లు, సర్వేషు = అన్ని విధములయిన దేహములందును, అసాధారణ్యాత్ = ప్రధానముగ పృధివ్యుపాదానమ్ = పృధివి ఉపాదానకారణము. మిగిలిన భూతములు సాధారణ కారణము. కాబట్టి తద్వ్యపదేశః = పార్థివ వ్యవహారము లోకమున నేర్పడిన దని భావము,

శరీరము భౌతిక మయినచో నందలి ప్రాణముకూడ భౌతికమేల కాదు ?

''న దేహారంభకస్య ప్రాణత్వ మింద్రియ శక్తిత స్తత్సిద్ధేః''
౫. ౧౧౩.

ఇంద్రియ శక్తితః = ఇంద్రియముల శక్తి విశేషము వలన, తత్సిద్ధేః = ప్రాణము సిద్ధించుటవలన, దేహారంభకస్య = శరీర ముత్పన్న

మగుటకు హేతువులయిన భూతములు, ప్రాణత్వం = ప్రాణము నుత్పన్నము చేయునవి, న = కాదు.

ప్రాణము ఇంద్రియముల శక్తి విశేషము వలన నేర్పడు నది కావున నది భౌతికము కాదు.

భోక్త యగు జీవు డీ శరీరము నెన్న డధిష్ఠించును ?

"భోక్తు రధిష్ఠానాద్ భోగాయతన
నిర్మాణ మన్యథా పూతిభావ ప్రసంగాత్" ౫. ౧౧౪.

భోక్తుః = జీవునియొక్క, అధిష్ఠానాత్ = సంబంధము వలన, భోగాయతన నిర్మాణమ్ = శరీర నిర్మాణ మేర్పడును, అన్యథా = సంబంధము లేనివాడు, పూతిభావ ప్రసంగాత్ = మృత శరీరము వలె శుక్ర శోణితములు చెడిపోవును.

అధిష్ఠాత, అధిష్ఠేయము నను రెండింటికి గల విశేష సంబంధము ఈ సూత్రమున అధిష్ఠాన మనబడినది. శరీర మునకు జీవుడే అధిష్ఠాత. కాబట్టి జీవసంబంధము కలుగని నాడు దేహారంభకము లయిన శుక్రశోణితములు వ్యర్థములై చెడిపోవునని భావము.

పరమాత్ముని అధిష్ఠానము (సంబంధము) వలన సృష్టి యందలి ప్రతికార్య మారంభమగునని కదా వినుచున్నాము. అట్టియెడ జీవాధిష్ఠానమున శరీరారంభ మెట్లు చెప్పదగు ననః—

"భృత్యద్వారా స్వామ్యధిష్ఠితిర్ నైకాంతాత్" ౫. ౧౧౫.

భృత్యద్వారా = భృత్యునివంటి జీవుని ద్వారా, స్వామ్యధిష్ఠితిః = పరమాత్మ సంబంధము, న ఏకాంతాత్ = సాక్షాత్తుగ కాదు.

పరమాత్మునిచే సదా భరింపబడువాడు కావున జీవుడు భృత్యుడు. పరమాత్ముడు వ్యాపకుడు కాబట్టి జీవసంబంధ మతని కుండును. ఆత్మస్థుడై పరమాత్ముడు శరీరాధిష్ఠాత

యగును. కాబట్టి సాత్మాత్మసంబంధము జీవునకే నైనను పరం పరగా సర్వకార్యాధిష్ఠాత పరమాత్మ యగుచున్నాడు. అందువలననే పరమాత్మ జగదధిష్ఠాత యని వినుచున్నాము.

అటులయిన జీవాత్మతోబాటు పరమాత్మకు నధిష్ఠాత యగుచుండుట వలన జీవాత్మకు బుద్ధిసత్త్వ మెట్లు సన్నిహితమో పరమాత్మయు నట్లు సన్నిహిత మనవలసి వచ్చును. కాబట్టి జీవునకు బుద్ధిసత్త్వసరూపత (సమాన రూపము) కలుగునట్లు పరమాత్మ సారూప్యమును కలుగును గదా? యన :-

"సమాధి సుషుప్తి మోక్షేషు బ్రహ్మరూపతా" సూ. ౧౧౬.

సమాధిః = యోగము, సుషుప్తిః = నిద్ర, మోక్షః = విదేహ కైవల్యము.

సమాధి, సుషుప్తి, మోక్షములందు జీవునకు బ్రహ్మ రూపత కలుగును.

జీవుడు జాగ్రదవస్థయందు బుద్ధిరూపమునొంది ప్రకృతి యందు వర్తించునట్లు, యోగము, నిద్ర, మోక్షము నను నీ మూడవస్థలలోను పరమాత్మ సమానరూపము నందినవాడై బ్రహ్మానందాది సుఖముల ననుభవించునని భావము.

(జుష్టం యదా పశ్యత్యన్యమీశ మస్య మహిమాన మితి వీతశోకః । నిరంజనః పరమం సామ్యము పైతి)

'జీవుడు తనతో నున్న పరమాత్మని తెలిసికొని, శోకరహితుడై; నిరంజనుడై పరమసామ్యము నందు' నని శ్రుతులందును వర్ణింపబడినది.

సమాధి సుషుప్తులలోను మోక్షమునందు వలెనే

బ్రహ్మసారూప్య మేర్పడునెడల మోక్షమునకు నిద్రా సమాధులకుగల భేదమేమి ?

"ద్వయోః సబీజ మన్యత్ర తద్ధతి" సూ. ౧౧౭.

ద్వయోః = సమాధి సుషుప్తులలో, సబీజమ్ = బంధహేతువగు క్లేశాది వాసనాసహిత బ్రహ్మ సారూప్యముండును. అన్యత్ర = మోక్షమునందు. తద్ధతిః = ఆ బంధవాసనలేని బ్రహ్మ సారూప్య ముండును ఇదియే భేదము.

లోకమున నిద్రాసమాధులే తెలియబడుచున్నవి కాని మోక్షము తెలియబడుట లేదు కదా ! యన :-

"ద్వయోరివ త్రయస్యాపి దృష్టత్వాన్నతు ద్వౌ" సూ. ౧౧౮.

ద్వయోరివ = సమాధి, సుషుప్తుల వలెనే, త్రయస్యాపి = మోక్షము సైతము, దృష్టత్వాత్ = శ్రుతి స్మృతుల ద్వారా చూడబడుట వలన, న తు ద్వౌ = సమాధి, సుషుప్తియే కాని మోక్షము లేదనుట యుక్తము కాదు.

సమాధియందు క్లేశాది వాసనలు కుంఠితము లగుటచే జీవునకు బ్రహ్మ సారూప్య మేర్పడిన నేర్పడవచ్చును; కాని, సుషుప్తియం దది యెట్లు సంభవించును ?

"వాసనయాఽనర్థఖ్యాపనం దోషయోగేఽపి న
నిమిత్తస్య ప్రధాన బాధకత్వమ్" సూ. ౧౧౯.

దోషయోగేఽపి = సుషుప్తియందును, నిమిత్తస్య = నిద్రా దోషమునకు, ప్రధాన బాధకత్వం = వాసనలను నశింపజేయు శక్తి యున్నది. కావున, వాసనయా = వాసనవలన, అనర్థఖ్యాపనం న = అనర్థమైన ప్రాకృతిక జ్ఞానము కలుగనేరదు.

సమాధియందు వాసనలు కుంఠితములై యుండుట వలన జీవునకు బ్రహ్మసారూప్య మేర్పడుచున్నది. అట్లే

సుషుప్తియందు కూడ నిద్రాదోషము వలన వాసన లణచబడి యుండును. అందువలన బ్రహ్మసారూప్యము కలుగు నవకాశము గలదని భావము.

యత్నించి బాణమునో యొక మట్టిగడ్డనో విసిరి దూరమునకు పంపునపుడు మొదట యత్నము వలన క్రియ కలుగును; దానివలన వేగనామక సంస్కారము కలుగును; అటుపై మరల క్రియ, మరల సంస్కారము నని యీ బాణాదు లొకచో పడువరకు ననేక క్రియలు ననేక సంస్కారములు కలుగుచుండునని కొందఱు చెప్పుదురు. వారి మత మయుక్తమని యీ సూత్రమున చెప్పుచున్నాడు.

"ఏకః సంస్కారః క్రియా నిర్వర్తకో నతు ప్రతి క్రియం సంస్కారభేదా బహుకల్పనా ప్రసక్తేః'' ౫. ౧౨౦.

ఏకః = ఒక్కటే, సంస్కారః = వేగాఖ్య సంస్కారము, క్రియానిర్వర్తకః = బాణాదులం దొకచో నేర్పడు క్రియల నన్నిటిని జనింపజేయును. బహుకల్పనా ప్రసక్తేః = అనేక సంస్కారముల నంగీకరించు దోష మేర్పడును. కాబట్టి, నతుప్రతిక్రియ సంస్కార భేదాః = ప్రతిక్రియకు నొక్క సంస్కారము చొప్పున ననేక వేగనామక సంస్కారము లంగీకరింపజనదు.

భూమిని భేదించి జనించు నంకురాదులును శరీరములే యని పూర్వము వర్ణింపబడినది. వానియందు నవియు శరీరములే (భోగాయతనములు-సుఖ దుఃఖానుభవ నిలయములు) అని చెప్పదగు బాహ్యజ్ఞానము గోచరము కానందున నవి శరీరము లెట్లగును ?

"న బాహ్యబుద్ధినియమో వృక్షగుల్మలతౌషధి వనస్పతి తృణవీరుధా దీనామపి భోక్తృభోగాయతనత్వం పూర్వవత్" ౫. ౧౨౧.

పూర్వవత్ = జరాయుజాదులకు వలెనే, వృక్ష .... మపి = వృక్షాదులకును, భోక్తృభోగాయతనత్వం = భోక్తృశరీరత్వము కలదు. నబాహ్యబుద్ధినియమః = బాహ్యేంద్రియజన్య జ్ఞానమే శరీరనియామక మను నియమము లేదు. వృక్షాదులను శరీరములే యని భావము.

పుష్పించి కాయలు గాచు మామిడి మున్నగునవి వృక్షములు. పొదలవలె నల్లుకొని యుండునవి గుల్మలతలు. ఒక్క మాటు ఫలించి నశించు వరి మున్నగు సస్యములు ఓషధులు. పుష్పింపకయే కాయలు గాచు పనస మున్నగు వృక్షములు వనస్పతులు. గరిక మున్నగునవి తృణములు. అనేక శాఖలు కలిగి యంతట నలముకొను తీగెలు వీరుధములు. ఇవి యన్నియు శరీరములే యని సూత్రాభిప్రాయము.

వృక్షాదులును శరీరములే యనుటకు ప్రమాణము నొసంగుచున్నాడు.

"స్మృతేశ్చ" ౫. ౧౨౨

శ్రుతి స్మృతులను వృక్షాదులు శరీరములే యని యంగీకరించు చున్నవి.

(అస్యయదేకాం శాఖాంజీవో జహా
త్యథసాశుష్యతి ! ఛాం. ౬. ౧౧. ౨.)

'జీవు డొక శాఖను విడిచినపు డది యెండిపోవును.' అని ఛాందోగ్యమున వర్ణింపబడినది.

(శరీరజైః కర్మ దోషైర్యాతి స్థావరతాం నరః మ. ౧౨.౯.)

'మనుజుడు శారీరిక కర్మ దోషముల వలన వృక్షాది శరీరమును బొందును.' అని మనుస్మృతి.

వృక్షాదులు శరీరము లయినచో వానికిని కర్మాధి కారమున్నదా ?

"నదేహమాత్రతః కర్మాధి కారితా వైశిష్ట్య శ్రుతేః" ౫. ౧౨౩.

వైశిష్ట్యశ్రుతేః = విశిష్టమగు మనుష్య శరీరధారికే కర్మాధికార మున్నట్లు శ్రుతి చెప్పుచున్నందున, దేహమాత్రతః = దేహము లయి నంత మాత్రమున వృక్షాది శరీరధారులకు, న కర్మాధికారితా = కర్మల ననుష్ఠించు యోగ్యతలేదు.

ఇట్టి భేదమేల ? యన :-

"త్రిధా త్రయాణాం వ్యవస్థా కర్మదేహోపభోగ
దేహోభయదేహః" ౫. ౧౨౪.

త్రయాణాం = ముప్విధములయిన సర్వప్రాణుల దేహములు, కర్మ...... దేహః = కర్మదేహము, ఉపభోగదేహము, ఉభయదేహము నని, త్రిధా = ముప్విధములని, వ్యవస్థా = వ్యవస్థ చేయబడినది.

లోకములో నెల్లరిదేహములు నుపభోగ దేహములే యైనను గుణప్రధానభావముచే కొందఱి దేహములు కర్మ దేహములనియు, మఱి కొందఱివి ఉపభోగ దేహములనియు, ఇంక కొందఱివి యుభయదేహము లనియు జెప్పబడినవని భావము.

"న కించిద ప్యనుశయినః" ౫. ౧౨౫.

అనుశయినః = ప్రారబ్ధ కర్మావశేష మున్నట్టి, సర్వకర్మ ఫల త్యాగియైన సన్యాసికి, న కించిదపి = పై ముప్విధము లయిన దేహ ములతోను సంబంధ ముండదు.

సన్యాసి చేయు నుపదేశాది కర్మలన్నియు నతనికి స్వాభావికములే కాని బంధహేతుకములు కావని భావము. ఇట్లు మనుష్యులలో కొందఱు కర్మలను ఫలాపేక్షతో జేసి

వాని ననుభవించుచుందురు. అట్టి వారు కర్మదేహులు. వృక్షాదులు కేవలము భోగశరీరములు. అట కర్మకవకాశము లేదు. మానవశరీరమే కర్మదేహము, ఉభయదేహము నని చెప్పబడును. బ్రహ్మచారులు వానప్రస్థులు ముఖ్యముగా కర్మల నాచరించుచు భోగాపేక్ష తక్కువ గలిగియుందురు. కాబట్టి వారి దేహము కర్మదేహ మనబడును. గృహస్థులు కర్మల నాచరించుచు విశేషముగ భోగాపేక్ష గలిగియుందురు. కాబట్టి వారి దేహ ముభయదేహ మనబడు నని వివేకము.

"న బుద్ధ్యాది నిత్యత్వమాశ్రయ విశేషేఽపి వహ్నివత్" ౫.౧౨౬

వహ్నివత్ = అగ్నివలె, ఆశ్రయవిశేషేఽపి =కొండొక విశేషాశ్రయమునందును, బుద్ధ్యాదినిత్యత్వం న=జ్ఞానము, ఇచ్ఛ, యత్నము మున్నగు నవి నిత్యములు కావు.

జ్ఞానేచ్ఛాప్రయత్నాదులు బుద్ధిసత్త్వము యొక్క పరిణామములు. అయ్యవి తాదాత్మ్యముచే జీవునియందు వ్యవహరింపబడును. కాని, బుద్ధిపరిణామములు కాబట్టి యవి యనిత్యములే. నిత్యములు కాజాలవు. వాస్తవమున నవి యానిత్యములయినను జీవాశ్రయము కలవై జీవుడు నిత్యుడు కాబట్టి యవియు నిత్యములగు నని చెప్పవలనుపడదు. అనిత్యమయిన వస్తువు ఆశ్రయభేదముచే నిత్యమెన్నడును కాదు. నిప్పు వంటియింటియందున్నపు డనిత్యమై, మరియొక స్థానమునందు నిత్యమగునా ? కాజాలదు. అట్లే బుద్ధివృత్తులయిన జ్ఞానేచ్ఛాదులు నని భావము. ఆత్మకు స్వరూపమయిన జ్ఞానము మాత్రము నిత్యమే యని తెలిసికొనవలయును.

''ఆశ్రయా సిద్ధేశ్చ'' ౫. ౧౨౭.

బుద్ధి సత్త్వముయొక్క పరిణామములయిన జ్ఞాన సంకల్పా దులు జీవుని గుణములేకాని బుద్ధివృత్తులు కావని నిరూపింప జాలము. కాబట్టియవి యనిత్యములేయని సూత్రాభిప్రాయము.

''యోగసిద్ధయోఽప్యాషధాది సిద్ధివ న్నాపలాపనీయాః''౫.౧౨౮

ఔషధాదిసిద్ధివత్ = ఓషధులు, మణులు మున్నగువాని సిద్ధుల వలె, యోగసిద్ధయః = యోగసిద్ధులును కలవు. కావున, నాపలాప నీయాః = నిషేధింపరాదు.

లోకమున మణులు, ఓషధులు ప్రభావవంతములుగ జూచుచున్నాము. అట్లే యోగజసిద్ధులు నంగీకరింపదగినవి. కాబట్టి సాంసిద్ధిక దేహము లున్నవనుటను నిరాకరింపరాదు.

''న భూతచైతన్యం ప్రత్యేకాదృష్టేః సాంహత్యేఽపిచ సాంహత్యేఽపచ'' ౫. ౧౨౯.

ప్రత్యేకాదృష్టేః = ఒక్కొక్క దానియందు చూడబడనందు వలన, సాంహత్యేఽపిచ = అట్టివి యనేక మొకచో జేరినను వాని యందు చైతన్యమును జూడనేరము. కాబట్టి, భూతచైతన్యం న = భూత ములు కలిసినందున వానిలో చైతన్యమేర్పడుననుట తగదు

ఈ సూత్రమునందు, 'సాంహత్యేఽపిచ' అను పదము రెండు సారులు వాడినందున నొకటి యధ్యాయ సమాప్తిని దెలుపునని గుర్తింపవలయును. కొందఱు, పృథివ్యాది భూతము లొకదానితో మరియొకటి కలిసినపుడు వాని యందు చైతన్య ముత్పన్నమగునందురు. పృథివ్యాది భూతములలో నొక్కొక్కదానియందు ప్రత్యేకముగ చైతన్యము కానరా నందున, నట్టివి యనేకము కలిసినంత మాత్రమున వాని యందు చైతన్య మేర్పడజాలదని భూత చైతన్యవాదము నీ సూత్రమునందు సూత్రకారుడు నిరాకరించి యున్నాడు.

సాంఖ్య దర్శనము

షష్ఠాధ్యాయము

పంచమాధ్యాయమునం దితర మతముల నిరాకరణ మొనర్చి, యంతకు పూర్వము నాలుగధ్యాయములందు నిరూపించిన స్వమతమును స్థిరపరుప నుద్దేశించి సూత్రకారు డీ యధ్యాయము నారంభించుచున్నాడు. ముందుగా నాత్మాస్తిత్వమును (జీవుని యునికిని) వర్ణించుచున్నాడు.

"అస్త్యాత్మా నాస్తిత్వసాధనాభావాత్" ౬. ౧.

నాస్తిత్వసాధనాభావాత్ = ఆత్మ (జీవుడు) లేదని సాధించు హేతువు లభింపనందున, ఆత్మా అస్తి=ఆత్మ యను పదార్థ మున్నది.

ఆత్మ యనున దొకటి లేదనము; కాని, యది శరీరమే కాని, యంతకంటె భిన్నము కాదందురేని :-

"దేహాదివ్యతిరిక్తోఽసౌ వైచిత్ర్యాత్" ౬. ౨.

వైచిత్ర్యాత్ = దేహముకంటె విలక్షణమైనది కావున, అసౌ = ఆత్మపదార్థము, దేహాదివ్యతిరిక్తః = దేహము, ఇంద్రియములు మున్నగు వస్తువులకంటె వేరైన వస్తువని యెఱుంగవలెను.

"షష్ఠీ వ్యపదేశాదపి" ౬. ౩.

షష్ఠీవిభక్తితో వ్యవహరించుటవలనను నాత్మ దేహము కంటె భిన్నమని సూత్రార్థము.

వ్యపదేశమనగా వ్యవహారము. లోకమున మనము 'నా శరీరము, నా బుద్ధి, నాముక్కు, నాకన్ను' అనియందుము.

'నా శరీరము' అనగా నా యొక్క శరీరము అని పదములను విడదీసి చెప్పవచ్చును. ఇందు 'యొక్క' అనునది షష్ఠీవిభక్తి. ఇయ్యది సంబంధమును బోధించును. కాబట్టి నా శరీర మనగా 'నేను' అనునది వేరనియు శరీరము 'నేను' అనుదానికి సంబంధించిన దనియు బోధపడును. ఇట 'నేను' అని చెప్పబడు పదార్థమే ఆత్మ యని భావము. కాబట్టి లోక వ్యవహారమున షష్ఠీ విభక్తి ప్రయోగముచేతను ఆత్మపదార్థము శరీరాదులకంటె భిన్నమని తెలియుచున్నదని భావము.

'రాహువేశిరస్సు' అనుటకు బదులు రాహువుయొక్క శిరస్సనియు, రాతిబొమ్మ దేహమనియు ననేక గౌణ ప్రయోగము లున్నవిగదా! అట్లే 'నా శరీరము' అనియు నెందుల కెంచరాదు ?

''న శిలాపుత్రవ ద్ధర్మిగ్రాహకమాన బాధాత్'' ౬. ౪.

ధర్మి బాధాత్ = ధర్మి (పురుషుని - జీవుని) నిగ్రహింప జేయు ప్రత్యక్షాది ప్రమాణములచే బాధింపబడుట వలన, 'నా శరీరము' అనునిట్టి ప్రయోగములు, శిలాపుత్రవత్ న = శిలాపుత్రుని శరీరమన్నట్లు కాదు.

దేహాదులకంటె భిన్నుడైన జీవుడున్న నుండ నిండు. అయినను, దుఃఖియగు నతనికి కృతకృత్యత యెట్లుగలుగును ?

''అత్యంత దుఃఖనివృత్త్యా కృతకృత్యతా'' ౬. ౫.

దుఃఖమత్యంతము నివృత్తి చెందినపుడు అనగా ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతికదుఃఖములు బొత్తిగా తొలగినపుడు జీవుడు కృతకృత్యుడగును.

సుఖప్రాప్తి కృతకృత్యత యనక దుఃఖాత్యంత నివృత్తి యందు రేల ?

"యథా దుఃఖాత్ క్లేశః పురుషస్య న తథా సుఖాదభిలాషః" ౬.౬

పురుషస్య = జీవునకు, యథాదుఃఖాత్ క్లేశః = దుఃఖము వలన ద్వేషముజనించినట్లు, న తథా సుఖాదభిలాషః = సుఖమువలన కోరిక కలుగదు,

మనుజుడు లేక ప్రాణి దుఃఖమును బొంది దానిని ద్వేషించినంతగా సుఖమును కామింపడు; సుఖ కామనాపేక్ష కంటె దుఃఖమును ద్వేషించుట మిక్కిలిగ జూచుచుందుము. కాబట్టి పురుషునకు దుఃఖనివృత్తియే సఫలత (కృతకృత్యత) యనదగును.

దుఃఖమును ద్వేషించినంతగా సుఖము నేల కామింపరు?

''కుత్రాపి కోఽపి సుఖీతి'' ౬. ౭.

లోకమున గల ప్రాణులలో నెక్కడనో యొకడు సుఖిగా గోచరించును. కాబట్టి ప్రాణి దుఃఖనివృత్తి కొఱకే యత్నించును అనగా దుఃఖ మెక్కుడగుటచే దానినే యెక్కుడుగ ద్వేషించునని భావము.

ఇందువలన సుఖము దుర్లభమనియే కదా ? తోచు చున్నది ?

''తదపి దుఃఖశబలమితి దుఃఖపక్షే నిఃక్షిపన్తే వివేచకాః'' ౬.౮.

తదపి = దుర్లభమగు నా సుఖము కూడ, దుఃఖశబలమితి = దుఃఖ మిశ్రితము కావున, వివేచకాః = వివేకులు, దుఃఖపక్షే = దుఃఖమునందే నిఃక్షిపన్తే= స్థాపించుచున్నారు - గణించుచున్నారు.

అన్నము విషమిశ్రితమని తెలిసిన వాడా యన్నము నభిలషింపనట్లు సుఖము దుఃఖమిశ్రితమని తెలిసికొని దాని

నభిలషింపక దుఃఖమును ద్వేషించును కాబట్టి దుఃఖ నివృత్తియే పరమార్థమని తేలుచున్నది.

లోకమున ప్రతి ప్రాణియు 'నాకు దుఃఖము కలుగకుండు గాక' యని దుఃఖమును ద్వేషించుటతోబాటు, 'నాకు సుఖము కలుగు గాక' యని సుఖము నభిలషించుటయు జూచుచున్నాము. కాబట్టి సుఖ ప్రాప్తిలేని దుఃఖ నివృత్తి పరమ పురుషార్థ మెట్లగును ?

"సుఖ లాభాభావాత్ అపురుషార్థత్వ మితిచేన్నద్త్వైవిధ్యాత్" ౬. ౯.

సుఖ........ఇతిచేత్ = సుఖప్రాప్తి లేనందున నది పరమ పురుషార్థము కాదందురేని, న = కాదు, ద్వైవిధ్యాత్ = ద్వివిధముగా నంగీకరించుటవలన.

పరమపురుషార్థము దుఃఖ నివృత్తి రూపమై యొక విధమైనను, దుఃఖ నివృత్తి కలుగుటయే తడవుగా నయత్న సిద్ధమై బ్రహ్మానంద ప్రాప్తియు కలుగును. కావున దోష మావంతయును లేదని భావము.

సాంఖ్య మతమున దుఃఖము బుద్ధి ధర్మము కాబట్టి యది పురుషునందుండదు. బుద్ధియందే యుండును. అట్టి దుఃఖ నివృత్తి పరమ పురుషార్థ మెట్లగునని శంకించుచున్నాడు :-

"నిర్గుణత్వమాత్మనోఽసంగత్వ శ్రుతేః" ౬. ౧౦.

('అసంగోహ్యయం పురుషః....' బృ.అ.౪.౩.౧౫)

'పురుషు డసంగుడు' అను నిట్టి వాక్యములవలన పురుషునకు దుఃఖాది సమస్త గుణములతోను నెట్టి సంబంధమును కాన రాదు. అట్టియెడ పురుషునకు దుఃఖనివృత్త్యభిలాష యెట్లు కలుగునని శంకాభిప్రాయము.

సమాధానము :-

''పరధర్మత్వేఽపి తత్సిద్ధి రవివేకాత్'' ౬. ౧౧.

లోకమున వహ్ని తాదాత్మ్యము వలన లోహమునకు దాహకశక్తి యేర్పడినట్లు, దుఃఖాదులు బుద్ధిధర్మములయినను నవివేకమువలన పురుషుడు బుద్ధితాదాత్మ్యముచే వానిని తనవిగా భావించును. కాబట్టి యతడు దుఃఖాదుల నివృత్తి నభిలషించుట యసంగతము కాదు.

అవివేకము వలన పురుషునకు దుఃఖాదు లేర్పడినచో నా యవివేక మెట్లేర్పడుచున్నది ?

''అనాది రవివేకోఽన్యథా దోషద్వయ ప్రసక్తేః'' ౬. ౧౨.

అవివేకము అనాది; అనగా కారణరహితము. అవివేకమున కియ్యది కారణమని చెప్ప వలనుపడదు. దాని కొక కారణ మంగీకరింతు మేని యనవస్థాదోష మేర్పడును. కారణ పరంపర కంతముండదని భావము. అవివేకమే యంగీకరింప మేని ముక్తులును బద్ధులే కావలసివత్తురు. కాబట్టి దోషద్వయ మేర్పడునని సూత్రాభిప్రాయము.

అవివేక మనాది యగునెడల నిత్యమేలకాదు ?

''ననిత్యః స్యాదాత్మవ దన్యథాఽనుచ్ఛిత్తేః'' ౬. ౧౩.

పురుషునివలె నవివేకము నిత్యముకాదు. అది నిత్యమగు నెడల దాని నాశమే యుండదు.

అవివేకము దేనివలన నశించును ?

ప్రతినియత కారణనాశ్యత్వమస్య ధ్వాంతవత్'' ౬. ౧౪.

చీకటి ప్రకాశమువలన నియతముగా నశించునట్లు

వివేకమువలన నవివేకము నశించునని భావము.

చీకటి ప్రకాశముచే నశించుట నియతమే కాని అవివేకమునకు వివేకము నియత నాశకారణమా ?

''అత్రాపి ప్రతినియమోఽన్వయ వ్యతిరేకాత్'' ౬. ౧౫.

ప్రకాశమున్న చీకటి యుండదు. ప్రకాశము లేకున్న చీకటి యుండును. ఇట్టి స్థితియే ప్రతినియమ మనబడును ఇట్లే వివేకమున్న నవివేక ముండదు. వివేకములేకున్న నవివేక ముండును. కాబట్టి వివేకము అవివేకమునకు ప్రతినియత నాశకారణమే యని భావము.

వివేకముచే నవివేకము నశించిన నశించును గాక. పురుషునకు బంధ నివృత్తి యెట్లు కలుగును ?

''ప్రకారాంతరా సంభవా దవివేక ఏవ బంధః'' ౬, ౧౬.

స్వభావాదులు బంధమునకు కారణము కానందున అవివేకమే బంధము. అవివేక నాశమే బంధ నివృత్తి యని భావము.

బంధ నివృత్తి (అవివేక నివృత్తి) వివేకముచే సాధింపబడుచున్నది. అదియే ముక్తి. కాగా ముక్తి కార్య మగుచున్నది. అందువలన నయ్యది నశించును. కాబట్టి ముక్తునకు పునర్బంధ మేర్పడునా ?

''న ముక్తస్య పునర్బంధ యోగోఽప్యనావృత్తి శ్రుతేః'' ౬. ౧౭.

(''నచ పునరావర్తతే నచ పునరావర్తతే'' ఛాం ౮. ౧౫) 'మరల తిరిగిరాడు. మరల తిరిగిరాడు' అను ని

యుపనిషద్వాక్యము వలన ముక్తునకు పునర్బంధము కలుగ దని యెంచవలయు నని సూత్రార్థము.

శ్రుతివాక్యము యుక్తి యగునా ?

"అపురుషార్థత్వ మన్యథా" ౬. ౧౮.

ముక్తునకు పునర్బంధ మంగీకరించిన నయ్యది పరమ పురుషార్థము కానేరదు. ముక్తి నశించున దగునెడల దానిని పురుషు డర్థింపడని భావము.

"అవిశేషాపత్తి రుభయోః" ౬. ౧౯.

మఱియు పునర్బంధ మంగీకరింతుమేని బద్ధులు, ముక్తులు, నను నుభయులలోను భేదముండ నేరదు.

ముక్తియన నేమి ?

"ముక్తి రంతరాయ ధ్వస్తేర్ న పరః" ౬. ౨౦.

ముక్తిః = ముక్తి. అంతరాయధ్వస్తేః = అవివేక నాశనముకంటె. పరః న = భిన్నము కాదు.

అవివేకనాశనమే ముక్తి యని భావము.

పూర్వము దుఃఖనివృత్తి మోక్షమని చెప్పి యిపుడు అవివేకనాశనము (అంతరాయ ధ్వంసము) అనుచున్నా రేల ?

"తత్రాప్యవిరోధః" ౬. ౨౧.

అవివేకము దుఃఖమునకు నిమిత్తము. నిమిత్తనాశము వలన నైమిత్తికము నశించును; కాబట్టి విరోధము లేదని భావము.

అటులయిన శ్రవణమాత్రమున నవివేకము నశించును. అటుపై ముక్తి లభించును. మననాది ఇతరసాధనము లింకేల?

"అధికారిత్రైవిధ్యా న్ననియమః" ౬. ౨౨.

వివేకజ్ఞానమున కధికారులగు వారిలో నుత్తమ, మధ్యమ, అధమభేదముండుట వలన నెల్లరికి శ్రవణమాత్రము ననే వివేకోద యము కలుగజాలదు.

ప్రత్యక్ష (అపరోక్ష) వివేకజ్ఞానమే యసంభావనను, విపరీత భావనను దొలగింపగలదు. అయ్యదియే యనాది యగు నవివేకమును బొత్తిగా నశింపజేయును. అట్టి యపరోక్ష వివేక జ్ఞానము శ్రవణ మాత్రముచే నెల్లఱకు జనింపదు. పూర్వ జన్మములందు శ్రవణ మననాదుల నభ్యసించిన పుణ్యాత్ములకే యీ జన్మమున శ్రవణ మాత్రముచే వివేక ముదయించును. అన్యుల కట్లు కాదు. శ్రవణము పరోక్ష (అప్రత్యక్ష) జ్ఞానమునే కలిగించును. కాబట్టి మననాది ఇతర సాధనము లవసరములే యని భావము.

"దార్ఢ్యార్థ ముత్తరేషామ్" ౬. ౨౩.

శ్రవణము వలన నేర్పడిన వివేక జ్ఞానమును దృఢ పరచుటకే (అపరోక్షముచేసికొనుటకే) మననాది సాధనముల ననుష్ఠింపవలసి యుందురు

ఆసనము కుదరకున్న ధ్యానాదులు సిద్ధింపనేరవు. కావున నెట్టి యాసన ముపయుక్త మగును ?

"స్థిర సుఖ మాసనమితి ననియమః" ౬. ౨౪.

ధ్యానము చేయు వానికే యాసనము స్థిరమై సుఖము కలిగించునో యదియే యుక్తము. కాబట్టి పద్మాసనాదులలో నొండొక దానిని నియమింప వలను పడదు.

ధ్యాన లక్షణమేమి ?

"ధ్యానం నిర్విషయం మనః" ౬. ౨౫.

నిర్విషయం = విషయరహితమైన, మనః = మనస్సు, ధ్యానమ్= ధ్యాన మనబడును.

ఆత్మకాక మిగిలిన పదార్థములనుండి మరలించి యాత్మయందే చిత్తము నిలుపుట ధ్యాన మనబడును. ఇయ్యదియే నిదిధ్యాసన మనబడునని భావము.

ధ్యానము వలన కలుగువిశేష మేమి ?

"ఉభయథా ప్యవిశేషశ్చే న్నైవముపరాగ నిరోధాద్విశేషః"
౬. ౨౬.

ఉభయథాప్యవిశేషశ్చేత్ = ధ్యానము చేసినను చేయకున్నను పురుషునకు గలుగునదేమియు నుండదని శంకింతువేని, నైవమ్ = అట్లు శంకింపబనిలేదు, ఉపరాగనిరోధాత్ = ధ్యానాదులవలన క్లేశాది వాసనలనెడి యుపరాగము (వాసనల సంబంధము) నిరోధింపబడును. కాబట్టి, విశేషః = విశేషము లేకపోదు.

ధ్యానమువలన క్లేశకర్మాదుల వాసనలు నిరోధింపబడుటయే విశేషమని భావము.

నిఃసంగుడు, నిర్వికారుడు నగు పురుషునందు క్లేశాదుల యుపరాగమెట్లు సంభవ మగునన :

"నిఃసంగేఽప్యుపరాగోఽవివేకాత్" ౬. ౨౭.

పురుషుడు నిఃసంగు డయినను, అవివేకము వలన క్లేశకర్మాదుల యుపరాగము కలుగును.

ఈ యుపరాగము పురుషున కెట్టిది ?

"జపా స్ఫటికయోరివ నోపరాగః కింత్వభిమానః ౬. ౨౮.

జపాకుసుమము, స్ఫటికము నను నీ రెండు నొకదాని

కొకటి సమీపమున నున్నపుడు, స్ఫటికమునందు జపాకుసుమముయొక్క రక్తవర్ణము ప్రతిబింబించి స్ఫటికము రక్తమగును. పురుషునందు వాసనల ట్లుపరక్తములు కావు. కాని, బుద్ధిసత్వ తాదాత్మ్యము వలన పురుషునకు బుద్ధియందలి వాసనలు తనవే యను నభిమానము కలుగును.

అటులయిన నీ యభిమానము ధ్యానమువలననే తొలగ గలదా ?

"ధ్యాన ధారణాభ్యాస వైరాగ్యాదిభి స్తన్నిరోధః" ౬. ౨౯.

ధ్యానము, ధారణ, అభ్యాసము, వైరాగ్యము మున్నగు వానిచే వాసనల యభిమానము తొలగ గలదు. కేవల ధ్యానము వలన తొలగనేరదని భావము. సూత్రము నందలి ఆది పదముచే దోష దర్శనము, యమ నియమాది సాధనములు గ్రహింప నగును. పదార్థముల లోని దోషముల నెఱుగుట వలన వానియందు వైరాగ్యము (వితృష్ణ) కలుగును. అటుపై యమ నియమాది సాధనముల ననుష్ఠించుట వలన చిత్త స్థైర్యము కలుగును. అభ్యాస మన నియ్యదియే. అనంతరము చిత్తము నాత్మయందు బంధించుట ధారణ యగును. పిదప పూర్వము వర్ణించిన ధ్యానము వలన నుపరాగము నిరోధింప బడగలదు.

ధ్యానాదుల వలన సాకల్యముగ నుపరాగ నిరోధము కలుగునా ?

"లయ విక్షేపయోర్ వ్యావృత్త్యా ఇత్యాచార్యాః" ౬. ౩౦.

లయ మనగా నిద్రావృత్తి. ప్రమాణము, విపర

యము. వికల్పము, స్మృతి యనెడి వృత్తులు విక్షేప మన బడును. ధ్యానాదుల వలన నీ లయ విక్షేపము లనెడి వృత్తు లన్నియు తొలగును. అటుపై వాసనోప రాగ నిరోధ మేర్పడునని సాంఖ్యాచార్యులు నుడువుదురు. కాబట్టిధ్యానాదు లుపరాగమును దొలగించుటలో సాక్షాత్కారణము కాక పరంపరా కారణ మని భావము.

లయ విక్షేపములను దొలగించుటకు ధ్యానాదు లెట నాచరింపవలయును ?

"న స్థాన నియమశ్చిత్త ప్రసాదాత్" ౬. ౩౧.

చిత్తము ప్రసన్నముగానున్న ధ్యానాదులు కుదురును. కాబట్టి ధ్యానమున కొకస్థానవిశేష మావశ్యక మను నియ మము లేదు. ఎక్కడ చిత్తము ప్రసన్నముగానుండునో యట ధ్యానాదుల నాచరింపవలయునని భావము.

పురుషునందు కలుగు వాసనాభిమానమునకు ముఖ్య కారణమేమి ?

"ప్రకృతేరాద్యోపాదానతా అన్యేషాంతత్కార్యత్వ శ్రుతేః"

౬. ౩౨.

ఉపరాగమునకు ప్రథమకారణము ప్రకృతి. మిగిలిన బుద్ధ్యాదులు దాని కార్యములగుట వలన నవి యనంతర కారణము లని యెఱుంగవలయును.

పురుషుడు నిత్యుడగుటచే నతడే యేల ముఖ్యకారణము కాదు ?

"నిత్యత్వేఽపి నాత్మనో యోగ్యత్వాభావాత్" ౬. ౩౩.

పురుషుడు నిత్యుడైనప్పటికిని ఉపరాగమున కతడు

ప్రథమోపాదాన కారణము కాజాలదు. అతనిలో నట్టి యోగ్యతయే లేదు. ఉపాదాన కారణము ముఖ్య కారణము. నిత్యుడగుటచే నాద్యకారణము కావచ్చునే కాని యుపాదానము కాజాలడు. ఉపాదానకారణము కావలయుననినచో పరిణామి కావలయును. కాబట్టి ప్రకృతియే యుపాదానమగును.

కేవల పురుషుడు కాకున్నను నవిద్యాసహిత పురుషుడేల కారణము కాజాలడు?

"శ్రుతివిరోధాన్న కుతర్కాపసద స్యాత్మలాభః" ౬. ౩౪.

ఈ తర్కము శ్రుతివిరుద్ధమయినందున నట్టి తర్కమొనరించు నధమునకు ఆత్మప్రాప్తి కలుగనేరదని సూత్రార్థము. కార్యకారణములు తాదాత్మ్యము లయినందున, జగద్రూప కార్యముగా పరిణమించునట్లు పురుషు నంగీకరింతుమేని కారణరూపమున పురుషుడు సత్యమయినను కార్యరూపమున నతని అసత్య మంగీకరింపవలసి వచ్చును. అట్టియెడ కార్యాత్మనా లేని పురుషుడు కారణరూపమున నెటనుండును? కాబట్టి యాత్మలాభమే సిద్ధింపదని భావము.

స్థావరాది కార్య జాతమున కంతటికి క్షిత్యాదులే కారణములై యుండ ప్రకృతి యుపాదాన కారణ మెట్లగును?

"పారంపర్యేఽపి ప్రధానానువృత్తి రణువత్" ౬. ౩౫.

అణువత్ = పరమాణువు వలెనే, పారంపర్యేఽపి = పరంపరా కారణము నందును, ప్రధానానువృత్తిః = ప్రకృతి అనువర్తించును.

స్థావరాదులకు క్షిత్యాదులు సాక్షా దుపాదాన కారణములు. కాని, ప్రకృతి పరంపరా కారణము. అందువలన

ప్రకృతి యుపాదానకారణ మనుటలో దోషము లేదు. ఇట్లే వైనాశికులు కూడ పరమాణువును సంఘాతమునకు కారణ ముగా నంగీకరింతురు.

ప్రకృతి యుపాదానకారణమైనను నయ్యది విభు వెట్లగును?

"సర్వత్ర కార్య దర్శనాత్ విభుత్వమ్" ౬. ౩౯.

బ్రహ్మాండమున నెల్లయెడల ప్రకృతి వికారములు (కార్యములు) లభించుచున్నందున నయ్యది విభువేయని చెప్ప దగును. కాని, ప్రకృతిలోగల విభుత్వము పరమాత్మ యందలి విభుత్వమువలె నిరపేక్షము కాక సాపేక్షమని యెఱుంగ వల యును.

ప్రకృతి విభువైనయెడల నందు జగత్తును సృష్టించుట కనువగు క్రియ కలుగనేరదు. ఎట్లో కలుగునని యంగీకరిం చినను, తంతువులు వస్త్రమున కుపాదాన కారణ మైనట్లు జగత్తున కది యుపాదానకారణ మెట్లగును?

"గతియోగేऽప్యాద్యకారణతా అహాని రణువత్" ౬. ౩౭.

వైనాశికుల మతమున పరమాణువు సంఘాతమున కుపాదాన కారణమైనట్లు, భగవంతుని సంకల్పము వలన ప్రకృతియందు జగత్సర్జనానుకూలక్రియ కలుగుటయే కాక, ఉపాదాన కారణత్వమునకును హానికలుగదు.

క్రియాయోగమువలన ప్రకృతి ద్రవ్యమగును. అందు వలన నది పృథివ్యాది ప్రసిద్ధ ద్రవ్యములలో నెందు జేరును?

"ప్రసిద్ధాధిక్యం ప్రధానస్య ననియమః" ౬. ౩౮.

ప్రకృతి (ప్రధానము) లోకమున ప్రసిద్ధము లయిన పృథివ్యాదుల కంటె నధికము. అయ్యది సర్వద్రవ్యములకు మూలకారణము. కాబట్టి ద్రవ్యమయినంత మాత్రమున ప్రసిద్ధ ద్రవ్యములలో నంతర్భాగము కావలయు నను నియమము లేదు.

"సత్త్వాదీనా మతద్ధర్మత్వం తద్రూపత్వాత్" ౬. ౩౯.

సత్త్వము, రజస్సు, తమస్సు నను గుణములు ప్రకృతికి స్వరూపము (లక్షణము) కాబట్టి ప్రకృతి క్రియావంతమైనందున నవియు క్రియావంతములు కానక్కఱ లేదని భావము.

గుణము (త్రాడు) బంధించుటకు సాధనమైనట్లు సత్వ రజ స్తమస్సులు బంధన సాధనము లగుటచే గుణము లనబడుచున్నవి.

ప్రకృతి జడము. ఉపభోగించు యోగ్యత దానికుండదు. అట్టియెడ నీ సృష్టి యెందులకు ?

"అనుపభోగేఽపి పుమర్థం సృష్టిః
ప్రధానస్యోష్ట్రకుంకుమ వహనవత్" ౬. ౪౦.

ఒంటె వ్యాపారి కొఱకు (తన కుపయోగము లేకున్నను) కుంకుమ భారమును వహించునట్లు స్వోపభోగము లేకున్నను, ప్రధానము (ప్రకృతి) పురుషుని యుపభోగార్థమీసృష్టి నొనరించుచున్నది.

ఏకాకి యగు ప్రకృతియం దీ సృష్టి వైచిత్ర్య మెట్లు కలిగినది ?

"కర్మ వైచిత్ర్యాత్ సృష్టి వైచిత్ర్యమ్" ६. ४౧.

ప్రకృతి యొక్కటియే యైనను, సృష్టి నొనరించుటకు దానికి సహకార మొనర్చు (సహకారి కారణములైన) పురుషుని కర్మలు విచిత్రములు. అందువలన సృష్టిలో వైచిత్ర్యమేర్పడు చున్నదని భావము.

కర్మ సహకారము వలన ప్రకృతినుండి విచిత్రసృష్టి కలుగవచ్చును. కాని ప్రలయ మెట్లు కలుగుచున్నది ?

"సామ్య వైషమ్యాభ్యాం కార్య ద్వయమ్" ६. ४౨.

సృష్టి. ప్రలయము నను రెండింటికిని ప్రకృతి యొక్కటే కారణము. ఒక్క కారణముచే రెండు పరస్పర విరుద్ధ కార్యము లెట్లేర్పడు నని పై ప్రశ్నాభిప్రాయము. ప్రకృతిలో గలుగు పరిణామము రెండు విధములుగ నుండును. విరూప పరిణామము సృష్టి యనబడును. సరూప పరిణామము ప్రలయ మనబడును. కాబట్టి ప్రకృతియొక్క సామ్య వైషమ్య భావములచే సృష్టి ప్రలయములు కలుగును.

ప్రకృతినుండి పురుషుని కొఱ కెన్నడు సృష్టి జరుగదు?

"విముక్త బోధా న్న సృష్టిః ప్రధానస్య లోకవత్" ६. ४3.

వివేకము కలుగుట వలన ముక్తుడైన పురుషుని విషయమున ప్రకృతి సృష్టికార్య మొనరింపదు. అతని విషయమున ప్రకృతి తాను చేయవలసినది చేసి చరితార్థమైనట్లే. లోకము నందును స్వకార్యమునందు కృత కృత్యులయిన వారు మరల కార్యమునందు ప్రవర్తింపరు గదా ? అట్లే ప్రకృతియు ముక్తుని విషయమున సృష్టికై ప్రవర్తింపదు.

ప్రకృతి వ్యాపక మగుటచే బద్ధుల విషయమున భోగార్థము ప్రవర్తించుచుండ ముక్తులకును భోగము కలుగదా?

"న, అన్యోపసర్పణే ముక్తోపభోగో నిమిత్తాభావాత్" ౬. ౪౪.

వివేకము కలుగని బద్ధులైన జీవుల యుపభోగార్థము ప్రవర్తించినను, అవివేకమనెడి కారణము ముక్తులకుండదు కావున వారికి ప్రాకృతిక భోగము కలుగనేరదు.

ముక్తులు వేరు బద్ధులు వేరు నని పురుషబహుత్వ మెక్కడిది?

"పురుష బహుత్వం వ్యవస్థాతః" ౬. ౪౫.

లోకమున కొందఱు జన్మించుట, కొందఱు మరణించుట, మఱి కొందఱు ముక్తులగుట, వేరొక కొందఱు బద్ధులగుటయు జూచుచున్నాము. కాబట్టి జీవులనేకులే యని సిద్ధమగుచున్నదని భావము.

పురుషు డొక్కడే యైనప్పటికి నుపాధిభేదముచే జన్మమరణాది వ్యవస్థ సిద్ధింపదా?

"ఉపాధిశ్చేత్ తత్సిద్ధౌ పునర్ద్వైతమ్" ౬. ౪౬.

ఉపాధివలన జన్మమరణాది వ్యవస్థ సిద్ధించునెడల నాత్మకంటె భిన్నముగా నొక పదార్థ మంగీకరింపవలసి వచ్చును. అపుడాత్మాద్వైతము సిద్ధించుటకు బదులు ద్వైతమే సిద్ధించును. కాబట్టి యుపాధివలన జన్మమరణాది వ్యవస్థ యేర్పడగలదు; అందువలన నాత్మాద్వైత మంగీకరింప నగు ననుట యుక్తము కాదు.

ఉపాధులు పరమార్థములు కావు. అవి యవిద్యాజన్యములు. అందువలన నాత్మాద్వైతమేల సిద్ధింపదు?

"ద్వాభ్యామపి ప్రమాణవిరోధః" ౬. ౪౭.

ఉపాధులు పరమార్థములు కావు; అవిద్యాజన్యములందు రేని, యపుడును ఆత్మ, అవిద్య అను రెండు పదార్థము లంగీకరింపక తప్పదు. అయ్యదియు నద్వైతమును సాధించు ప్రమాణమునకు విరుద్ధమే యగును.

"ద్వాభ్యామప్యవిరోధాత్ న పూర్వముత్తరంచ
సాధకాభావాత్" ౬. ౪౮.

ప్రకృతి, పురుషుడు నను నీ రెండు వస్తువులు నవిద్యాత్మకములే యందురేని యదియును తగదు. సాంఖ్యుల మాగుపేము ఆత్మలనేకములనియే యంగీకరింతుము. కాబట్టి, ఉపాధివలన జన్మమరణాది వ్యవస్థ లేర్పడు ననుటయు చైతన్యమద్వైతమే యనుటయు రెండును ప్రమాణ విరుద్ధములే యని భావము.

"ప్రకాశతస్తత్సిద్ధౌ కర్మకర్తృ విరోధః ౬. ౪౯.

ఆత్మ స్వయం ప్రకాశముగలదగుటవలన తన యద్వైతత్వమును తానే సిద్ధింపచేసికొనగలదు. కావున వేరుగా ప్రమాణమొండు చూపనవసరము లేదందురేని, ఆత్మ తానే ప్రకాశకము, తానే ప్రకాశ్యము కావలసి వచ్చును. అట్టియెడ కర్మకర్తృ విరోధమేర్పడగలదు. అనగా కర్తయే కర్మ కావలసి వచ్చును. అది యుచితము కాదని భావము.

"జడవ్యావృత్తో జడం ప్రకాశయతి చిద్రూపః" ౬. ౫౦.

జడవ్యావృత్తః = జడధర్మ రహితుడై, పురుషుడు, జడంప్రకాశ

యతి = జడపదార్థములను ప్రకాశింప జేయును. కాబట్టి, చిద్రూపః = ప్రకాశస్వరూపుడు.

పురుషుడు ప్రకాశమున కాశ్రయుడై స్వాత్మను ప్రకాశింపజేయును. కాబట్టి కర్మ కర్తృ విరోధ ముండ నేరదని యందురేని యదియును లగదు. కారణమేమన :- పురుషుడు చిద్రూపుడే - ప్రకాశస్వరూపుడే కాని ప్రకాశమున కాశ్రయుడు కాడు. ఈ సూత్రమునందు జడవ్యావృత్తు డనుటవలన పురుషుడు జడమగు బుద్ధియొక్క ధర్మమైన జ్ఞానమున కాశ్రయుడు కాదనియు జడమును ప్రకాశింపజేయు ననుటవలన నతడు సర్వ సాక్షియనియు చిద్రూపు డనుటవలన నతని స్వరూపము జ్ఞానాత్మకమనియు చెప్పబడినది.

"న శ్రుతి విరోధో రాగిణాం వైరాగ్యాయతత్సిద్ధేః" ౬.౫౧.

పై సూత్రములందు ఆత్మాద్వైతత్వము నిషేధింప బడినది కాని బృహదారణ్యకములోని (సఏష నైతి నైతి - ౬. ౨. ४.) యనుశ్రుతిచే జగత్తునది లేనట్లు వర్ణింప బడినది. అందువలన నాత్మాద్వైతత్వము సిద్ధింపగలదు. కాబట్టి సాంఖ్యులమతము శ్రుతి విరుద్ధమగు నందు రేని యది యును సరికాదని యీ సూత్రము చెప్పుచున్నది.

(సఏష నైతి నైతి) అనుశ్రుతి, విషయాసక్తు లయిన వారికి జగత్తు హేయము - లేనిది, యని చెప్పిననే కాని వారీ జగత్తునుండి విరక్తులు కానేరరని యట్లు చెప్పినది. విషయ విరక్తులే ఆత్మ సాక్షాత్కారమునకు పూనుకొందురు. కాబట్టి శ్రుత్యర్థము నుపపన్న మగును. జగత్తు సత్యమే యని చెప్పు సాంఖ్య మతమును శ్రుతి విరుద్ధము కానేరదని యభిప్రాయము.

జగత్తు సత్య మను టెట్లు?

"జగత్ సత్యత్వ మదుష్టకారణ జన్యత్వాత్
బాధకాభావాత్" ౬. ౫౨.

అదుష్టకారణ జన్యత్వాత్ = దోషయుక్తముకాని ప్రకృతి రూప కారణ జన్య మగుట వలనను, బాధకా భావాత్ = బాధక జ్ఞానమునకు విషయము కానందునను, జగత్సత్యత్వమ్=జగత్తు సత్యమే.

అద్వైత వాదులు స్వప్న పదార్థముల వంటిదే జగత్తందురు. కాని, స్వప్నములో మనము జూచు పదార్థములు నిద్రాది దోషయుక్త కారణ జన్యములు. మఱియు జాగ్రదవస్థ యందు గలుగు జ్ఞానముచే నవి బాధింపబడును. కాబట్టి యవియసత్యములు. కాని, యీ దృశ్యజగత్తు భగవద్ బుద్ధి యుక్త ప్రకృతి జన్య మగుటచే నది సత్యమే. మఱియు నీ జగత్తు స్వాప్నిక పదార్థముల వలె బాధితము కాదు. అందువలనను నియ్యది సత్యమే యని భావము.

"ప్రకారాంతరా సంభవాత్ సదుత్పత్తిః" ౬. ౫౩.

మఱియు నీ జగత్తు తన యుత్పత్తికి పూర్వము సూక్ష్మ రూపమున అనగా కారణ రూపమున నుండియే యున్నది. అట్లు సద్రూపమున నుండకున్న నిది యేర్పడుట కవకాశమే లేదు. కారణ రూపమున (సూక్ష్మమున) నుండి కార్య రూపమున పరిణమించుటయే సృష్టి యనబడును. మఱియొక విధమున జగత్తేర్పడ నేరదని భావము.

జగత్తు సత్యమైనచో పురుషునకు గల కర్తృత్వము మాత్ర మేల సత్యము కాదు?

"అహంకారః కర్తా న పురుషః" ౬. ౫౪.

చేతన ప్రతిబింబముతో కూడి యహంకా రావస్థను

బొందిన బుద్ధి సత్త్వమే (అహంకారమే) కర్త యగును కాని పురుషుడు కాడు. పురుషుడు కర్త యగునేని పరిణామి కావలసి వచ్చును. పురుషుడు పరిణామము నొందనివాడు కావున నహంకారమే కర్త యని భావము.

పురుషునకు కర్తృత్వము లేకున్న భోక్తృత్వము కూడ నుండదు కదా ?

"చిదవసానాభుక్తి స్తత్కర్మార్జితత్వాత్" ౬. ౫౫.

భుక్తిః = భోగము-సుఖ దుఃఖానుభవము, తత్కర్మార్జితత్వాత్ = జీవునకు సంబంధించిన అహంకారముచే చేయబడిన కర్మలద్వారా ఆర్జింపబడుచున్నందున, చిదవసానా = పురుషునందు పర్యవసానము చెందుచున్నవి.

పురుషునకు కర్తృత్వము సత్యము కానట్లే భోక్తృత్వము కూడ సత్యము కాని మాట వాస్తవమే. కాని యహంకారము జడమైనందున, దానికి భోగ మసంభవము కాబట్టి, పురుషునకే భోగమని చెప్పుచున్నాము.

కర్మములు అనంతములు కాబట్టి భోగార్థము చంద్రాది లోకములను బొందిన పురుషులకు పునరావృత్తి యుండునా ?

"చంద్రాదిలోకేఽప్యావృత్తి ర్నిమిత్త సద్భావాత్" ౬. ౫౬.

పురుషు లొనరించు కర్మలలో గల వైచిత్ర్యము వలన చంద్రాది లోకములకు బోయి యట సుఖ దుఃఖముల ననుభవించి మరల నీ లోకమునకు రావచ్చును. అట్లు వచ్చుటకు తగిన నిమిత్తముండును. కాబట్టి పునరావృత్తి జరుగునని సూత్రార్థము.

చంద్రాది లోకమును బొందిన పురుషు లట ఉపదేశము ద్వారా వివేకజ్ఞానము సంపాదించి ముక్తి వడయుదురేని పునరావృత్తి యెట్లు గలుగును ?

"లోకస్యనోపదేశాత్సిద్ధిః పూర్వవత్" ౬. ౫౭.

పూర్వవత్ = భూలోకమున నుపదేశమాత్రముచేత భోగాసక్త పురుషునకు వివేకోదయము కలుగునట్లు, లోకస్యనోపదేశాత్ సిద్ధిః = చంద్రాది లోకము నందును ఉపదేశమాత్రమున వివేకము కలుగనేరదు. కాబట్టి, పునరావృత్తి కలుగు నవకాశము కలదని భావము.

(చంద్రమసో విద్యుతం, తత్ పురుషోఽమానవః స ఏనాన్ బ్రహ్మగమయత్యేష దేవపథో బ్రహ్మపథ ఏతేన ప్రతిపద్యమానా ఇమం మానవ మావర్తం నావర్తంతే. ఛాం. ౪. ౧౫. ౬.)

అను నీ యుపనిషద్వాక్యమునందు 'చంద్రాదిలోకముల నందిన వారు బ్రహ్మము నందుదురు. మరల నీ మానవ లోకమునకు రారు' అని యేల చెప్పబడినది ? అన :—

"పారంపర్యేణ తత్ సిద్ధౌ విముక్తి శ్రుతిః" ౬ ౫౮.

పారంపర్యేణ = బహు కాలానంతరము వైరాగ్య ముత్పన్నము కాగా శ్రవణాదుల ననుష్ఠించిన పిదప, తత్సిద్ధౌ = వివేకము సిద్ధించి నపుడు, విముక్తి శ్రుతిః = ముక్తి చెందిన పురుషుడు మరల పునరావృత్తి నొందడని శ్రుతి చెప్పుచున్నది.

వైరాగ్యము కలిగిన మీదట శ్రవణాది సాధనముల ద్వారా వివేకమును సంపాదించిన పురుషుడు ముక్తి నొందు విధాన మీ శ్రుతియందు చెప్పబడినదే కాని చంద్రాది లోకములను బొందిన మాత్రమున పునరావృత్తి యుండదని చెప్పుట శ్రుతి యభిప్రాయము కాదని భావము.

సాంఖ్యుల మతమున పురుషుడు అణువు; కూటస్థ నిత్యుడును. అందువలన నతనిలో గతి యుండదు. అట్టియెడ కర్మ ఫలభోగము కొఱకు చంద్రాది లోకముల కేగుట యెట్లు పొసగును ?

"గతి శ్రుతేశ్చ వ్యాపకత్వేఽప్యుపాధి
యోగాద్ భోగదేశకాల లాభో వ్యోమవత్" 59.

(వ్యాప....లాభః) పురుషుడు విభువని చెప్పువారి మతమున నుపాధి సంబంధమున దేశ విశేష లాభము గలుగునట్లు, సాంఖ్యుల మయిన మేముకూడ, గతిబోధక శ్రుతి స్మృతులకు లోబడి బుద్ధి సత్త్వము ప్రధానముగా నుండు లింగ శరీర మనెడి యుపాధి ద్వారా పురుషునకు కర్మఫల భోగము కొఱకు దేశాంతర ప్రాప్తి కలుగునని యంగీకరింతుము.

పురుషుని యుపభోగార్థము లోక లోకాంతరములు సిద్ధించునట్లు, శరీరాంతరముకూడ పురుషు డధిష్ఠించుటకు పూర్వము యేల సిద్ధింపదు ?

"అనధిష్ఠితస్య పూతిభావ ప్రసంగాన్న తత్సిద్ధిః" 60.

పురుషునిచే నధిష్ఠింపక మున్నే శరీరము సిద్ధింపనేరదు. పురుషుడు లేకున్న శరీరము చెడిపోవును. శరీరమునకు కారణములైన శుక్ర శోణితము పుండులోని చీము వంటివే కదా ? కాబట్టి పురుషుడు అధిష్ఠితుడు కాకముందు శరీరము సిద్ధింపదు పురుషు డధిష్ఠింపకున్నను నతని యదృష్ట వశమున శుక్ర శోణితములచే నేర్పడు శరీర మేల చెడక యుండరాదు?

"అదృష్ట ద్వారాచే దసంబద్ధస్య తదసంభవా జ్జలాది
వదంకురే" 61.

బీజ మంకురింప వలయుననినచో దానితో సంబంధము

గల జలమే కారణమగును. అసంబంధ జలము బీజము నంకు రింప జేయజాలదు. అట్లే యసంబద్ధ పురుషా దృష్టమువలన శుక్ర శోణితములు శరీరమును కలిగింపనేరవు. కాబట్టి దూరస్థ పురుషుని యదృష్టముచే శరీరాంతరము సిద్ధించి చెడకుండుట యసంభవమని సూత్రాభిప్రాయము.

"నిర్గుణత్వా త్తదసంభవా దహంకార ధర్మా హ్యేతే" ౬. ౬౨.

మఱియు నదృష్టాదులు అహంకార ధర్మములే కాని పురుష ధర్మములు కావు. పురుషుడు నిర్గుణుడు-నిర్ధర్మి. అతని యందు అదృష్టాదు లుండనేరవు. కాబట్టి పురుషాదృష్టవశమున శరీరాంతర మెక్కడో సిద్ధించుననుట సంగతము కానేరదు.

అటులయిన నదృష్టము జీవ ధర్మముగా నెందులకు చెప్పబడు చున్నది.

విశిష్టస్య జీవిత్వ మన్వయ వ్యతిరేకాత్" ౬. ౬౩.

అహంకారభావ మెటనుండునో యటనే జీవ భావ ముండును. అది లేనిచోట జీవభావముండదు. కాబట్టి యన్వయవ్యతిరేకములతో నహంకార విశిష్ట పురుషుడే జీవు డనబడునని తేలుచున్నది. కేవల పురుషుడు జీవుడుకాడు. కాబట్టి యదృష్టాదులు జీవధర్మములుగా జెప్పబడుట దోషము కాదు. పురుష ధర్మములు మాత్రముకావు.

జీవుడు చేయు లౌకిక, వైదిక కార్యములు పరతంత్ర ములై సిద్ధించు చున్నవా? లేక యాత్మతంత్రములేనా?

'అహంకార కర్త్రధీనా కార్యసిద్ధిః నేశ్వరాధీనా ప్రమాణా భావాత్" ౬. ౬౪.

కార్యములన్నియు పురుషుని ప్రతిబింబమగు జీవునితో

కూడిన అహంకార కర్తృతంత్రములై సిద్ధించునే కాని యీశ్వర తంత్రములై సిద్ధింపవు. జీవుడు తన పురుషకారముచే కార్యములను నెరవేర్చును. ఈశ్వరుడు నెరవేర్చున దేమియు లేదు. ఈశ్వర తంత్రములనుటకు ప్రమాణమును లేదు. కాబట్టి జీవుడు కర్మల నాచరించుటలో స్వతంత్రుడని యెంచవలయును.

జీవుల కార్యసిద్ధి వారి యదృష్టము వలన నేలకాదు?

"అదృష్టో ద్భూతివత్ సమానమ్" ౬. ౬౫.

కార్యసిద్ధి యదృష్టమువలన ననుట యుక్తము కాదు. కారణ మేమన :- జీవుల యదృష్టము సైతము వారి పురుషకారము (యత్నము) వలన సాధింపబడునదియే కదా? అనగా కర్మాచరణమెట్లు పురుషయత్న సాధ్యమో అదృష్టము నట్లే యని భావము.

సమస్త కర్మలు పురుషయత్న సాధ్యములగుచో దుఃఖముల నత్యంతము నివర్తింపజేయు ప్రకృతి పురుషవివేకాత్మక మానస కర్మము సైతము జీవునకు యథాకామము (కోరినట్లు సులభముగా) ఏల సిద్ధింపదు ?

"మహతోఽన్యత్" ౬. ౬౬.

అన్యత్ = వివేకమనెడి మానసకర్మము, మహతః=ఉత్తమునకు లభించును.

అనేక జన్మములు నిరంతరముగా నభ్యసించిననే కాని శుద్ధసత్త్వ మేర్పడదు. శుద్ధసత్త్వ మేర్పడిన కాని పురుషుడు ముక్తి ననుభవింప యోగ్యుడు కాడు. ప్రకృతి పురుష వివే

30)

కాత్మక మానసకర్మము కూడ పురుషకార సాధ్యమే యైనను, బుద్ధిసత్త్వమునందలి మాలిన్యము వలన సులభముగా సిద్ధింపదు. అందువలన మోక్ష మపేక్షించు వ్యక్తి బుద్ధిసత్త్వమును శోధించుటకుగాను యమ నియమాదులను యత్నపూర్వక ముగ ననుష్ఠించిన నదియు లభింపగలదని భావము.

దుఃఖనివృత్తి ప్రకృతి పురుషుల సంబంధము విడిపోయిన కలుగునని చెప్పబడినది కదా ? ఆ సంబంధ మెట్లు కలిగినది ?

"కర్మనిమిత్తః ప్రకృతేః స్వస్వామి భావో ఽప్యనాదిర్ బీజాంకురవత్"

౬. ౬౭.

ప్రకృతి పురుషులకు గల సంబంధము స్వస్వామిభావ సంబంధ మనబడును. పురుషుడు స్వామి; ప్రకృతి యతని స్వమ్ (ధనము – సొత్తు). ఇట్టి సంబంధము కర్మ నిమిత్త ముగా నేర్పడు ననియు, నదియు బీజాంకురములకు వలె ననాది యనియు కొందఱు చెప్పుదురు.

"అవివేక నిమిత్తోవా పంచ శిఖః" ౬. ౬౮.

కాని, పంచశిఖాచార్యుడు మాత్ర మీ ప్రకృతి పురుషులకు గల స్వస్వామిభావ సంబంధము అవివేకము వలన కలుగునని చెప్పుచున్నాడు. ఇయ్యదియే సాంఖ్యుల మతము.

"లింగశరీర నిమిత్తక ఇతి సనందనాచార్యః" ౬. ౬౯.

సనందనాచార్యు డీ సంబంధము సూక్ష్మ శరీరము వలన నేర్పడునని యెంచుచున్నాడు

"యద్వా తద్వా తదుచ్ఛిత్తిః పురుషార్థః, తదుచ్ఛిత్తిః పురుషార్థః"

౬. ౭౦.

ప్రకృతి పురుషులకు గల స్వస్వామిభావ సంబంధము

కర్మ నిమిత్తకముగానీ, అవివేక నిమిత్తకముగానీ, సూక్ష్మ శరీర నిమిత్తకము గానీ, యెట్లేర్పడినను నేర్పడవచ్చును. కాని, వివేక జ్ఞానము కలుగకున్నచో నా సంబంధము విడిపో నేరదు. కాబట్టి యీ సంబంధ విచ్ఛేదము నార్జించుటయే పరమ పురుషార్థము. దాని వలననే దుఃఖాత్యంత నివృత్తి కలుగును.

నిఖిలశాస్త్రనిష్ణాత శ్రీమత్పండితముక్తిరామోపాధ్యాయశిష్య
పండిత గోపదేవ విరచిత 'అంబా' వ్యాఖ్యాన సహిత
సాంఖ్యదర్శనము సమాప్తము.

విజయ ఆర్ట్ ప్రెస్— తెనాలి

పారిభాషిక పదములు